
భాగవతము

# భాగవత సారము-10-12 స్కంధములు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దకిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భాగవతసారము

ఇది

'శతావధానులు'

శ్రీమాన్ పండిత టి. లక్ష్మణాచార్యులవారి

భాగవతకాలక్షేపముల సంగ్రహము

10-12 స్కంధములు : రెండవ సంపుటము.

సంపాదకుడు, పరిష్కర్త :

చిలకపాటి విజయసారథి, ఎం. ఏ.,

1997

# భాగవత సారము.

## దశమస్కంధము

### శ్రీకృష్ణ జననము.

శ్రీకృష్ణునిచరిత్రమం దనేకవిషయములు ఉన్నవి. కడపటకును వేదాంతమే. ఈసంగతి చెప్పువారును, వినువారును సాంతముగ ననుభవించుటకు భగవంతునిప్రార్థింపవలయును. మీరును ప్రార్థింపుడు అనిరి. శ్రుతిస్మృతులు భగవంతుని స్తోత్రము చేయుచున్నవి. భగవంతుడు స్తోత్రము చేయబడువాడుగనున్నాడు. అతడవతరించి దైత్యులను జంపి శిష్టపరిపాలనమొనర్చి మనకు పరమోపకారకుడై యున్నాడు. సనకాదియోగులుకూడ అతనిని ధ్యానించుచున్నందున మనమతనిని తలంచవలయును.

ఇదివఱలో సూర్యచంద్రవంశముల సంగతులు చెప్పి మరల కృష్ణకథచెప్పుటలో న్యాయ మేమన నత డావంశమునం దవతరించుటయే కారణము. శ్రీకృష్ణచరిత్రమును గురించి శుకపరీక్షిత్తుల కీరీతి సంభాషణ జరిగెను.

పరీ.: శుకమహర్షీ! సూర్యచంద్రవంశములం దుద్భవించిన అనేకరాజుల చరితములు దెలిపితివి. విని సంతోషించితిని. అయినను మనయుద్దేశ మదికాదు. యాదవకులమున కృష్ణు డవతరించినసంగతి దెలియుట ముఖ్యము. అత డవతరించి యేమి చేసెను? అవతారకారణ మేమి? ఇత్యాది సకలవృత్తాంతములను తెలుపవలయును. ఇంతకుమునుపు కృష్ణునియొక్క సకలవిషయములు చెప్పితివి. (అనగా అనేకార్థములు గలిగిన కొలదిశబ్దములతో

దెలిపితివి) అది బుద్ధిమంతులకు తగినవర్గము- మందమతులకు విస్తారముగ జెప్పవలయును (అనగా అనేక శబ్దములలో చెప్ప వలయును).

శుక. : పరీక్షిన్మహారాజా ! నాకొక సందేహము పొడము చున్నది. ఇతరావతారములను చెప్పుచుండగా చెప్పినంతవఱకే వినుచుంటివి. శ్రీకృష్ణావతారమును మాత్రమే యడుగనేల ? ఇంతకుమునుపు చెప్పినవికూడ భగవదవతారములే కదా !

పరీ. : శ్రీకృష్ణుడు మా కులదైవము. (కులదైవ మనగా తమవంశ పరంపరచేత నారాధింపబడి వారిననుగ్రహించినదైవము) నాతండ్రి యగు నభిమన్యుడు, తాతయగు నర్జునుడు, పెద్దతాతలగుధర్మజ భీములు, చిన్నతాతలగు నకులసహదేవులు, ప్రపితామహపరంపర మొదలైనవారికి శ్రీకృష్ణమూర్తి కులదైవమై యున్నాడు. ఆపద యందు కులదైవమునే భజింతురు. పాండవులు శ్రీకృష్ణచరణార విందములను నౌకచేత భీష్మద్రోణాదులనెడు మొసళ్లు, మత్స్యములు, తిమితిమింగిలములు అనువానితో నిండిన కౌరవ సైన్యమను సముద్రమును గోవత్సపదజలమును దాటినట్లు దాటిరి; కృతార్థులైరి.

ఇట్టి మా పూర్వజులను అనుగ్రహించినట్టి శ్రీకృష్ణుని చరిత్ర మును విపులముగ దెలుపవలయును.

శుక. : మీపూర్వజు లతని నారాధించి యనుగ్రహింపబడిరి వారి కతనియందు భక్తి యుండుట యుచితము. నిన్ననుగ్రహించినగదా నీకును భక్తి యుండవలయును ?

పరీ. : మావారు పుట్టిపెరిగి స్వామిని పరిహాసములుకూడ చేయు చుండి పిమ్మట నాపద లనుభవించి ఆయాపదలనుండి కాపాడబడి, యటుపై శ్రీకృష్ణభక్తికలవారైరి. నే నతనిచేత గర్భములోనే కాపాడబడి విశేషసంబంధము కలిగియున్నాను.

శుక. : రాజా! సంతోషము. శ్రీకృష్ణవిషయములేవి తెలియవలెను ?

పరీ. : శ్రీకృష్ణు డెట్లు జన్మించెను ? జీవాత్మలకువలె అతనికి పూర్వపూర్వకర్మములు లేకుండినను జన్మమెట్లు గలిగెను ? అతనికి భార్యలెందరు ? పుత్రు లెందరు ? అత డెచ్చట నుండెను ? ఏమి చేసెను ? ఎవ్వరికడ విద్యాభ్యాసము గావించెను ? ఎన్ని దినములలో నావిద్యలను గ్రహించెను ? పాండవుల నేరీతి గాపాడెను ? పాండవు లెట్టివిపత్తు లనుభవించిరి ? ఏయుపదేశ మొనరించెను ? ఉద్ధవుని కేమి ఉపదేశించెను ? ఎనిమిదిమంది బిడ్డలలో నేడవవా డాదిశేషు డంటివి. ఆయాదిశేషుడు రోహిణి బిడ్డడా ? దేవకి బిడ్డడా యని సంశయముగుచున్నది. స్వామి దుష్టశిక్షణ చేయుదునని పలికెగదా ? ఏదుష్టుల శిక్షించెను ? ఏశిష్టుల రక్షించెను ? ఈ సంగతు లన్నియు తెలుపవలెను.

శుక. : "ఏమియు తెలియని నీకే శ్రీకృష్ణునియం దింత ప్రీతి యుండగా సకలము ననుభవించిన నాకెంత ప్రీతి యతనియం దుండును ?" అని శుకు డానందమున సూచించెను.

పరీ. : శ్రీకృష్ణునియం దతిశయానురాగ ముండియు నీ వతనిచరితమును సంగ్రహించుటకు కారణ మేమి ?

శుక. : రాజా! నీవు ప్రాయోపవేశము చేసియున్నాడవు. రెండవయధ్యాయము మొదలు ఎనిమిదధ్యాయములు విని యలసియున్నాడవు. నిద్రచేతను, ఆకలిదప్పులచేతను శ్రమనొంది యున్నాడ వని తలంచి సంగ్రహముగ దెల్పితిని. నీ కుత్సాహ ముండుటదెలిసి విశేషముగ జెప్పెద నంటిని.

పరీ. : నా కాకలిదప్పులు లేవు. సవిస్తరముగ జెప్పుము.

శుక. : మనుష్యునకు ఆకలిదప్పులు లేకుండునా ? ఇది యుపచారవాక్యముగాని, నిజమైనమాటగ నుండదు.

పరీ. : మహర్షీ ! నేను భుజింపకుండినదా ఆకలిగలుగును ? నీముఖారవిందమునుండి వెలువడు భగవత్కథామృతమును భుజించుచున్నాను. (గురుశిష్యలక్షణం బన నిట్టిదియే)

విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన !
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥

భగ. 10. అధ్యా 18వ శ్లోకమునందును అర్జునుడును శ్రీకృష్ణు నిట్లే యడిగెను. ఇట్టి శిష్యుడు లభించుభాగ్యము కలిగెగదా యని శుకు డానందమున మునిగెను. ఈసంగతి సూతుడు శౌనకాదులకు జెప్పెను.

శుక. : రాజా ! ఇట్టి శ్రమకరమైన కాలమునగూడ ఆకలి దప్పులు లేవని భగవత్కథను సవిస్తరముగ వినగోరితివి. నీభాగ్యమే భాగ్యము. బుద్ధిమంతుడ వనిన నీవె యనం దగును.

పరీ. : భగవన్మహిమలను దెల్పుమని కోరినందులకు నన్నిట్లు స్తోత్రము చేయుచున్నావు. భగవత్కథయం దాస్థయను దానికింతగౌరవము గలదా ?

శుక. : రాజా ! భగవత్కథను చెప్పువారు, వినువారు, చెప్పించువారు సకలపాపవిముక్తులై శుద్ధులై మోక్షపదవిని బడయుదురు.

భగవత్పాదప్రక్షాళనజలమగు గంగ యెట్టిదో అట్టిదే భగవత్కథయును. ఈ రీతి శుకు డెఱిగింపగా పరీక్షిత్తు సంతోషించి కృష్ణావతారకారణమును జెప్పు మనెను.

కంసాదిదానవులు భూమికి భారమైయుండ నామె గోరూపమున బ్రహ్మలోకమున కేగి తనదుఃఖమును బ్రహ్మ కెఱిగింపగా బ్రహ్మదేవుడు "భూదేవీ ! నీవు సర్వంసహ వనియు, భూతధాత్రి వనియు, భూతధారిణి వనియు పేరులు వడసియుండియు భారమగుచున్న దంటివేల ?" యని యడిగెను. "యోగ్యుల నెందరి

నైన భరింతును గాని దుష్టు నొక్కనినైనను ధరింపజాల'' నని భూమి యనెను, (ఎట్టి శ్రీమంతుడైనను తనయింట నుండువారు దుష్టులై యుండిరేని అతనికి సుఖముండనేరదు) బ్రహ్మ భూదేవిమాటలను విని, "అమ్మా ! నే నెల్లవారిని సృష్టించితిని. అందు యోగ్యులును, అయోగ్యులును పుట్టియున్నారు. ప్రకృతి యందు మూడుగుణము లున్నవి. నేను పంచభూతములతో చేయగా సకల మేర్పడును. (వంటవాడు ఉప్పు, పులుసు నధికముగ వేసి రోగమును గల్గించెనేని ఆబాధ వైద్యునివలన తీరవలయును.) నావలన గలిగిన శ్రమమును నివారింపదగినవాడు భగవంతు" డని చెప్పి భూదేవిని, శివుని, నింద్రాదులను బిలిచికొని క్షీరసము ద్రమునకు బోయి యందు అముక్తస్థలమునుండి (అనగా స్వామియుండుస్థలమునకు బోక గట్టునందుండి) నారాయణా ! (సముద్రమున బవళించినవాడా) యని పిలిచిరి. స్వామి యుపే క్షించుట గని వారు "స్వామీ ! నీవు ఉపేక్షించిన మాగతి యే" మని మొరపెట్టిరి. భూదేవి యేడ్చుచుండెను. బ్రహ్మదులు పురుషసూక్తమును చెప్పగా స్వామి సంతోషించి వచ్చెను. అపు డాతనిశరీరము ఇంద్రనీలమాణిక్య మట్లుండగా ముఖము చంద్రుని బోలియుండెను. చూచువారికి పర్వతమున చంద్రోదయమై నట్లుండెను. అతనినగవు వెన్నెలనుబోలి మాట లమృతకిరణము లట్లుండెను. ఇట్లు ప్రకాశించు భగవంతుడు బ్రహ్మను జూచి భూమికిని మీకును గలిగియుండు నాపద నెఱుగుదును. మీ రెల్ల రును, దేవతాస్త్రీలును కలసి భగవత్సేవార్థము యాదవులై యవ నిలో జన్మింపుడు. నేను యదువంశమున జన్మించి-

> పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
> ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

భా. 4 అధ్యా. 8వశ్లోక మట్లు సాధువులను రక్షించి దుష్టుల శిక్షించి భూభారము నడంచెదను, భయపడకుడని అభయప్రదానము చేసి పంపెను.

మధురమైన నామముగల్గిన మధురాపట్టణమును ఆహుకుని పౌత్రుడును, ఉగ్రసేనుని పుత్రుడును అగు కంసుడు పాలించుచుండెను. ఇతడు దేవకుడను తన పినతండ్రియొక్క కొమార్తెయగు దేవకిని యాదవకులజుడైన శూరునిపుత్రుడగు వసుదేవునికిచ్చి వివాహముచేసెను. అతడు వధూవరులను ఊరేగించుటకు నవరత్నఖచితమైన స్వర్ణరథసహస్రమును ఇష్టబంధుమిత్రులను భూమ్యాకాశములకు వ్యాపించి శబ్దార్ణవమో యనునట్టి అష్టాదశ వాద్యఘోషావిశేషములును, నాట్యమాడువారును తోడ నడువగా అలంకరింపబడిన రథమందు దేవకీవసుదేవులను గూర్చుండబెట్టి తాను రథమును నడపుటకు నారంభించెను. ఆసమయమున అశరీరవాణి "కంసా! మూఢా! నీ విటులేల సంతోషించెదవు? ఈ దేవకీదేవిగర్భమున బుట్టునట్టి యెనిమిదవవాడు నిన్ను జంపును" అని పలుకగా కంసుడు తన్నట్లు నిర్భయముగ బిలిచి దూషించి చెప్పినది అశరీరవాణియని తెలిసి చేతిపగ్గములను రథమునకుగట్టి తత్క్షణమే చెల్లెలిని రథమునుండి జడపట్టి యీడ్చి, మెడబట్టివంచి, కృష్ణసర్పమువంటి ఖడ్గమెత్తి తల నఱుక గమకించెను. కంసుడు చెల్లెలిపట్ల వాత్సల్యముగలవాడైనను అశరీర వాణి పలుకుల కులికి యట్లు సాగ్రహు డాయెను.

ఆఢ్యోభిజనవా నస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా,
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః.

భగ 16అధ్యా 15 శ్లోకమట్లు నా సము డెవ్వడని తలంచి అహంకరించుచుండువాడు నయితము పరమదుర్దశ ననుభవింపనగును. విపత్సంపదలు చెప్పిరావు. శాశ్వతములు గావు. ఎట్టి

విభవసమయమున నెట్టి యాపద సంభవించెను! అపు డచటనుండిన వారొక్కరును కంసు నాపజాల కుండిరి. ఆ సమయమున వసుదేవుడు తనకు గల్గిన విపత్తునకై చాల చింతించి ఈశ్వరునిపై భారముంచి రథముడిగ్గి తాను చెప్ప నట్టిమాటనువిని పిమ్మట నామెను జంపుమని కంసుని వేడెను. హృషీకేశుని సంకల్పముచేత చెల్లెలి శిరశ్ఛేదముసేయ శంకించు చుండిన కంసుడు వసుదేవునిపలుకు లాలించుట కంగీకరించెను.

"నే డీమెను జంపినను రేపు మృత్యువు తప్పదు. అది యునుగాక ఈమెయొక్క అష్టమగర్భమేగదా నిన్ను జంపును? ఇపుడు భయములేదు. మృత్యువు సదా మనతోడనే యుండి సమయమును వేచియున్నది. అపు డపుడు యత్నములుకూడ సల్పుచున్నది. మృత్యువు శరీరమునకే గాని ఆత్మకుగాదు.

నత్వేవాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః,
నచైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్ ॥

భగ. 2 అధ్యా. 12

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత,
తస్మాత్సర్వాణి భూతాని నత్వం శోచితు మర్హసి.

భగ. 2 అధ్యా. 30 శ్లోకము లట్లు ఆత్మ నిత్యమైనది" అని యిట్లు చెప్పిన వసుదేవుని మాటలు విని నిజమే యని కంసుడు ఈమెగర్భస్థుడు తన్ను జంపిన దిక్కెవ్వరని యెంచెను. పరీక్షి న్మహారాజా! కంసు డసురు డగుటచేత వేదాంతతాత్పర్య మెఱి గియు తనకార్యమును మానకుండెనని శుకు డనెను. వసుదేవు డపుడు వేదాంతమును నిలిపి "నీకుమృత్యుకారణ మీమెగర్భస్థుడే గాని యీమె గాదు. కాన నీమెను బ్రతికించిన నీమెగర్భస్థుల నెల్ల జంప నిచ్చెదను. పుట్టినతోడనే శిశువు నిన్ను చంపజాలడు గదాయని కంసునికి దెలిపెను. వసుదేవుడు తనకొడుకుల నందఱ

నిచ్చెద" నని ప్రతినపట్టినందులకు పరీక్షిత్తు ఆశ్చర్యపడి అతని మనసెట్లు వచ్చెనని శుకు నడిగెను. రాజా ! వసుదేవుడు నాడు గండముతప్పినయెడల వెనుకటిగతి చూచుకోవచ్చుననియు, బిడ్డ పుట్టునో లేక పీడేచచ్చునో యనియు, భగవద్వ్యాపారము కడు విచిత్రము; జరిగినపిమ్మటనే విశద మగును అనియు తలంచెను. (ఇందుల కొక యితిహాసము గలదు. బోయవా డొక్కడు మృగ ములజంపి దారపుత్రాదులను పోషించుచుండెను. వాని కొక్క నాడు మధ్యాహ్నమువరకు నేజంతువును చిక్కనందున తనకై కనిపెట్టుకొని, యధికఫలముతోడ వచ్చునను ఆశతో నెదురు చూచుచుండు దారపుత్రాదుల యొద్దకు వట్టిచేతులతో పోవజాలక ప్రాణత్యాగము సేయదలచి కడపటిప్రయత్నముగ నెంచి, మరియొకవనము ప్రవేశించెను. అందొక్కవృక్షమున రెండు పక్షు లుండుట గని అతడు వానిని జంపదలచి చెట్టుక్రింది కేగి గురిపెట్టి కూర్చుండెను, అపుడే యాకాశమున నొకగ్రద్ద ఆపక్షులకై వేచియుండెను. అపుడు మగపక్షి ఆడుపిట్టతో సరసములాడ నారంభించగా నాడుపక్షి క్రింద పైన జూచి మృత్యువువాతబడ నున్న మన కెక్కడిసంతోష మని పల్కెను. బోయవా డపుడు మోకాలిని భూమిపైనుంచి బాణమును సంధింపగా భూమి యందుండిన పామొకటి వాని నప్పుడే కరచెను. వాడు సంధించి విడిచిన బాణము గ్రద్దప్రాణ మపహరించెను. పోతు, పెంటి సుఖించెను. ఇందుచేతనే వసుదేవుడు నేడు గడచిన నాడు చూచు కొందమని యెంచి అట్లు వాగ్దత్త మొనర్చెనని శుకుడు పరీక్షిత్తు నకు జెప్పెను.

కంసుడు వసుదేవుని యోచన బాగుగనున్నదని యెంచి చెల్లెలిని జంపక మన్నించి యథావిధిగ వివాహోత్సవకార్యము జరిపి ఆ దంపతులను చెరయం దుంచెను. వీరిప్రథమపుత్రుడు

కోటిమన్మథాకృతియై జన్మింపగా వసుదేవు డాశిశువును కంసుని కప్పగించెను. కంసు డా శిశువుయొక్క అందమును జూచి యానందించి తన్ను జంపువా డెనిమిదవవా డగుటచేత నిర్దోషి యగు వీని నేలచంపవలయునని యెంచి మన్నించితి నని పలికెను. నారదు డపుడు కంసునివద్దకు వచ్చి "కంసా! నీవు దేవతలమాయను నమ్మకుము. ఎట్లులెక్కించినను అందరును ఎనిమిదవవా రగుదురు. రెండవవానివద్దనుండి లెక్కించినట్లైన నీమొదటివాడే యెనిమిదవవా డగును. కాన ఆలోచింపక చంపు మని బోధించెను. (దేవకికి పుట్టబోవు ఆర్గురును మరీచిబిడ్డ లగుట చేత పుట్టినతోడనే మరణము కల్గునట్టి శాపము వారికి వచ్చి యుండుటచేత దేవరహస్యమును దెలిసిన నారదు డిట్లు కంసునికి బోధించెను). తనయార్గురుబిడ్డల దలచి దేవకి చింతించగా కృష్ణు డామెకు వారిని జూపెను. ఆసంగతి ముందు వచ్చును.

నారదునియుపదేశ మాలించి కంసుడు దేవకియొక్క అర్గురుబిడ్డలను చంపెను. పిమ్మట ఆదిశేషుడు ఏడవగర్భముగ ప్రవేశించెను. తానును, ఆదిశేషుడును గలిసి కార్యములు సల్ప వలసియుండుటచేత భగవంతుడు మాయాశక్తిని బిలిచి వసుదేవుని స్నేహితుడగు నందునింటనుండు వసుదేవునిభార్యయగు రోహిణిగర్భమున నుంచుమని యాజ్ఞాపించగా దుర్గాదేవి అట్లే చేసెను. ప్రజలు దేవకిగర్భము విచ్ఛిన్న మాయెనని దుఃఖించిరి. రోహిణీదేవి నిద్రలేచి తనయేడునెలలగర్భమును జూచి యిదేమని చింతింపసాగెను. ప్రజ లామెను వింతగ జూడసాగిరి. అపుడు అశరీరవాణి ప్రజలను, రోహిణీదేవిని సంబోధించి— ఓ జనులారా! వసుదేవుని వీర్యమిది. సంశయించితిరేని మీరు పతితు లగుదురు. రోహిణీ! నీవు సాధ్వివి. నీకు సత్పుత్రుడు గలుగు" నని పలుకగా వారు నిస్సంశయులైరి.

దేవకికి నెనిమిదవగర్భము గలిగెను. దేవతల కభయమిచ్చి నట్టియు, హృదయమందు సిద్ధముగనుండునట్టి స్వామి కొంత పళపళ మెఱయగా దేవకికి గర్భచిహ్నములు గలిగెను. కంసు డీ దంపతుల నొకచిన్న గదియం దుంచి సంకెళ్ళను గూడ తగిలించి యాగృహమునకు పెక్కుతీగములను వేసి వానిని తనయొద్దనే యుంచుకొని యుండెను. చిన్న గదియందు వారు, వారియందు భగవంతుడు, ఆతనియందు బ్రహ్మాండము ఉండెను.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥

భగ. 15 అధ్యా 12 శ్లో. సూర్యచంద్రాదులతేజస్సు భగవంతుని తేజస్సులో కోట్యంశము గాదని చెప్పబడియున్నది. అట్టి ప్రకాశమాన స్వరూపుడైన స్వామి దేవకిగర్భమున వెలుగగా అంధకారబంధురమైన యాగృహము వెలుగుచుండెను. కంసు డా వెల్గుచూచి దీప మెవ్వ రుంచిరని పరీక్షించి చూచి దీపము కనబడ కుండుట యెఱింగి దేవకిగర్భమునం దున్నవాడు భగవంతుడే యనియు, అత డవతరించి తన్ను జంపుననియు నిశ్చయించి జరుగవలసినది జరుగక మానదని తలంచెను. దేవకికి నవమాసములు రాగా కంసుడు దినములు లెక్కించుచు జాగరూకుడై యుండెను. క్షీరసముద్ర, వైకుంఠములకంటె దేవకిగర్భము పరిశుద్ధమైయుండుటచేత భగవంతు డావిర్భవింప కుండెను. బ్రహ్మాదిదేవతలు అవతరింపు మని స్వామిని ప్రార్థించుటకై ఆ గదియందు ప్రవేశించగా దేవకీవసుదేవులు వారిని గాంచిరి.

బ్రహ్మాదు లాగదియం దెట్లు ప్రవేశింప గలిగి రనుకొన వచ్చును. బ్రహ్మాండనాయకుడే అందుండెను గదా! దేవకి గర్భమున భగవంతుడును, ప్రక్కను వసుదేవుడు నుండగా బ్రహ్మ

దులు దేవకియెదుట ప్రత్యక్షమై యంజలిబద్ధులై నిలిచి, "స్వామీ! మాకష్టములు దీర్చుటకై యిచటికి వచ్చితివి. అట్లగుటచేత నవతరింపవలయును" అని వేడుకొనిరి. అపుడు పరమేష్ఠి విశేషముగ భగవంతుని స్తుతించెను. ఆ స్తుతి అనేకవేదాంతార్థములు కలిగినది. బ్రహ్మాదులు తనకు మ్రొక్కుచున్నారేమని దేవకి సందేహించగా వారు తాము మ్రొక్కునది గర్భస్థునికే యని తెలిపిరి. స్వామీ! నిన్ను సత్యమువలన పొందనగును. నీవు సత్యముదప్పనివాడవు. మూడువేదములందును తత్త్వమని చెప్పబడినవాడవు; బ్రహ్మాది స్తంబపర్యంత ముండువాడవు. సూర్యచంద్రులిట్టి నిన్ను నమస్కరింతు రనియు, జగదీశ్వరుని చరణారవిందములను ధ్యానించి సంసారసాగరమును గోవత్సపదజలమట్లు దాట నగుననియు స్తోత్రములు సల్పి "దేవా! శీఘ్రముగ నవతరింపవలయు" నని ప్రార్థించిరి. అందులకు స్వామి, "ఇదివరలో ననేకావతారము లెత్తియుంటిని గదా" యనెను. "ఇదివరలో ననేకావతారము లెత్తినటులే యదువంశమునం దవతరించి దుష్టనిగ్రహము గావింపుము. మాస్వరూపమే నీదిగ నున్నది. మేము నీ కేమియు నీయజాలము" అని స్తోత్రముసల్పి బ్రహ్మదేవుడు దేవకిని "అమ్మా!" అని పిలిచెను. దేవకి యపుడు నీయంతటివాడు నన్ను అమ్మా యన దగునా? యనెను. బ్రహ్మ అందులకు "పొరబడితిని. నీవు మాతండ్రికి తల్లి వగుటచే అవ్వా యని పిలిచియుండవలయు" నని సవరించుకొని ప్రత్యుత్తర మిచ్చెను.

పాపియగు కంసుడు జన్మించినతోడనే శిశువును జంపునే యని వారు భయపడగా బ్రహ్మాదులు వాని నపుడే సంహరించి యీయెనని యెంచు మనియు మిమ్ము, సకలచరాచర ప్రపంచములను ఆతడు కాపాడు ననియు చెప్పి తమ నెలవులకు బోయిరి. శుకు డిట్లనెను. స్వామి అవతరించ దలంపగా రోహిణీ

నక్షత్రమును, ఆదిత్యాది గ్రహములును శుభస్థానములందుండి భగవదవతారమును నిరీక్షించుచుండిరి. (మనము పుట్టవలయు నన్నచో భగవంతుడు తోయవలయును. భగవంతుడు తన యిచ్ఛచేత నవతరించువాడు. కాన సవ్యముగ నుండనిచో అప చార మగునని యెంచి గ్రహములు శుభస్థానములం దుండిరి). కృష్ణాష్టమి రాత్రియందు అరణికట్టెయందు అగ్ని జనించినట్లు భగవంతు డావిర్భవించెను. ఆ వంశమూలపురుషు డగుటచేత ఆనందముచే చంద్రుడు డుదయించెను. లోపలవెల్గిన భగవంతుడే బయట వెలిగెను. అపుడు వసుదేవు డిట్టి స్వామిని జూచెను. ఈ శ్లోకములు నిత్యానుసంధేయములు.

తమద్భుతం బాలక మంబుజేక్షణం
చతుర్భుజం శంఖగదాద్యుదాయుధమ్,
శ్రీవత్సలక్ష్మం గళశోభికౌస్తుభం
పీతాంబరం సాంద్రపయోదసౌభగమ్.
మహార్హవైదూర్య కిరీటకుండల
త్విషా పరిష్వక్త సహస్రకుంతలమ్,
ఉద్దామ కాంచ్యంగద కంకణాదిభి
ర్విరోచమానం వసుదేవ ఐక్షత.

పద్మము లవంటి నేత్రములుగలవాడును, నాలుగుకరములు, వానియందు శంఖచక్రగదాద్యాయుధములు ధరించినవాడును, వక్షమునందు శ్రీవత్స మనెడి పుట్టుమచ్చ గలవాడును, కంఠమున మెరయుచున్న కౌస్తుభమణి గలవాడును, దట్టమై వర్షింపనున్న మబ్బువలె అందమైనవాడును, అచ్చెరువుగొల్పు ఆ బాలకుని వసుదేవుడు చూచెను. మిక్కిలి వెలగల వైదూర్యమణులు చెక్కిన కిరీట కుండలములయొక్క కాంతులతో గూడి నిగనిగలాడు కురులు మెండుగ గలవాడును, చక్కని మొలనూలు, భుజకీర్తులు

హస్తకంకణములు మున్నగువానితో శోభిల్లుచున్న బాలుని వసుదేవుడు గాంచెను. పై రెండుశ్లోకములకు బమ్మెరపోతనామాత్యుని అనువాద పద్యమిది.

సీ. జలధరదేహు నాజానుచతుర్బాహు
 సరసీరుహాక్షు విశాలవక్షు
చారుగదా శంఖ చక్ర పద్మవిలాసు
 కంఠకౌస్తుభమణీ కాంతిభాసు
కమనీయ కటిసూత్ర కంకణకేయూరు
 శ్రీవత్సలాంఛనాంచితవిహారు
ఉరుకుండలప్రభాయుత కుంతల లలాటు
 వైడూర్యమణిగణ వరకిరీటు
గీ. బాలు పూర్ణేందురుచిజాలు భక్తలోక
పాలు సుగుణాలవాలు కృపావిశాలు
చూచి తిలకించి పులకించి చోద్యమంది
యుబ్బి చెలరేగి వసుదేవు డుత్సహించె.

## యమళార్జున భంజనము.

దివ్యలాంఛనములతో నవతరించిన హరినిజూచి దేవకీవసుదేవులు ఇతడు భగవంతుడేగాని సాధారణశిశువుగాడని నిశ్చయించుకొని బ్రహ్మకును తండ్రియగు నితని గనుటకై యేమి పుణ్యము చేసితిమో యనియు, అట్టిమహాపుణ్య మాచరించినవారు తమలో నెవరై యుందు రనియు, ఇది ఇరువురిపుణ్యవిశేషమై యుండవలెనని యోచింపసాగిరి. దీనిని వినుచుండిన భగవంతుడు "తలిదండ్రులారా ! మీరు స్వాయంభువమన్వంతరమున పృశ్ని, తపస్సు అనువారై యుండి నన్నుగూర్చి తప మాచరించి నేను ప్రసన్నుడను కాగా నాయట్టిపుత్రుని గోరితిరి. నాతో సమానుడు

ఇతరుడు లేనందున నేనే మీకు పుత్రుడ నగుటకు నిశ్చయించి ప్రథమమున పృశ్నికి బుట్టి పృశ్నిగర్భుడను నామముతో విలసిల్లితిని. రెండవజన్మమున మీర లదితికాశ్యప ప్రజేశ్వరులు కాగా నేను వామనరూపుడనై పుట్టి ఉపేంద్రుడను పేర పరగితిని. ఈ జన్మమున దేవకీవసుదేవులై జన్మించియుండు మీకు కృష్ణుడనై యవతరించితిని. హరియే యవతరించెనని తెలిసి సంతోషింతురని ఈ రూపమున బుట్టితిని. మీరు పూర్వజన్మమున గొప్ప తప మాచరించితి" రని పలుకగా దేవకీవసుదేవులు భగవంతుని మాటలు విని చెవులతోడను, అతనినిదర్శించి కన్నులతోడను, తమపూర్వజన్మవిశేషమును దలంచి మనస్సుతోడను మిక్కిలి యానందించిరి.

పిమ్మట వారు భగవంతుని పలువిధముల స్తోత్రముచేసి "స్వామీ! నీవీరూపమున నుండినచో బంధువులు చూడవత్తురు. అదియుగాక ఉపనయనాదిక్రియల గావింపవలసియుండును. నీ విట్లే యుండుపక్షమున నిన్ను పూజించి ధ్యానించుచుండవలసినదే. అందుచే నీవిలక్షణరూపమును మనుష్యరూపముగ మార్చవలయు" నని ప్రార్థించిరి. వారిప్రార్థన నంగీకరించి స్వామి తన నిజరూపమును వీడి సాధారణశిశు వాయెను. దేవకీవసుదేవులు భగవంతునిశక్తిగని యాశ్చర్యపడిరి. భగవంతు డపుడు వసుదేవా! నన్ను భుజమున నెత్తుకొనిపోయి నందునింటజేర్చి అక్కడ యశోదప్రక్కను పరుండియుండు ఆడుశిశువు నెత్తుకొని వచ్చి యిందుంచు మని యాజ్ఞాపించగా అతనిరూపు దర్శించి సాక్షాత్తుగ మాటలు వినినందున భక్తిగల్గి వసుదేవు డట్లే చేయ నెంచెను గాని తాము కారాగారమునుండి తప్పించుకొను నుపాయము లేదని యోచించెను. అందుకు స్వామి "నీవిట్లు యోచింపక నన్నెత్తుకొని పొమ్ము అన్నియు సరిపడును" అని చెప్పెను.

దేవకీవసుదేవులు మునుపు కంసుడు చంపునని భయపడుచుండిరి. ఇపుడాభయము పోయి యిట్టిబిడ్డను ఎడబాయవలసివచ్చెగదా యని చింతించిరి. భగవదాజ్ఞయైనందున వసుదేవుడు శిశువు నెత్తికొని బయలుదేరెను. సూర్యు డుదయించినతోడనే ప్రయత్నములేక చీకటి వీడిపోవునట్లు "కర్తు మకర్తు మన్యథాకర్తుం" శక్తియుతుడగు భగవంతుని వసుదేవు డెత్తుకొని బయలుదేరగనే కంసుడు వేసియుండిన బీగము లన్నియు తమంత వీడిపోయెను. ఆగృహద్వారము జేరగనే వసుదేవునికాలిసంకెళ్ళు వీడిపోయెను. ఎల్లరును గాఢనిద్రచెందుటకై భగవత్సంకల్పమున వర్ష మారంభమాయెను. శిశువు వర్షములో తడియునని వసుదేవుడు తనవస్త్రముతో కప్పబోయెను. కాని అపుడొక గొప్పప్రకాశము కలుగగా వెనుకకు తిరిగిచూచెను. సర్వకాలములందు సర్వరూపముతో దాస్యముచేయుచు శేషుడను నామము పొందియుండు ఆదిశేషుడపుడు తనపడగతో కప్పి స్వామిని వర్షములో తడియకుండ జేసెను. అందరు స్వామికి శేషభూతులే అయినను ఆదిశేషుడు చక్కగా కైంకర్యము సల్పుటచేత శేషు డనబడును.

దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,
మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే.
భగ. 7అధ్యా.14శ్లో.

భగవన్మాయచేత సర్వప్రాణులును నిద్రించుచుండిరి. ఆదిశేషునిపడగయందుగల రత్నము యొక్క ప్రకాశముచేత వసుదేవుడు దారినడచుచుండెను. వసుదేవు డట్లు చని చని వానకాల మగుటచేత గొప్పశబ్దముతో ప్రవహించుచుండిన యమునా నదిని చేరి దీనినెట్లు దాట నగునని చింతించి భగవదాజ్ఞను స్మరించి అందు కాలుపెట్టబోయెను. అపుడు ప్రవాహము పొరలి రెండు పాయలుగ చీలి నడుమ దారి నొసగెను. తిరుప్పావులో "మాయనై

మన్ను వడమదురై మైన్దనై" అనునైదవపాశురములో తూయ పెరునీర్యమునైత్తురైవనై" అనగా "పరిశుద్ధమై మిక్కిలిలోతుగల జలముగలిగిన యమునానదిగట్టున నర్తించువాడై" అని యున్నది. వర్షాకాల మగుటచేత యమున పారుచుండుటచేత జలము ఎట్లు పరిశుద్ధముగ నుండె ననగా కృష్ణునికి దారినిచ్చి కైంకర్యముచేసియుండుట చేత యమున పరిశుద్ధురా లాయెను. యమునానది అట్లు మార్గ మిచ్చుటకు కారణ మేమనగా ఆమె స్వామినిచూచినతోడనే తనభర్త యగు సాగరుడు తలపునకు వచ్చెను. రామావతారమున లంకకు బోవనెంచి సాగరము మార్గమున కడ్డముగ నుండుటచే తన బాణముచే నింకింపదలచినవాడు గనుక ఇపుడు నన్నేమిచేయునో యని తలంచి యమునానది మార్గ మిచ్చెను. అందరును పరిచితులై యుండుటచే గోకులము ప్రవేశించి యెట్లీకార్యము రహస్యముగ చేయుదు నని యోచించుచు పోయి వసుదేవుడు తనబాలుని యశోద ప్రక్క పరుండబెట్టి అక్కడనున్న ఆడుశిశువు నెత్తుకొని యథాస్థానముచేరి ఆ బిడ్డను దేవకిప్రక్క పరుండబెట్టగా సంకెలలు మరల తగులుకొనెను. యశోదకు బుట్టినది ఆడుశిశువా ? మగశిశువా ? యని అచటివారు భగవన్మాయచేత చూడకుండినందున పిమ్మటచూచి మగశిశువే యని తెలిసిరి. నందు డానందభరితు డాయెను. యశోద తనకు కుమారుడుపుట్టిన ట్లానందించెను. కోటిమన్మథాకృతియైన రత్నము పుట్టె నేమిభాగ్యమని అందరు సంతోషించిరి. సాధారణముగ గర్భస్థశిశువు ఏడుమాసములు కాగానే అవయములు పుష్టి కలిగి జ్ఞానము కలిగి కర్మభూమికి పోజాలననియు క్రిందికి త్రోయకు మనియు భగవంతుని ప్రార్థించుచుండును. స్వామి ప్రసూతివాయువును త్రోయగనే శిశువుపుట్టి యేడ్చును. ఆప్రకారమే దేవకిప్రక్క పరుండియున్న ఆడుబిడ్డ యేడ్వగా

భటులు విని కంసుని కెఱిగింపగా ఆతడు వచ్చెను. అట్లు వచ్చి ఆడుబిడ్డను జూచి భయములేదని తలంచి అయినను చంపుద మని యెంచి కాళ్లుపట్టి గిరగిరత్రిప్పి నేలకు కొట్టబోగా ఆబిడ్డచేతినుండి తప్పించుకొని పైకెగిరి ఆకాశమున నిలిచి "ఓరీకంసా! మూర్ఖుడా! నన్నేలచంపెదవు? నిన్ను చంపువాడు వేఱొకచోట పెరుగుచున్నా"డని చెప్పి అనేక హస్తములు, ఆయుధములు ధరించిన దుర్గ ఎగిరిపోయెను. "కంసుడెనిమిదవశిశువు మృత్యువు కాదనియు తన్నుచంపువాడు వేఱొకచోట నున్నా డనియు చెప్పిన మాటలు విని దైవముగూడ అసత్యమాడుచున్న" దని ఆశ్చర్యపడి దేవకీవసుదేవుల కడకేగి వినయవచనములతో "దైవము మాట నమ్మి మిమ్ము హింసించితిని. నావలన తప్పులేదు. పుట్టినబిడ్డ లందఱిని మీరు నా కప్పగించితిరి. పాపినై వారినెల్ల చంపితిని. మీరును ఆదైవమునే నిందింపవలయు" నని చెప్పివెడలిపోయెను. కంసుడు చింతించి మంత్రులను పిలిచి యెచటనో నామృత్యువు పుట్టి పెరుగుచుండుటచేత మూడుమాసములకు లోపల వయసున్న శిశువుల నందఱను క్రూరరాక్షసులబంపి చంపింపు"డని కట్టడ చేసెను.

కంసునాజ్ఞప్రకారము అసురు లనేకశిశుహత్యలు గావించిరి. కంసునికి కప్పముగట్టుటకై నందుడు వెళ్ళిన సమయముచూచి ఘోరరూపముగల యొక అసురస్త్రీ తనరూపును మార్చుకొని దివ్యమైన యలంకారములు చేసికొని అప్సరస్త్రీరూపమును పొంది నందునింటికి బోవ వీథిలో నరుగుచుండెను. ఆమెనుచూచువారందరును నందగోపునింట భగవంతుడే పుట్టియున్నాడు. అతనిని జూడ మహాలక్ష్మియే యేతెంచుచున్న" దని యెంచిరి. పూతన యను నారక్కసి నందునింటికి బోయి ప్రసవగృహమును చేరగా యశోద బిడ్డనెత్తి యామెచేతి కిచ్చెను. పూతన బిడ్డనుతీసికొని యిట్టిబిడ్డను గన్న నీ భాగ్యమేమని ప్రశంసించి వజ్రశరీరము

నైనను పొడిచేయునట్టి ఆ రక్కసి స్వామిని జంపదలచి తన చనుబాలను కుడిపింప సాగి యొకకంట స్వామిని మరియొక కంట యశోదను గనుచుండెను. సర్వభుక్కై దుష్టులనే సంహరింప నవతరించినవాడుగాన నీరక్కసిపాలు గుడువనారంభించెను. దానికి బాధకలిగి బిడ్డ పాలుద్రాగుటను మాన్పదలచెను గాని స్వామి చన్ను విడువలేదు. రాక్షసి హాహాకారములు చేయు చుండగా స్వామి పాలతో పాటు దాని పంచప్రాణములను గూడ గ్రోలెను. అధికమగు తీపిని భుజించుటకు సమ్మతింపనివారు కొంచెము కారమునుకూడ నంజుకొనునట్లు స్వామి మాయావిని యగు దానిపాలు అతిమధురముగ నుండుటచేత నడుమ నడుమ క్రూరమగు దాని ప్రాణవాయువులను నంజుకొని దానిపాలు కుడిచెనని కవీశ్వరు డనెను. పిమ్మట నారక్కసి మృతినొంది దీర్ఘశరీరముతో గూలెను. వారు దానినెత్తి వీధిలోపడవేసిరి. స్వామి దాని చేతులలోనేయుండి ఆ శరీరముమీద నాడుకొనుచుండెను. యశోద మున్నగువారు తమబాలుని దైవము కాపాడె నని యెంచి భగవంతుని ప్రార్థించిరి.

నందుడు కంసునికి కప్పముగట్టివచ్చునపుడు తనయింటి వాకిట వీధిలోపడియున్న పూతనశరీరమును చూచి భగవద్గీత 15వ అధ్యాయమున చెప్పబడినవృక్షమునుఛేదింపవలసియున్నట్లుగ భావించెను. అతడిల్లుచేరి సంగతిదెలిసి బాలుని కనేకరక్షలు పెట్టించి భగవద్భాగవతారాధనలు చేయించెను.

పూతనాసంహారమునకు పిమ్మట నందాదులు ఔత్థానికమహోత్సవము గావింప నెంచిరి. ఔత్థానికమహోత్సవ మనగా పుట్టిన శిశువును సుదినమున భగవత్సన్నిధికి బిలుచుకొనిపోవుట. అందు చేత యశోద కృష్ణునికి స్నానము చేయించి అలంకరించి ఒక మెత్తనిపరుపుమీద పరుండ బెట్టెను. అప్రక్కనే అలంకరింపబడిన

వసుదేవుడు రోహిణీయశోదాపుత్రులకు నామకరణము చేయుటకై గర్గుడను పురోహితుని నందుని కడకు బంపగా నతడు వచ్చి వసుదేవునితలంపునందునికి తెల్పి యతని యనుమతివడసి బలిష్ఠుడను నర్థము దెలుపుచు బలభీముడని రోహిణిబిడ్డకును, పూర్ణస్వరూపుడు, పరబ్రహ్మము అను నర్థమును సూచించుచు కృష్ణుడని యశోదాపుత్రునికిని నామకరణముచేసి బాలురను జాగరూకులై కాపాడుడని చెప్పి యతనియాజ్ఞగొని తన యూరికి జేరెను.

బలరాముడు సాధువు. కృష్ణుడు తులిపి. కృష్ణునిదుడుకు పనులను గంథ్రకారు లీరీతి వర్ణించిరి. కృష్ణు డాకాలమున నావు తోడ దూడనుజేర్చి పాలెల్ల ద్రాగునను భయముతో వానియొద్దకు పరుగెత్తు వారినిజూచి నవ్వుచు పోవును. అతడు పెరుగువెన్నలు భుజించుచుండును. ఆకారణముచేత నింటివారు భాండములను ఎత్తగు నుట్లలో నుంచినను పీటలుమొదలగువానిని వేసికొని వాని మీదనెక్కి కుండలలోని వానినెల్ల భుజించును. వారంతకన్న నెత్తైన చోట్ల భాండముల నుంచగా ఆ కుండలకు తూట్లుపొడిచి స్రవించు పాలువెన్నలను నోరుతెరచి త్రాగుచుండును. బిడ్డలను గిల్లి వా రేడ్వగా నవ్వుచుండును. ఇట్లు పలుచిన్నెలు సల్పుచుండి ఒక్క నాడు మన్నుతినగా బాలురు యశోద కెఱింగించిరి. యశోద శ్రీకృష్ణు నొక్కదెబ్బవేసి నోరు తెరచి చూపు మనగా నతడు "అమ్మా! నేను మన్ను తినలేదని చెప్పి నోరుదెరచి తననోటి యందు దామెకు సకలప్రపంచమును, బ్రహ్మదిదేవతలను, గోకుల మును, తమయూరిని, తమయింటిని, అందులోనున్న ఆమెను, ఆమెయొడిలోనున్న తన్నును జూపెను. యశోద భయపడి యీ తడు బిడ్డడు కాడు. ఈశ్వరుడే యని భావించగా తన్నిక పూజింప నారంభింతు రని తలంచి స్వామి మాయను గ్రమ్మగా

యశోద ఆ సంగతి మరచి తాను కొట్టినందులకు బాలుని బుజ్జగించి పాలిచ్చెను. శుకు డిట్లుచెప్పగా పరీక్షిత్తు ఆశ్చర్యపడెను.

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి ॥
భగ. 5అధ్యా. 29శ్లో

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మా మభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే॥
భగ. 9అధ్యా. 24శ్లోకములవలె

యజ్ఞభోక్త యశోదముఖము చూచుచు ప్రియముతో నామె స్తన్యము గుడుచునంతటి ప్రాప్తి ఆమెకు గలిగెను. ఆభార్యాభర్త లెట్టి సుకృత మాచరించిరో యని పరీక్షిత్తు పలికెను.

"యశోదానందులు సామాన్యులు గారు. వారు ధరయను భార్య, ద్రోణుడను భర్తలై యుండిరి. ద్రోణు డనువాడు వసువు. బ్రహ్మదేవుని యాజ్ఞచేత దేవతలెల్ల యాదవులై జన్మింప సమ్మతించిరి. ఈ ధరయు ద్రోణుడుమాత్రము స్వామి తమయింట నవతరించిననే తాముపుట్టుద మనియు, అట్లు కాకున్న పుట్టమనియు దృఢముగ దెల్పిరి. స్వామి దేవకీవసుదేవులకు బుట్టునేర్పాటు జరిగియున్నది. కాన వారింటబుట్టి మీయింటనే పెరుగునని చెప్పి బ్రహ్మవారిని సమాధానపరచెను. వారే యశోదానందులై జన్మించిరి. వారంతటిభాగ్యశాలురు. వారికి స్వామి సకలభాగ్యములు ప్రసాదించెను" అని చెప్పి శుకు డీసంగతి ముగించెను.

అష్టదిక్పాలకులలో నొకడును, ధనాధ్యక్షుడును, శివునికి స్నేహితుడును, రాజరాజను నామాంతరము గలవాడును అగు కుబేరునిపుత్రులును, ధన కుల రూప మదాంధులును అగు నలకూబరమణిగ్రీవులను వారు తమయందు మోహముగల అప్సరసలతోగూడి అనేకవిధములగు ఆటపాటలతోడ నానాప్రదేశములు

తిరుగ నారంభించి తుదకు ఆకాశగంగనుచేరి అందు వస్త్రములు విడిచి ప్రపంచమును లక్ష్యముచేయక జలక్రీడ లాడుచుండిరి. భగవత్సంకల్పముచేత నారదుడా స్థలమునకు రాగా అప్సరసలు సిగ్గుపడి తమవస్త్రములు గట్టుకొనిరి. కుబేరునిపుత్రులు నారదుని రాక గమనించనందున వస్త్రము లేలధరించితి రని ఆస్త్రీలనడిగి వారివలన నారదునిరాక నెఱింగి ఈ దరిద్రుని కొఱకా అట్లు పారి పోయిరి? ఎట్టిఘనులు వచ్చిరోయని యెంచితిమిగదా యని పల్కిరి. ఇదంతయు చూచుచు వినుచుండిన నారదుడు వారలను బిలిచి "కులువలారా! ఇటురండు. నన్ను జూచి వస్త్రములు ధరింప కుండుటే యపరాధ మగుచుండగా నన్ను దూషించి మిక్కిలి తప్పు చేసినవా రైనారు. నేను బ్రహ్మపుత్రుడ ననియు, కర్తుమకర్తు మన్యథాకర్తుం శక్తిగలవాడ ననియు తెలియక యిట్లాడితిరి. ప్రాణముపోవగనే శరీరము మన్ను గునో, అమేధ్య మగునో, క్రిము లగునో, మసియగునో! ఇట్టిదానిమీద నింతయభిమాన ముంచ దగునా?" అని పలుకగా వారు మాశరీరముమీద మా కభిమాన ముండిననేమి తప్పని ప్రశ్నించిరి. నారదు డపుడు శరీరము మీదిగాదు. దాని కనేకకర్త లున్నారు. గర్భాధానము చేసినతండ్రి నావీర్య మనును. తల్లి నేను నవమాసములు గర్భమున ధరించి కంటి నను. అన్నదాత నేనన్నము పెట్టితిని గాన నేనే కర్త ననును. మాతామహపితామహులు మావారి దందురు. పనిచేయించు కొను యజమాని నాకు అధికార మనును. తస్కరులు మాది యందురు. అగ్ని నాదియనును. బాగుగ కాలకున్న శునకాదులు మాది యనును. విషయ మిట్లుండ మీర లహంకరింపవచ్చునా? మీకు తగిన ప్రాయశ్చిత్తము చేయవలసినదే. అట్లు చేసినచో నితరులకు బుద్ధి వచ్చును. ఎట్టివారైనను అహంకారము గల్గియుండ రాదు. పెద్దలవిషయమున నపరాధ మొనర్చి వృక్షములట్లు వస్త్ర

హీనులరై నిలిచితిరి. మీరును అట్టి వృక్షరూపములనే పొందుడు" అని శపించగా నలకూబరమణిగ్రీవులు నారదునికి నమస్కరించి శాపవిమోచనము గావింపుమని యనేకవిధముల ప్రార్థించిరి. పిమ్మట నారదుడు కరుణించి మీరు నందగోపునింట మద్దివృక్షములై జన్మించి వేయిసంవత్సరము లుండి నాయనుగ్రహమున ఆజన్మమందు పూర్వజన్మజ్ఞానము గల్గి కృష్ణావతారమున కెదురు చూచుచుండుడు. పిదప నాకృష్ణుడే మీకు శాపవిముక్తి గల్గించు ననగా వారట్లే నందునింట వృక్షజన్మమెత్తి భగవదవతారమున కెదురుచూచుచుండిరి.

ఒకనాడు పరిచారకులు ఏదో కారణమున పనులకు రాక పోగా యశోద స్వయముగ పెరుగు చిలుకవలసివచ్చెను. ప్రాతఃకాలమున నిదురలేచి ముఖము కడుగుకొని, పట్టువస్త్రము ధరించి శ్రీకృష్ణుని బాలక్రీడలను బాడుచు నామె దధి మథింపసాగెను. తెల్లనివస్త్రము ధరించినదియు, నవరత్నఖచితమైన ఒడ్డాణము ను వేసికొన్నదియు, కదలుచుండు స్తనములు గలదియు, కృష్ణుడులేచునో యనిజ్ఞాపకము వచ్చుటచేత స్తనములందు పాలు చేపినదియు, హస్తకంకణారవములతో గూడినదియు, కదలు చుండుటచేత కర్ణాభరణములు వెలుగగా ముఖమున చెమ్మట యొప్పగా, జాజిమల్లె మున్నగు పుష్పములు ముడుచుకొని యుండినదియు నగు యశోద పెరుగుచిల్కుచుండగా కృష్ణమూర్తి నిదురలేచి తల్లినిగానక పాలు గుడువనెంచి తన తల్లి యొద్దకేతెంచి "అమ్మా! నన్ను విడిచి వచ్చితివా? నాకు పాలిమ్ము" అని యడిగి కవ్వమును పట్టగా యశోద ప్రక్కను నిలుపున్న కృష్ణునికి సమాధానము చెప్పుచు పెరుగు చిలుకుచుండెను. కృష్ణుని కపుడు కోపమువచ్చి నటన మాడెను. యశోద చిలుకు నపుడు శ్రీకృష్ణమూర్తి కోపముచే అందెలు శబ్దించునట్లు కాళ్లను

మార్చి మార్చి చిందులు ద్రొక్కుచుండెను. యశోద చేతులు నొప్పిపుట్టి చిలుకుట మానగా శ్రీకృష్ణమూర్తి ఆడక నిలుచును. శ్రీకృష్ణస్వామి చేయుచుండిన నవనీతనాట్యమునకు యశోద పెరుగుచిలుకగా గలిగిన శబ్దము తాళముగ నుండెను. (ఇట్టి నాట్యము కాపాడవలయునని యొకకవి యనెను.) పిమ్మట యశోద పుత్రునికి పాలిచ్చి పొయ్యిమీద పాలుపొంగుచుండి నందున లేచిపోయెను. కృష్ణునికి తృప్తికానందున కోపమువచ్చి ఆ పెద్ద పెరుగుకుండను పగులగొట్టి వెన్ననుంచిన కడవకు రంధ్రము చేసి అందుండిన వెన్ననంతయు క్రింద జారవిడిచెను. అంత మాత్రమేగాక రోటిమీదగూర్చుండి పిల్లలకు వెన్నబెట్ట నారంభించెను. యశోద తుంటరియగు కృష్ణుని బెత్తముజూపి భయపెట్టగా నతడు పారిపోవ నారంభించెను. కామక్రోధాదుల నణచి తపమాచరించియుండు సనకాదియోగులును, వసిష్ఠాదిమునులును, పరమాత్మను పట్టజాలకుండగా అట్టిపరమాత్ముని యశోద పట్టదలచినది. ఆమె యెంతవెఱ్ఱిదోగదా యని శుకుడనెను.

కృష్ణమూర్తి యశోద తన్ను వెంబడించుటగని తాను వెన్నలారగించినది తెలియకుండవలయునని యెంచి నాలుకతో పెదవిని నాకికొనుచు, నమస్కరించుచు, ఇక తప్పుచేయను చేయ ననుచు పరుగెత్తదొడంగెను. కర్మయోగజ్ఞానయోగాదులు సలిపి మోక్షమునకు బోవువారికిని ఈ సుఖము ఆనంద ముండదని దేవాదులనిరి. పిమ్మట యశోద తనయునిబట్టి త్రాటితో రోటికి కట్టబోగా రెండుజేనలు త్రాడు తగ్గెను. ఆమె ఒకదానివెనుకనొకటిగ నెన్నో త్రాళ్లను తెప్పించి కట్టజూచెనుగాని రెండుజేనలు మాత్రమే తగ్గుచుండెను. కృష్ణుడామెపడు సంకటముచూచి తనకు స్వల్ప కైంకర్యముచేయువారలే సుఖపడుచుండ పాలిచ్చి కాపాడుతల్లి యింతశ్రమపడరాదని యెంచగా చాలకుండిన త్రాడు రెండజేన

లధిక మాయెను. యశోద ఒక్కొక్క త్రాడు విప్పుచు వచ్చెనుగాని రెండుజేనలే త్రాడుమిగులుచువచ్చి తుదకు మొదటిత్రాడే రెండు జేన లధికముగ నుండెను. సకలప్రాణిబంధమోచకుడ నగు నేను కట్టువడను. భక్తిచేతనే కట్టువడుదు నని తెలుపుటకై స్వామి తల్లిచే కట్టబడెను. భక్తియుతులకు స్వామి వశ్యు డనుసంగతి శుకు డీరీతి దెలిపెను. బ్రహ్మాదులు, నారదాదులు ధ్యానము, తపము చేయు దురుగాని యశోదయట్లు ఱట్టి కొట్టినవారు లేరు. లక్ష్మీదేవియు స్వామికి అణగి మణగి యుండును. పిమ్మట యశోద కృష్ణుని రోటగట్టి ఇక కట్టువిప్పను; నేటితో నీ అగడ మణచితి నని చెప్పి వెడలిపోయెను. బాలకృష్ణుడు రోటిని మెల్లగ నీడ్చుకొనిపోయి జంటగ నిల్చియున్న మద్దిచెట్లనడుమ దూరి చెట్ల కడ్డముపడిన రోటిని గట్టిగ నీడ్వగా వృక్షములు ఫెళఫెళధ్వనితో పెల్లగిలి నేల గూలెను. అందుండి వెలుగులు విరజిమ్ముచు శాపవిమోచకుడగు స్వామిని సమీపించి యనేక విధముల స్తోత్రములు చేయుచు, వృక్షజన్మము గలిగినను స్వామిదర్శనము, స్పర్శనము సమకూడెనని సంతోషించి నలకూబరమణిగ్రీవులు స్వస్వరూపములతో సంతోషించి తమదారి నరిగిరి. ఈకథకు యమళార్జునభంగము అనగా జోడుగ నుండిన మద్దివృక్షముల శాపవిమోచన మనియు, నలకూబరమణి గ్రీవశాపవిమోచన మనియు పేరు. స్వామి యిట్లు దుష్టశిక్షణ, శిష్ట పరిపాలనము గావించెను.

## వత్సాపహారము

భగవంతుడు మత్స్య కూర్మ వరాహ నృసింహ వామన రామ పరశురామాద్యవతారములెత్తుట దుష్టశిక్షణము శిష్టపాలనము గావించు టకేగదా! దుష్టులను శిక్షించుటకు సాధువులై యుండిన కార్యము గానేరదు. అందుచేతనే భగవంతుడు ప్రతిఅవతారమునందును తనఘనతను కొంత చాటుచునే యవతరించును. దానిచే జనుల

కాతడన్న భయముగూడ గలుగుచుండును. ఈకారణమువలననే భగవంతుడు కృష్ణావతార మెత్తి తనవారు తిట్టినను, కొట్టినను సహించి తనసౌలభ్యమును వెల్లడించెను. గీతోపదేశము చేసి యాచార్యుడై యున్నాడు- ఇట్టివాని నెల్లరును నిర్భయముగ శరణుపొందవగును. కృష్ణునికి రక్కసులవలన నేదైన కీడు సంభవింపబోయినపుడు అతడు సకలచరాచర ప్రపంచమును గాపాడువాడని యెఱుగక నందాదులు తమబిడ్డను భగవంతుడు కాపాడె నని చెప్పుచు బ్రాహ్మణభోజనములు, జపహోమములు మున్నగు ఆయుర్వృద్ధికరములు, దురితహరములగు క్రియలు చేయుచుందురు. బిడ్డలు లేరని యనుభవించు దుఃఖముకంటెను నిత్యము వేయిఆపదలతో గూడిన బిడ్డనుగలిగి చూచుచుండుట దుఃఖతరమని వారు భావించిరి. నందయశోదాది సకలప్రజలు దివ్యమంగళవిగ్రహుడగు కృష్ణునికి వచ్చుఆపదల దలచి దుఃఖించి తాముండుగోకులమువిడిచి బృందావనమునకు తరలిపోవ దలచిరి. నందుడు మొదలగు గోపకులు తమ గోధనములతో, గోరసములతో (పాలు,పెరుగు మొదలగునవి) స్త్రీబాలవృద్ధకుటుంబపరివారములతో బృందావనము చేరి అందు తమకు నెలవు లేర్పరచుకొని నిమ్మళముగ నుండిరి. బృందావనస్థలమునందుగూడ కొందరు దుష్టుల శిక్షింప దలచి భగవంతుడు వారి కటులు తోపించి కార్యము జరిపించి అందు తానొకవత్సపాలుడై (దూడలను మేపువాడై) తోడిబాలురగూడి లేగలను మేపుచుండెను. పుట్టిననాటినుండియు పూతనాదిరాక్షసులను జంపుచుండుటచేత కంసుడు కృష్ణుడే తనమృత్యువని దృఢముగ నమ్మియుండెను. అందుచే కంసు డొక్కరక్కసునిబంపగా వాడు వత్సరూపుడై వచ్చి యితరవత్సములతోడ మేయుచు కృష్ణుని సంహరించుసమయమును నిరీక్షించుచుండెను.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

అను భగ. 4అధ్యా. 8శ్లోకమట్లు

అవతరించిన వాడుగాన స్వామి యా వత్సమును సమీపించి దాని వెనుకటికాళ్లను తోకతోగూడ పట్టుకొని గిరగిరత్రిప్పి వెలగచెట్టుకు కొట్టగా ఆ చెట్టు కదలి కాయలు రాలెను. దానితో కపటమైన దూడయు పడెను. గోపబాలు రిదేమి యన్యాయ మని భయపడగా శ్రీకృష్ణమూర్తి "బాలులారా! నేను దుష్కార్యము చేసితి నని యెంచకుడు. మీదూడలను లెక్కించుకొనుడు. వీడుమోసముగ వచ్చి దూడలలో దూరిన రక్కసుడు గాని నిజమైన దూడకాదు" అని సమాధానపరచి వత్సాసురసంహార మొనర్చెను. మఱియొక నాడు కృష్ణస్వామి బాలురతో సంచరించుచుండగా నొకరాక్షసుడు కొంగరూపుతో వచ్చి స్వామిని సమీపించి నోరుతెఱచి మ్రింగెను. కృష్ణుడు దానినోట ప్రవేశింపగనే తోడిబాలురు "అయ్యో! కృష్ణుడు మ్రింగబడెను. మనల నింక కాపాడువా రెవరు" అని బిగ్గరగ నేడ్చిరి. ఆ బకాసురునినోరు పెద్దదై యుండినది గాన కృష్ణు డొకమహాద్వారములో ప్రవేశించినట్లు లోపలికిపోయి వెంటనే వెలుపలికి వచ్చెను. బకాసురుడు శ్రీకృష్ణుని మ్రింగజాలక ముక్కుతో పొడిచి చంపుటకు నిశ్చయించి సమీపించగా నతడు దానినోటిని బట్టుకొని బిడ్డలు గడ్డిపోచను చీల్చునట్లు చీల్చివేసెను. జగత్పతి యగు బ్రహ్మకును తండ్రియైనవాడు గోపాలసూనుడై సాత్త్వికులను గాపాడవచ్చెను. కాన కంససఖుని జంపెను. పైన దేవతలును, క్రింద గోపబాలురును చూచుచుండగ నీ కార్యము ననాయాసముగ జేసెను. దేవతలసంతోషమునకై యిట్టి కార్య మొనర్చెను. గోప బాలురు కృష్ణుడుగావించిన ఘనకార్యమునకై యాతని ననేకవిధ ముల గొనియాడి యానందభరితులైరి.

గోపబాలురు తాము దూడలనుమేపుటకై పోవునపుడు తమ తోడ చల్దులెత్తుకొని పోవుటవాడుక. ఒక చిక్కములో కొందరి యన్నము లుంచిన పాత్రలను వరుసగ నుంచి ఒక్కొక్కదిన మొక్కొకడు తీసికొనిపోవుట వాడుక. ఒకనాడు గోపబాలురు ఒక స్థలము శుద్ధిచేసి వారిచల్దులను అచటనుంచి అక్కడ నొకబాలుని కావలియుంచి తామెల్లరు దూడలను మేపుచు ఆటలాడుచుండిరి. అపుడు పాపియగు అఘాసురుడను వాడు కొండచిలువ రూపముతోవచ్చి దారికడ్డముగ నోరుదెఱచికొని పరుండియుండెను. తెఱచియుండిన వానిక్రిందిపెదవి భూమికిని, పైపెదవి ఆకాశమునకును వ్యాపించియుండెను. గోపబాలురు వత్సములతోడ వాని ముఖద్వారమున బ్రవేశించిరి. కాని వాడు కృష్ణుడు ప్రవేశించు వరకును నోరు తెఱచియేయుండెను. వానిని సంహరించుటకై స్వామి లోపల ప్రవేశించగనే వాడు తననోరు మూసికొనెను. కృష్ణుడు వానినోట ప్రవేశించి యందు త్రివిక్రమరూపుడై వాని నోటనిండగా, శ్వాసము లాడక వానికడుపులోని వాయువు అందే నిండి శిరమును భేదించగా అందుండి ప్రాణములు పోయెను. స్వామియిట్లు వానిని సంహరించి వానిగర్భమున బ్రవేశించి చూచు నప్పటికి అందుండిన గోపబాలురు వత్సములతోడ భస్మమై యుండిరి. శ్రీకృష్ణభగవాను డపుడు తమ మనుష్యస్వభావమును వదలి పరత్వమును దలంచి యా దృష్టితో వారలను జూడగా నెల్ల వారును సజీవులై వెలుపలికి వచ్చిరి. బ్రహ్మాదు లపుడు శ్రీకృష్ణుని స్తోత్రము చేసిరి. వీరందరు రెండుగంటలకాలము నడచి మధ్యాహ్నసమయమునకు యమునచేరి శ్రీకృష్ణుని నడుమ నుంచుకొని అతనిచుట్టును గూర్చుండి చల్దు లారగింపసాగిరి. వారు ఊరగాయలు, అన్నములు ఒకరిది మఱియొకరు మార్చుకొనుచు యమునలో మేయుచుండిన దూడలను జూచుచు భుజించుచుండిరి.

తమయన్నమును స్వామి కిచ్చి స్వామిది తాము భుజించిన బాలుర భాగ్యమే భాగ్యమని కవి యనెను. నడుమునకు వస్త్రము గట్టుకొని యా వస్త్రము నడుము, నడుమునకును మధ్య వేణువు దోపుకొని లేగలఁ దోలుట కొరకబెత్తము చంకలో, కూర్రమృగముల నదరించుటకు మరియొక చంకలో కొమ్ము నుంచుకొని యెడమచేత చల్దిముద్ద నుంచుకొని బాలుర కందఱకును ప్రీతిసేయుటకై వారిమధ్య గూర్చుండి పరిహాసము లాడుచు కృష్ణుడు భుజించెను. ఈ సంగతి చెప్పుచు వినుచున్నాము. ఇదియే మనభాగ్యము. బ్రహ్మాదులే ప్రత్యక్షముగ చూచి ఆనందించిరి.

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మా మభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే ॥

భగ. 9అధ్యా. 24శ్లో

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి ॥

భగ. 5అధ్యా. 29శ్లోకము వలె

సర్వయజ్ఞభోక్తయగువాడు బాలక్రీడ అట్లాచరించెనని శ్రీకృష్ణుడు చల్దిగుడిచినవిధమును శుకుడు వర్ణించెను. ఈ యర్థముగల శ్లోకమును నిత్యము పారాయణము చేసిన యెడల శ్రీకృష్ణునితోడ మనమును విందుగుడిచిన ట్లగును.

బిభ్రద్వేణుం జఠరపటయో శ్శృంగ వేత్రే చ కక్షే
వామే పాణౌ మసృణకబళం తత్ఫలాన్యంగుళీషు ।
తిష్ఠ న్మధ్యే స్వపరిసుహృదో హాసయన్న ర్మభిస్స్వైః
స్స్వర్గేలోకే మిషతి బుభుజే యజ్ఞభు గ్బాలకేళిః ॥

యజ్ఞములందు పవిత్రమైన హవిస్సు భుజించు శ్రీకృష్ణుడు బాలక్రీడల ననుసరించుచు మొలదట్టియందు పిల్లనగ్రోవిని చెక్కి, కొమ్ము బెత్తము చంకలో నిరికించుకొని, ఎడమచేత పెరుగన్నపు

ముద్ద, వ్రేళ్ళ సందులలో మామిడి, ఉసిరిక మొదలైన ఊరుగాయల నుంచుకొని బాలురమధ్య గూర్చుండి చుట్టునున్న పిల్లలను పరిహాసవచనములతో నవ్వించుచు దేవతలు దివినుండి కనుగొనుచుండగా చల్దియన్నము గుడిచెను.

ఇందుకు పోతనగారి పద్యము -

సీ. కడుపున దిండుగా గట్టిన వలువలో
లాలిత వంశనాళంబు జొనిపి
విమల శృంగంబును వేత్రదండంబును
జాఱి రానీక డాచంక నిఱికి
మీగడ పెరుగున మేళవించిన చల్ది
ముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేగి కొసరితెచ్చిన యూరగాయలు
వ్రేళ్ళసందుల నెల్ల వెలయ నిఱికి
ఆ. సంగడీల నడుమ చక్కన గూర్చుండి
నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణు డమరులు వెఱగంద
శైశవంబు మెఱసి చల్దిగుడిచె-

గోపబాలురతోడ వేడుక లనుభవింపుచుండి యమునవైపు చూచుచుండుసరికి దూడ లన్నియు మాయ మయ్యెను. బాలురందరు కృష్ణా! యింతకుముందు వచ్చినకష్టములు కష్టములుగావు. దూడలులేకుండ నింటికి పోయితిమేని మా తలిదండ్రులు మమ్ము బ్రతుకనీయరు. ఇపు డెట్లైన మమ్ము గాపాడుము. మే మికముందు జాగరూకులమై యుందుము అని వేడుకొనుచు నేడ్చిరి. కృష్ణమూర్తి "బాలులారా! మీరునిర్భయముగ భుజింపుడు. నేనుమీదూడలనెల్ల వెదకితెచ్చెద" నని యోదార్చి లేగలను వెదుకబోయెను.

శ్రీకృష్ణమూర్తి వత్సములను నానాదిశలందు వెదకి చూచి యెందును గానక బాలురనువిడిచిపోయిన స్థలమున ఆ బాలురను గూడ గానక యోచించి "ఓహో! ఇది తనపెద్దకుమారుని (బ్రహ్మ యొక్క) కార్యమని తెలిసి వానిని యాచింప దగదనియు, వత్స ములకు, బాలురకు ఆహారము వేళవేళకు అందించలేక అతనితిక్క కుదురు ననియు, బ్రహ్మయొక్క గర్వ మణచవలసినదే యనియు నెంచి పరమేష్ఠి తన్ను ప్రార్థించి సమర్పించునంతవరకు తానే బాలురుగను, వత్సములుగను అగుటకు సంకల్పించి అట్లే వారు వారు మాబాలుడుగాడు, మాదూడగాదు అని సందేహింపకుండు నట్లు అనేకరూపములెత్తి తానే తోలుకొనిపోయి వారివారి స్థలములు చేరెను.

శుకు డిట్లనెను. శ్రీకృష్ణమూర్తి గోవత్స, గోపబాలరూప ములు దాల్చి వానివాని ఆకారము లెట్లుండెనో, వస్త్రాభరణము లెట్లుండెనో, మాట లెట్లుండెనో, స్వభావము, పేరు, వయసు ఎట్లుండెనో అట్లేయుండి సర్వం విష్ణుమయమ్మను వాక్యమును వ్యక్తపరచెను. అంతమాత్రమే కాక వత్సరూపమున అన్ని యావులపాలుదాగి అందరిగృహములందు భుజించెను. అట్లే మరల వత్సములను మేపుచు వత్సరకాలము గడపి తనకొడుకగు బ్రహ్మదేవుడు పడెడుపాట్లు దలచి తన యనేకరూపములను ఒక్క రూపము గ మార్చునట్లు నిశ్చయించి తనయట్టిబిడ్డ గోవులకును, గోపకులకును ముందు లభించనందున ఇపుడే తన్ను ముద్దాడ నిమ్మని సంకల్పించగా గుట్టలమీద ఆవులను మేపుచుండిన గోపకు లందరు త్వరితగతి వచ్చి తమతమబాలురను ముద్దుపెట్టుకొనిరి. గోగణములు తమదూడలయం దాశతో తోక లెత్తుకొని కాపరులైన గొల్లలను తోసికొని దూడలవద్దకు వచ్చి చేరెను. ఎన్నడు జరు గని యీవింతను జూచి బలరాము డాశ్చర్యపడి యిది భగవన్మాయ

వారికి క్షేమమా! నీకేమివరము గావలెనో కోరుము'' అని పలికెను. బ్రహ్మదేవు డపుడు ''స్వామీ! తప మాచరించినవారికి వరము లీయవలెను. నేనట్టివాడనుగాక అపరాధమే చేసియున్నాడ నని విన్నవించెను. శ్రీకృష్ణమూర్తి ''అయిన నేమి ? నేను నామాయను జూపితిని, నీవలన నామాహాత్మ్యము వెల్లడియైనది. పాలు, వెన్న లను దండిగ నారగించితిని. నీవు చేసిన దపరాధమే యైనను మన్నించితిని. వర మడుగు మనెను. అపుడు బ్రహ్మ ''స్వామీ! త్రిమూర్తులలో నొక్కడ నగు నేనే యిట్టి కార్య మాచరించితిని. నాకీ యపచారఫలముగ శునకాదిహీనజన్మము కల్గునని యెంచెద. అట్లయిన నగుదుగాక! ఆజన్మమునగూడ నీపాదభక్తిమాత్రము కల్గింపుమని వేడెద ననగా స్వామి ''విరించీ! నీకోరికప్రకార మగును. నీ వాచరించిన కార్యమును నే నపరాధమని యెంచిన గదా నీకాగతి పట్టును ? నీకే కొఱత యుండదు'' అని సెల వీయగా చతుర్ముఖుడు మూడుప్రదక్షిణములు చేసి తన మార్గమున తానుబోయెను.

అటుపిమ్మట కృష్ణమూర్తి గుహకుపోయి బ్రహ్మచేత బాగుగ కాపాడ బడియు కృష్ణదర్శనములేని కారణమున శుష్కించి యున్న బాలురను, వత్సములను కలసికొని తనకరస్పర్శచేత బలముగల్గించెను. ఒక్కసంవత్సరము కృష్ణునెడబాసితి మని తెల్సినయెడల గోపబాలురప్రాణము లెగిరిపోవునని యెంచి స్వామి వారికి విశ్లేషణము అరక్షణము మాత్రమే కల్గినట్లు తోపించెను. పిదప కృష్ణమూర్తి, గోపబాలురు, వత్సములు తన్ననుసరింపగా ఊరుచేరెను. శుకు డిట్లు శ్రీకృష్ణలీలలు దెలిపి యింకను ననేకకథలు చెప్పెద నని పరీక్షిత్తుతో పలికెను.

## కాళీయ మర్దనము

శ్రీకృష్ణమూర్తి మూడునెలల శిశువుగ నుండినపుడు పూతనాసంహారమును చేసెను. శిశుభావము ననుసరించియే తన

కాళ్ళను పైకెత్తి తన్ని శకటాసురుని హతము గావించెను. గాలికి కొట్టుకొనిపోయినట్లే పోయి తృణావర్తాసురుని జంపెను. తల్లిచేత రోటికి కట్టబడి యమళార్జున భంగము గావించెను. పిమ్మట బృందావనమున వత్సబాలుడై తోడవత్సములమేపుచు మాటల సందర్భముననే వత్సాసుర, బకాసురులను, అఘాసురుని సంహరించెను. ఇవి ఘనకార్యములే యయినను శ్రీకృష్ణుని పరాక్రమము బాగుగ విశదపడలేదు. శ్రీకృష్ణమూర్తి తన్ను వంచింపవచ్చిన బ్రహ్మదేవుని గర్వ మడచి తనసామర్థ్యమును పూర్ణముగ జూపెను. ఇట్లే యాతడు పెరుగను పెరుగను తన సామర్థ్యమును జూపనారంభించెను. పిమ్మట వత్సబాలుడుగ నుండిన శ్రీకృష్ణుడు గోపాలు డాయెను. అన్నయగు బలరామునితోడను, సమాన వయస్కులగు గోపబాలురతోడను గలిసి నిత్యమును గోవులను మేపుటకు బోవుచుండిన స్వామి యమునాతీరమం దొక్కకార్యము చేయదలచి బలరాము డందుల కియ్యకొనడని యెంచి అన్న నిదురించుసమయముజూచి యిలువెడలి కొందరు బాలురతోడ నావుల మేపుకొనుచు యమునాతీరమున కాళీయుడను క్రూర సర్పము వసించు స్థలమునకు బోయెను. బలరాముడు నిదుర లేచి తమ్ముని గానక ఆత డెచ్చటి కరిగెనని గోపబాలుర నడిగి అత డొక క్రొత్తమార్గమున బోయెనని వారు తెలుపగా నామార్గ మెద్దియై యుండునో యూహింపజాల కుండెను. కృష్ణుడు పోయి నది యమునాతీరమం దొక్కభాగమే యైనను దాని నెల్లవారును పరిత్యజించి యుండిరి. అందొక్కచెట్టుగాని, తీగగాని మొలవదు. ఆ ప్రదేశమందాకాశ మార్గమున బోవు పక్షు లట్లే భస్మమై పడి పోవును. ఇందుకు కారణ మా జలమున నివసించు నూరుశిరములు గల కాళీయుని విషజ్వాలలే. ఇట్టి దుష్టుని నిగ్రహింప నెంచియే శ్రీకృష్ణమూర్తి యా తావునకు బోయెను. గ్రీష్మకాల మగుటచేత గోవులును, గోపబాలురును దప్పిగొని నదిలోదిగి నీరుద్రావి మర

ణించిరి. స్వామి యొక్కడే మిగిలెను. పరీక్షిన్మహారాజా! అనా డచ్చట నాజలములు ద్రాగి వారట్లు చావవలయునని భగవత్సం కల్ప మని శుక డనెను. ఆవిషజలమును పానముచేసినతోడనే క్షణమైన నాలస్యములేక మృతినొందిన గోవులను, గోపబాలురను జూచి యిందరు మరణించిరిగదా! యని స్వామి చింతించెను. అత డట్లు దుఃఖింప నగునా? యనిన కరుణానిధిగాన నట్లు దుఃఖించెను. అట్టితావున కతడేలపోవలయుననిన శిష్టపరిపాలనము చేయవలసి యుండుటచేత-

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

భగ. 4అధ్యా. 8శ్లోకమువలె

కరుణానిధిగాన అతడు సత్పతి యనగా సత్తులకు పతి, అస త్కాలుడు=అసత్తులకు యముడు. మనుష్యలీలల ననుసరించి కృష్ణుడు దుఃఖించెను. ఇట్లు దుఃఖించి తననిజస్వరూపము జూప నభిలషించి నదియొడ్డున వరుసగ పడియుండిన వారినెల్ల జూచుచు పేరులుపెట్టి పిలుచుచు పోగా ఆ గోపబాలురు కృష్ణాయని పిలు చుచు గోవులతోడ లేచిరి. వారట్లు లేచుటకు కారణము భగవంతుని కరుణార్ద్రదృష్టియే. మృతులైనవారిని బ్రతికించుట శక్యమా యనిన భగవంతుడుగదా! భగవంతుడైననేమి? అట్లు జరుగునా యనిన శ్రీరామావతారమునగూడ నట్లే చేసెను. శ్రీరాముడైనపుడు మృతులైన వానరులజూచి యిందరు చచ్చిరేయని వానరుల వరుసగజూచుసరికి వారందరును పునర్జీవితులైరి. భగవంతుని అమృతదృష్టిచేతనే వారట్లు లేచిరి. ఇందాశ్చర్య మేమున్నది? ఇపుడుకూడ నట్లే తన కటాక్షవీక్షణముచేత నందరిని లేపెను. గోవులును, గోపబాలురును త్రాగినవిషజలము అమృతము కాగా వారు దప్పిదీఱి స్వస్థులై యుండిరి. తాము చచ్చి మరల బ్రతికిన సంగతి వారెఱుగరు. యోగీశ్వరు డగుటచేత శ్రీకృష్ణుడీకార్యము

చేసెనని శుకు డనెను. యోగీశ్వరు డనగా సర్వోపాయములకును ప్రభువు. సామదానభేద దండోపాయముల నెఱిగినవాడు. సామోపాయముచేత (మంచిమాటలాడి) బలిని మోసపుచ్చి త్రైలోక్యము నపహరించెను. దానము లనేకులకు చేసియున్నాడు. నారదుని బంపి భేదోపాయము చేయుచుండును. ఎంతకును కాకుండిన దండోపాయము నుపయోగించును. ఇట్లాగుణముల నుపయోగించి దుష్టశిక్షణమును, శిష్టపరిపాలనమును జేయును.

ఏవ ముక్త్వా తతో రాజన్ మహాయోగీశ్వరో హరిః ।
దర్శయామాస పార్థాయ పరమం రూప మైశ్వరమ్ ॥

భగ. 11అధ్యా. 9వశ్లోకమున

యోగీశ్వరు డగు హరి తన యీశ్వరరూపమును జూపెనని చెప్పబడెను. అట్టివా డగుటచేతనే–

ఏవ ముక్త్వా ఽర్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్న మానసః ॥

భగ. 1అధ్యా. 47వశ్లోకమున

జెప్పినట్లు శరచాపములు వదలి యుద్ధవిముఖుడైన యర్జునుని మనసును ద్రిప్పి–

నష్టోమోహ స్స్మృతి ర్లబ్ధ్వా త్వత్ప్రసాదా న్మయాచ్యుత ।
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥

భగ. 18అధ్యా. 73వశ్లోకమట్లు

యుద్ధమేగాక నీవేమిచెప్పినను చేసెదను అనునట్లు చేసెను. ఇట్లనేక ఘనకార్యములు సల్పు సమర్థుడు గాన తన్ను నమ్మి వచ్చిన గోవులను, గోపబాలురను బాసిపోవుట తగదనియు, అట్లు చేసిన తనకే యగౌరవ మనియు భావించి యమృతవృష్టి గురియించి వారల బ్రతికించెను. వారు కృష్ణుడు చేయబోవు కార్యమిట్టిదని తెలియలే కుండిరి. ఈ విషసర్పము వలన నెన్నిగోవులు, ఎందరు బాలురు, మహర్షులు చచ్చియుందురు ? నేను వచ్చి

దారియు తెలియదని నానావిధములుగ చింతించి "కృష్ణా! తప్పించుకొని రమ్ము. మాకేమియు తోచకున్నది. నీయందే మనసు లయించియున్నది. కనులకు నీసొగసెంతో క్రమ్మియున్నది. నిన్నే తలచుచుండుటచేత నీముందటి రూపమే మాకు స్ఫురించుచున్నది. వచ్చి కనబడుము. నీకథలు వీనులందు నిండియున్నవి. నీవు మాతో ముచ్చటలాడిన దంతయు మా చెవులందట్లే నిలిచియున్నది. నీనామము నోట చెలగియున్నది. స్వామీ! నిన్ను కృష్ణకృష్ణా యని పిలచినమాటమాత్రము మానోట అట్లేయున్నది. మేమెచట జూచినను నీవై యున్నది. నీయందలి కలవరముచేత, నిన్నే ధ్యానము చేయుచుండుటచేత నీ వన్నివైపుల నిలచినట్లే తోచుచున్నది. మేము నీభక్తులము కాకున్నను పేరునకైనను నీభక్తులమే. మమ్ము గాపాడెదనని చెప్పియుంటివే; ఇపుడిట్లు చేయుచున్నావా? మాతపముయొక్క ఫలము నీవే. నీతో చేరినవారని యెంచి మాకు దర్శనమీయరాదా?" అని ప్రార్థించిరి. శ్రీకృష్ణమూర్తికి వినోదముగ నున్నందున బాలభావము ననుసరించియు బ్రహ్మదులను మోసపుచ్చుటకును అట్లు చేసెగాని సహస్రఫణియగు ఆదిశేషునియందు పరుండువానికి శతఫణియగు కాళీయు డొక లెక్కయా?

ఇచ్చటస్థితి యిట్లుండగా బృందావనమున నపశకునములు తోచెను. నందాదులు కృష్ణమూర్తిని వెదకి ఆతడు కనబడకున్నందున బలరాముని జూచి కృష్ణు డెక్కడని యడిగి అతడును తనకు తెలియదని చెప్పగా కృష్ణునికేదో గొప్ప యాపద గలిగినదని నిశ్చయించి దుఃఖించి అతడెచ్చటనుండునదియును ఎఱుగజాలకుండిరి. వృద్ధులగువారు మాకీ యాపదవచ్చి కృష్ణుడు సుఖముగ నుండరాదా యని విలపించిరి. మాతోడనాడుకొనువానిని గానమే యని గోపబాలురు దుఃఖించిరి. పిమ్మట నందగోపుడును, యశోదయును, పురజనులును, బాలురును, వృద్ధులును, గోపస్త్రీలును

కృష్ణుడు పోయిన త్రోవ తెలియక నానాప్రదేశముల వెదకి తుదకు శంఖము, చక్రము, కల్పవృక్షము, ధ్వజము, పద్మము అంకుశము, వజ్రాయుధము అను దివ్యలాంఛనములతో గూడిన శ్రీకృష్ణుని దివ్యచరణముల గుర్తులను నేలపై గనుగొని ఆతని పాదచిహ్నములుగదా యని సంతోషముతో అచ్చటి ధూళిని శిరముల జల్లుకొనుచు పాదమే ఇంత అందముగ నున్నది. ఇక ఆతని సౌందర్య మేమని చెప్పగలము ? ఇట్టి సుందరస్వరూపున కిట్టియాపద తటస్థించెగదా యని దుఃఖించుచు పోయి ఆస్థలము చేరి కృష్ణు డెచ్చట నున్నా డనుచు బాలురను సమీపించిరి. ఆ గోపబాలకులు శ్రీకృష్ణుని కలిచి అతనిని చుట్టుకొని తాటిచెట్టువలె నిలిచియుండిన పామును నందాదులకు జూపిరి. అపుడు వారందఱు నేడ్చి యిట్టివానిని విడిచిపోవుట తగదని యెంచి యమునలో బడుటకు అధిక దుఃఖ మగుటచేత నిశ్చయించి, ఒండొరులను బట్టుకొని నీటియందు దిగి గొంతువరకు పోగా బలరాముడు వారిని నివారించి అఘాసురుని నోటినుండి బయటపడిన వాని కిది యొక ఘనకార్యము గాదు. కడకు జరుగబోవునది చూడుడు. ఆకృష్ణుని కేదేని యాపద తటస్థించినచో నాతో కూడియే యీనీట బడుడు అని చెప్పగా నందరును నీటమునుగుట మాని "కృష్ణా! బలరాముని మాట నిజమేని నీవు వెలుపలికి వచ్చి నీముఖము చూపుమని ప్రార్థింపగనే భక్తుల మాటలువిని శ్రీకృష్ణమూర్తి తన శరీరమును కొంత పెద్దది చేయగా సర్పమునకు శ్రమ కలిగి చుట్టలు విప్పెను. శ్రీకృష్ణుడు తనశరీరమును పెంచను పెంచను పాము తనచుట్లను విప్పుచు విప్పుచు వచ్చి తుద కన్నిచుట్లను విప్పివేసెను. ఈ కథను వినునపుడే మనకింత యానంద మగుచుండ ప్రత్యక్షముగ చూచుచుండిన బ్రహ్మాదుల కెంత యానందము గల్గియుండవలెను ?

పిమ్మట కృష్ణమూర్తి కాళీయుని తోకను తన యెడమచేత బట్టుకొనగా పాము శిరోభారముచేత శిరసుల నాడించెను. అతడు తలనెత్తనీయక దానిశిరస్సులందు కాలుంచెను. అది ఒక్కొకతల నెత్తినపుడు ఆయాతలలమీద తనకాలి నుంచుచు పోయెను. ఇట్లే నూరు శిరస్సులందును శ్రీకృష్ణమూర్తి నృత్యము చేసెను. వంగని శిరములం దతడు తన కాలుంచునపుడు దాని శిరములం దుండిన రత్నస్పర్శచేత నదియొక అందముగా నుండెను. అతడట్లు చేసి నది యొక నృత్యముగ తోచెను.

సీ. ఘనయమునానదీ కల్లోల ఘోషంబు
సరసమృదంగఘోషంబు గాఁగ
సాధుబృందావన చర చంచరీక గా
నంబు గాయకసుగానంబు గాఁగ
కలహంస సారస కమనీయ మంజుల
శబ్దముల్ తాళశబ్దములు గాఁగ
దివినుండి వీక్షించు దివిజ గంధర్వాది
జనులు సభాసీనజనులు గాఁగ

పద్మరాగాది రత్నప్రభా సమాన
మహిత కాళియఫణిఫణా మండపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు
నిత్య నైపుణ్యమునఁ బేర్చి నృత్యమాడె-

అపుడా సర్పముయొక్క నాసికామూలమునుండి రక్తము ప్రవహించెను. ఈఘోరబాధను చూడలేక నాగపత్నులు శ్రీకృష్ణుని సమీపించి యుక్తియుక్తముగ నిట్లనిరి. "కృష్ణా! యితడు మహాపాపి. అనేకులను జంపెను. ఇతని నింకను అణగద్రొక్కుము. నీవిందులకే గదా అవతరించితివి! ఇట్లు శిక్షించియే యితనికి బుద్ధిగఱపవలయును. అందుచేత నిది శిక్షగాదు. ఇందుచేత నితనికి

బుద్ధి గలుగును. ఇట్టిపాపి బాగుగ శిక్షించబడిన చూడవలయు ననియే యుంటిమి. ఇపు డీతడు తమపాదధూళి స్పర్శచేత శుద్ధుడాయెను. కాన నీతనియందు మా కిపుడు భక్తి కల్గెను. ఇతడు సర్వదా పరహింస చేయుచుండెను. ఇట్టివానిశిరస్సులందు నృత్యము చేయుచున్నావు. ఇతని పుణ్య మిట్టిదని యిపుడే తెలిసెను. కాన నితనిని బాగుగ శిక్షింపు"డన కృష్ణమూర్తి నాగపత్నుల మాటలకు సంతోషించి, "వరమేదైన నడుగు డన వారు మాంగల్య భిక్ష నర్థించిరి. స్వామి అట్లే కరుణించి పామును విడిచి ఇతనిని మీకొరకు వదలితి'' ననెను. ఈ దృష్టాంతము వలన భర్త పాపి యైనను భార్య యోగ్యురా లయ్యేనేని సర్వశ్రేయములు గలుగునని తెలియుచున్నది. కృష్ణమూర్తి కాళీయుని యమున విడిచి సముద్రమున రమణక మను ద్వీపమునకు బొమ్మని యాజ్ఞాపించెను. మున్నాద్వీపమున ననేకసర్పములు వసించుచుండుట గని గరుడుడు ఒక్కొక్క సర్పమును భుజించు చుండెను. అందుచేత నాసర్పములు పర్వతిథులలో మాత్రము గరుడునికి బలి యిచ్చుచుండెను. కాని కాళీయుడు మాత్రము తాను గరుడుని కాహార మగుటకు ఇష్టపడక పోగా గరుడుడు తన్నెను. అపుడే యీసర్పము పాఱివచ్చి యీమడుగును జేరెను. ఈ ప్రాంతమున తప మాచరించుచుండిన సౌభరిమహర్షి తనయెదుట మత్స్యములు బట్టుచుండిన గరుడుని నీ విచ్చటికి వచ్చినచో కాలిపోదువని శపించియుండెను. ఆశాపభయముచే గరుడు డచటికి రాకుండెను. సర్ప మీ విషయమెఱింగి వచ్చి యిచ్చట చేరెను. స్వామి మరల పూర్వస్థలమునకు బొమ్మనగా సర్పము భయపడెను. స్వామి అపుడు కాళీయునితో "నీవు భయపడకుము. నీశిరమునందు గల నాపాద చిహ్నమును జూచి గరుడుడు నీకు నమస్కరించిపోవు'' నని చెప్పి పామును బంపెను. ఇపుడు నాగుపాము తలలోగల గురుతు స్వామి పాదచిహ్నమే. మన చిన్నవాడు గట్టివాడే అనియు

భగవదనుగ్రహ మనియు నందాదులు తలంచిరి. శ్రీకృష్ణ డావిష జలమున బడి పొరలగా నాతని యంగస్పర్శచేత నాజల మమృత మాయెను. నాటినుండియు గోవులు, బాలురు, ఋషులు ఎల్లవారు నీ జల ముపయోగించుచు నచ్చట వసించుచుండిరి. ఈ కథను చెప్పినను, పారాయణము చేసినను, వినినను సర్పదర్శనమేకాదు; అయినను విషబాధ గలుగదు.

## రాసక్రీడ

వత్సాపహారమునకును, కాళీయమర్దనమునకును నడుమ ధేనుకాసుర సంహార మని అద్వైతులకును, విశిష్టాద్వైతులకును, కృష్ణుడు కాళీయమర్దనము చేసి అగ్నిని మ్రింగిన పిమ్మట ధేను కాసురప్రలంబాసురులను బలభద్రుడు చంపెనని ద్వైతులకును పాఠము. వత్సాపహారమునుకథ ద్వైతులకు లేదు.

బ్రహ్మ వత్సములతోడ గోపబాలురను శ్రీకృష్ణమూర్తికి సమర్పించి వెడలగానే యతడు తోడిబాలురతోడ తాళవనమునకు బోయెను. బాలురు తాటిపండ్లను తినగోరగా చెట్లనాడించి పండ్లను రాల్చి వారియభీష్టము దీర్చెను. బలరాముడు పండ్లకై తాటిచెట్టు నాడించినతోడనే ధేనుకాసురుడు గార్దభరూపముతో వచ్చెను. బల రాముడు వాని రెండు కాళ్లనెత్తి గిరగిరద్రిప్పి చెట్టుమీద బడ వేసెను. అచటనుండిన యితర రాక్షసులను కృష్ణమూర్తి అంత మొందించెను. ప్రలంబాసురధేనుకాసురులను బలభద్రుడే చంపెను. కాళీయమర్దనము కాగానే పొద్దుగ్రుంకినందున నెల్లవారును అచ్చ టనే నిలిచిరి. అపుడు వృక్షముల నన్నింటిని భస్మము సేయుచు కార్చిచ్చు వచ్చుటగని యెల్లవారును కృష్ణుని సామర్థ్య మెఱిగి యుండుటచేత నతనినే కావుమని వేడుకొనిరి. పెద్ద లెల్లరును నతని నాలింగనము చేసికొని కాపాడు మనిరి. చిన్నవారలెల్ల రత నికి నమస్కరించి ప్రార్థించిరి. శ్రీకృష్ణుడు వారి కభయప్రదా

నముచేసి తొలగుడని చెప్పి నోరుతెరచి దానిని మ్రింగెను. శుకు డిట్లనెను. స్వజనమును తాను కాపాడునట్లు నిర్ధారించియుండెను గాన నిదివరకు తనచేతనే కాపాడబడుచుండువారిని భవిష్యత్కాలమున గూడ కాపాడవలయు నని యెంచి అట్లు చేసెను. బ్రహ్మకును తండ్రియగుటచేత బాలుడగువాడిట్టి కార్యము చేయగలిగెనా యని సంశయింప బనిలేదు. సర్వదహనుడగు అగ్నిని మ్రింగెగదా యని బ్రహ్మాదు లాశ్చర్యపడిరి. ఒకకవి యిట్లనినాడు. బ్రహ్మాదు లెల్లరును స్తోత్రములు చేసిరి గాని నే నట్లు చేయను. ఇది యితర రాక్షసుల జంపినంతటి ఘనకార్యము గాదు. అగ్ని భగవంతుని ముఖమున బుట్టెను. కార్యార్థమై వెలికివచ్చి మరల తనస్థలము చేరెను. ఇం దాశ్చర్య మేమి ? పురుషసూక్త ప్రతిపాద్యుడైన పరబ్రహ్మ విషయమం దాశ్చర్యమేమున్న" దనిరి. అగ్ని చల్లారుట నెల్లవారును జూచి సంతోషించి తమ నెలవులు సేరిరి. పిమ్మట నొకనాడు ఆటలందు ప్రలంబాసురుని బలభద్రుడు చంపెను. పిమ్మట వచ్చిన కార్చిచ్చును శ్రీకృష్ణు డడచెను.

శరత్కాలమం దొక్కనాడు మేఘశ్యాముడగు స్వామి వనప్రదేశమున కేగి వేణుగానము సేయగా కృష్ణునే ధ్యానించుచుండిన గోపికలు కృష్ణుని బాలలీలలను వర్ణింప నారంభించి కృష్ణమయాత్మలైరి. కృష్ణమూర్తి సేయు వేణుగానము ను విని మెచ్చుకొని అంతటితో తృప్తినొందక యిట్టివానియంగసంగము కల్గినగదా జన్మసాఫల్య మని తలంచిరి. వారిలో నొకతె "అమ్మలారా! ఆ కృష్ణుని చర్యలను జూడ నతడొక మహాత్ముడైయుండు నని తోచెడిని. అదియునుంగాక యితడు రాజకుమారుడై యున్నాడు. కాన నిట్టివానిని భర్తగ బడయవలయునన్నచో పార్వతిని పూజించి యటుపిమ్మట నాభాగ్యము నొందవలెను. (సీతారుక్మిణులు రామ

కృష్ణులకై పార్వతిని పూజించిరి అని చెప్పికొని హేమంతఋతువు నందలి మొదటమాసమున గోపిక లెల్లరును కృష్ణుని భర్తగ గోరుచు యమున గట్టున వ్రతము సలుప నారంభించిరి. అందఱకును పతిగ నుండువాడు మాకును పతికావలయునని వ్రతము సల్పిరి. శ్రీకృష్ణమూర్తి మనుష్యావతారము ననుసరించి గోపిక లేదో వ్రత మాచరించుచున్నా రనియెంచిన ట్లుండెను. పరబ్రహ్మరూపము ననుసరించి తన కొఱకే చేయుచున్నా రని యెఱిగి యుండెను. గోపికలు తమవస్త్రములు గట్టుననుంచి నదిలో స్నాన మాచరించు చుండగా శ్రీకృష్ణు డా వస్త్రముల నెత్తి చెట్టుమీద నుంచి తానును అందే కూర్చుండి యుండెను. గోపికలు హేమంతర్తు వగుటచే చలికి గడగడ వడకుచు గట్టెక్కి వస్త్రములు గానరాకుండుటచే ఇది కృష్ణుని పనియే యని యెంచి తమ మర్మాంగములు చేతులతో మూసికొని వెన్నలు దొంగిలించినది చాలక చీర లపహరించితివా? దొంగా! క్రింద బడవేయు మనిరి. ఇచటికి వచ్చిన చీర లిత్తు నని స్వామి యనగా వారట్లే వృక్షమును సమీపించి వలువ లడిగిరి. నమస్కరించిన నిత్తు నని స్వామియన తప్పుచేసినవారే నమస్క రింపవలయును. మేము వ్రత మాచరించుచున్నాము. తప్పేమి చేసితి మని గోపిక లనిరి. అందుల కాతడు సకలదేవతా సన్నిధాన మగు నీటియందు మూత్రపురీషము లను విసర్జింపరాదు. వస్త్రము లేక స్నాన మాడరాదు. వ్రత మాచరించు మీరు జాగ్రత్తలేక దేవ తాపచార మొనర్చితిరి. తత్పరిహారముగ నా కంజలిచేసి నిర్దోషులై మీవస్త్రము లందుకొనుడనగా వార లొక్కచేత తమ యొడలు గప్పుకొని మరియొకచేత నమస్కరించిరి. ఒంటిచేతితో నమస్క రించుట శాస్త్రసమ్మతము గాదు. రెండుచేతులతో నమస్కరింపు డని కృష్ణు డనగా కృష్ణార్పణ మని వారట్లే చేసి తమవస్త్రములు గట్టుకొనిరి. ఇంత శ్రమపడి యీ వ్రతమాచరించుటేల యని

స్వామి యడుగగా నీ యంగసంగార్థమే యని వారు పలుకగా స్వామి అట్లే కలుగునని చెప్పిపోయెను.

మఱియొకనాడు బలరామునితోడనుండు కృష్ణుడు ఆకలితో డస్సి సమీపమున నుండిన యాగశాలకు గోపబాలుర నంపి అట నుండు మహర్షుల తానడిగినట్లు చెప్పి అన్నమును తెండనెను. బాలురట్లే ఋషుల నడిగిరి. కాని వారు యజ్ఞమాచరించుచుండుట చేత హవిర్భాగ మీయనిదే అన్న మొసగ జాల మని చెప్పి వారి నదలించి పంపిరి. బాలు రీ సంగతి కృష్ణుని కెఱింగించగా నతడు ఋషిపత్నులకు తన మాహాత్మ్య మెఱిగించి అన్నమడుగుడని వారిని బంపెను. ఋషిపత్నులు గోపబాలురుచెప్పిన శ్రీకృష్ణుని మాహాత్మ్యములను విని ఒక్కొక్కసంగతి ననుసంధించి పరమభక్తి కలిగి లేచి అతని కొఱకై యజ్ఞపాత్రలందు చతుర్విధాన్నముల నెత్తుకొని బయలుదేరిరి. అయ్యో! యజమానపత్ని యజ్ఞకాలమున బయటికి వెడలుచున్నదే యని యచటనుండిన వా రఱచిరి. కాని వారాకూతలను పెడచెవిని బెట్టి యెవ్వనికై యజ్ఞ మాచరించు చున్నారో వాడే ప్రత్యక్షముగ వచ్చియున్నాడని చెప్పి వెడలిరి. ఋషిపత్నులను గోపబాలురు నిర్బంధించి పిలుచుకొనివెళ్ళి రా యనిన నట్లు జరుగలేదు. నదులు సముద్రమున గలియుటకు పోవునట్లు పతులను, భ్రాతలను, బంధువులను, బిడ్డలను వలదని వదలి శ్రీకృష్ణసమీపమునకు ఆస్త్రీలు పోయిరి. స్వామి ఋషి పత్నులు దెచ్చిన యన్నమును ఇష్టమిత్రులతోడ నారగించి వారిని కటాక్షించి పంపగా నాయాడువారు తమ యాశ్రమము చేరి స్వామి ననేకవిధముల ప్రశంసింపగా హృషీకేశుని ప్రేరణచేత ఋషులకు దుఃఖము కలిగెను. "భగవద్భక్తి లేనివారు నిప్పువద్ద కూర్చున్ననేమి ? కామ్యకర్మలు చేయువారికి మోక్షములేదని వేదవాక్యము. అకటా! మోసపోయితిమే! ఈ యాడువారి కిట్టి భాగ్యము లభించెను గాని మన కిట్లు లభించకపోయెనే" యని

వారు చింతించిరి. వారిలో నొక్కమహర్షి "యింతభక్తి గలవారు మనకు భార్యలై యుండు భాగ్యము బడయ గంటి మని, యిట్టిభార్యల వలననే గదా మనకు భక్తి కలిగె" నని చెప్పగా నందరును నిజమే యని సంతోషించిరి.

భగవంతుడు శ్రీకృష్ణమూర్తియై యవతరించి దుష్టశిక్షణ, శిష్టపరిపాలనము సేయుచుండగా నొకనాడు తమ యింట భోజన పదార్థము లధికముగ దెచ్చి పడవేసి యుండుటను జూచి "తండ్రీ! మన యింట నేమివిశేష" మని నందమహారాజు నడుగగా నతడు "గోధనమునకు గావలసినది పంట. పంటకు వర్ష మావశ్యకము. ఆ వర్షమును దయచేయుటకై సంవత్సరమున నొకదినము ఇంద్రు నారాధించుట వాడుకగ నున్నది. కాన ప్రస్తుత మింద్రు నారాధించుటకే యీ ద్రవ్యార్జన" మని చెప్పెను. శ్రీకృష్ణమూర్తి నందుడు మొదలగు వారి భ్రమలు పోగొట్టవలె ననియు, ఇంద్రుని గర్వము గూడ నణచవలె ననియు నెంచి "తండ్రీ! తడవ తడవకు దానవులకు భీతిల్లి సింహాసనమును విడిచి పారిపోవునట్టి యింద్రుడా మనలను కాపాడువాడు!? వర్ష మెటులైనను కాలమున గురియును. పైరుపచ్చల నిచ్చునది గోవర్ధనగిరి యగుటచేత దాని నారాధించుట న్యాయమగును. తనదైవము నారాధింపక అన్యదైవము నారాధించునెడ న న్నారాధింపలేదని సొంతదైవమును నావాడు కాడని పరదైవమును దలచుటచేత వీరిలో నెవ్వరును ఫలమిచ్చుటకు త్వరపడరు. అందుచేత వీనికి ఫల మభావమగును. ఇట్లని వేదవాక్యము "- అని నందునికి జెప్పి, అట్లే గోపకులకును చెప్పగా వా రెల్లరును సంతసించి బాలుడైనను కృష్ణుడు చెప్పు యోచన యుక్తముగ నున్నదని యెంచి పర్వతమునకే పూజసల్పిరి. అణువులో నణువై మహత్తులలో మహత్తై యుండు స్వామియే పర్వతమునకు సమర్పించినదానినెల్ల భుజించెను.

తాము సమర్పించుపదార్థములను పర్వతము మ్రింగుటను జూచి నందాదులు "ఆహా! ఇన్ని దినములు ఈ పర్వతమునకు బెట్టక ఆ యిందు్రి నారాధించి వ్యర్థులమైతిమిగదా! కడువృద్ధులమై యుండియు నేమిపరియోజనము ? బాలుడైనను కృష్ణు డెంత ధీమంతుడు:" అని శ్రీకృష్ణుని పొగడిరి.

పర్వతమున నుండిన భగవంతుడు "నందగోపాలా! ఇక ముందు నన్నే యారాధింపుము. మీ రిచ్చునదెల్ల నేను భుజించె దను. నన్నారాధింపక చెడితిరి" అని పలుకగా నందాదులు పర్వ తములోని భగవంతుడు భుజించె నని పరమానందభరితు లైరి. శ్రీకృష్ణమూర్తి యొక్క కార్యము నెఱిగి యిందు్రిడు కోపించి బృందావనమున నొక్క కుటీరమైనను, ఒక్కజనుడైనను మిగిలి యుండరాదని తలంచి ప్రళయకాలవర్షమును గురియించగా గోప కులు భీతిల్లి గోవిందుని శరణుజొచ్చి- "స్వామీ! నీవు మున్ను గాపాడినది ఒక కాపాడుటగాదు. తలదాచుకొనుటకు స్థలములేక అల్లాడుచున్న మమ్మిపుడు కాపాడుటయే నిజముగ కాపాడుట. నీ మాట విని పర్వతమును పూజించితిమి. పర్వత మిపుడు కాపాడ గలదా! ఆలస్యమైనచో మే మెల్లరము నీటగలసిపోయెదము. లేచి యేదేని ఒక యుపాయ మాలోచింపు" మని పా్రిర్థించిరి. శ్రీకృష్ణమూర్తి యపుడు వారి కభయప్రిదాన మొనర్చి ఆటలాడు చుండుబాలుడు కుక్కగొడుగు నెత్తునట్లు అనాయాసముగ గోవర్ధన గిరిని వే్రిలితోనెత్తి పర్వతముక్రిందిపల్లమున వాసస్థానము లేర్పఱచు కొను డని నందాదులకు చెప్పెను. భగవంతుని బాల భావమునకు గోవర్ధనగిరి కుక్కగొడుగై యుండెను. శుకుడు స్వామి యొనర్చిన యీకార్యమునకు నానందించి చెప్పుచున్న కథను నిలిపి "రాజా! గోపకులందరి కిదియొక గొప్పయాపద. బృందా వనమెల్ల పాడై యుండును. ఈ కథను చెప్పువారు, వినువారు భగవంతునిచేత కాపాడబడుదురు" అనెను. పిమ్మట వజా్రియుధ

ములు పడునట్లుగ నేడుదినములు వాన కురిసి కురిసి నిలచెను; ఈ దినములలో శ్రీకృష్ణమూర్తి యెల్లవారి నహోరాత్రములు కాపాడెను. మేఘములు తమయొద్దనుండిన జలమునెల్ల వర్షించిపోయియిందుృని కెల్ల సంగతులు విశదపఱచగా నతడు భగవదపచారము తటస్థించిన దని భయపడెను. వర్ష మాగినచో నెప్పటియట్లే పర్వతము నుంచ నెంచి కృష్ణమూర్తి వాన నిలిచినదా చూడుడని కొందరు గోపకుల నాజ్ఞాపించెను. అపుడు గోపకృష్ణులకు సంభాషణ జరిగెను.

గోప : స్వామీ ! వర్షము నిలిచినది.

కృష్ణు : ఇంకను వర్షధారలు పడుచున్నవే.

గోప : స్వామీ! అవి వర్షధారలు గావు. నీతోగూడియున్న మాప్రేమాశ్రుధారలు.

కృష్ణు : ఉఱుముచున్నట్లున్నదే.

గో : స్వామీ ! అవి ఉఱుములుగావు. ఆకాశమున యక్ష గంధర్వ కిన్నర కింపురుష విద్యాధరాదులు నిన్నుగూర్చి పలుకు ప్రశంసావాక్యములు; స్తోత్రవచనములు.

కృష్ణు : మెఱుపు లున్నవే.

గోప : స్వామీ ! అవిమెఱుపులు గావు. మిమ్ము పొగడుచు నాట్యమాడు రంభాద్యప్సరసల చేతి రతనాల గాజులకాంతులు.

కృష్ణు : ఇంకను గాలికొట్టుచున్నదే.

గోప : స్వామీ! మీమీద దేవతలు పుష్పములు కురియించుచుండగా ఆసువాసనలకై భ్రమరములు పూలతోపాటు దివినుండి భువికి దిగుచున్నవి. వాని రెక్కలవలన కలిగిన గాలియే వచ్చుచున్నది. కాని వానగాడ్పు కాదు.

కృష్ణు : ఆకాశమున నలుపు కనబడుచున్నదే !

గోప : స్వామీ! మేఘములు తమకార్యమును జేసి వెలవెలపోగా నిందుృనిముఖము నల్లబడినది. ఆ నలుపే యిది.

కృష్ణు : అంబరతలమున మేఘసంచారము కనబడుచున్నదే.
గోప : స్వామీ! మిమ్ము స్తోత్రముసల్పుచు తిరుగుచున్న విద్యాధరగంధర్వుల విమానములే గాని మేఘసంచారము గాదు.
కృష్ణు : ఇంకను కొంచెము చీకటి యున్నట్లున్నదే!
గోప : ఇట్టి ఘనకార్య మొనర్చిన మిమ్ము మనుష్యుడని భావించు వారిహృదయములందే చీకటియున్నదిగాని మఱెందునులేదు.
కృష్ణు : మీ కందరికి భయముగ నున్నదా ?
గోప : "స్వామీ! మీతో చేరినవారికి భయములేదు. ఇంద్రునకే భయము" అని గోపకులు చెప్పరి.

శ్రీకృష్ణుడు పర్వతముక్రిందనున్న వా రందరిని బయటకి రండని చెప్పి వారు రాగా పర్వతమును యథాస్థానమున నుంచెను. ఎల్లవారును సుఖముగ నుండిరి. ఇంద్రుడు క్షమాపణకై వచ్చి "స్వామీ! మాప్రార్థననంగీకరించియే యిచటికి విచ్చేసితివి. ఐశ్వర్యమదముచే సేనాసంగతి మరచి నీయెడ నపరాధ మొనర్చి చెడితిని. నన్ను మన్నింపుము. ఇకముం దెన్నడు నిట్టి దుర్బుద్ధి పుట్టకుండునట్లు కరుణింపు"మని యనేకవిధముల స్తుతి నొనర్చి నమస్కరించి తనతోడ గొనివచ్చిన కామధేనువుయొక్క క్షీరముతో నభిషేకము గావించి వెళ్లెను.

నందు డేకాదశీవ్రత మాచరించి ద్వాదశి యగుటకు మునుపే ఆకలిచేత పీడితుడై అర్ధరాత్రమున స్నానము సల్పుటకు నదిలో దిగెను. అకాల మగుటచే వరుణదూత యతనిని బట్టు కొనిపోయి ప్రభునిముందు నిలిపెను. వరుణుడు నీ విట్లొనర్పదగునా యని నందుని దండించు చుండగా శ్రీకృష్ణమూర్తి యచటికి వచ్చెను. వరుణుడు శ్రీకృష్ణు నర్చించెను. నందుడు తన కృష్ణునిగాంచి ధైర్యము పొంది యిట్టివాడు నాకు కొడుకాయెగదా యని యానందించెను. ఆవల కృష్ణుడు తండ్రినిపిలుచుకొని

వెళ్లెను. నందుడు తానొక దివ్యపట్టణము జూచితి ననియు, కృష్ణుడా స్థలమున సత్కరింప బడెననియు చెప్పగా నెల్లవారును తమకా తావు జూపుమని శ్రీకృష్ణు నర్థింప సాగిరి. స్వామి వారినెల్ల నీట మునుగు డని చెప్పి వారికి వైకుంఠమును జూపెను.

శరత్కాలము సంప్రాప్త మాయెను. గోపికలును సంవత్సర కాలముగ కృష్ణమూర్తికై వేచియుండిరి. శ్రీకృష్ణుడు లక్ష్మీసదృశుడై తోచిన చంద్రుని, అతని కిరణములతో మిలమిలలాడు వనమును జూచి అనందమును పొంది వేణుగాన మొనర్చెను. సంగీతము స్త్రీలకు రుచించునట్లు పురుషులకు రుచించదు. సంగీతము చేత స్త్రీలు చెడుదురు గాన పురుషులును చెడుదు రని వేదవాక్యము. కృష్ణస్వామి యనుగ్రహమును పొందియుండిన స్త్రీలు తదేకధ్యానముతో పరుండియుండిరి. వారు తమతమ యిష్టమిత్రబంధువులు, అత్తమామలు, భర్తలుపరుండియుండగా మెల్లగాలేచి కృష్ణుడుండు చోటికి పోయిరి. కృష్ణమూర్తి వారలను జూచి "వనితలారా! మీ యత్తమామలను, మగలను విడిచి యిట్లు రా దగునా ?'' యని యడుగగా వారు సర్వసంగపరిత్యాగము చేసి వచ్చిన మ మ్మిట్లు నీయంగసంగ మీయక పొమ్మనుట తగదని పల్కిరి. కృష్ణమూర్తి ధర్మశాస్త్రమును బోధించి చూచెను గాని వారు దానిని పాటింపక ఆతనిపాదముల బడి వేడుకొనిరి. మరికొందరు స్త్రీలు కృష్ణసందర్శనార్థము వెడలుట దెలిసి యింటివారు వారి నదలింపగా నాస్త్రీలు పరుండి మరల లేచి పోబోయిరి. అది యెఱింగి యింటివారు వారల నొకగదిలో పడవేసి బీగములువేయగా వారందే మృతినొందిరి. ఆస్త్రీలు కృష్ణవిరహవేదనచేత ననేకకోటిజన్మకృతపాపము ననుభవించి యతనిదివ్యచర్యలను దలంచి యానందించి యనేకజన్మకృతపుణ్యము ననుభవించి త్రిగుణాత్మకమైన దేహమును వదలి మోక్షము పొందిరి. కృష్ణమూర్తి గోపికలకు తన యంగ సంగ

మిచ్చెను. అతడు గోపికలతోడ క్రీడలు సల్పుటచేత మన్మథునికి కొంతగౌరవము కలిగె నని శుకు డనెను. మహాలక్ష్మికి గూడ లభించని భాగ్యము మనకు అనన్యభక్తి వలన లభించె నని తల చుటకు మారుగ గోపికలు తమ అంగసౌందర్యమును కృష్ణు డాశించెనని యెంచి తమసాటివా రెవ్వరని తలంపగా వారిగర్వ మణచి భక్తి కల్పించి అధికముగ కటాక్షింపదలచి అదృశ్యు డాయెను. గోపిక లతనిని చింతించి మార్గమున కనబడు వృక్షము లను పేరుపెట్టి పిలుచుచు కృష్ణుని గంటిరా యని యడుగబోయి తమ్ము దామె పిలుచుకొని తమలో నొకతె కానరా కుండుటచే నామె శ్రీకృష్ణుని పిలుచుకొనిపోయెనని యెంచి గోపికలు స్వామి యొక్కయు, నతనితో వెళ్లిన గోపికయొక్కయు పదచిహ్నములు చూచుచు పోగా కొంతదూరమున తావల స్వామి యడుగులు మాత్రమే కాన్పించెను. స్వామి దానినెత్తుకొనిపోయెనని వారు భావించిరి. ఒక్కచోటపడియుండిన పుష్పములను, కూర్చుండిన గురుతులను జూచి స్వామి దానికి జడవేసెనని తలంచిరి. ఇట్లు వీరెల్లరు దుఃఖించుచుండగా కృష్ణునితో నుండిన గోపిక తానె సమర్థురాల నని తలంపగా స్వామి దానినికూడ విడిచెను. అంద రొక్కచోటచేరి కృష్ణా! కృష్ణా! యని విలపింపసాగిరి. అవియే గోపికా గీతికలు. కృష్ణా! నీ యరికాలిస్పర్శచేత మాయురముల తాపము లణగును. నీ యధరామృతముచేత మాసర్వాంగతాపము శమించును. అనన్యభావముననిన్ను నమ్మివచ్చి నీయంగసంగమము లభింపగా సుఖసముద్రమున మునిగిన మా కిట్టి యవస్థ తటస్థిం చుట న్యాయమా ? పతిసుత భ్రాతృ బాంధవులను విడిచితిమే యని విలపింపగా వారి యహంకార మెల్ల నశించె నని యెంచి స్వామి దర్శన మిచ్చెను. కోటిమన్మథ మన్మథుడైన స్వామి రాగా నొకతె పాడ, నొకతె తాళము వేయ, నొకతె యాడెను. పిమ్మట కృష్ణమూర్తి యిద్దరుస్త్రీలనడుమ తానొకడు నిలిచి వారిభుజములమీదచేతు లుంచు

కొనెను. ఇట్లు నడుమ నడుమ తానై యుండెను. వారెల్లరు నొక్కటిగ కూర్చుండుచు లేచుచు ఆటలాడిరి. పిమ్మట గోపికలు కృష్ణు నుద్దేశించి "మారజనకా! నీవు కోటిమన్మథ విగ్రహుడవు. నిన్ను నమ్మితిమి. మమ్ము వదలరాదు. ఇట్లే యుండ నగును. కాపాడవలయును. నీవులేని సమయమున మారుతమువలనను, చంద్రునివలనను, మన్మథునివలనను బాధ నొందితిమి. ఇకమీద మే మహంకరింపము" అని విన్నవించి స్తుతించిరి. పిమ్మట వారెల్లరు గొబ్బితట్టి అనేకలీలల దేలిరి. పిదప శ్రమతొలగునట్లు జలక్రీడలు సలుపగోరి యమునకు బోయిరి. మదించిన యేనుగు పెంటియేనుగులతో వలె స్వామి వారితో నరిగి నీటదిగెను.

## అక్రూరాగమనము

వేణుగాన మొనర్చి తమ యుల్లములు పల్లవింపచేసిన శ్రీకృష్ణునితో గోపకాంత లెల్లరు కొంతకాలము గడపి తమయిండ్లకు బోగా భగవదనుగ్రహమున వారి నెవ్వరును దండించలేదు. ఒకనాడొక్క గొప్పసర్పము నందగోపుని సగము మ్రింగివేయగా చూచుచుండిన గోపాలకులు రోకళ్లతో నాపామును గొట్టియు ప్రయోజనము లేనందున శ్రీకృష్ణు నచటికి పిలుచుకొనివచ్చిరి. శ్రీకృష్ణుడు తనపాదముతో నాపామును స్పృశించగా నది యంత మొందెను. అందుండిన తేజము ఆకసమున కెగిరి కృష్ణాయని పిలచి తాను సుదర్శనుడను విద్యాధరుడ ననియు, శాపకారణమున ఈ సర్పరూపమును ధరించితి ననియు, నీవలన శాపవిముక్తి కల్గెననియు చెప్పి స్వామిని స్తుతించి తనదారి నరిగెను. పూర్వయుగమున అహల్యాశాపవిమోచనము గావించిన ట్లీ యుగమున నుపనయనము కాకమునుపే శ్రీకృష్ణుడు సుదర్శనుని పాపము పరిహార మొనర్చెను. శ్రీకృష్ణుడు తాను పరమాత్మ యని

తెలియుట కనేక కార్యములు సల్పుచుండినను మనమా సంగతి నెఱుగజాలకున్నాము.

శంఖచూడుడను కుబేరుని భటుడు వచ్చి స్త్రీలతో వేడుకగా మాటలాడుట గని కృష్ణుడు "ఓరీ ! నేను, బలరాముడుండగా మా సమక్షముననిట్టికార్య మొనర్ప సాహసింపకు" మని బోధించెను. కాని విననందున వానితలయందున్న నాగరత్నము నెత్తివేయగా వాడు మృతుడయ్యెను. కృష్ణుడామాణిక్యమును బలరాముడు వాంఛింపగా నతనికిచ్చెను. మరియొకనాడు కృష్ణమూర్తి వనమున కేగి వేణుగాన మొనర్పగా గోపికలెల్లరు గూడి "ఓసీ! ఏమి ఈవేణునాదము. దీనిని వినిగదా! సర్వసంగపరిత్యాగ మొనర్చి వానిని దలంచితిమి. కృష్ణు డెచటనుండిన మనమనసు లచటనే యుండును. అతనిగానమునకు అడవిమృగములు, జింకలు, వృక్షములు, నదులు, సర్వసంగపరిత్యాగ మొనర్చిన మహర్షులు పరవశింతురు. ఆకాశమున గంధర్వవిద్యాధరాదులు తమ భార్యలతోడ విమానములందు సంచరించుచు శ్రీకృష్ణుని వేణునాదమును విని స్త్రీలు విమానములను నిలుపవలెనని కోరగా ఆపురుషు లట్లే విమానములను నిలిపి గానమున ప్రసిద్ధినొందిన అనేకాపూర్వ ప్రయోగములను శ్రీకృష్ణమూర్తి ప్రయోగింపగా వ్రాసికొందురు.

స్త్రీ లన్నినో పరపురుషుని తమ పురుషులముందు స్తుతించుటకు వెరచి మాటలాడక వినుచుందురు. అట్లు విని విని ఆనందముచేత అవశముగ తలల నాడించుచుందురు. పిమ్మట వారిమనసు కృష్ణునియొద్ద కేగును. వారి వస్త్రములు వీడిపడును. ఇట్టి జగన్మోహన మైన వేణుగానమహిమ నేమందు మని గోపికలు వర్ణించిరి. కంసుడు అరిష్టాసురుని బంపగా నా దైత్యుడు పెను మూపురమును బలిష్ఠమైన శరీరమును కలిగిన వృషభరూపమున భూమిని గిట్టలతో నెగజిమ్ముచు కదలివచ్చెను. దుష్టశిక్షణకొఱకే యవతరించి

కాచియుండుట చేత కృష్ణుడావృషభముయొక్క కొమ్ములను బట్టి దూరముగ త్రోయగా నామాయావృషభము మరల కృష్ణుని మీదికి వచ్చెను. స్వామి దానికొమ్ములను గట్టిగ బట్టుకొని పాదములతో తన్ని క్రిందబడవేసెను. పిమ్మట దానిశృంగములను విఱిచి తడిగుడ్డను పిండునట్లు దానిని పిండివేసెను. దాని శరీరము కొంచెము కదలుచుండగా చేతనున్న కొమ్ముతో గొట్టి చంపివేసెను. శ్రీకృష్ణుడిట్లు చిట్టిపొట్టి దుష్టుల సంహరించుచుండుటగని దేవతలు కాల మరుగుచున్నదనియు, మూలస్థానపుసు కూల్చవలయు ననియు నెంచి నారదుని బిలిచి కంససంహారమునకు తగినయేర్పాటు గావింపు మని చెప్పి పంపిరి. నారదుడు కృష్ణునొద్దకు వచ్చి "చిన్నచిన్న యసురుల జంపుచున్నావేమి ?" యనగా నతడు మధురనుండి యిచటికి వచ్చితిని. పిలువనిదే అక్కడికెట్లు పోగల నని వచింపగా ప్రథమమున కంసుని దిద్దుటకు నారదు డరిగెను. నారదునకు దేవదానవులు సమానులే. విరోధులు లేరు. కంసుడు నారదుని పూజించి "సంగతి యే" మని యడిగెను. ఇంతకు మునుపు ఆకసమున కెగిరిపోయినది నీచెలియలిబిడ్డ గాదని నారదుడు కంసుని కెరిగించెను. అతడు "దైవ మబద్ధ మాడె" నని తలచితిని. అట్లు తలంచుట తప్పని నీమాటలవలన నిప్పు డెఱింగితిని. మఱి యా యాడుబిడ్డ యెవరి దని కంసు డడిగెను. ఆమె యశోదకు జన్మించిన శిశు వని నారదమహర్షి పలుకగా కంసుడు తన చెలియలి పుత్త్రు డెవరని ప్రశ్నించెను. నీవు పంపు చున్న చిన్నచిన్నయసురులను జంపుచున్నవాడే యనియు, బలరాముడు వసుదేవుని మఱొకభార్యకు పుట్టినవా డనియు జరిగిన సకల వృత్తాంతము లెఱిగించెను. కంసుడు తన బావచేసిన కార్య మెఱింగి ఔరా! యాత డెంతసాహసు డని యెంచి మరల చెల్లెలికిని, ఆమెభర్తకును సంకెళ్లు వేయించెను.

"కృష్ణబలరాములు నీకు మృత్యువులు. నీవు ముందు మోస పోయితివి. వారి నిపుడే చంపుట మంచిది. ఇంకను దినములు జరిగెనేని వా రింకను బలాఢ్యు లగుదురు. నారాక నెవరికిని తెలుపవలదు" అని చెప్పి కలహప్రియు డగు నారదు డరిగెను. కంసుడు యోచించి పరమశివుని చాపమునకు చేయబోవు ఉత్సవ మును జూడ రండని తన మేనల్లుర్ను పిలిపింతుననియు, ఉత్సవ మునకు వచ్చు రామకృష్ణులను గృహద్వారమును ప్రవేశించు నపుడే యేనుగులచేత చంపింప డనియు, వారట్లు చావరేని మీరే చంపుడనియు మల్లుల నాజ్ఞాపించెను. ఈసంగతి నెఱింగి మంత్రు లలో నొకడు "ప్రభూ! కృష్ణుడు నీచెలియలికొడుకని తెలిసి నందుకు సంతోషించరాదా ? రామకృష్ణులు పరమశూరులు; సుందర విగ్రహులు; వారిని చంపదలచితిరా ?" యనియడిగెను. కంసు డందులకు "దేవకీవసుదేవులకును,కృష్ణునకును,నాకును బంధుత్వమే లేదనియు తనతండ్రియగు నుగ్రసేనునకే తాను బుట్టలే దనియు చెప్పుచు మాతల్లి ఋతుస్నాతయై వనమున దిరుగుచుండి భర్తను స్మరించగా ద్రవిళు డను గంధర్వు డాసంగతి నెఱిగి ఆమె భర్త రూపమున వచ్చి భోగించగా నేను పుట్టితిని. కావున నాకును వీరి కిని సంబంధమే లేదు. వీరియం దాశయు నాకు లేదు" అనెను. అపుడు మంత్రి "నేడే యుజమానుల అవతారవిషయము తెలిసిన" దనెను.

కంసుడు మల్లుల నారీతి నాజ్ఞాపించి యంతఃపురమున కరి గెను. కృష్ణుడు ధనుర్యాగమునకు వచ్చులోపలనే చచ్చినను చావ నిమ్మనితలంచి కంసుడు కేశియను రక్కసుని బంపెను. వాడు పెద్దగుఱ్ఱమై తన తోకవెంట్రుకలచేత ఆకాశమున దిరుగు విమాన ములను జోపుచు మనోవేగమున రాగా పదునాల్గు లోకములును చలించెను. ఇట్టివానిని శ్రీకృష్ణుడు అలవోకగా తన్ని విసరివేయగా నూరుక్రోసుల దూరమున బడి మరల నోరుతెఱచుకొని యతని

మీదికి వచ్చెను. శ్రీకృష్ణుడు తనబాహువును కేశినోట దూర్చి లోపలికి పోగానే వానినోరుపట్టనంతపెద్దదిగ చేయుగా శ్వాసము లాడక అశ్వరూపధరుడైన ఆ దైత్యుడు చచ్చెను. కేశినట్లు సంహరించి ఏమియు నెఱుగనట్లు కూర్చుండి యుండగా స్వామివద్దకు నారదుడేతెంచెను. నారదుడు శ్రీకృష్ణుని వేషమును గాంచి "మనసా! వేదములకందని వస్తువు, అవాఙ్మానసగోచరుడు, బ్రహ్మాదులకు దొరకనివాడు నగు పరబ్రహ్మము ఆటలాడు బిడ్డ డాయెను. ఈ రూపమును, చేష్టలను జూచి మోసపోకుము. పరబ్రహ్మము గ నుండువాడు సర్వసులభుడై పెరుగువెన్నల దొంగయై, గోపకామినులకు జారుడై యుండుటచేత నితనిని జూచి మోసపోవకుము. ఇట్లున్న పరమాత్మను జూచి కృష్ణుడని, గోపాలుడని, గొల్లవాడని భావించి మోసపోవకుము_ వాఙ్మనస్సుల కందని ఈ వస్తువు చరాచర ప్రపంచమును సృష్టించి రక్షించి సంహరించునట్టి పరమాత్మయే. ఇతనిని ధ్యానించినవాడు పరమాత్మయగును అని వేదవచనము. అట్టి పరబహ్మ శ్రీరమణీకుచదుర్గవిహారిగ నున్నది. ఇట్టి పరమాత్మను జూచి మోసపోవకు" మని నారదుడు మానసబోధ చేసికొనుచు రాగా సకల మెఱింగి యుండియు స్వామి తెలియని భంగి "నారదమహర్షీ! విశేషమే" మని అడిగెను. "అల్పరాక్షసులను అంత మొందించిన నేమి ఫలము ? కంససంహారము గావింపు" మని నారదు డనెను. స్వామి "పిలువనిదే యెట్లు మధురకు పోదు" నని బదులు చెప్పగా నారదుడు తాను కంసునియొద్ద చేసివచ్చిన ఘనకార్యము నంతయు చెప్పెను. కంసాహ్వానము రాగానే బయలుదేరెదనని స్వామి నారదునికి దెల్పెను.

కంసుడు యోచించి వసుదేవునికిని, కృష్ణాదులకును ఆప్తుడై యుండి తనతో జేరనవాడగు అక్రూరుని బిలచి "నేను సల్పబోవు ధనుర్యాగమునకు పాలు, పెరుగు, వెన్నలను బండ్ల

నిండుగ తీసికొని కుటుంబపరివార సమేతముగ వచ్చి యాగము నిర్వహింపవలసినదని నందున కెఱిగించి వారి నందరిని పిలుచు కొని రావలసిన" దని ఆజ్ఞాపించగా అక్రూరుడు వల్లె యనెను.

ఒక్కనాడు కృష్ణసహితులై గోపకుమారులు అడవికివెళ్లి పశువులను మేపుచు ఒకపర్వతముచెంత కనుమూసిగంతలు ఆడు చుండిరి. కంసునిపంపున వ్యోమాసురుడు గొల్లపిల్లవానిరూపముతో వచ్చి వారినిగలిసి ఆటలాడుచు మెల్లమెల్లగా ఒక్కొక్కరిని కొండ గుహలోనికి గొంపోయి లోపలవదలి బిలద్వారమును ఱాతితో కప్పి ఎప్పటివలె ఆడుచుండెను. సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు నవ్వుచు కపటాత్ముడైన వ్యోమాసురునితో "ఓరీ! నీవు చాల గడుసరిదొంగవు. గొల్లపిల్లలు కొందరిని శైలగుహలో దాచినావు. మిగిలినవారిని గూడ దాచరా'' అనుచు తోడేలును సింహమువలె వానిని ఒడిసిపట్టుకొనెను. వాడు పట్టువిడిపించుకొనలేక గిలగిల తన్నుకొనుచుండగా కృష్ణ మూర్తి వానిని నేలగూల్చెను. పర్వతగుహ కడ్డముగ నున్న రాతిని కాలితో పడదన్ని లోపలికి వెళ్లి అక్కడనున్న గొల్లపిల్లల నందరిని గైకొని గొల్లపల్లె కేగెను.

అక్రూరుడు కంసునాజ్ఞగొని శ్రీకృష్ణు నెపుడు చూతునో యని ఉత్కంఠతో రేయి నిదురించలేదు. బృందావనమున నున్న కృష్ణబలరాములను జూచి వచ్చెద ననిన పాపియగు కంసుడు చంపునని వెఱచి యడుగ కుంటిని. అట్టి కంసుడు ఇతరమంత్రు లను బంపక నన్నే యీ కార్యమునకు నియోగించె నని తలచి యానందించెను. త్రిపురసుందరి యనుపేరు గలిగి చూడ ఘోర ముగ నుండునట్లును, గంగయనుపేరు గలిగి నీరు లేకుండునట్లును, నీలాయతాక్షి యను పేరు గలిగి కన్నె లేకుండునట్లును గాక అక్రూరుడను పేరు అతనియెడ సార్థక మయ్యె నందురు. అక్రూ రుడు రాత్రియంతయు కృష్ణధ్యానమున గడపి తెల్లవారగనే రథ

మెక్కి ప్రయాణము సల్పెను. పోవునపుడు శుభశకునము లగుట జూచి భక్తితో, పరమానందముతో ఆతనిహృదయము నిండియుండెను. ఎడమవైపున రెండుగరుడపక్షు లగపడెను. అందుచే సకల కార్యసిద్ధి. దీనినిజూచి ఆనందించులోపల ఇరువురు వేదవేదాంగ పారంగతు లగు బ్రాహ్మణుల దర్శన మాయెను. గరుడదర్శనము చేత గరుడవాహనుని దర్శన మగును. శుకు డిట్లనెను. అక్రూరుడు ఎట్టివిఘ్నములు లేక ఊరుచేరి కృష్ణదర్శనము చేసికొని యతనితో మాటలాడి తనతో పిలుచుకొని రావలెనని యెంచి "సర్వేశ్వరా! సర్వసాక్షి!" యని ధ్యానించి యతనియొద్దకు భక్తుడొకడు వచ్చుచున్నాడని తెలుపుటకు భక్తియను దూతికను బంపెను. "ఓ! భక్తీ! నీవు నన్నుగూర్చి చెప్పునపుడు స్వామి వాడు కంసదాసుడు, పతితుడని పలుకును. అయిన నేమి ? నీవు పతితపావనుడవేగదా యని బదులుపల్కు" మని యుక్తి తెలిపెను. కృష్ణుని కింకను ఉపనయనము కాలేదు. వానికేమి తెలియు నని భక్తి యడుగగా "పోయిన అవతారములో వసిష్ఠునిచేత నుపదేశమును పొందెను. అతడు మహారూపవంతుడు" అని అక్రూరు డుత్తర మిచ్చెను. అక్రూరుని గూర్చి శుకు డిట్లనెను. "ఏ జన్మమున నేపుణ్య మొనరించితినో, ఏతపము గావించితినో, ఏ వేద విదుడైన బ్రాహ్మణునకు దాన మొసంగితినో, అనేకజన్మార్జితపాప సంఘము నేటితో తొలగెను. భగవంతుడు నాకు చుట్టము, నాకు స్నేహితుడు, నేడే నాజన్మ సఫల మయ్యెను. సనకాదులు తమ హృదయములందుంచి ధ్యానించుచరణములను గదా నే నిపుడు సేవింపబోవుచున్నాను అని తలంచి ఒడలు మఱచి ప్రపంచవాసన లేక ధ్యానించుచు బోయెను. అట్లు పోవునపుడు తన కెందటో మిత్రులుండగ తన్ను బంపిన కంసుని యుపకారమును స్మరించి రథము డిగ్గి యతనికి సాష్టాంగప్రణామ మాచరించెను. కంసు డే కారణమున బంపినను నాకు కృష్ణదర్శన మగునుగదా! భగవం

తుని చరణారవిందములు వెలుగుచున్నవి. అందుచే చీకటి పోవును. భగవచ్చరణ నఖముల ప్రకాశముచేత సనక సనందన నారదాదులకు హృదయమందలి చీకటి తొలగెను. అట్టి పాదములను దర్శింపబోవుచున్నాను. సంసారసాగరమున బడియుండు నేను నేడు దానిని విడుతును. కృష్ణాయని అతడు పిలుచుచు మైమఱచి రథము దోలక నిశ్చలుడై యుండెను. మరల తెలివిరాగా రథము తోలుకొని పోవుచుండెను. అక్రూరుడును మనుష్యుడు, మనమును మనుష్యులము. అట్లుండియు మనకు ఆతనికున్న భక్తియందు సహస్రాంశ మయిన ఉన్నదా యనికవి యనెను. అక్రూరుడు స్వామిపాదములు దలంచి ముఖమును దలచి మరలపాదములను దలంచెను. ఆశ్రయించుటకు సాధనముగ నుండుటచేత పాదమే అధికముగ వర్ణింపబడుచున్నది. తిరుమంత్రార్థమున భగవంతుని చేరుటకు నాతనిపాదమే మార్గమని చెప్పబడినది. తనయజ్ఞానాంధకారమును బోగొట్టు చరణసందర్శనము కాబోవుచున్నదని యానందించెను. దేవాదులచేత పూజింపబడుచు లక్ష్మీదేవిచే నామెతొడపై నుంచుకొనబడి ఋషుల హృదయమున నెలకొని, మహోపాసకుల చేత ఉపాసింపబడినవి ఆతని పాదములు. అట్టి పాదములు ఆవులను, దూడలను మేపుచు అడవిలో తిరుగుచున్నవి. ఈ పాదములకొఱకే నేనింత అల్లాడుచున్నాను. ఇట్టి పాదములస్పర్శచేత గోపికలు తమహృదయతాపము చల్లార్చుకొనుచున్నారు. ఆగోపికలకు నమస్కారము. ఆహా! ఆతనిముఖసౌందర్య మేమనవచ్చును? రత్నకుండలములతో గూడిన కర్ణములును, అందపు చెక్కిళ్ళునుగల ఆ ముఖము ననుఁజూచి నవ్వుచున్న ట్లున్నది. ఆతని కుంతముల అంద మేమనవచ్చును? అట్టిముఖదర్శన మగుననని యెంచెదను. పక్షులు ప్రదక్షిణముగ బోవుచున్నవి. అని భావించుచు నతడు పోవుచుండెను. కన్ను తుడుచుకొనెను. పాపాత్ముడగు కంసు

నిన్ని దినములు చూచుచుంటిని. కన్నులు కలిగినందుకు నేడె ఫలము సమకూడెను.

అజోఽపి సన్నవ్యయాత్మా
భూతానా మీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వా మధిష్ఠాయ
సంభవా మ్యాత్మమాయయా ॥

భగ. 4. అధ్యా. 6శ్లోకము

భగవంతుడు తన సంకల్పమున నవతరించెను.

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే ॥

భగ. 4 అధ్యా. 8వశ్లోకము

సాధువులను గాపాడి, దుష్టులను శిక్షించుటకే యవతరించెను. అట్టి వానిని జూడబోవుచున్నాను. అతనినిజూడని కన్నులకు ప్రయోజనము లేదు. " అక్రూరు డిట్లు తలచి తాను శ్రీకృష్ణునికి నమస్కరించుచున్నట్లును, కృష్ణుడు "అక్రూరా! వచ్చితివా" యని పలికి తన శిరస్సు నతడు నిజ కరముతో స్పృశించి నట్లును భావించి "ఆహా! అది సాధారణమైనహస్తమా ? కాలసర్పముచేత హింసింపబడుచు మాయాబంధురసంసారమును అనుభవించుచు శరణాగతులైనవారికి భయపడవలదని అభయమిచ్చు హస్తముగదా!" (భక్తులిట్లు తలంపపలెను.) నేను కృష్ణు నింటివాకిటికి పోగా ద్వారపాలకులు కంసునిమంత్రినగుటచేత నన్ను లోపలికి విడువ మందురు. అతడు నట్లే యనునేమో ? ఆహా! తప్పుగ భావించితిని. అతడు సాధారణ ప్రభువుకాడు. హృదయములోపలనుండు ముఖ్యక్షేత్రజ్ఞుడు; మనసుసంగతి నెఱిగియున్నాడు. మనసు తనకిచ్చి

యున్నానని తెలిసికొనును. నేడే నాజన్మకు సాఫల్యము. అతడు నన్ను పిలుచును. నేడే మనుష్యుడ నగుదును. వా రట్లు పిలువ కున్న జన్మము కాదా యనిన భగవద్భాగవతులు మంచివా డనని జన్మము జన్మమే కాదు (వానిజన్మమును కాల్పవలసినదే.) అని యక్రూరు డిటులు కృష్ణుని పాదాదికేశపర్యంతమును, ఆతనిసకల లీలలను స్మరించుచు, కలుగబోవు సుఖముల నెంచుచు పోవు నంతలో సూర్యాస్తమయ మాయెను. మహాభాగవతుడు వచ్చెనని సూర్యు డస్తమించెను. పొద్దు చీకటివెలుతురులతో మిశ్రితమై యుండెను. శ్రీకృష్ణమూర్తి అపుడే గోవులను తోలుకొని యింటికి బోయెను. అక్రూరు డపుడె పుడమిపై ముద్రితములైన శ్రీకృష్ణ పాదరేఖలను జూచి రథము దిగి ఆమట్టిలో పొరలి, పొరలి ఆధూళి నెత్తి నెత్తిపై జల్లుకొని బ్రహ్మాదులు సేవించి మెరయుచుండు తమకిరీటములు మిక్కిలి ప్రకాశించుటకు తమ శిరములందు స్వామి చరణధూళిని వేసికొందురు. అట్టిపాద మిది; ఇట్టి పాదధూళి లభిం చెనుగదా! అని పల్కి శ్రీకృష్ణపాదరజమని అచటి మన్ను నెత్తి దేహ మునకు పూసికొనెను. అటుపిమ్మట అచ్చటనుండిన యొక రిద్దరు బాలురను జూచి కృష్ణు డిపుడేమిచేయుచుండునని యడిగెను. రామ కృష్ణు లిప్పుడె యిల్లుసేరి వస్త్రములను ధరించి గోవులను కట్టివేసి దామములు భుజములపై వేసికొని పాలుపిండుటకు సిద్ధముగ నుందు రని వారు తెలిపిరి. అక్రూరుడు రథముతోలుకొని పోయి ఆ బాలురు చెప్పినట్లే యుండిన రామకృష్ణులను గాంచెను.

బలరామకృష్ణులు నీలపీతాంబరములు ధరించి యుండిరి. రజత మరకత పర్వతములవలె నుండిరి. వా రట్టిట్లు కదలునపుడు మత్తాబులవలె వెల్గుచుండిరి. ''మహారాజా! శ్రద్ధగా నాలకింపు'' మని శుకు డనెను. అక్రూరు డిట్టి రామకృష్ణుల గని రథముడిగ్గి వారి కడకేగి అచటి గోమూత్రగోమయములనుగూడ పాటింపక

సాష్టాంగముగ సేవించెను. "నీ వెవ" రని వారడుగ తాను అక్రూరుడ నని చెప్పెను. వారీమాట విని మరియొకనిని పాలు పిదుకుట కాజ్ఞాపించి అక్రూరుని రాక కానందించి లోపలికి పోయి తండ్రి కాతని నెఱిగించి అతనితో గలసి భుజించిరి. నందుడు పరుండుటకు వెళ్లగానే కృష్ణమూర్తి అక్రూరునితో కంసునిసంగతి యేమని యడిగెను. "ధనుర్యాగ మను వ్యాజముతో మిమ్ము రప్పించి చంపదలచె" నని అక్రూరుడు చెప్పెను. వాడే చంపునో, మేమే చంపెదమో చూతువుగాక! మాతండ్రి కీసంగతి చెప్పిన మమ్మచటికి పంప నొల్లడు గాన నతనికి చెప్పవద్దని వారలు అక్రూరునకు చెప్పిరి. ఊరివా రెల్లరకు కంసుని యాగమునకు పాలు, పెరుగు, వెన్న లీయవలె ననియు, రేపే ప్రయాణ మనియు నందుడు చాటించెను.

అక్రూరుడును, కృష్ణబలరాములును మాటాడు చుండగా రాత్రి గడచెను. తెల్లవారగనే ముగ్వురును స్నానానుష్ఠానములు చేసికొని వస్త్రములు ధరించి ప్రయాణమునకు సిద్ధమై యుండిరి. వాకిట నిలిచియుండిన రథమును జూచి గోపిక లందరును ఒకటిగ చేరి "ఓసీ! ఈ రథసన్నాహ మేమి? కృష్ణు నెవ్వడో పిలుచుకొని పోవునట! ఇక సిగ్గుపడి యూరకున్న కార్యము గాదు. రండి పోదము" అని పరస్పరము చెప్పుకొని అత్తమామలకు భయ పడక గుంపుగకూడి కృష్ణునింటివాకిట నిల్చి కృష్ణుని బిలుచుకొని పోనున్న పాపి యెవ్వడు? అని అడిగిరి. కృష్ణుని విడిచి ఒక క్షణమైన నుండగలమా? మనము చూచుచుండగా కృష్ణుని నత డెట్లు పిలుచుకొని పోవునో చూత మని కొంద అనిరి. అక్రూరుని, కృష్ణుని నిందించనేల? ఆ చతుర్ముఖుని నిందించ వలెను? బ్రహ్మదేవుడు కృష్ణునింత యందముగ బుట్టించి యీ యూరిలో నుండునట్లు చేసి మా కతనితో స్నేహము గూర్చి యిపుడు మా

కతనితో విశ్లేషము కలిగించ నున్నాడు గాన ఆతడే నింద్యుడు. పసిబాలురు మట్టితో నిల్లుగట్టి తల్లి తమ్ము పిలువగనే దానిని చెఱిపివేయుదురు. అట్లే మా బ్రతుకులును ఆట లాయెను. ఓ బ్రహ్మదేవా! యిట్టిసృష్టి నేల చేసితివి? యని నలువను దూషించిరి. "యమునలో పడుదము రండని యొకతె యన మఱియొకతె యట్లు చేయరాదు. కృష్ణు డొకవేళ మనయందు దయదలచి ప్రయాణము మానుకొనునేమో! రథము పోవువరకును ఆగుద" మనెను. మాప్రాణమగు కృష్ణుని బిలుచుకొనిపోయి మమ్ము చంపు వానికి సంధ్యావందన మొకటియా? యని యతనిని తిట్టిరి. మంగళవారమని పేరుగలిగి శుభమైనదినము కాకుండునట్లు ఇత డక్రూరు డను పేరుగలిగి క్రూరుడై యున్నాడు. ఇతని కీపే రెవరు పెట్టిరి? యనిరి. వీరట్లు మాటలాడు సమయమున అక్రూ రుడు బయటికి రాగా నతనినిజూచి "చండాలా! నీవు మాప్రాణ మును దీసికొనిపోవుచున్నావు. నీవలన నిందరు స్త్రీలు మృతి చెందుదురు. ఈ పాప మెట్లు తొలగించుకొందువో యనిరి. వీరు తన్నిట్లు దూషించుచున్నను అక్రూరునకు కొంచెమేని కోపము రాలేదు ఆహా! కృష్ణునియందు వీరికి కలిగియుండు భక్తివిశేష మేమని ఆతం డచ్చెరు వొందెను. కృష్ణుడు మోసగాడు. తా నావుల దోలుకొని పోవునపుడు వాకిట పోవుచున్నాడని మన మెఱుగుటకు వేణువు నూదుచుపోవును. వానిని జూచుటకు మనము వాకిటికి రాగా మనల నరగంటజూచుచు పోవును. ఇట్టివాడు మనలను విడిచి వెళ్లినచో బ్రతుక గలమా? యని మఱియొకతె చెప్పెను. అక్రూరుడు వీరికి నమ స్కరించెను. శ్రీకృష్ణమూర్తి రథము నెక్కిపోగా గోపికయొకతె అతనివస్త్రము పట్టుకొని "కృష్ణా! మమ్ము విడిచి వెళ్లుట న్యాయ మా? నీవు పోయిన మాగతి యేమి?" అని యడిగెను. "కృష్ణుడు రాజకొడుకు. వచ్చి పిలుచువాడును ఘనుడు. ఇది

న్యాయమా ? కాదా ? యని యడిగిన ప్రయోజనము లేదు. అతని పాదములబడి కరుణించవా ? కరుణానిధే యని ప్రార్థించుటే యుచిత మని మరియొకతె చెప్పెను. ఇట్టి భజనయును గలదా ? యని అక్రూరుడు చూచుచుండెను. "మీకు ఎందరో బాంధవులు, ఆప్తులున్నారుగదా! నన్నేల తొందరపరచెద"రని స్వామి యడుగగా "కృష్ణా! సర్వసంగపరిత్యాగము చేసితి మని నాడే చెప్పితిమి. మరి మరి చెప్పవలయునా" అనిరి. గోపిక లిట్లు దుఃఖించగా శ్రీకృష్ణమూర్తియును వారియందు గల ప్రీతిచేత నేమియును చేయజాలకుండి మరల ప్రతిపక్షమున గల దాక్షిణ్యమును, కార్యమును యోజించి "గోపికలారా! నేను శీఘ్రముగ వచ్చెద" నని చెప్పి వారి నోదార్చి రథము తోలు మనెను. గోపిక లెల్లరు రథమునకు అడ్డముగ పరుండిరి. భగవంతు డగు శ్రీకృష్ణుడు అపుడు రథము నిలిపి "గోపికలారా! మీకు గలప్రీతి నాకు లేదా! ఇది రాజాజ్ఞగదా!" యని ప్రేమతో కన్నీటితో సమాధాన మొసగెను. వారిలో నొకతె "రథమును పోనిండు. ఇట్టి వజ్రహృదయునితో నిక నేమి లాభము ? ఇతనికి కృతజ్ఞత, దయ లే" దనెను. గోపికలు రథమునకు మార్గ మిచ్చి పిమ్మట నేడ్చిరి. గోవింద, దామోదర, మాధవ యని వారేడ్చుట యొకఅందముగ నుండెనని శుకులనిరి. గోపికలు రథము కనబడునంతవరకును జూచుచుండి రథము మఱుగు కాగా ధూళి కనబడునంతవరకును జూచుచుండి కృష్ణాయని యేడ్చుచు తమయిండ్ల కరిగి సదా స్మరించుచు కృష్ణమయ లైరి. బలరామకృష్ణులు అక్రూరునితో బోవుచుండి మార్గమున నది వచ్చుట గని పరమానుష్ఠాత యగుటచే అక్రూరుడు మాధ్యాహ్నికమునకై రథము దిగెను. అతడు కృష్ణునిజూచి "కృష్ణా! నే వచ్చునంతవరకు నీవిందే కూర్చుండియుండుము. నీటిలో దిగవలదు. మిమ్ములను మరల మీ యిల్లుజేర్చు భారము నాదిగ

నున్నది” అని చెప్పి స్నానమునకు పోగా కృష్ణుడతనివెంట దిగి మఱియొక గట్టునకు పోయి వలసిన నీరుద్రావి అన్నతోడ గూర్చుండెను. అక్రూరుడు జపించి నీట మునిగి కృష్ణబలరాము లను అందుఁజూచి తనమాట వినక తనకంటే ముందే నీటదిగిరని యెంచి తలనెత్తి పైకిజూడ వారు రథమున గూర్చుండి యుండిరి. ‘‘కృష్ణుడు నామాటవిని రథమునందే కూర్చుండి యున్నాడు. నాకు కృష్ణునియందే ధ్యాన మగుటచేత నీటియందు నున్నాడను కొంటిని’’ అని తలచి అక్రూరుడు మరల నీటమునుగగా మునుపటి యట్లే కనబడెను. అక్రూరు డిట్లే నీటను, రథమునను మరల మరల జూచి అందు నిందు కనబడుచుండు కృష్ణుని సంగతి యిట్టి దని తెలియక_

దైవీ హ్యేషా గుణమయీ
మమ మాయా దురత్యయా।
మామేవ యే ప్రపద్యంతే
మాయా మేతాం తరంతి తే॥

భగ. 7. అధ్యా. 14శ్లోకమట్లు

అది భగవన్మాయ యని యెంచి మరల నీట మునుగగా కృష్ణుని ప్రక్కనుండిన బలరాము డాదిశేషుడై తోచెను. కృష్ణు డనంతు నిపై గూర్చుండి నారాయణుడై కనబడెను. ఆ స్థలము శ్రీవైకుంఠ ముగ దర్శన మాయెను. బ్రహ్మాదులు, వేదపురుషులును శ్రీమన్నా రాయణుని స్తుతించుచుండిరి. బలరాముడు కృష్ణా! మామ రాలేదే యని యడుగ నీ యానందమున మునిగినవాడు పైకి రాడని యెంచి కృష్ణమూర్తి తన దివ్యరూపము నదృశ్యము గావించెను. అక్రూరుడు తనసర్వస్వము గోల్పోయినట్లు దుఃఖించి పైనచూడగా కృష్ణుడు “ఆకలి యగుచున్నది. త్వరగా ర”మ్మని పిలిచెను. అక్రూరుడు రథమునెక్కి ఆనందముచేత తల నాడించుచు పోగా

శ్రీకృష్ణుడు ''మామా! జలమున నేమివిశేష''మని యడిగెను. అందుల కతడు పరమాద్భుతమును జూచితిని.

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చిదేన
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్యః శృణోతి
శ్రుత్వా ప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥

భగ. 2అధ్యా. 29. శ్లోకమట్లు

ఆ యాశ్చర్యవస్తువు నీవే సుమా! అని పలికెను. "మామా! నే నేమియును చేయలేదే. ఇందే కూర్చుండియుంటినే'' యని స్వామి చెప్పెను. వారిట్లు మాటాడుచు మధుర చేరిరి. శ్రీకృష్ణమూర్తి రాబోవుచున్నాడు అను సంగతి నా యూరివా రెరిగియుండిరి. కాన నాతడు రాజమార్గమున వచ్చుచుండగా భుజించుచున్నవా రట్లే లేచిరి. అంబరములను సరిగా కట్టుకొననివారును, రవికలు సరిగా తొడుగుకొనని వారును అగుచు జనులు అట్టే వచ్చి శ్రీకృష్ణుని జూచిరి. వృద్ధు లెల్లరును గజరాజును కాపాడినవా డితడే గదా! వీనిని దర్శింపు డనియు, దివ్యమంగళవిగ్రహుడనియు చెప్పిరి. యౌవనవతులగు స్త్రీలు పురుషు డనిన నిట్లుండవలయునని ప్రశంసించిరి. పసివా రెల్లరును "ఆహా! ఆ పురుషుడు ధరించియున్న ఆభరణము లెట్లు ప్రకాశించుచున్నవని మెచ్చుకొనిరి. ఇట్లెల్ల విధంబుల నెల్లవారును ప్రశంపించుచుండగా కృష్ణమూర్తి మధుర యందుగల ఇండ్లు, వాపీ కూపతటాకాదులను జూచుచు, అన్నకును జూపుచు కడగంటిచూపులతో భక్తులను సంతోషింపజేయుచు పోయి తనకని యేర్పరచిన విడిదియందు దిగెను. అక్రూరుడు తనగృహమునకు రావలయునని కృష్ణుని బిలువగా నతడు కంసుని సంహరింపకుండ రానని యును, అంతకుముందు మనసు స్వస్థముగ నుండ దనియు, వచ్చినకార్యము తీరగనే వచ్చెద ననియు చెప్పెను.

శుకు డిట్లనెను. "కృష్ణుని మాటలవలన అక్రూరునికి తృప్తి కలుగలేదు. రేపటిసంగతి యెట్లెంచదగును ? రేపటివరకు బ్రతుక వచ్చునని యెట్లు తలంప నగును ?" అని దుఃఖించెను. శ్రీకృష్ణ బలరాములను తోడ్తెచ్చితి నని అక్రూరుడు కంసునితో జెప్పి పిమ్మట తన గృహమునకు బోయెను. పరమభాగవతు డగు అక్రూరుని తల్లి కాందిని; తండ్రి శ్వఫల్కుడు.

శ్రీకృష్ణమూర్తి బృందావనమున రక్కసులను జంపి నారదునిచేత తాను మధురకువచ్చు కార్యము జేయించి, ఆ ప్రకారమే మధుర చేరెను.

## కంసవధము

కంసుడు పంపగా తమ్ము పిలువవచ్చిన అక్రూరుని గలిసి కృష్ణబలరాములు మధురచేరి అందొక్క దివ్యమందిరమున విడిసి యుండగా, నింతలో నందుడు, స్త్రీలు, పురజనులు, సామగ్రితోడ వచ్చి చేరిరి. సాధారణముగ వయసు చెల్లినవారు తమ కార్యము నే ముఖ్యముగ గమనింతురు. పసివారు క్రొత్తస్థలములకు బోయి ఆయాతావులగల విశేషములను ఉత్సాహముతో కన్నులార చూడ గోరుదురు. అట్లు మన శ్రీకృష్ణమూర్తి మధురాపట్టణము నందలి వింతలు, విశేషము లరయుటకు సాయంసమయమున అన్నయగు బలరామునితోడను, తనకు మిక్కిలి ప్రీతిపాత్రులగు కొందరు గోపబాలురతోడను గలసి రాజవీథులను జూచుచు పోవుచుండెను. దివ్యమంగళవిగ్రహుడగు శ్రీకృష్ణమూర్తి అన్నతోడను, స్నేహితులతోడను కలసి వచ్చుటను చూచుటకు పురజను లెల్లరును వీథులందు క్రిక్కిరిసియుండిరి. శ్రీకృష్ణునిజూచిన వృద్ధులు "ఆహా! యితడు మనుష్యుడని ఎట్లెంచదగును ? మొసలిచే పట్టువడి యల్లాడుచుండిన గజరాజును గాచిన వరదుడు. ఇతనిని దర్శింపు" డనిరి. యౌవనవతులగు స్త్రీలు స్వామిని పాదాది కేశపర్యంతము

అవలోకించి "ఆహా! యింతటి సౌందర్యరాశి యగుటచేతనే గదా లక్ష్మీదేవి సదా యితని ముఖమును జూచుచుండగోరి వక్షఃస్థలమున గూర్చుండియున్న" దని ప్రశంసించిరి. బాలురు "ఆహా! యీతడుధరించియుండు హారము లందలి పతకము లెట్లుధగద్ధగాయమానముగ వెలుగుచున్న వనుకొనిరి.

శుకు డిట్లనెను. మధురాపురియం దొక్కపాత్రియిల్లుగాని, శిథిలమైన గృహముగాని లేదు. అన్నియును స్ఫటికములతో కట్టబడినవిగా నున్నవి. నలుప్రక్కలను స్ఫటికగోపురద్వారము లుండెను. నవరత్న ఖచితతోరణములు కట్టబడియుండెను. ఏనుగులశాలలు, గుఱ్ఱముల శాలలు మొదలగునవి రాగితో, ఇత్తడితో నిర్మింపబడియుండెను. శత్రువులు ప్రవేశింపకుండుటకై అగాధమైన అగడ్త లుండెను. ఉద్యానవనములును, ఉపవనములు ఇంకను ఎన్నో వైభవములతో నొప్పుచుండెను. మధురానగరి యొక్క రాజమార్గము లందు శ్రీకృష్ణమూర్తి తన్ను జూచుచుండిన పురజనులను కడగంటిచూపులతో అనుగ్రహించుచు బోయెను. అట్లు పోవునపుడు కంసుని చాకలి యొకడు చలువచేసి పళపళ మెరయుచుండిన వస్త్రములను దీసికొని పోవుచుండుట గని కృష్ణుడు "ఓరీ! నీ వెవడవు? ఈవస్త్రములందు నాకు కావలసినవి యిచ్చెదవా?" యని యడుగ నారజకుడు తానట్లిచ్చుటకు వీలు పడదని విన్నవించుకొనక "నీతండ్రికాలమున నిట్టివస్త్రము లను గట్టితివా? అడవియందు బుట్టి పెరిగి ఆవుల మేపుచుండువాడ వగుటచేత నీకు మర్యాద తెలియకున్నది. అదియునుగాక పసివాడవుగ నున్నావని మన్నించితిని. నీవు బలాత్కారముగ నీ వస్త్రముల దీసికొనుటకు యత్నింతువేని నీప్రాణమే పోవును. జాగ్రత్తగ నుండు" మని ప్రేలెను. ఈ మాటలు వినుచుండిన బలరాము డాగ్రహించి వానిమీద పడజూచెను. కాని కృష్ణమూర్తి

వలదని వారించి చాకలి నుద్దేశించి "వస్త్రము లిచ్చెదవా ? ఈయవా? ఖండితముగ చెప్పు" మని యడిగెను. వా డందులకు "ఒక్కపర్యాయము చెప్పిన బుద్ధిలేదా ? ఈ వస్త్రము లిచ్చినను వీనిని గట్ట నర్హుడవు గావని తెలియవా ? చినిగిన మురికిగుడ్డలు, కంబళ్ళు ధరించు మీవంటివారు ఈ వస్త్రము లడుగవచ్చునా ? ఇట్లడుగుట చేతనే నీకు బుద్ధిలేదని తెలియుచున్న" దనెను. శ్రీకృష్ణానుచరులు కంససేవకుని కెంత పొట్టపొగరని యనుకొనుచుండగా స్వామి "వస్త్రము లీయవా ?" అని యడుగుచునే వానిశిరమును తనసఖములతో గిల్లి పారవేసెను. ఆ చాకలివాని యనుచరులు నానాముఖముల పరువెత్తి పోగా కృష్ణు డా వస్త్రములందు తనకు వలసిన వానిని ధరించి అన్నకును, తోడివారికి నొసంగి మరికొంతదూరము పోగా నొకనాయకుడు వీరినిగాంచి విచిత్రవర్ణములతో గూడిన దివ్యములైన యుడుపుల నిచ్చెను. కృష్ణబలరాము లాదుస్తులు ధరించిరి. వానికి దేహాంతమున సారూప్యము గల్గునట్లును, ఈ దేహమున ఐశ్వర్యము, సకలేంద్రియపాటవము, దేహకాంతి యింకను ననేకభోగములు సమకూడునట్లును కృష్ణు డనుగ్రహించెను. భగవద్విషయమున శ్రద్ధాభక్తులతో మెలగినయెడల నాతడు ప్రీతుడగును. శ్రియఃపతియు, నిత్యతృప్తుడు నగుటచే నతని కేమి యీయజాలుదు మని యోజింప నక్కరలేదు.

పత్రం పుష్పం ఫలం తోయం
యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత
మశ్నామి ప్రయతాత్మనః ॥

భగ. 9అ. 26 శ్లోకమునట్లు

భక్తితో వాని కేమిసమర్పించినను అంగీకరించును. భగవంతు డీరీతి దుష్టనిగ్రహ, శిష్టపరిగ్రహములను స్వల్పకాలముననే చేసి చూపెను.

పిమ్మట వారు సుదాముడను మాలాకారు నింటికిబోగా నాతడు బలరామకృష్ణుల గాంచి ఆదిశేషుడును, పరమాత్మయు తన గృహమునకు దయచేసి రనియు, వారితోడి బాలురు పుణ్యశాలు లనియు భావించి సాష్టాంగముగ నమస్కరించి వారి నుచితాసనముల గూర్చుండబెట్టి తాను కంసునికొరకు కట్టిన వెలగలపూల దండలను శ్రీకృష్ణబలరాములకును, గోపబాలురకును సమర్పించి యింతకంటె నెక్కువైన పదార్థము సమర్పించుటకు తనయింట నేమియు లేదాయెగదా యని చింతించి "త్వమేవ శరణం మమ" అని కన్నీరు విడిచెను. భగవంతుడు సంప్రీతుడై నీకేమివరము గావలయు నని యడుగగా నా సుదాముడు "స్వామీ! నేను శునకము, క్రిమికీటాదులు మొదలగు నీచజన్మముల బడసినను నీచరణములం దచంచలభక్తిమాత్రము కల్గియుండున ట్లనుగ్రహింపుము. అంతమాత్రమే కాదు. మీచరణభక్తిగల భాగవతులందును భక్తి గల్గింపుము. సర్వప్రాణులకును సుహృత్తునై యుండున ట్లను గ్రహింపుము" అని వరము లడిగెను. స్వామివా డడిగిన వరము లిచ్చి "సుదామా! నీవు భక్తుడవు. ఇట్టివాడ వగుటచే నీసంతతి వృద్ధికావలయును. ఆ సంతతి యశస్సుతో గూడినదిగ నుండవల యును. నీవును దీర్ఘాయుష్మంతుడవై యొప్పి పిమ్మట ముక్తి నొందుదు" వని యాశీర్వదించి అచటినుండి బయలుదేరి సాక్షాన్మన్మథమన్మథుడై పోవుచుండెను.

మార్గమున పొట్టిదియు, యౌవనవతియు, ముఖము మాత్రము అందముగనుండిన యొకస్త్రీ తనచేత నవరత్నఖచితమైన గిన్నెయందు సువాసనలు వెదజల్లు గంధమును తీసికొని పోవుట జూచి శ్రీకృష్ణుడు చిరునవ్వుతో "ఓసీ! నీ వెవ్వతెవు ? నీ పేరేమి ? నీచేతిలో నున్నదేమి ? నీవు దీని నెవ్వరికై తీసికొని పోవుచున్నావు ? అబద్ధమాడక సత్యము వచింపుము. దీనియందు

మాకు కొంచె మిమ్ము. తరిగిపోవునని తలంపకుము. దీనిఫలము తోడనే పొందుదువు'' అని పల్కెను. భగవంతుని మందస్మితము దానిమనసులో ప్రవేశించి మనసును త్రిప్పెను. అతనిహాసము శృంగారమును గల్గించెను. ఆస్త్రీ జన్మాంతరపుణ్యవశమున శ్రీ కృష్ణుడు భగవంతుడని తలంచి భయభక్తులతో బదులు చెప్పెను. "స్వామీ! ఈచందనముకంసునికై తీసికొనిపోవుచున్నాను. నిత్యము నిట్లేతీసికొనిపోవుచుందును. నేను ఆతని దాసిని. మిమ్ము దర్శించిన ఈక్షణము నుండి మీదాసురాల నైతిని. అందుచే కొంతయే గాదు. ఈ గంధము నంతయు నుపయోగించుకొనుడు. మన్మథుని తండ్రియు, మన్మథరూపుడునగు నిన్ను జూచి నాబుద్ధి కిట్లు తోచినది'' అని కుబ్జ చెప్పినమాటలు విని స్వామి ''నీకేమి కావలయు'' నని యడిగెను. అందుల కామె "దీనవత్సలా! నా కేమియు తోచుటలేదు. మీదయమాత్ర ముండవలయు'' నని కోరెను. పిమ్మట కృష్ణమూర్తి చందనమును అన్నకును, గోపబాలురకు నిచ్చి తానును పూసికొనెను. కుబ్జ చందనస్వీకార ఫలముగ శ్రీ కృష్ణుని అంగసంగ మడుగగా నాతడు ''ఇది యిట్లడుగునని తెలిసియుండిన చందనము పూసికొనియే యుండ''నని యెంచి సత్యసంకల్పుడుగాన దానివక్రతలు సరిపరుప నెంచి దాని కాలి యందలి రెండుపెద్దవ్రేళ్లమీద తనకాలిరెండుపెద్దవ్రేళ్లనుంచి అదిమి దానిగడ్డమును తనరెండుచేతివ్రేళ్లతో పట్టి పైకెత్తగా దాని వక్రతలు పోవుటయేగాక మహాలక్ష్మితో సమానమైన సౌందర్యము గల దాయెను. శుకు డనెను.

అనన్యభావముతో భక్తిసల్పిన ఫలముగలదని స్వామి యిట్లు చాటెను. ఏయేఅవయవము లెట్లె ట్లుండవలయునో అట్లట్లే యయ్యెను. రంభయో, ఊర్వశియో, తిలోత్తమయో, మహాలక్ష్మియో యనునట్లామెయొప్పెను. పిమ్మటకుబ్జ "స్వామీ! ఈ వక్రశరీరముతో

మీతోడి సౌఖ్య మెట్లు పొందుదు నని తలచియుంటిని. ఇపుడు నే నెవతెనో తెలియజాలకున్నాను. అట్టి రూపమును పొందితిని. మీరు చందన మడిగితిరి. నే నంగసంగ మర్దించితిని. నేనిచ్చిన చందనము పూసికొని నావక్రతలు మాన్పితిరి. అచిరకాలమున ఫలము గల్గునని చెప్పియుండుటచేత నాయింటికి వచ్చి నాకోరిక దీర్చి పోవలయు" నని చెప్పి స్వామి కొంగుపట్టి యీడ్చెను. నడివీధి యం దిట్లు చేయదగదని దానితో చెప్పి "యిపుడేమి సేయనగు" నని తోడివారల నడుగ వారు "కృష్ణా! నీవు చందనమును పూసికొనునపుడే ఆ సంగతి యోజించి యుండవలయును. అట్లుచేయక అంగసంగమునకు సమ్మతించితివి. ఆమెవక్రతలు గూడ పోగొట్టితివి. అందుచే నామెచెప్పినట్లు ఆమె యింటికి పోవలసినదే" యనిరి. అప్పటికిని స్వామి యాలోచించుచుండగా నామె "స్వామీ! సద్యఃఫలమని చెప్పి యిట్లుపోవుట న్యాయము గాదు. నీరూపమును జూచి నీదాసురాలి నంటిని. ఇపుడు నేబిలువగా నాయింటికి రానని చెప్పుట మీవంటి ఘనులకు దగునా ? ఆడిన మాటతప్పరనిగదా నమ్మియుంటిని" అని బలాత్కరింప నారంభించెను. శ్రీకృష్ణమూర్తి దాని నావలికి బొమ్మని ధిక్కరించి పలికి మరల వచ్చెద నని చెప్పి వెడలిపోయెను. కృష్ణు డట్లు చెప్పి వెడలగా నాసుందరి "అయ్యో! కృష్ణుడు మరల నన్ను వెదకికొని వచ్చుటకు నేను రూపవతినా ? ధనవతినా ? బ్రహ్మదేవునికిని ప్రార్థించినను దొరకని యతని నే నెందు వెదకుదును అని యేడ్వ నారంభించి, అయినను అత డసత్యమాడునని తోచలేదు. తప్పక వచ్చును; మూడుదినములు నిదానించి చూచెద" నని తీర్మానించుకొని ఊరడిల్లెను.

శ్రీకృష్ణమూర్తి సుదాము నింటినుండి వెడలి కంసుని ధనుస్సును చూడబోవగా వసుదేవునికి, నందగోపునికి పుత్రు డగుటచేత

నచటిజను లతనిని బహుమర్యాదతో ధనుర్యాగశాలలోనికి బిలు చుకొనిపోయి శివధనుస్సును దర్శింపు మనిచెప్పిరి. శ్రీకృష్ణ మూర్తి ధనువిదేనా ? యని యడుగుచు అచటనున్నవారు హాహా కారములు సల్పుచుండగా దానిని తనవామహస్తముతో నెత్తి యెక్కువెట్టి వేడుకగా నీడ్వగా నాక్షణమునం దావిల్లు రాముని చేత శివధనుస్సువలె విరిగెను. కంసుడు పరమశివు నారాధించి యతని యనుగ్రహమున బడసిన ధనుస్సును శ్రీకృష్ణమూర్తి మదపుటేనుగు చెఱకుగడను విఱచునట్లు అనాయాసముగ విరువగా పిడుగువంటి శబ్దము జనించి బలరాముడు, గోపబాలురు మొదలగువారినిగూడ వణకించెను. పురజనులు అనర్థ మేమో సంభవించెనని భావించి తమతమగృహములకు బోయి తలుపులు మూసికొనిరి. కంసుని కీ సంగతి తెలిసి రేపు కృష్ణు డిట్లే తన్ను జంపునని నిశ్చయించు కొనెను. కృష్ణుడు తనయొద్దకు వచ్చునట్లును, తన్ను జంపునట్లును స్వప్నముగని యల్లాడుచుండెను. ఈ సంగతి యిట్లుండగా నంద గోపుడు, యశోద మొదలగువారు "అయ్యో! రేపు కంసుని చూడ వలయునే. కృష్ణుడు చిన్నవా డగుటచేత వానిదయకు తగినట్లు నడువవలదా ? వానితో విరోధము చేసికొననగునా ? సాయంసమ యమున పోయినవా డింకను రాకున్నాడు." అని కృష్ణునిగూర్చి పరితపించుచుండెను. అపుడే కృష్ణుడు రాగా వా రతని నడిగి జరి గిన సకలవృత్తాంతములను తెలిసికొనిరి.

సూర్యోదయానంతరము కంసుడు పిలువనంపగా కృష్ణబల రాములు పోయిరి. కంసు డున్నతాసనము నధిష్ఠించియుండగా నతనిబంధువులును, మహర్షులును, రాజులును, పురజనులను,స్త్రీలును ఉచితాసనముల గూర్చుండియుండిరి. శ్రీకృష్ణబలరాములు వచ్చి నపుడు కువలయాపీడ మను ఏనుగు రంగద్వారమునకు అడ్డముగ నిల్చుండి మావటివాని సంకేతమును దెలిసి యా యున్నతమైన

యేనుగు తన తొండమున దాల్చియున్న యినుపరోకలితో కృష్ణుని వీపుమీద మోదెను. కృష్ణు డా రోకటిని దీసికొని మోదగా గజము క్రిందబడెను. కృష్ణు డేనుగుమీద కాలుంచి తన్ని దానిదంతము నూడబెరికి సమభాగుడగు అన్ననుగూడ మరియొక దంతమును దీసికొమ్మని చెప్పి యిరువురును దంతములతో నొక్కొక్కదెబ్బ వేయగా నా యేనుగు చచ్చెను. కుంజర మేపాటిదై యుండినను సింహమున కేమిభయము ? అట్లే కృష్ణమూర్తి కువలయాపీడ మను నేనుగును సింహవిక్రమమున జంపి మావటివాండ్రనెల్ల పరి మార్చెను. మావటివాండ్రతోడ నేనుగును గూల్చి దానిదంతము లను భుజములందు దాల్చి కృష్ణబలరాములు గోపబాలురతోడ మల్లరంగమును ప్రవేశించిరి.

శుకు డనెను. "పరీక్షిన్మహారాజా! గమనింపవలసిన ఘట్ట మిది. కువలయాపీడమును జంపిన తోడనే చేతికి తెల్లదంతమేల వచ్చె ననగా వారు దానినిజంపినకీర్తి నెత్తుకొని పోయిరి. కంసు డున్నతాసనమున నుండగా నెల్లవారు ఉచితాసనములం దుండిరి. రామకృష్ణులు ద్వారమున ఘనకార్య మొనర్చి నిశ్చింతముగను, నిర్భయముగను వచ్చిరి. శ్రీకృష్ణుని జూడగా చాణూరముష్టికు లకు అతడు తమపాలి పిడుగుగ దోచెను. సాధారణులకు రాజ లక్షణములతోడ పురుషోత్తముడై గోచరించెను. స్త్రీలకు మన్మథుడై కనుపట్టెను. గోపాలురకు చుట్టమై అగుపించెను. రాజులకు శాస కుడై పొడకట్టెను. తలిదండ్రులకు బిడ్డడై గోచరించెను. కంసుడు నారదుడు చెప్పినట్లు తనకు మృత్యువని భావించెను. తత్త్వ మెఱుగనివారు పాపియగు కంసుని ముందు ఈ బిడ్డలను జూడ జాలి కలుగుచున్నదని యనుకొనిరి. మహర్షులు పరబ్రహ్మమని యెంచిరి. యాదవులు తమకులమున నవతరించినట్లు తలచి యానందించిరి. ఇట్లు వారు తమ తమ మనోబుద్ధులకు తగినట్లు

పూర్వకర్మానుసారముగ తలచిరి. ఒకకవి యిట్లు వర్ణించెను. శ్రీకృష్ణుని ముందుంచుకొనినయెడల మన్మథుడు తనకు గల బాణముల నన్నిటిని ప్రయోగించి తనసామర్థ్యమును జూప శక్తుడగునని స్త్రీలు దలచిరి. సంసారమున జిక్కి భగవద్భక్తిగలవారగు పెద్దలు ఈతని కటాక్షవీక్షణము సర్వసంసారార్ణవతరణ మని భావించిరి. మల్లులు మహాప్రళయకాలమున సర్వసంహారార్థమై వచ్చిన రుద్రునిగ భావించిరి. జననీజనకులు పాలుద్రావినపెదవి యెండలేదని తలచిరి. గోపబాలురు స్నేహితు డని భావించిరి. యోగులు ఉపనిషత్తులకు అందనివాడని, వేదవృక్షముయొక్క చిగురుటాకు అని భావించిరి. సర్వసంహారమూర్తియగు నీతనిజూచి తన రాజ్యలక్ష్మి భయపడి తొలగిపోయెనేమో యని యెంచి కంసుడు తన చుట్టుపట్లు జూడ నారంభించెను. ఎపుడును పాలు, పెరుగు, వెన్న, నేయి మొదలగు పదార్థములను సమర్పించుచుండిన నందుడు క్రొత్తవస్తువును కంసునికి సమర్పించదలచి శ్రీకృష్ణమూర్తిని తోడ్తెచ్చెనో యని పురజనులు తలచిరి. అజ్ఞానులుగ నుండినవారు "అయ్యో! యిట్టి పసివారిని మల్లులతోడ పోరుటకు విడువదగునా? ఈ సభయందు దింద రుండియు నీ కంసునికి ధర్మసూక్ష్మమును దెలుపకున్నారే? ఇట్టి స్థలమందు దుండనేయుండరా" దని లేచిరి. సభికులకు బుద్ధిలేదు. బలులకుఅబలులకుయుద్ధమా? అన్యాయమును జూచురాజు రాజా? పెద్దలు పెద్దలా? వజ్రశరీరులై కొండలవలెనున్న మల్లులతో మృదులశరీరులగు బాలురకు పోటియా? వీరలకుపనయనమే కాలేదు. సమానులనేగదా పోటీకి విడువవలెను? ఇట్టి యన్యాయము జరుగునట్టి చోట నిలువరాదు అని స్త్రీలు చెప్పుకొనిరి.

పిమ్మట బలరామకృష్ణులు మునుపు బాగుగ నలవడియుండిన రీతిగనే మల్లులతో పోర నారంభించిరి. అట్లు పోరాడి

శ్రీకృష్ణుడు చాణూరుని, బలరాముడు ముష్టికుని జంపిరి. ఆ కోప ముతో కూటుడనువాడు రాగా బలరాము డొక్కదెబ్బతో వానిని జంపెను. శ్రీకృష్ణుడు శలతోశలకుల తలలను కాలితో దన్ని హతుల గావించెను. మిగిలిన మల్లులు భీతిచెంది పారిపోగా బలరామకృష్ణులు కంసుని సమీపించిరి. రామకృష్ణులు తన్ను సమీపించుట గాంచి వసుదేవనందసుతులైన వీరు దుర్మార్గులు; ధనుస్సును విఱిచి, యేనుగును జంపిరి. అడవిలోపుట్టి పెరిగినవారికి అన్యాయముగ వర్తించుటే యలవాటు. వీరిని తరిమివేయుడు. నందగోపునితో చేరిన వారి నందఱను విడువకుడు. వారియిండ్లు కాల్చి ధన మపహరింపుడు. నందగోపుడే వీరిని గాపాడుచున్నాడు. వానింబట్టి కారాగృహములో నుంచుడు. నన్ను మోసగించి పుత్రులను గాపాడుకొనిన దుర్బుద్ధియగు వసుదేవుని పట్టి తన్నుడు, చంపుడు. నా తండ్రియగు ఉగ్రసేనుడు వసుదేవునియెడ ప్రీతి కలిగియున్నాడు. వానింబట్టి వధింపుడు అని కంసుడు తన భృత్యుల నాజ్ఞాపించగా వినుచుండిన కృష్ణస్వామి వీనికై యిందరు చచ్చుటకంటె వీడొకడు చచ్చుట మేలని తలంచి కంసుని యెత్తైనసింహాసనము మీదికి శైఘ్ర్యముతో నురికి వానిపైకిపోవ నుంకించగా కంసుడు మృత్యువాసన్న మాయె ననియు, కువలయాపీడమునకును, మల్లులకును అయినగతి తనకును అగుననియు భావించి అయినను ఆత్మరక్షణార్థము ప్రయత్నించవలయునని యెంచి సింహాసనమునుండి లేచి ఖడ్గము త్రిప్ప నారంభించెను. శుకు డనెను.

ఆహారార్థము వేచి తిరుగు డేగవలె కంసుడు కృష్ణుని బట్టుకొనుటకును, తన్ను గాపాడుకొనుటకును ఇటునటు తిరుగుచుండెను. ఒకరినొకరు పట్టుకొనుటకు తఱివేచి చూచుచుండగా కృష్ణమూర్తి గరుడుడు సర్పమును బట్టుకొనునట్లు కంసుని కేశపాశమును బట్టుకొని బలాత్కారమున నీడ్వగా వానికిరీటము క్రిందబడెను.

పిమ్మట స్వామి వానిని త్రోయగా నతడు రంగమున బడెను. తోడనే స్వామి క్రిందికి దిగి వానిని కాలితో రాచి చంపెను. అపుడు దేవవాద్యములు ఘోషించెను. బ్రహ్మరుద్రేంద్రులు మొదలగు వారు పుష్పవృష్టి కురియించిరి. రంభాదులు నాట్యమాడిరి.

శ్రీకృష్ణమూర్తి కంసునిజంపి తలిదండ్రులగు దేవకీవసుదేవులకు మ్రొక్కి "తలిదండ్రులారా! నన్నుగనియును ఇట్టి కష్టములనుభవించితి" రని కన్నీరు విడిచి తనచేతిలో వారి సంకెళ్లను తొలగించెను. (కృష్ణబలరాములే వసుదేవుని పుత్రులని నారదుడు చెప్పినది మొదలు కంసు డాగ్రహించి దేవకీవసుదేవులకు మరల సంకెళ్లనువేయించి యుండెను.)

శుకు డనెను. భగవంతుడు తన్ను నమ్మినవారి భవబంధములు తీర్చును. పిమ్మట కృష్ణుడును, బలరాముడును తండ్రియగు వసుదేవునింటికి పోగా వారు ఆనందబాష్పములు రాల్చి "ఆహా! మీరూపము, శౌర్యము, ఎట్టివి ? ఎచ్చోటనైనను సుఖముగ నుంటిరిగదా! ఇకముందైనను మీ వేడుకలను జూతుముగాక" యనిరి. నందు డీసందర్భము జూచి ఇకపుత్రులు తనవెంట రామందురేమో యని శంకించి "కృష్ణా! ఇంక మనయూరికి పోవుదమా" యని యడిగెను. కృష్ణు డపుడు "తండ్రీ! నేను వారి బిడ్డను. కార్యార్థమై మీయొద్ద నుంటిని. కనినవారు గాన వారిమనసులు తృప్తిపరచవలెను. లేకున్న ఋణగ్రస్తుడ నగుదును" అని చెప్పి నందాదులను సమ్మతింపచేసి కొంతదూరము వారివెంటబోయి వారిని పంపివేసెను. కంసునికి వెఱచి పారిపోయిన బంధువులను బిలిపించి వారిగృహములందు వారు నివసించునట్లు చేసి వా రుంచిపోయిన ధనముకంటె నెక్కువధనము కంసుని ధనాగారమునుండి తెప్పించి వారి కిచ్చి, వారియిండ్ల నాక్రమించుకొనియుండిన కంసజనులను తఱిమివేసి ఉగ్రసేనుని సింహాసన మెక్కుమని చెప్పెను.

అత డందులకు "కృష్ణా! నీవే సింహాసనమునకు తగుదు" వని చెప్పగా యయాతిశాప ముండుటచేత యాదవుడ నగు నాకు సింహాసనము వలదనియు, నీవే యిందుల కొడబడు మనియు కృష్ణుడు ఉగ్రసేనునికి దెలుప నతడు కడువృద్ధుడనగు నేను రాజ్యమేలు పక్షమున నన్నుజూచి భయపడువా రెవరు ? కప్ప మెవరు కట్టుదురు ? రాచకార్యము లెట్లు జరుగు నని శంకించెను. నేను భృత్యుడనై ప్రక్క నిలిచియుండగా నింద్రుడు మొదలగు దేవతలు నీవుకోరినచో స్వయముగ వచ్చి నమస్కరించి సమర్పింతు రని చెప్పి కృష్ణుడు తాతకు రాజ్య మొసగెను. ఎల్లవారును తమ తమ యిండ్లలో మునుపటికంటె నెక్కువ ధనముతో కాపురములు చేయుచుండిరి. బలరామకృష్ణుల నాల్గుభుజములే ఆ యూరికి కావు దలగ నుండెను. ఎల్లవారలును కృష్ణబలరాములను దర్శించుచు వారిబాహువులను నమ్మి సంతోషముతో నుండిరి.

## శ్రీకృష్ణబలరాముల యుపనయనము - విద్యాభ్యాసము

శ్రీకృష్ణమూర్తి కంససంహారముచేసి జన్మమునకు ప్రయోజన మగు మాతాపితృశుశ్రూష సల్పలేదని చింతించి బాలక్రీడలు మీరు చూచితిరి. ఇకమీదివ్యాపారములు వీరిని చూడనిం డనియు, త్వర లోనే వచ్చెద ననియు యశోదానందులతోజెప్పి వారిని బంపివేసి మధురయందు వసించుచు దుష్టనిగ్రహము, శిష్టపరిగ్రహముల జేయుచుండెను. శ్రీకృష్ణు డవతరించినది మొదలు అనేకఘనకార్య ములు చేసి ముగించియుండుటచే నతని కెంతో వయస్సుండునని తోచును. కంససంహారమైనపు డాతని కేడుసంవత్సరముల వయస్సు. అప్పటికి ఉపనయనము కాలేదు. కార్చిచ్చు ద్రమింగిన వాడు, పూతనను, శకటాసురుని, తృణావర్తుని జంపినవాడు, యమ ళార్జునభంజనము గావించినవాడు, అనేకగోవులుగను, బాలురుగను రూపుదాల్చినవాడు యమునయం దుండిన కాళీయుని నూరుశిర

ములందు నృత్యము చేసినవాడు, వేణుగానముచేత గోపికలను మోహింపజేసిన పరమసౌందర్యరాశి యగు పరబ్రహ్మమునకు ఉపనయనము చేయనేల ? అక్రూరునకు దర్శనమిచ్చి కువలయాపీడమును, కంసుని జంపినందుననే యితడు సామాన్యుడా ? కాడని తెలియుచుండలేదా యని సందేహము పొంద నవసరము లేదు. మాతృగర్భమునబుట్టిన కారణముచే నా కార్యము చేసి తీఅవలయు నని చెప్పి యదుకులాచార్యు డగు గర్గాచార్యులు రామకృష్ణులకు శుభదినమందు శుభలగ్నమున మంత్రలోప తంత్రలోపములు లేకుండ విధిప్రకార ముపనయనము గావించెను. రామకృష్ణులకు ద్విజత్వము (బ్రాహ్మణత్వము) వచ్చెను. గాయత్రీ మంత్రోపదేశము జరిగెను. రామకృష్ణులు బ్రాహ్మణ రాజాశీర్వాదములు పొందిరి. కృష్ణమూర్తి-

యద్య దాచరతి శ్రేష్ఠ
స్తత్తదే వేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే
లోక స్తదనువర్తతే ॥

భగ. 3అధ్యా. 21 శ్లోకము వలె

ధర్మము ను తా ననుష్ఠించిచూపువా డగుటచేత విద్యాభ్యాసము చేయుటకై అన్నతోడ కాశియందుండు సాందీపునియొద్ద కరిగెను. సకలలోకములకును గురువుగ నుండు భగవంతునికి సాందీపుడు గురు వాయెను. ఆతనిభాగ్య మేమన వచ్చును ?

తద్విద్ధి ప్రణిపాతేన
పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం
జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥

భగ. 4అధ్యా. 34శ్లోకమున

శుశ్రూషచేసి విద్య తెలిసికొనవలయునని చెప్పబడుటచేత స్వామి నిమిత్తమాత్రముగ నాతనియొద్ద విద్య నభ్యసింప నారంభించి సర్వజ్ఞుడుగాన నరువదినాల్గుదినములలో నరువదినాల్గువిద్యలను నేర్చెను. గురువు క్రొత్తపాఠమును జెప్పుచుపోగా వీరుగూడ జెప్పుచు సర్వము గ్రహించిరి. వారు బ్రహ్మాదులకు లేని కౌశలముతో విద్యల నేర్చిరి. ఇక మీయింటికి మీరు పొండని గురు వాజ్ఞనొసంగగా గురుదక్షిణ కోరుడని వా రనిరి. అందుకు గురువు సర్వజ్ఞుడవగు నీకు గురు వనుటే గౌరవ మగుచుండ నాకింక వేఱు పారితోషిక మేలయని చెప్పెను గాని వా రనుష్ఠించి చూపవలెనని చెప్పి నిర్బంధముగ నడిగిరి. అంత సాందీపుడు భార్యతోడ యోజించి యితడు మహాత్ముడు; అసాధ్యుడుగాన నడిగినది యిచ్చునని తలంచి ప్రభాసక్షేత్రమున సముద్రములో మునిగి మృతినొందిన తమపుత్రుని తెచ్చియిమ్మని కోరగా స్వామి అన్నతోడ రథమునెక్కి సముద్రమునకు బోయి సముద్రు నుద్దేశించి "సముద్రుడా! కొంచెమైన యోజించవలదా ? మునుపు రామావతారమున నేజూపిన ప్రభావమును మఱచితివా ? యని యడిగి నీ వందఱికంటెను గొప్పవాడవుగదా" యని స్తోత్రము సేయగా సాగరుడు సిగ్గుపడి "స్వామీ ! నాకు యోగ్యత యేమున్నది ? నాకంటెను ఘనమైనది నీక్షీరాబ్ధి. అది దేవభోగ్యమైన సముద్రము. నీకు భార్య నొసగి శయనించుటకు చోటుగూడ నిచ్చియున్నది. అట్టి యుపకారియుండగా నే నెట్లు గొప్పవాడ నగుదును ?" అని స్వామిని కొనియాడగా శ్రీకృష్ణుడు "సముద్రా! నా యాచార్య పుత్రుడు నీయందు మునిగిపోయెను. వానిని దెచ్చి యిమ్మని యడిగెను. సముద్రు డందులకు "స్వామీ! పంచజనుడను అసురుని కార్య మిది. వానిని బట్టుకొ"మ్మని చెప్పగా స్వామి దట్టికట్టి నీటమునిగి వానినిజంపి వానియెముకను శంఖముగ జేసికొని యన్న

తోడ రథమునెక్కి సంయమని యను యమునిస్థానమునకు బోయి అక్రొత్తశంఖమును పూరించగా యముడు-

మృత్యుస్సర్వహరశ్చాహ
ముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తి శ్శ్రీర్వాక్చ నారీణాం
స్మృతి ర్మేధా ధృతిః క్షమా ॥

అను భగ. 10అధ్యా. 34శ్లోకమట్లు

తనకును మృత్యువుగ నుండు భగవంతునికి భయపడివచ్చి "స్వామీ! తప్పేమైన నుండిన క్షమింపవలయు" నని వేడుకొనగా శ్రీకృష్ణుడు నాయాచార్యపుత్రు నిమ్మని యడిగి అతడు సమర్పింపగా గైకొని వానిందెచ్చి గురువున కర్పించెను. గురు వందులకు సంప్రీతుడై "ఆహా! నిన్ను శిష్యునిగ బడసినందున నిట్టిఫలము లభించెను. బ్రహ్మాదులైన నిట్టికార్యము చేయజాల"రని ప్రశంసించి, వివాహము చేసికొనుడని వారి నాశీర్వదించి పంపెను. స్వామి బయలుదేరివచ్చునపుడు అనేకకోట్లప్రజలు చూచుచుండిరి. నిన్న భుజించినను నేడు మరల భుజించునట్లు స్వామిని జూచువారు మరల మరల క్రొత్తవస్తువును జూచునట్లు చూచుచుండిరి. శ్రీకృష్ణుడు మధురయందు పుట్టినవాడైనను ఆ యూరు వదలిపోయి మరల వచ్చినందున ప్రజలు గొప్పవస్తువును గోల్పోయి మరల లభించిన ట్లతనిని గాంచి యానందించుచుండిరి.

కృష్ణమూర్తి మధురావాసముచేయుచుండి మున్ను తాను వేణుగాన మొనర్చి గోపికల నెల్ల మోహింపజేసినదియును, వారితోడ రాసక్రీడలుసల్పినదియును, శీఘ్రముగ వచ్చెదనని వారికి వాగ్దానముచేసినదియు తలచి బృహస్పత్యవతారమగు తన మిత్రుడైన ఉద్ధవుని బృందావనమునకు బంపగోరి యతని నుద్దేశించి "ఉద్ధవా! నీవు బృందావనమునకు బోయి ప్రథమమున తలిదండ్రులకు

నాక్షేమసమాచార మెఱిగింపుము. గోపికలు వచ్చి నాసంగతి యడుగుదురు. వారితో నే రీతి బలుకవలయునో యా రీతిం బలుకు'' మని చెప్పిపంపెను. ఉద్ధవుడు బృందావనముసేరి రథములో బోవుచుండగా నొక్కొకయింటను నందగోపకుమారునినామము జెప్పుచు వేణువిషయము లెందు కనుచుండు గోపికలపలుకులు వినబడెను.

శుకు డనెను. బృందావనమున వృద్ధులును, యౌవనులును, బాలురును, గోపికలును సర్వకాలములందును శ్రీకృష్ణునిసంగతు లందే మన సుంచినవారై యుండిరి. ఉద్ధవుడు నందగోపునింటికి బోగా నత డతనిని సత్కరించి మధురాపట్టణమున నెల్లవారును క్షేమముగ నున్నారా ? కృష్ణుడు నన్ను జ్ఞప్తిలో నుంచి యున్నాడా ? అతడు చేసిన దుడుకుతనములను సహించిన తల్లిని, ఆతనితోడ నాడినబాలురను, ఆతడు మేపిన యావులను, బృందావనమును, గోవర్ధనగిరిని జ్ఞప్తిలో నుంచుకొని యున్నాడా ? అను విషయముల నడుగగా సర్వదా మీయందే జ్ఞాపకము నుంచి యున్నాడు. అందువలననే నన్నిచ్చటికి బంపెనని ఉద్ధవుడు నందగోపుని కెఱింగించెను. నందగోపు డందులకు కృష్ణునిముఖము మరలజూతునా ? ముందటివలె నతడు పెరుగు వెన్నలు దొంగి లించునా ? విద్యనేర్చి పెద్దవాడై యున్నాడు. అతడొక్కపర్యాయ మీ యూరికి వచ్చినటులైన ఆతనిముఖమండలమును సేవింతుము. మీరట్లు చేయుదురా ? యని యడిగెను. ఈ మాటలు విని ''అహా! పరబ్రహ్మను బిడ్డగ బడసితిరి. అతనియందే ధ్యానము గల్గి యున్నారు. అట్టివానిని బిడ్డ బాగుగనున్నాడా యని యడిగితిరి. మీభాగ్యమే భాగ్య''మని యుద్ధవుడు నందగోపుని స్తుతించి కృష్ణు డిచటికి రాగోరుచున్నా డనియు, వచ్చుననియు, మీ రాతని తప్పక చూతు రనియు చెప్పెను.

మరునాటియుదయమున గోపికలు మరల నక్రూరుడే వచ్చె నని తలచి యొండొరులతో "ఓసీ! దుష్టుడగు కంసునిమంత్రి యగుటచేత నతడును దుష్టుడే. ఇత డెవ్వరికాపురమును గూల్ప వచ్చెనో! మున్ను మన ప్రాణము నపహరించుకొని పోయెను. ఇపు డితడు శ్రీకృష్ణునిధ్యానించువారిని చంపు మని కంసుడు పంపగా వచ్చె నేమో" యని యనుకొనిరి. పిమ్మట శ్రీకృష్ణుడు పంపగా విషయము చెప్పుటకై యుద్ధవుడు వచ్చెనని తెలిసికొనిరి. ఉద్ధవుడు గోపికలను గాంచి వారితో "గోపికలారా! మీరు దుఃఖింతు రనియు, భుజింపకుందు రనియు నెంచి యట్లు దుఃఖపడవల దనియు, మీవద్దకు వచ్చెద ననియుకృష్ణుడు చెప్పి పంపె" నని పలికెను. వారందుకు "ఓయీ! యిక నామాట లేటికి? విద్యను గ్రహించినపిమ్మట ఆచార్యునితోడను, అన్నముభుజించినపిమ్మట నన్నదాతతోను, దక్షిణతీసికొన్నపిదప దాతతోను నేమికార్య ముండును? వృక్షములతో నిండియుండునపుడు అచ్చోటికి మృగములు మొదలగునవి వచ్చుచుండును. కార్చిచ్చువచ్చి కాల్చినపుడా మృగాదు లందేల ప్రవేశించును? వృద్ధాప్యము, వికృతరూపము, అశక్తత కలిగినప్పు డట్టిస్త్రీతో జారుని కేమి కార్యముండును? శ్రీకృష్ణునికి మేమాకాలమున కావలసియుంటిమి. ఇపు డతడు మమ్ము మఱచినాడు. అగ్నిసాక్షిగ వివాహమాడినవారము కాముగదా!" అనిరి.

ఉద్ధవు డందులకు సమాధానము చెప్ప దలచి సమీపమునకు పోగా వా రందులకు "ఓయీ! దూరముగ నుండుము. నీవు మహాయోగ్యుడవు. నిన్ను పంపినవాడు తానే వచ్చియుండరాదా?" అని సూచించుచు భ్రమరము నుద్దేశించి "భ్రమరమా! ఇటకేల వచ్చెదవు? సపత్నుల కుచములయందు నలిగిన పూదండ కంటుకొన్న కుంకుమపంకమున నమరు మీసములతో మాపాదము ముట్టవలదు.

మేము పల్లెటూరివారము. పట్టణమువారియొద్దకే పొమ్ము. నీవు పుష్పమందలి తేనెగ్రోలి పిమ్మట దానిని విడిచిపోయినట్లు అతడు తన యధరసుధ నిచ్చి మమ్ము మోహింపజేసి వెడలిపోయెను. ఇట్టిమోసగాని నెట్లాలక్ష్మీదేవి భర్తగ వరించెనో ? అతనిశరీరమును, రూపమును జూచి మేము మోసపోయినట్లే ఆమెయును మోస పోయియుండనోపు" ననగా వినుచుండిన యుద్ధవుడు వారిని సమీపించికృష్ణుడు త్వరలోనే వచ్చు ననెను. అనగా వారు "ఆతనికిక పెరుగు, వెన్నలేల ? మీరుండ లేదా ? ఆ మధురాపురియందుండు స్త్రీలను జూచినవాడు మావద్ద కేలవచ్చును ? పరమసౌందర్యమణి యగు మహాలక్ష్మికి భర్తయగువాడు మావద్దకు వచ్చునా ? అతని పేరు చెప్పుచు బ్రతుకుదుము" అనిరి. వారట్లు చెప్పునప్పుడు దీర్ఘశ్వాసము విడుచుచు 'కృష్ణా! కృష్ణా!' యని పలవరించుచు నిట్లనిరి.

"అయ్యా! మీ రాతనికి మిత్రులు. మీ కాతని రహస్యము లన్నియు దెలిసియుండును. మే మాతనికి జ్ఞాపక మున్నామా ? కృష్ణుడు మమ్మెడబాసినది తలచునా ?" యని దీర్ఘనిశ్వాసము లతో నడిగిన గోపికలం గాంచి "గోపికలారా! మీవలె భగవంతుని యందు మన సుంచినవా రుండరు. బ్రహ్మకును, మహర్షులకును, నాకును మీయట్టిభక్తి కుదురలేదు. గొల్లవారైన నేమి ? స్త్రీలైన నేమి ? అనంతకథారసమును గ్రోలువారికి బ్రాహ్మణజన్మమే కలుగవలెనని నియతి యేల ? అట్లు భగవత్కథారసమును ద్రావని జన్మము బ్రాహ్మణజన్మమైన నేమి ప్రయోజనము ?" అని పల్కి యుద్ధవుడు గోపికలు నడచిన తావులం బడి పొరలి ఈ గోపికల పాదధూళిపడి అందుమొలచిన కసవుగనైనను కాకపోయితిని గదా యని చింతించి "పోనిమ్ము; మరుజన్మమందైన నట్లు కలుగ వలయు" నని తలంచెను. ఇట్టిభక్తిగల మీకు ప్రాణములతో

నుండుట ఆశ్చర్యమని గోపికలను ప్రశంసించి మధురాపురి కేగి శ్రీకృష్ణుని దర్శించి "స్వామీ! నీ వొక్కపర్యాయము గోపికలకు దర్శన మిచ్చి రాగూడదా'' యని విన్నవించెను. కృష్ణు డందులకు "నేనాయూరికి పోయినపక్షమున వారు మరల నన్ను రానిత్తురా ? భక్తిపాశముతో గట్టియున్నారే'' యని యుత్తర మిచ్చెను.

అట్లు గోపికలసంగతి యోజించునపుడు కుబ్జచేతిచందనము పూసికొని దానియభీష్టమును దీర్చలే దనియు, ఆమె మోసగాడని భావించు ననియు నెంచి యుద్ధవునితోడ నామెగృహమున కేగెను. శ్రీకృష్ణమూర్తి తానువచ్చినసంగతి ముందుగ తెలియపఱచగనే ఆస్త్రీ స్నాన మాచరించి మంచివస్త్రాభరణాదుల నలంకరించుకొని, పుష్పము లను ధరించి, తాంబూలము వేసికొని చందన తాంబూలాదులను సిద్ధముచేసియుంచి కృష్ణునిరాక కెదురుచూచుచు తలవాకిటనిలిచి సిగ్గుతో లోపలికి బోయి మరల వాకిటికి వచ్చెను. కృష్ణు డాసమయమున ఉద్ధవునితోడ కుబ్జాగృహమునకు బోయి కొంతతడ వాతనితో కూడియేఆమెతో ముచ్చటలాడుచుండి పిమ్మట నుద్ధవు నొక్కయెడ గూర్చుండ నియమించి యేకాంతస్థలమునకు కుబ్జతోడ నేగెను. దీనిరూపమునకు నేను తగుదునా యని తలంచెను.

లక్ష్మీపతియగువానికి చందన మిచ్చి అంగసంగ మడిగితిని. ఇతనినెట్లు మెప్పింతు నని కుబ్జ యోజించుచుండగా స్వామి "కుబ్జా! యిపుడేల సిగ్గుపడెద వని దానిఅందమైన కంకణముగల చేతినిబట్టి యిటుర''మ్మని పిలిచెను. కుబ్జ తపమాచరించ లేదు. యాగము లు చేయలేదు. వేదాంత విచారము సల్పలేదు. భక్తితో చందన మిచ్చిన ఫలమువలన స్వామి ఆమెను బలాత్కారముగ కూర్చుండ బెట్టుకొనెను. ఆ వెలది యపుడు శ్రీకృష్ణుచేతిని తన హృదయమునకు, కనులకు నద్దుకొనెను. ఆతనిపాదములు కనుల కద్దుకొనెను. సాధారణపురుషుని యంగసంగముచేత మన్మథ

తాపము తీఱునట్లుగాక భగవంతుని యంగసంగముచేత ఆధ్యాత్మి కాధిభౌతి కాధిదైవికతాపము లణగును. శ్రీకృష్ణు డామెగృహమున రెండుమూడుదినములుండి ఆమెనెట్లు తృప్తురాలిని జేయవలయునో యట్లుచేసి తన గృహమున కేగెను.

కంసవధానంతర మక్రూరునింటికి వచ్చునట్లతనితో జెప్పి యుండినమాటను స్మరించి అన్నతోగూడి యచటికి బోయెను. అక్రూరు డపుడు స్వామి యింకను తనగృహమునకు రాలేదని తలంచి "కృష్ణా! త్వమేవ శరణ మ్మనినవారిని కాపాడుదు నంటివి. ఆ మాట మఱచితివా" యని చింతించుచుండెను. కృష్ణబలరాములు వచ్చుటగని వారి ననేక విధముల బూజించి భగవత్పాదధూళిపడు టకు భాగ్యములేని యీ యింటిని విడువ నుద్యుక్తుడనై యుంటిని. నే దలచినట్లుగాక యీగృహము మహాభాగ్యము చేసినది. నీరాక బ్రహ్మ, దేవతలు, పితృదేవతలు వచ్చుటతో సమానము (అన్నియు నీవే. అందరు నీస్వరూపమే). నీపాదధూళి సోకిగదా గంగ త్రిజగ త్పావని యాయెను. అట్టి చరణధూళి పడని యీ గృహమువలన ప్రయోజనము లేదని యుండగా నింతలో నీట్లు తటస్థించెను. ఏమి నాభాగ్యము! ఇపుడే నాగృహ మొకగృహ మాయెను" అని యిట్లు స్తుతించుచున్న యక్రూరుని జూచి కృష్ణబలరాములును, ఉద్ధవుడును విస్మితులైరి. కృష్ణమూర్తి రెండుదినములుండి బయలుదేరగా అక్రూరు డందులకు సమ్మతింపక ఉండు ముండు మనుచుండెను. నాకు వేఱుకార్యము లేదా ? ఎన్నిదినము లిచ్చుట నుందు నని స్వామి యనగా వివేకముగలవాడు నిన్నెపుడును విడిచియుండ డని యక్రూరు డుత్తర మిచ్చెను. కారణ మేమని కృష్ణు డడు గగా "స్వామీ! ఒక్కొక్కవిషయ మొక్కొక్కయింద్రియము నకు సుఖము గల్గించునట్లుగాక నీవిషయము సకలజ్ఞానేంద్రియ కర్మేం ద్రియములకును సౌఖ్యము గలిగించుచున్నది. అందుచే నిన్ను

విడువజాల" నని చెప్పి యక్రూరుడు కృష్ణుని గాఢాలింగనము చేసికొనెను. అక్రూరుడు తన్ను వదల డని యెంచి యతనినొక కార్యార్థ మంపి తాను తన గృహమునకు బోవదలచి కృష్ణమూర్తి యతనితో నిట్లనెను. "అక్రూరా! పాండవులను కౌరవులు హింసించు చున్నారు. నీవు హస్తినాపురమునకు బోయి ధృతరాష్ట్రునితో నామాటగా నిట్లు చెప్పుము. "ధృతరాష్ట్రమహారాజా! పాండవులు తండ్రిలేనివా రనియు, అనాథు లనియు భావింపవలదు. వారు నాయత్తబిడ్డలు. వారి కేమైన హానిగల్గె నేని మీకు కష్టము వాటి ల్లును. నీవు దుర్యోధనాదులం దత్యంతపక్షపాత ముంచి పాండవు లను ద్వేషించుచున్నట్లు వింటిని. నీపుత్రులైన నేమి ? పాండు పుత్రులైన నేమి ? నీ వాభేదమును పాటించితివేని ఇహపరములకు జెడుదువు" అని యిట్లు కృష్ణుడు చెప్పగా అక్రూరు డాసందేశ మును ధృతరాష్ట్రున కెఱింగించి మగిడివచ్చి జరిగినసంగతులను కృష్ణునకు దెలిపెను.

భర్తృవియోగమున కుందిన కంసునిపత్నులు అస్తి ప్రాప్తులు తండ్రియగు జరాసంధునితో మొరపెట్టగా నత డుగ్రుడై పదునేడక్షౌహిణులసేనలతో వచ్చి మధురాపట్టణమును ముట్టడించెను. కృష్ణు డాసంగతి తాతకుచెప్పి అన్నతోగలసి యుద్ధమున కరిగి వాని నోడించి తరిమెను. జరాసంధు డిట్లే పదునేడుమారులు యుద్ధమునకు వచ్చి యోడిపోయెను. ఒకపర్యాయము కృష్ణుడు భయపడి పారిపోయినట్లు పోయి కరవీరపురాధిపతియు, నేనే వాసు దేవుడ నని యహంకరించినవాడును నగు సృగాలవాసుదేవు డను వానిని జంపి గోమంతపర్వతము నెక్కి అచటనుండిన విగ్రహ రూపుడైన భగవంతుని దర్శించెను. (వైకుంఠనాథుని కిరీటమును బలిచక్రవర్తి అసురావేశముచేత గొనిపోవుచుండగా స్వామి దానిని తెమ్మని గరుడుని బంపెను. గరుడుడు దానినితెచ్చునపుడు పర్వ

తముమీదనుండిన స్వామి కాకిరీటము నుంచగా వైకుంఠనాథు డా విగ్రహముగూడ తానే యగుటచేతను, కలికాలమున తనయవతారము లేకుండుటచేత తన ప్రతినిధిగ కిరీటముండవలసినదేయని తోచినందునను ఆ విగ్రహమునకే యుంచి యిట్లే యుండనిమ్మని గరుడున కాజ్ఞాపించెను. ఆ కిరీటము అనిరుద్ధుని పుత్రునికి అట్లే పరంపరగ వచ్చి యిపుడు తిరునారాయణస్వామి వారికి లభించి యున్నది. అదియే మేలుకోట చెల్వపిళ్లకు వైరముడి యన బరగుచున్నది) ఆ కిరీటమును ధరించిన స్వామినే కృష్ణమూర్తి దర్శించినది.

పిమ్మట నారదుని ప్రోత్సాహమున కాలయవను డనువాడు మధురాపట్టణమును ముట్టడించగా జరాసంధుడుగూడ మరల సంగ్రామమునకు వచ్చుననియు, తా మిరువురతో పోరవలసి యుండు ననియు, అందుచే ప్రజలను సురక్షితమైన ప్రదేశమున నుంచవలయు ననియు తలపోసి కృష్ణమూర్తి విశ్వకర్మచేత సముద్రమధ్యమున పండ్రెండుయోజనముల వెడల్పును, పొడవునుగలదై నవరత్నఖచితమైన గృహములతో నొప్పు ద్వారకా పట్టణమును నిర్మింపజేసి యందు-

దైవీ హ్యేషా గుణమయీ
మమమాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యన్తే
మాయా మేతాం తరన్తి తే ॥

అను భగ. 7అధ్యా. 14శ్లోకమట్లు మాయచేత నిదురించుచుండిన సకలప్రాణులను తెల్లవారునప్పటికి ఆ పట్టణమునజేర్చి మాంధాతపుత్రుడును, ఇక్ష్వాకువంశజుడును, సత్యసంధుడును, మహాజ్ఞాతయు నగు ముచుకుందుని నిదుర లేపి మోక్షమొసగవలెననియు, కాలయవనుడు కాలధర్మము నొందవలెననియు తలంచి యతనికి భయపడినట్లు పారిపోయెను.

మున్నొకకాలమున దేవాసురసంగ్రామము జరిగినప్పుడు ముచుకుందుడు దేవతలకు సహాయముచేసి అలసియుండుటచేత హాయిగ నిదురించుటకును, నిదురించునపుడు సంధ్యాద్యనుష్ఠానములు నిర్వర్తించని దోషము కలుగ కుండుటకును, తనకు నిద్రాభంగము గావించినవాడు భస్మ మగునట్లును దేవతలచేత పరము పడసి ఒకగుహయందు దీర్ఘకాలముగ నిద్రపోవుచుండెను. కృష్ణుడాగుహలోపలికి బోయి నిదురించుచుండిన ముచుకుందునిపై తన పీతాంబరమును గప్పగా అంతలో యవనుడు లోపల ప్రవేశించి "ఓరీ! చోరుడా! యిందునిదురించుచున్నట్లు నటించెదవా ?'' యని కాలితో తన్నగా ముచుకుందుడులేచి వానిం జూచెను. ఆతనిదృష్టి పడినతోడనే యవనునిశరీరమునుండి యగ్ని వెడలి వానిని దహించి భస్మముగావించెను. ముచుకుందుడు మరియొకప్రక్క జూచి శ్రీకృష్ణమూర్తిని దర్శించి స్వామీ-

యదగ్రే చానుబంధేచ
సుఖం మోహన మాత్మనః ।
నిద్రాలస్య ప్రమాదోత్థం
తత్తామస ముదాహృతమ్ ॥

అను భగ. 18అధ్యా. 39శ్లోకమట్లు నిద్రించుచుంటిని. నన్నులేపి కటాక్షించితి వని చెప్పి ఆనందించి ఆనందబాష్పములతోడను, గగుర్పాటుతోడను గూడినవాడై అనేక శాస్త్రసారభూతము లైనస్తోత్రముల గావించెను. అందొక్కసంగతి యేమన ''ఈశ్వరా! నీమాయ కెంతటిశక్తి? మాయయను తెరమఱుగున నుండుటచేత ప్రాణులు చెడుదురుగదా! ఈ సుఖములందు కడపట సుఖ మున్నదా ? సుఖార్థము వివాహము చేసికొనును. అందువలన నెందరికి విరోధము గలుగునో, సుఖము గలుగునో చెప్పశక్యముగాదు. అన్నవస్త్రములనుగూడ సరిగా ననుభవించక ధనమును వృద్ధిచేయుగా పుత్రుడు నాభాగము నాకిమ్మనును.

ఇట్టివిషయములందే సుఖమున్నదని భావింతురు. ఇదియే నీమాయ. నా కేజన్మము వచ్చినను వచ్చుగాక! నీపాదారవిందములందు భక్తిమాత్రము కలుగున ట్లనుగ్రహింపుము. వివేకి సంసారబంధమును పోగొట్టు ని న్నాశ్రయించి విషయసుఖముల గోరునా? (ముప్పదియాఱువేలసంవత్సరము లాయు వీయగా ధ్రువు డేఁగెను. ప్రకృతిబంధమోచకుని దర్శించి, సంభాషించి, ఆలింగనము గావించి యీ బంధమును బాయకున్నానని యల్లాడెను) కాన నీచరణపద్మ సేవయు, ని న్నారాధించి నీకటాక్షమును బొందుటయు చాలును. వేఱువిషయ మేమియు నే నడుగజాలను". (అనగా మోక్ష మిమ్మని భావము) ఇట్లడిగిన ముచుకుందునిగని నీ వీ క్షత్రియజన్మము వదలి మఱుజన్మమున ఉత్తమబ్రాహ్మణుడవై పుట్టి మహాజ్ఞానివై పలువుర కుపదేశించి పిదప మోక్షము పొందుము. అట్లే భగవత్సంకల్ప మని తెలుపగా అనేకజన్మములందుగాక మఱుజన్మముననే యని స్వామి చెప్పినందులకు ముచుకుందుడు సంతోషించి గుహవెలుపలికి వచ్చి తప మాచరించెను.

కాలయవనుని మ్లేచ్ఛసైన్యములు తమ యూరిని ముట్టడించి యుండగా స్వామి వారినెల్ల జంపెను. ఇదివిని జరాసంధుడు ఇరువదిమూడక్షౌహిణుల సేనతోడ రాగా స్వామిభయపడినట్లు పారిపోయి గోమంతపర్వతము నెక్కెను. పదునొకండుయోజనముల యున్నతమైన యా పర్వతమునకు జరాసంధుడు నిప్పంటించి కృష్ణుడు చచ్చెనని తలంచి పోవుచుండగా స్వామి శైలము డిగ్గి వానిని వెంబడించి జయించెను.

ద్వారకానాథుడగు స్వామి పాండవులు లక్కయింట కాలి చచ్చి రనుమాట విని యీసంగతి నరయుటకు కృతవర్మను హస్తినాపురికి బంపెను. అతడు పోయివచ్చి స్వామీ! నీయనుగ్రహముగలవారు చావ రని చెప్పెను. కృష్ణబలరాములు ద్వారక

యందు వసించుచుండునపుడు రైవతు డనురాజు రేవతియను నామెను బలరామున కిచ్చెను. కృష్ణుడు భీష్మకుని కూతురు రుక్మిణిని వివాహమాడెనని శుకుడు చెప్పగా పరీక్షిత్తు మాస్వామి వివాహమును విశదముగ జెప్పుమని కోరెను.

## రుక్మిణీ కల్యాణము

శ్రీకృష్ణుని వివాహ విషయము సవిస్తరముగ నెఱిగింపుమని పరీక్షిత్తు కోరగా శుకుడు– "రాజా! అట్లే తెలిపెదనని యారంభించెను. విదర్భ దేశమున కుండినమను పట్టణమును భీష్మకుడనురాజు పాలించుచుండెను. అతడు మహాదాతయు, జ్ఞాతయునై యుండెను. అతనితో దేవేంద్రుడుగూడ సరిపోలడనిన తక్కిన భూపాలురు సరివత్తురా ? అతనికి రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మమాలి యనునేవురు కుమారులును, రుక్మిణియను కొమార్తెయు నుండిరి. రుక్మ మనగా బంగారమని యర్థము గాన నామె కాపేరు పెట్టబడెను. అందు కడవటిదియగు రుక్మిణి మంచిబాలిక. ఇతరులు చెడ్డవారా యనిన నట్లుగాదు. ఈమె అకారశబ్దవాచ్యుడైన భగవంతునిభార్య. సర్వాంగసుందరి; జగన్మోహిని. బ్రహ్మాదుల కరచరణములాడుట యీామె వలననే. ఈమె భగవంతునికంటె తగ్గినదై, బ్రహ్మాదులకు హెచ్చైనదై యుండును. లక్ష్మ్యవతారము ఇన్ని విశేషములతో గూడినది.

భీష్మకుడు తన జ్యేష్ఠపుత్రుడగు రుక్మియందు రాజ్యభారముంచి తనయొద్దకు వచ్చుచుపోవుచుండు పెద్దలతో బ్రహ్మవిచారము సల్పుచుండును.

మచ్చిత్తా మద్గతప్రాణా
బోధయన్తః పరస్పరమ్ ।
కథయన్తశ్చ మాం నిత్యం
తుష్యన్తి చ రమన్తి చ ॥

అను భగ. 10అధ్యా. 9వశ్లోకమువలె వారు ద్వారకా

నాథునే ప్రశ్నించుచుందురు. ప్రతిదినము వచ్చుచుండు బ్రాహ్మ ణుడు కొన్ని దినములుగ రాకపోగా రానికారణ మేమని భీష్మకు డడిగెను. అందుల కాతడు_

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే ॥

అను భగ. 4అధ్యా. 8శ్లోకమున "పరిత్రాణాయ సాధూనా"మనిన "పరమాత్మ ద్వారకయందు క్రీడించుచున్నాడు. అతనిని దర్శింపబోయితి" నని యుత్తర మిచ్చెను. భీష్మకు డా మాటలువిని అతనిని పుత్రునిగ బడసిన తలిదండ్రుల భాగ్య మెట్టిదో యని యానందబాష్పములు విడుచుచు నానందించు చుండెను.

సాధారణముగ నొక డొకనిని వర్ణించునెడల వారివారికి హితు లగువారిని వారువారు ప్రేమించుచున్నారని యెన్నవగును. కృష్ణునివిషయమున నట్లుగాక వచ్చువా రెల్లరును అతనినే వర్ణించుట చేత నతనియం దనేకకల్యాణగుణము లున్నవని రుక్మిణి భావించి యతనిని పెండ్లాడ దలంచెను.

క. తనతండ్రిగేహమునకుం
జనుదెంచుచు నున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూపబలగుణాదులు
విని కృష్ణుఁడు దనకుఁ దగిన విభుఁ డని తలఁచెన్.

## బమ్మెరపోతన భాగవతము

ఆమె యతనిని తనకుసదృశునిగ భావించెను. మఱియు నతని అ + సదృశునిగ = "అ" యని చెప్పబడు విష్ణుసమానునిగా తలచెను. రుక్మిణీదేవి కృష్ణునివివాహమాడవలయునని తలచినంతనే

ప్రయోజనమేమి ? వరుడుకూడ దలపవలదా ? (ఒకానొకపేద బ్రహ్మచారి యొకశ్రీమంతుని పుత్రికను జూచి వివాహమాడదలచి ముహూర్తమును నిర్ణయించి బంధువుల కెల్లను శుభలేఖలు వ్రాసెను. శ్రీమంతున కల్లుడు కాబోవుచున్నాడనియు, తాముగూడ బంధుత్వము కలుపుకొన వలయుననియు తలచి దూరబంధువు లెల్లరును వివాహముజూచుటకు ఆ బ్రహ్మచారి యింటికి బోగా నచట మంచిదీపమైన నుంచియుండలేదు. వా రదిచూచి విస్మితులై బ్రహ్మచారిని బిలిచి "నీ వివాహవిషయ మే" మని యడుగగా వాడు "బంధువులారా! వివాహమగుటకు రెండువిషయములుముఖ్యములు. అవేవన వరుడు వధువును ప్రేమించుట, వధువు వరుని వరించుట. నే నిపుడా బాలికను వరించితిగాన వివాహ మర్ధభాగము నిశ్చయమైనది. మరియొక అర్ధభాగము బంధువులగు మీరే నిశ్చయింపవలె ననెను.) రుక్మిణీ వివాహవిషయ మట్లుగాక, బ్రహ్మాదులచేత ధ్యానింపబడుస్వామియు రుక్మిణిని దలచుచుండెను.

క. ఆ లలనరూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ జింతించి తగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ జేకొందు ననుచు హరియుం దలచెన్.

## పోతన భాగవతము

ఇ ట్లిరువురును వివాహకాలము నెదురుజూచుచుండిరి. భీష్మకు డపుడు పుత్రికకు పెండ్లిచేయవలెనని యెంచగా రుక్మియనువాడు ఎవరికీయ దలచితి వని తండ్రి నడిగెను. రాజందులకు కృష్ణుని కీయనెంచితి నని చెప్పగా అట్లెంచుటకు కారణ మేమనివా డడిగెను. రా జందులకు మనయింటికి దయచేయుచుండు పెద్ద లెల్లరును కృష్ణుడు సకలకల్యాణగుణపరిపూర్ణు డనియు, దోషగంధరహితు డనియు చెప్పియుండుటచేత నతని కీయదలచితి నని పల్కెను.

రుక్మి యా మాటలు విని "తండ్రీ! పెద్దవాడ వగుటచేత నీకు బుద్ధి మాంద్యము గల్గినది. కృష్ణుడేవిషయమున మనతో సరితూగ గలడు ? వివాహమునకును, వివాదమునకును సరియగువారుగ నుండవలదా ? అట్లగుటవలన నన్నివిధముల మనకు తగినవాడు చేదిరాజగు శిశుపాలుడే యని చెప్పగా విని భీష్మకుడు అసత్సహవాసముచేత వీనిబుద్ధి యిట్లున్న దని తలచి యూరకుండెను.

భీష్మకు డొక్కమహాసభ గావించి జనుల నుద్దేశించి "జనులారా! నా కొమార్తెను ద్వారకానాథున కీయదలచితిని. మీ యభిమత మెఱిగింపు'' డని కోరగా వా రెల్లరును అది మంచికార్యమని వక్కాణించిరి. విషయ మిట్లు నిర్ధారింపబడగా రుక్మిలేచి తండ్రి యగువాడు కడుపునబుట్టిన బిడ్డను యోచించిగదా తగినవాని కీయవలెను ? ప్రభుని ముఖప్రీతికై ప్రజ లెల్లరు సమ్మతించి యుందురని పల్కి యిటుచూచి ''ప్రజలారా! ద్వారకానాథు డెవ్వడు ? మీ రతనిని జూచితిరా ? మీ బిడ్డలకును ఈరీతిగనే వివాహము గావింతురా ? ఆవేశము వహించకుడు. నేను శిశుపాలుని కీయదలంచితిని. మీరేమందురు ? అని కోపముతో ఒడలు వడక కనులెఱ్ఱచేసి గద్దించి పలుకగా ప్రజలు అట్లే కానిమ్మని యుత్తర మిచ్చిరి. రుక్మి యపుడు ''జనులారా! నామాటను, నాతండ్రి మాటను సమ్మతించితిరి. కన్య నిరువురి కెట్లు కట్టబెట్టనగును ? కాన తండ్రిమాటను వదలి నామాటను స్థిరపఱచు'' డనగా వారట్లే సమ్మతించిరి.

రుక్మి చెల్లెలిని శిశుపాలుని కీయదలచి ఆతడు అపనీపతీశుడు, సద్గుణకోశుడు, చేదిదేశేశుడు, మా రుక్మిణీశుడని వానిని పొగడెను. కృష్ణుని కీయతగదని తలంచి అతడు జారచోరశిఖామణి, వసుదేవ నందులకు కొమరుడు, సదా చోరత్వ మతనిప్రవృత్తి. అట్లు దొంగిలించినను గొప్పవస్తువులను సంపాదించెనా ? అదియును లేదు.

పాలు, పెరుగు, వెన్నలనెడి యల్పవస్తువులనే అతడు కోరును. శూరుడని తలంతు మన్ననో గోవులను మేపువా డతడు. గోపస్త్రీ జారుడు, గోధనచోరుడు, గోపకుమారుడు పరుక్మిణీశుడు కాదగడు. వివాహమైన తరువాత పెండ్లికుమారుడు దుర్మార్గమున ప్రవేశించె నేని బాలికయొక్క నొసటివ్రాత యని యెన్న నగును. తెలిసి తెలిసి ముందే యిట్టివాని కీయదగునా? కూడదని కృష్ణుని నిందించెను.

రుక్మిణీదేవి ప్రత్యక్షముగ తానీ సంగతి నరయుటకు సిగ్గు పడి బుద్ధిశాలినియగు బాలిక నొకతెను సంగతి నరయుటకు బంపి యుండెను. ఆమె రుక్మిణిచెంత కరిగి "అమ్మా! సంసారరోగహరు డగు వాసుదేవునికి నిన్నిచ్చునట్లు నీతండ్రియును, బంధువులును తలచిరి. భగవద్ద్వేషియగు మీయన్న నిన్ను శిశుపాలున కిచ్చు నట్లు తీర్మానించె" నని చెప్పెను.

రుక్మిణి యీ మాటవిని యిట్లె మూర్ఛనొంది మరల తేరు కొని "ఈశ్వరా! మాతండ్రి అన్నకు విద్యగఱపి శాస్త్రకోవిదుని చేయలేదా? అతనికి బుద్ధిమాత్రము లేకపోయెనే. నాకును, నా తండ్రికివలె అతనికి ద్వారకానాథునియందు భక్తి యేలకలుగక పోయెను? నీ యాజ్ఞలేక తృణముగూడ చలించదే. ఇట్లేల చేసితి" వని యామె చింతించెను.

ఈ వివాహకార్యము జరుగుటకు భగవత్సంకల్పము గలి గెను. రుక్మిణీ సంగతి తెలియుటకై యొకవృద్ధబ్రాహ్మణు డామె నగరున కేగి ఆమెనుగాంచి "అమ్మా! నీవు మనఃపూర్వకముగ భగవంతుని నమ్మి యుంటివి. సకలకళ్యాణగుణపూర్ణు డగు ఆ స్వామికే నీవు తగినదాన" వనెను. అందుల కామె "తాతా! నాకు తగనట్టి చేదిదేశాధిపతికి నన్నిచ్చుటయా? నేనేమిచేయుదు" నని చింతించగా నాబ్రాహ్మణుడు "అమ్మా! మేము తత్త్వవిచారార్థము

మీతండ్రి యొద్దకు వచ్చుచుండుటయే మీఅన్నకు సరిపడకున్నది. ఇక నీసంగతి యతని కెఱిగించిన మమ్ము రాకుండ జేయును" అనగా రుక్మిణీ "తాతా! తండ్రికిని, మీకును ఈ కార్యమున ప్రవేశించుటకు వెరపగుచున్నది గాన నే నొక్క యుత్తర మా కృష్ణమూర్తికి వ్రాసి యిచ్చెదను. ఆ లేఖ నాతని కిచ్చెదవా?" యని యడిగెను. అందుల కాబ్రాహ్మణు డా కార్యము తనచేత నగునని బదులు పల్కెను. రుక్మిణి స్వామిభవనమును మీరెట్లు చొత్తురనగా "అమ్మా! ఎప్పుడును ఆతడు బ్రాహ్మణప్రియుడు. అట్లు కాకున్నను యాచనార్థము చేతిచెంబు నెత్తుకొందు నేని ఇంద్రుడు, చంద్రుడు పోజాలని స్థలమున కైనను పోగలుగుదును. న న్నడ్డగించువారే యుండరు. యాచకుని జూచిన పక్షమున యజమానులే లోపలికి పొమ్మని యాజ్ఞాపించెదరు. కాన నేను అనాయాసముగ పోగల్గుదు" నని చెప్పి బ్రాహ్మణుడు బయలుదేరి ద్వారకకు పోవుచుండెను. రుక్మిణికి ధైర్యము చెప్పినను ఆ బ్రాహ్మణునికి తన మనసుమాత్ర మధైర్యముతో నుండెను. అందుచేత నతడు భగవంతుని ధ్యానించుచు అతనినామోచ్చారణ సల్పుచు పోవుచుండెను. ఆసమయమం దతనికి వామపార్శ్వమున గరుడదర్శన మాయెను. అదిచూచి యతడు పరమసంతోషభరితుడై పోవుచుండ వేదవేదాంగపారంగతులగు నిద్దరు బ్రాహ్మణులదర్శన మాయెను. ఈ శుభశకునము లరసి బ్రాహ్మణుడు స్వామి తనతోడవచ్చి రుక్మిణిని వివాహమాడవలెనని తలచుచు పోయి ద్వారకాపురిచేరెను. సాక్షాద్వైకుంఠనాథుడు లక్ష్మీపతియగు భగవంతునికి నివాసముగ నుండునదియు—

న తద్భాసయతే సూర్యో
న శశాంకో న పావకః।
యద్గత్వా న నివర్తంతే
తద్ధామ పరమం మమ ॥

అను భగ. 1౫అధ్యా. 6శ్లోకమట్లు స్వయంప్రకాశమానమై విచిత్రస్థానముగ నుండునదియు, నవరత్నఖచితమైన స్వర్ణగృహములతో గూడినదియునగు ద్వారకాపురిని అగ్నిద్యోతనుడు చూచి యిట్టిశ్రీమంతు డగుటచేతనే మన బిడ్డ యితనిని కోరెనని తలచి పరమానందభరితుడై శ్రీకృష్ణమూర్తి గృహమును గుర్తించి అనేకరక్షకభటులతో నిండియుండు నీ గృహమునెట్లు చొత్తు నని శంకించుచు బోయెను. కానియతని నెవ్వరు నాటంకపరచలేదు. ఆ బ్రాహ్మణుడు అంతఃపురము ప్రవేశించునప్పటికి కృష్ణమూర్తి దివ్యసింహాసనముపై గూర్చుండి యుండి తనవద్దకు వచ్చు బ్రాహ్మణుడు భయపడతగడని యెంచి సింహాసనము దిగి భూసురున కెదురేగి యతనిని పిలుచుకొనివచ్చి తన గద్దియపై గూర్చుండబెట్టి షోడశోపచారపూజ గావించి నే పూజించుస్వామి నన్ను పూజించుచున్నాడని బ్రాహ్మణున కాశ్చర్యము గలిగించెను. బ్రహ్మాదిదేవతలకు దైవముగనుండు స్వామి బ్రాహ్మణుని తనదైవమని తలచి భక్తితో పూజించెను.

శ్రీకృష్ణమూర్తి రుక్మిణీదేవి పంపిన బ్రాహ్మణుని భక్తితో పూజించి యతని నుద్దేశించి "బ్రాహ్మణోత్తమా! మీ యూరేది? మీరాజుపేరేమి? ఆ పుడమిఱేడు వర్ణాశ్రమధర్మములను గాపాడుచున్నాడా? మీతపస్సు వృద్ధిపొందుచున్నదా?" యనుప్రశ్నల నడుగగా బ్రాహ్మణుడు "రాజునకు బిడ్డ లున్నారా?" యని యడిగిన రుక్మిణిసంగతి చెప్పనగును. అట్లడుగక పరమవైదికమార్గము ననుసరించి మాటలాడుచున్నాడే యనిమనసున విచారపడుచుండెను. హృషీకేశుడుగాన నాతనితలం పెఱిగి తన్ను నమ్మియుండి ప్రత్యక్షముగ దర్శించిన బ్రాహ్మణుని దుఃఖపెట్టుట పాడిగాదని భావించి "బ్రాహ్మణోత్తమా! ఆ రాజునకు సంతానము గలదా? కొమార్తెయు గలదా? ఆమెకు వివాహమయ్యెనా?" అని ప్రశ్న

వేసెను. అగ్నిద్యోతనుడు కృష్ణమూర్తి యడిగిన ప్రశ్నలన్నింటి కిని బదులుచెప్పి కడపటిప్రశ్నకు వివాహార్థమై యిచటికి వచ్చితి నని ప్రత్యుత్తర మొసగి రుక్మిణి జాబునెత్తి స్వామిపాదములందు సమర్పించెను. ఉత్తర మేమని కృష్ణమూర్తి యడుగగా బ్రాహ్మ ణుడు ఆబిడ్డయే వ్రాసి యిచ్చెనని చెప్పెను. అందులకు స్వామి "బ్రాహ్మణోత్తమా! నేనాకన్యను జూడలేదు. ఆమెయు నన్ను జూచి యుండలేదు. ఇట్లుండగా పరపురుషుడనగు నా కామె యెట్లు జాబువ్రాసినది ? రాజపుత్రిక యగుటచేత చెల్లునని యిట్లు వ్రాసెనా ?" యని యడిగెను. బ్రాహ్మణు డందులకు "కృష్ణా! యిది విజ్ఞాపనమని యెంచుకొనుము. విదర్భరాజపుత్రిక యగు రుక్మిణి మీసేవకురాలు- ఇట్లు ప్రార్థించిన" దని విన్నవించగా స్వామి ఆయుత్తరము నంగీకరించెను. అగ్నిద్యోతను డపుడు "స్వామీ! యెపుడో చదువుట గాదు. ఈ యుత్తరము నిపుడే చదువుకొనవలయు" ననగా కృష్ణమూర్తి "భూసురోత్తమా! తమతో మాటలుమాని యీపెద్దలేఖను చదువుట యుచితమా ?" అనెను. విప్రుడందులకు "దేవా! మీరెంచినట్లు ఆ జాబు దీర్ఘముగ వ్రాసి యుండలేదు. సంగ్రహముగనే యున్న" దని తెలిపెను. శ్రీ కృష్ణుడు బ్రాహ్మణునితో సంభాషించుట మాని యుత్తరము చదు వుట తగదని యోచించుచుండ "వివాహపత్రికను వెంటనే చదువ వలయును గాని విలంబము సేయుట తగ"దని విప్రుడు చెప్పెను. శ్రీకృష్ణమూర్తి ఆయుత్తరము నందుకొని "అయ్యా! ఆయూరిలోని సంగతి యేమి ? ఆ కన్నియ నెవరి కిచ్చునట్లు తలంచి" రని యడుగగా బ్రాహ్మణుడు "కృష్ణా! రాజామెను నీకీయదలచెను. ఆమెయు నిన్నే కోరియున్నది. రుక్మి శిశుపాలున కీయదలం చెను. ఈ విషయము చర్చించుటకొక గొప్పసభ కూర్చబడెను. తుద కామెను శిశుపాలున కిచ్చునట్లు రుక్మి నిర్ధారించెను. అప్పటి

నుండియు ఆ కన్నియ మిగుల చింతించుచున్నది. ఆమె మనో
వ్యథను నీవే తీర్పవలయు" నని చెప్పెను. కృష్ణు డా యుత్తర
మును వీక్షించి "ఆమె వ్రాత ప్రశంసనీయముగ నున్న" దనగా
బ్రాహ్మణు "డామె బహు బుద్ధిమంతురాలు. ఆమెవ్రాసినవ్రాత
మాత్రమే కాదు. అర్థవిశేషము కూడ కొనియాడదగియుండును.
ఆమె మీకేమి వ్రాసియుండెనో దానిని వినిపింపుమని యామెనే
యడుగుద మని తలంచితిని. మరల నామె లజ్జించునని నే నాలో
చించి అట్లడుగనైతిని. నేనును ఆయుత్తరము నందుగల సంగ
తులను వినుట కర్హుడనగుదునేని వినిపింపు" మని కోరెను. శ్రీకృష్ణ
మూర్తి యందులకు "విప్రపుంగవా! నేను స్వామిని. ఆమె లక్ష్మి.
మాశృంగారవిషయము వేదములందు వర్ణింపబడును. ఆవేదములు
మీవాక్కున నిమిడియుండును. కాన మీకు తెలియగూడని విషయ
మేమియు నుండదు" అని చదువ నారంభించెను. బ్రాహ్మణు
డపుడు "భగవంతుడా! యీతని కాయుత్తరమందలి విషయములు
బాగుగ బోధపడవలయును. నాతోడ రావలయును- రుక్మిణిని
పెండ్లాడవలయు" నని చింతించుచుండెను. కృష్ణుడా సంగతి
నెఱింగి "అట్లే కానిమ్మని చెప్పిన తనగౌరవము కొంత తగ్గు
ననియు, చెప్పకున్న బ్రాహ్మణుడు భయపడు" ననియు భావించి
తన కటాక్షవీక్షణము, మందహాసము, రూక్ష, చెమ్మటలచేత తన
యంగీకారమును తెలియపఱచెను. బ్రాహ్మణుడు కృష్ణభగవానుని
రీతిని జూచి "ఆహా! ఈ యుత్తరమును చదువుటకు నారంభించిన
తోడనే యితనికి శృంగారరసము కలిగెనని సంతోషించుచుండెను.
రుక్మిణీదేవివ్రాసిన ప్రథమశ్లోకాభిప్రాయ మేమనిన "హేభువన
సుందరా! లోకమున నీవంటిసుందరు డుండనేరడు. నీకల్యాణ
గుణములను వింటిని. అవి లోపలప్రవేశించి దేహతాపమును
పోగొట్టుచున్నవి. కన్నులకు ప్రయోజనకరమగు రూపమని

వింటిని. నిన్ను పెండ్లాడదలచితిని. అందుకు ప్రతిబంధక మేర్ప డెను. అందుచే క్షణకాలము లజ్జను త్యజించిన యెడల ప్రయోజ నము కల్గునని యెంచి అట్లే లజ్జాత్యాగ మొనర్చి యీ యుత్తర మును వ్రాసితిని" అని రుక్మిణి వ్రాసిన ప్రథమశ్లోకమును జదువు కొని ఈ రుక్మిణి సాధారణముగ సుందరులు సుందరులను కోరునట్లు కోరి వ్రాసెను గాని-

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే ॥

అను భగ. 4అధ్యా. 8 శ్లోకమట్లు సాధుజనులను రక్షించి దుష్టజనులను శిక్షించి ధర్మసంస్థాపనము చేయుటకై యవతరించిన వాడనని నన్నెఱుగక పోయెను. నీచర ణారవిందసేవచేసెద ననగా యోజన యేల యని వ్రాయలేదు- అని యెంచి కృష్ణమూర్తి ఆ లేఖను దిగువ పడవైవగా బ్రాహ్మ ణుఁ "కృష్ణా! మీరు యోజించువిషయమున కామె తగినయుత్తర మిచ్చియుండుఁను. మరల చదివిచూడవలయు"నని చెప్పెను. శ్రీకృష్ణు డా యుత్తరమును మరల చదివి చూచి యిట్లన్వయించు కొనెను. "స్వామీ! వేదాంతవిచారము చేసిన పురుషులకు నీగుణ ములు చెవులందు జొరబడి త్రితాపములను బోగొట్టి అపరోక్షజ్ఞానము గల్గజేయును. ఇట్టిఫలము గల్గునని నారదుని వలన విని సిగ్గువిడిచి మీయందు నామనసు లగింప జేసితిని. మీకు ప్రియుడగు బ్రాహ్మ ణుని బంపితిని. లక్ష్మినగు నేను లక్ష్మీనాథుడ వగు నిన్ను ప్రార్థిం చితిని"-అని వ్రాసిన రుక్మిణిభావ మెఱింగి కృష్ణమూర్తి సంతసించి అయినను నాసృష్టిస్థిత్యాదికార్యము లను గమనింపక అందమునే గమనించె నని కొంత యోజించి మరల నిది వివాహసమయ మగుట

చేత ఆ విషయము నెత్తి వ్రాసెను. ఇది వేదాంత విచార సమయము గాదు. పెండ్లి నిశ్చయము కాగానే బాలిక తన భర్త సుందరుడేనా యని గమనించును గాని సుఖదుఃఖము లెఱుగని దగుటచేత నతడు వివేకియా కాడా అని యోజింపదు. బాలికతల్లి అల్లుడు ధనవంతుడా అని యోజించును. తండ్రి బుద్ధిమంతుడా యని యోజించును. బంధువులు కులమును యోజింతురు. ఇతరులు మృష్టాన్నమునే కోరుదురు. అందుచేత రుక్మిణి భువనసుందరా! యని సంబోధించుట తగునని కృష్ణమూర్తి సంతోషించెను. పరపురుషుని కిట్లు వ్రాయదగునా యని స్వామి యోజించగా బ్రాహ్మణుడు "బాగుగ చదివి చూడు" మనెను. మరల చదువగా నిట్లన్వయమాయెను. "కృష్ణా! నీ కల్యాణగుణములను విని నేనిట్లు వ్రాయుట తప్పుకానేరదు. నిన్నుజూచిన పురుషులు సహితము మోహింతురు. అట్టి నీగుణములు విని వివాహ మాడదగిన వయస్సులో నున్న నేనిట్లు వ్రాయుట తప్పుకానేరదు. ఇది తప్పేయని భావింతువేని నీవట్లు భావించుటయేపొరపాటగును. ఎట్లన నీవు సర్వమనస్సాక్షిభూతుడవై సర్వాంతర్యామివై యున్నావు. ఇట్లంతరాత్మవై సకలము నెఱిగి యుండు నీకడ నాభావము తెలుపక దాచుటచేత నేమిప్రయోజన మున్నది?" ఈ భావము నెఱింగి కృష్ణుడానందించెను గాని, నాయంతటిరూపవంతునికి తాను భార్యయగుటకు తగుదునా యని రుక్మిణి యోజింపకపోయెనని తలంచి బ్రాహ్మణుని ప్రేరణచేత మరల లేఖ చదివి యిట్లన్వయించుకొనెను. "కృష్ణా! భువనసుందరుడవగు నీకు నేను తగుదునా యని యోజింతువు. వలయునేని ఈ బ్రాహ్మణు నడిగి తెలిసికొనుము. ఇతడు నాతో చేరినవాడని భావించు నెడల నీవారి నడుగుము. నన్ను నేను వర్ణించుకొనరాదు. నన్ను జూచిన మహర్షులకు సైతము మనసు చలించును. నన్ను జూచుటే కన్నులు కలిగినందులకు ఫలము. ఈ విషయ

మును విచారించుము. భయము లేదు'' అని వ్రాసియుండుటకు కృష్ణు డానందించెను. నాగుణములు వినుటచేత నాయందను రాగము గలిగెను. రేపు శిశుపాలుని గుణములు వినిన వానియందును ప్రీతిచేయునెడల నేను మరలిపోవలసిన వాడనే గదా! యను సంశయము స్వామికి పుట్టి మరల జాబుచదివి చూడగా "స్వామి! విప్రులు నన్ను మోసపుచ్చుటకై శిశుపాలుని గుణములను వర్ణింపగా నాదేహము మండ నారంభించెను. పరమాత్మా! నీ రూపమును దర్శించుటచేత నిఖిలార్థలాభము కలుగును. వానిరూపును జూచుటచేత ప్రయోజనము లేదు. శిశుపాలునియందు నామనసు దగులకుండుటకై వాని దోషములను సదా యెన్నుచున్నాను తామీ విషయమున యోజింపక దయచేయ నగును'' అను భావము తెలియవచ్చెను.

శ్రీకృష్ణమూర్తి అనేక సమాధానములతో గూడియుండిన రుక్మిణీదేవి యుత్తరము నంగీకరించెను. గాని వివాహమునకు మొదటనే జరాసంధాదులతో పోరవలసియుండుటను యోజించి యింతకన్న వేఱొక కన్యను పాణిగ్రహణమొనర్చుట మేలని భావించి ఆ యుత్తరమును క్రిందవేయగా బ్రాహ్మణుడు "కృష్ణా! మఱియొకసారి చూడుము. నీయోజనకు సమాధానము వ్రాయబడియుండు'' ననెను. శ్రీకృష్ణు డా యుత్తరము నందుకొని చదివి, "దారుకా! రథ మాయత్తము సేయు'' మనెను. బ్రాహ్మణు డాశ్చర్యముతో నిదేమియని యోజించుచుండెను. ''ఉజ్జాత్యాగ మొనర్చితి'' నని వ్రాసియుండుటే శ్రీకృష్ణుని త్వరకు కారణము.

''సుందరులగు స్త్రీపురుషులకు పరస్పరము కలుగు నను రాగము దశవిధములై యున్నవి. వార లన్యోన్యము విని చూచిన యెడల చూడవలయుననెడి యాశ మొదటిది. ఆయాశచేత మనసు లగించును. ఇది రెండవ యవస్థ. ఇట్లాశ దగిలి యుండుట

చేత నెట్లు లభించు నను సంకల్పము కల్గును. (3) ఇట్లుయోజించు చుండుటచేత నిద్రపట్టకుండును. (4) నిద్రలేమిచేత దేహము కృశించును. (5) పిమ్మట సకలవిషయములం దిచ్ఛ లేకపోవును. (6) ఆపై యవస్థయే లజ్జాత్యాగము. క్రింది యవస్థల ననుభవించి యేడవస్థితికివచ్చితిని. నీవిపుడనుగ్రహింతువేని బ్రదుకుదును. అట్లు కరుణజూడవేని ఏడవ, ఎనిమిదవఅవస్థలగు ఉన్మాదము, మూర్ఛనముల ననుభవించి కడపటియవస్థయగు మరణమును పొందుదును" అని రుక్మిణి తెలుపగా స్వామి తానామెనాదరింప కుండిన నామెకు ప్రాణహాని యగునని నిశ్చయించుకొనెను.

మఱియును రుక్మిణీదేవి యిట్లు విన్నవించెను. "నీ వను గ్రహించి రాకపోయినయెడల ఆ శిశుపాలునిమాత్రము నేను పెండ్లాడను. నిన్ను మరుజన్మమున పెండ్లాడెదను. అట్లు తటస్థించ కుండిన యెడల నూరుజన్మము లయిన నెత్తి నిన్నే పరిణయ మగుదును. అప్పుడు కూడ నీవు నన్ను గైకొనవేని యట్లు కఠిన ముగ నుండు నిన్ను పెండ్లాడుటకన్న పెండ్లియే మానుకొందును" అని ఈ రీతిలో నున్న యుత్తరమును జదివి కృష్ణమూర్తి ఆమెను గూర్చి బ్రాహ్మణునితో ప్రశంసించి యతనితోడ బయలుదేరెను. ఈ సంగతి యంతయు దెలిసి ద్వారపాలకులు పెద్దవారి కెఱిగింపగా బలరాము "డిదేమికార్యము ? ఈ శ్రీకృష్ణుడు స్త్రీవిషయమున నిట్లే తొందరపడుచుండును. తలిదండ్రులతో యోజింప నవసరములేదా ? ఆకన్యవ్రాయుట; వీడు పోవుట బాగుగ నున్నది. ఆ సమయమున జరాసంధాదులు యుద్ధమునకు వత్తురుగాన నేనును ఆతనికి సహాయముగ పోయెద" నని తలచెను. శ్రీకృష్ణ మూర్తి పోవులోపల రుక్మిణీదేవి స్థితి యెట్లుండెనని పరీక్షిత్తు ప్రశ్నింపగా శుకుడు తెలిపెను.

రుక్మిణి బ్రాహ్మణుని బంపి కృష్ణా! కృష్ణా! యని స్మరించుచు "స్వామీ! నేను వ్రాసిపంపిన యుత్తరము నంగీకరించి వచ్చి

నన్ను వివాహమాడవలయు'' నని తలంచుచుండెను. తడవాయెనని యోజించుచు స్వామియును, బ్రాహ్మణుడును ఇంకను రాలేదని ఎదురు చూచుచుండెను. ఒక్కయామము గడచె నిక మూడు యామములే యున్నవి. నిర్భాగ్యురాలనగు నా కా గొప్పభాగ్య మెట్లు లభించును ? బ్రాహ్మణుడును, స్వామియు రాని కారణము తెలియకున్నది. వివాహాత్పూర్వమే యీ రీతి సిగ్గులేక యుండు దీనితో నేనెట్లు కాపురము చేయగలనని తలచి రాకున్నాడేమో! శివునికిని, పార్వతికిని నాయందు కరుణ కలుగ కున్నదే. నలువది యెనిమిది దినములా దంపతుల సన్నిధికి బోయి వారి నర్చించి తినిగదా!

మ. ఘను డా భూసురుఁ డేగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
వినికృష్ణుండది తప్పుగాఁ దలఁచెనో విచ్చేయునో యీశ్వరుం
డనుకూలింప దలంచునో తలపడో యార్యామహాదేవియున్
ననురక్షింప నెఱుంగునో యెఱుఁగదో నాభాగ్య మెట్లున్నదో!

—పోతన భాగవతము

అని తలంచి చింతించి తోడిబాలికలలో నొక బుద్ధిశాలిని యగు దానిం బిలిచి ''చెలియా! శ్రీకృష్ణుడు వచ్చునా ? రాడా ? చెప్పు'' మని యడిగెను. అందుల కా బాలిక ''అక్కా! అవసర మేల ?'' యని యనగా రుక్మిణి ''యీ సమయమందే గదా వచ్చి యాపరించవలయు'' ననెను. ఇంకొకబాలిక నుద్దేశించి ''సఖీ! కృష్ణుడేల రాకున్నాడు ? నేజేసిన తప్పే'' మని యడుగ నామె నేడేగదా బ్రాహ్మణుని బంపితివి. త్వరపడవలదనగా రుక్మిణి అత నిని బంపినది నేడేనా ? ఒక్కమాసమాయె గదా యని యుత్తర మిచ్చెను. నిండు వెన్నెలలో గూర్చుండి రుక్మిణి చటుక్కనలేచి ఆవరణమందు గూర్చుండగా సఖి యొకతె ''యేమమ్మా! ఇటకేల వచ్చితి'' వన ''నన్నేమో యీ వెన్నెల యెండవలె మాడ్చుచున్న''

వేసెను. సూదివలె గ్రుచ్చుచున్నదని ఆమె పూలహారమును పార వేసెను. తాంబూలము తన కెలయని తలచి యుమిసెను. ఇట్లనేక మన్మథ బాధల ననుభవించి తుదకు కృష్ణుడు రానందున సహింప జాలక ప్రాణత్యాగ మొనర్ప దలచి మంచము కోడునకు తన జడను జుట్టి ఉద్వనారంభించెను. శ్రీకృష్ణు డా సంగతి దెలిసి అప్పుడే యామెకు దర్శన మొసగుటకు లేనందున నామెకు శుభ మును దెలుపుచు ఆమెయొడమ భుజము, తొడ, కన్ను అదరునట్లు చేసెను. రుక్మిణి యాశుభశకునములను జూచి తాను జేయుచుండిన కార్యమును మాని కృష్ణుడు దయచేసెనేమో యని ద్వారము కడ కేగి జూచి యతనిం గానక "స్వామీ! నామనోబుద్ధులు నీయందు తగిలి యల్లాడుచున్నవి. శరీరము నిలువజాల కున్నది. నిన్ను చూడలేక యుండు నాకు నీకథలే చెవులందు నిండియున్నవి. నిన్నెట్లు మఱువగలను ? కృష్ణా! యని తలచుచు ప్రొద్దుపుచ్చు చున్నాను. నిన్ను సదా తలంచుచుండుటచేత నెచ్చట జూచినను నీవుగనే కనబడుచున్నావు. ప్రత్యక్షముగ మాత్రము రాకున్నావు; నిన్ను కోరువారిని రక్షింతు వని చెప్పినమాట కల్లయేనా ? నేచేసిన సకలపుణ్యకర్మలును నిన్ను భర్తగ పొందుటకేగదా!" అని స్వామి నుద్దేశించి పల్కుచు నాల్గుదారుల జూచుచుండెను. "స్వామీ! నేను నీకు జాబు వ్రాసినది తప్పుగాదు. అది నీతప్పే యగును. కారణ మేమన నీవంతటి యందగాడ వగుటయే. పుత్రవతులై సంసారము సేయుచుండు యువతులు కూడ నీయందు రక్తిచెందు చున్నారు. నీవేణుగానమును విని నీయొద్దకు వచ్చి కోరిన గోపికలకు నీ యంగసంగమిచ్చి వారు గర్వపడగా నదృశ్యుడవై మరల వారు దుఃఖించి పాడగా (గోపికాగీతలు) దర్శనమిచ్చి సంతోషపెట్టితివి. నీవిషయమున వారట్లు అల్లాడుచున్నారు" అని యా రీతిగ చింతించుచు రుక్మిణీదేవి చూచుచుండగా నగరము

నకు ఒక్కొక్క రాజుగ వచ్చుచుండిరి. వారలం గని "రుక్మిణీ కోటి మన్మథ రూపుడగు యదుపతి రాలేదు గదా! తెల్లవారిగదా పెండ్లి? శుభశకునములు తలంచిన కొంతధైర్యము గలుగుచున్నది" అని తలంచుచుండగా బ్రాహ్మణపుంగవుడైన అగ్నిద్యోతనుడు మహా జ్ఞాతగాన ఉత్తమదూతలక్షణముల జాటుచు "వచ్చెను; వచ్చెను; వచ్చె" ననుచు రుక్మిణీ కడకు వచ్చి "అమ్మా! నీకును శ్రీకృష్ణున కును వివాహ మగు"నని చెప్పెను. అపుడామె పరమానందభరి తయై బ్రాహ్మణునకు పారితోషిక మీయదలంచి పాదాది కేశ పర్యంతముగల ఆభరణము లీయనగునా యని యోజించి అతడు గావించిన మహోపకారమునకు ఆ బహుమానము తగదని యెంచి ఇంద్రపదవి, బ్రహ్మపదవి యీయ దలంచెను. ఆపదములును నూరేండ్లకు భ్రష్టమగునవి గనుక మోక్ష మిచ్చుట సమంజస మని భావించెను. కాని మహానుభావుడగు ఆతనికి ఆ స్థానము సొంత ముగ నుండుటను దలంచి నమస్కారముదప్ప అతడు గావించిన మహోపకృతికి సమము లేదని నమ్మి యట్లే ప్రణమిల్లెను.

రుక్మిణీదేవి మంగళస్నాన మాచరించి దివ్యాభరణములు ధరించి పార్వతీపతి నారాధింప బయలుదేరగా కృష్ణుడు వచ్చి రుక్మిణిని అపహరించుకొని పోవునను భయముచేత పెక్కువేల మంది జనులు ఇరుపార్శ్వముల కాపలి యుండిరి. రుక్మిణీదేవి గౌరీవిభుని సన్నిధి కేగి ప్రదక్షిణము, అర్చనము గావించి ఓ ఉమామహేశ్వరులారా! నేను లేఖ వ్రాసితిని. కృష్ణుడు వచ్చెనె సని బ్రాహ్మణుడు చెప్పెను. అత డనృతమాడడు. నన్ను కృతార్థురాలుగ చేయవలయునని ప్రార్థించి వాకిటికి రాగా మరల వాద్యఘోషము లారంభ మాయెను. స్వామి చిన్నవాడగుటచేతనే కర్ణాటకదేశపురాజు చొక్కాజేబులో నణగిపోయి యుండునో యని తలంచి రుక్మిణి రాజుల నెల్లరను పరికించుచు మెల్లగ బోవుచుండెను.

రాజు లెల్లరును తమ్మే రుక్మిణి చూచుచున్నదని భావించి మూర్ఛ నొందిరి. ఆమె కడగంటిచూపుచేతనేగదా రాజుల కెల్లను సకల భాగ్యములు గల్గును; అట్టి యామె స్వామీ! గడువు మీఱునే యని తలచుచు బోవుచుండగా కృష్ణమూర్తి కనబడెను.

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖున్ కంఠీరవేంద్రావలగ్నున్ నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశదేహు నగారాతిగజేంద్రహస్తనిభబాహుం జక్రిఁ బీతాంబరున్ ఘనభూషాన్వితుఁ గంబుకంఠువిజయోత్కంఠున్ జగన్మోహనున్.

— పోతన భాగవతము.

ఇట్టిస్వామిని జూచి రుక్మిణి కుంతలములను సవరించుకొను వ్యాజమున రెండుచేతులతో నంజలిచేసి తన్నంగీకరించుమని తెలుపగా శ్రీకృష్ణమూర్తి ఆమెభావ మెఱింగి వచ్చుచుండెను. ఆతడు రుక్మిణిసమీపమునకు వచ్చునపుడు మెఱుపువంటి ప్రకాశము గలుగగా నెల్లవారును కన్నులు మూసికొనిరి. అంతలోపలనే శ్రీ కృష్ణమూర్తి రుక్మిణి నెత్తుకొనిపోయి రథమునం దుంచుకొని ఆమె మెడపై తనచేయినిడి వేడుకతో ముచ్చటలాడుచు పోవుచుండెను. జరాసంధాదు లపుడు నిలునిలుమని పలుకుచుండగా శ్రీకృష్ణ మూర్తి రుక్మిణీదేవింగాంచి 'భువనసుందరా' యని అంటివిగదా! నాపరాక్రమ మిపుడు చూపుదునా యని యడుగ నామె సమ్మ తించెను. బలరాముఁ డపుడు "కృష్ణా! నీవు భద్రముగ పొమ్ము. నేను వీరితో పోరెద" నని చెప్పి శత్రువులను నాగటితో నీడ్చి రోకటితో కొట్టుచుండెను.

రుక్మి యనువాడు బలరామునితో పోరలేదు. వాడు తన చెలి యలిని తీసికొనిపోవుచున్న కృష్ణునిమీదికి పోయి యుద్ధము చేసి రథ్యములు, సారథి, బాణము లాదిగాగల వానినెల్ల గోల్పోయి రథము డిగ్గి కత్తితో పోర నారంభించెను. స్వామి వాని ఖడ్గ,

తఱిగి అందొక ప్రకాశమానుడైన మగశిశువుండుట జూచి తమకు పైవిచారణకర్త్రిగ నుండు మాయావతి చేతి కిచ్చిరి. మాయావతి యెవరనగా భర్తయగు మన్మథుని వెదకికొనుచు వచ్చిన రతీదేవియే. ఆ రతీదేవి వంటవారిచ్చిన శిశువును పుత్రభావమున పెంచుచుండినను తన కా శిశువునందు మోహము జనించుచుండుట గని యిదేమి విపరీత మని చింతించుచుండగా ఆమె యట్లు పుత్త్రిభావముతో నుండరాదని యెంచి నారదు డచటికి విచ్చేసి ఆ శిశువుయొక్క సకలవృత్తాంతము నెఱింగించి ఇతడు నీభర్తయే యని చెప్పి వెళ్లెను. నారదు డిట్లు చెప్పిపోయిననాటినుండియు రతీదేవి యా బాలుని తనభర్తగ భావించి కొంచెము లజ్జయు, కడగంటిచూపును, సైగలును, నవ్వుటయు ఇత్యాది కార్యముల నారంభించగా వంటవా రామెయెడ సందేహముతో నుండిరి. పిమ్మట ప్రద్యుమ్నుడు యౌవనవంతుడు కాగా నతనిపత్ని మన్మథవిరహాక్రాంతయై తన మనోరథ మీడేర్పు మని యతనిని ప్రార్థించెను. నీవు నన్ను పెంచినందున నిట్లు తలపకు మని యతడు పలుక నారంభించగా పతిభావముతోనే నిన్ను పెంచితిని. ఈ సుమశరునిబాధ సహింప జాలనని యామె ప్రార్థించెను. నీవు నన్ను రక్షించినందున నీకు నాయందు పుత్రభావ ముండవలయును గాని యీ కైవడి తలచుట మర్యాద గాదని ప్రద్యుమ్నుడు బుద్ధిగఱపగా నామె నారదుడు చెప్పిన వృత్తాంత మతని కెఱిగించెను. అటుపిమ్మట మన మీలాగున నుండుట శంబరు డెఱింగెనేని చంపక మానడని ప్రద్యుమ్ను డనగా మాయావతియగు నామె సర్వమాయావినాశిని యను మహామాయయను విద్య నతని కుపదేశించి యతనితో సుఖముగ నుండెను. వంటలవారీసంగతిని శంబరున కెఱిగించిరి. నీటియందు సూదిబొట్టు వేసిన పక్షమున నది జలమంతయు నెట్లావరించునో అట్లే మనము పరమరహస్యమని యెంచి యుండుసంగతి

యును బయలుపడును. రహస్యము, విద్య, కస్తూరివాసన అను నీమూడును దాచియుంచినను దాగవు. శంబరుడు పరిచారకులవలన సంగతిదెలిసి యుద్ధమునకు రాగా ప్రద్యుమ్నుడు పోరాడి కిరీట కుండలములతో క్రింద పడునట్లుగా వాని శిరచ్ఛేదనము గావించెను. ఆ రాక్షసవధానంతరము ప్రద్యుమ్నుడు మాయావతియగు రతిదేవితోడ ఆకాశమార్గమున బోయి తనతల్లియగు రుక్మిణీదేవి మేడమీద దిగెను. అంతఃపురకాంత లతడు కృష్ణు డని భ్రమించి లోపలికి వెళ్లిరి. రుక్మిణికి కూడ సందేహము పొడమునంతలో నామెస్తనములందు పాలూరెను. పిమ్మట స్వామి యతడు తమవాడే యని చెప్పి జరిగిన సంగతినంతయు వివరించెను. దేవకీ వసుదేవులు, బలరామకృష్ణులు, రుక్మిణియును, తక్కిన స్త్రీలును ఆదంపతుల నాలింగనము చేసికొని పరమానందభరితు లైరి. దేవతలును, నారదాదులును భగవంతుని "స్వామీ! నీసంకల్పము కార్యమునకు పిమ్మట తెలియునేగాని ముందుగ తెలియదు. ఇట్టి విలక్షణవిచిత్రసంకల్పము నీది. నీతో మిక్కిలి సంబంధము గల వారికైనను దెలియదు. పంకేరుహాసనాసీనుడైన పరమేష్ఠికిగూడ తెలియదని స్తుతించిరి." కొడుకును, కోడలిని జూచుకొనుచు ఔపాసనాదుల జరుపుకొనుచు రుక్మిణీదేవితోడ కాలము గడపుటకు కృష్ణమూర్తి కోరెనా ? ఎంతమాత్ర మట్లు కోరలేదు. సత్రాజిత్తు స్వామి విషయమున నపచారపడి శ్యమంతకమణితోడ తన కొమార్తె నిచ్చెనని శుకుడు చెప్పగా ఆ సంగతి విశదముగ దెల్పు మని పరీక్షిత్తు కోరెను.

సత్రాజిత్తు సూర్యుని గూర్చి తప మాచరించి శ్యమంతక మణిని బడసెను. ఆ మణి యున్నచోట బంగారము కురియుచుండును. ఆ మణి నతడు కంఠమున గట్టుకొని వచ్చుచుండగా పరిచారకులు కృష్ణునొద్దకు బోయి "స్వామీ! సూర్యుడు నిన్ను

జూడవచ్చుచున్నా" డనగా స్వామి కాదుకాదు; సత్రాజిత్తు సూర్యుని వరము బడసి వచ్చుచున్నాడని స్వామి తెలిపెను. కృష్ణు డొక్క నాడు సత్రాజిత్తు నింటికిబోయి లోకోత్తరవస్తువు లభించెనేని యది రాజుగారి కొసంగవలయును. అట్లగుటచేత దాని నిమ్మని యడుగగా సత్రాజిత్తు "రాజున కిచ్చుటకా నేనింత తప మాచరించినది ? నేను దీని నొసగజాల'' ననెను.

సత్రాజిత్తు తమ్ముడగు ప్రసేను డా శ్యమంతకమణిని కంఠమున ధరించి యశ్వారూఢుడై వేటకు బోగా పళపళమెరయుచుండు మణిని జూచి అది మాంస మని యెంచి సింహ మొకటి పరుగెత్తికొనివచ్చి గుఱ్ఱముతోడ ప్రసేనుని జంపి మణి నెత్తుకొనికొని పోవుచుండెను. జాంబవంతు డా సింహమును జంపి యా మణిని గ్రహించి దానిని తన కుమార్తె వేడుకకై తొట్లయందు గట్టి యుంచెను. సత్రాజిత్తు తనసోదరునితోడ వెళ్లినవారు మాత్రము వచ్చుటయు, నతడు మాత్రము రాకుండుటయు గని యతనిని కృష్ణుడే చంపి మణిని గ్రహించి యుండునని భావించి యెల్లవారితో నా రీతిగ జెప్ప నారంభించెను. పురజను లెల్లరును తమలో నీవిషయమై గుసగుసలాడుకొనుచు స్వామి కెఱింగింపగా కృష్ణు డా యపవాదమును పోగొట్టుకొనదలచి ఆ జనుల తోడనే పోయి గుఱ్ఱము యొక్క జాడయును, దానింజంపిన సింహము యొక్క అడుగులను కనుగొని సింహమే యతనిని జంపినదని యూహించి మఱియును గొంతదూరము పోయి యెలుగుబంటియొక్క కాలి యడుగులను గుర్తించి అదిపోయిన మార్గముననే పురజనులతో పోవగా నాయడుగు లొక గుహయొద్ద నాగిపోయెను. కృష్ణుడా మణిని వెదకుటకు గుహలో ప్రవేశింతము రండని పిలువగా వారు మణి వలదు. మేమీగుహలోనికి చొరబడుటకు వెఱతు మనిరి. శ్రీకృష్ణుడాగుహలో ప్రవేశించి చూడగా నా ప్రదేశమంతయు ధగ

ద్గాయమానముగ వెలుగుచుండెను. జాంబవంతు డచట శ్రీరామ తారకమంత్రమును జపించుచు ధ్యానించుచుండెను. 'ప్రసేనుని జంపిన సింహమును సంహరించి మీతండ్రి యీ మణిని దెచ్చి నీతొట్లకు గట్టెను. దీనిని జూడు'మని పాడుచు దాది తొట్ల నూచు చుండుట గని శ్రీకృష్ణమూర్తి నిస్సంశయముగ ఆ మణిని లాగు కొనగా ఆస్త్రీ హాయని యఱచెను. అందువలన జాంబవంతుని ధ్యానము చెదఱి లేచివచ్చి చూచి భగవన్మాయా మోహితుడై యతడొక తస్కరుడని భావించి యొక్కదెబ్బవేసెను. భక్తకర స్పర్శ మాయెనని భగవంతుడు సంతోషించెను. పిమ్మట భక్తుని యాలింగనముగోరి జాంబవంతునితో ముష్టియుద్ధము నారంభించి యిరువది యెనిమిది దినములు పోరాడెను. కృష్ణునితో వచ్చినవా రాతనియందు ప్రీతిచే పండ్రెండుదినములు వేచియుండి యాతడు రానందున సింహమును జంపిన భల్లూక మగుటచేత దానిచేత నాతడు మడసియుండు నని భావించి యూరికిబోయి కృష్ణుడు మృతు డాయెనని తెలిపిరి. దేవకీవసుదేవులు మొదలగు సర్వ జనులు దుఃఖించుచుండిరి. జాంబవంతు డిరువదియెనిమిది దిన ములు పోరాడి శక్తిహీనుడై తానిక బ్రతుకజాలనని యెంచి—

అంతకాలే చ మామేవ
స్మరన్ ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం
యాతి నాస్త్యత్ర సంశయః ॥

అను భగ. 8అధ్యా. 5శ్లోకమట్లు తన దైవమైన శ్రీరాముని ధ్యానించెను. అట్లు కన్నుమూసి ధ్యానించి కనుదెఱవగా నిరువది యెనిమిది దినములుగ తనతో పోరాడిన కృష్ణమూర్తి రాముడై దర్శన మిచ్చెను. అట్లేల చేసె ననగా—

యే యథా మాం ప్రపద్యన్తే
తాం స్తథైవ భజామ్యహమ్ ।
మమ వర్త్మానువర్తన్తే
మనుష్యాః పార్థ సర్వశః ॥

అను భగ. 4అధ్యా. 11శ్లోకమున నెపరెట్లు ధ్యానించిన నారీతి వత్తునని చెప్పియుండుటచేతనే జాంబవంతుడు తనహృదయమున ధ్యానించి వెలుపలనుండు రాముడా రీతిగనే యున్నాడా లేడాయని పరీక్షించి చూచి అట్లే యుండగా నానందించుచుండెను. ఇట్లు పలుమారు చూచుచుండగా ముందు తనతో పోరాడిన కృష్ణుడై తోచెను. ఇట్లు రాముడు కృష్ణుడై తోచగాజాంబవంతునకేమియుతోచక "స్వామీ ! నా కిపుడంత్యకాలము ప్రాప్తించి యున్నది. ఇట్టి సమయమున పరిహాసము సేయజనదు. నీ నిజరూపము జూపు" మని ప్రార్థించగా స్వామి అతనిం బిలచి ఆ శ్రీరాముడు, దశరథరాముడను నేనే యని చెప్పెను. అటులైన నీ రూపమున నేల వచ్చితి వని జాంబవంతు డడుగగా ఆదేశకాలములు వేఱు; ఇప్పటివి వేఱు.

యదా యదా హి ధర్మస్య
గ్లాని ర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య
తదాత్మానం సృజామ్యహమ్ ॥

భగ. 4అధ్యా. 7శ్లో

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే ॥

భగ. 4అధ్యా. 8శ్లోకములరీతి

నవతరించితిని. నేనే శ్రీరామచంద్రుడను. భేదములేదు. అయి నను నీవా రామునే యారాధించితివి. కాన నీ యిష్టదైవమైన రాముడనై దర్శన మిచ్చితిని. కాన దర్శింపు మని పలికెను. జాంబవంతు డా రాముని సేవించునపుడు ఋశ్యమూకపర్వతమున తమ కతనితో స్నేహము గల్గినది మొదలు శ్రీరామపట్టాభిషేకము వఱకు జరిగిన సకలవిషయములు జ్ఞప్తికి రాగా ఆ శ్రీరాము నుద్దే శించి "సౌమిత్రీ! చాపము నెత్తుమని నీ వనగా సముద్రుడు గడగడ వడకెనుగదా! సేతువును గట్టి లంక కరిగి యుద్ధము చేసితివిగదా! నీవు బాణమును సంధించినది, విడిచినది తెలియ కుండెను గాని తెగి క్రిందపడుచుండిన తలలు మాత్రము కనుపించెను. అట్టి రణశూరుడవు నీవు" అని స్తుతించెను. అట్టి నేనే యిపుడు కృష్ణుడ నైతిని అని చెప్పి స్వామి కృష్ణరూపము ను జూపగా జాంబవంతుడు తన యపచారపరిహారార్థము తన పుత్రికయగు జాంబవతి నిచ్చి వరదక్షిణగా శ్యమంతకమణి నొసంగెను.

శ్రీకృష్ణమూర్తి జాంబవతీసమేతుడై తనకొఱకు దుఃఖించు చున్న సకలప్రాణులకును ఆనందము కల్గునట్లు ద్వారకాపట్టణము నకు బోయి సత్రాజిత్తును పిలిపించి మణిసంగతి నంతయు తెలిపి నేను మణిని, కన్యామణిని దెచ్చితిని. నాకు కన్యామణి చాలును. ఈ మణిని నీవు పుచ్చుకొను మని చెప్పి యతని కా మణి నిచ్చెను. సత్రాజిత్తు మణివృత్తాంత మంతయు తెలిసికొని తా జేసిన యప రాధమునకు సిగ్గుపడి లక్ష్మీపతిగాన నతని కేమిచ్చుటకును దోచక యెవరికేది కావలయునో దానినే యిచ్చుట మంచిదని తలంచి తనకూతురగు సత్యభామను, శ్యమంతకమణి నిచ్చెను. కృష్ణ మూర్తి సత్యభామను గైకొని సత్రాజిత్తు నుద్దేశించి నీవీమణి నీయ నని చెప్పియుంటివి. అంతేగాక నామీద నిందమోపితివి. అట్ల గుటచే నాకీ మణివలదు. రమణీమణియే చాలునని ప్రియ వాక్య ములతో చెప్పి మణి నాతనికే యిచ్చివేసెను.

పాండవులు కుంతీదేవితోడ లక్కయింట దగ్ధమైనారని విని సకల మెఱింగిన వాడయ్యును, లీలార్థము ధృతరాష్ట్రుని పరామర్శించుటకై బలరామునితోడ హస్తినాపురి కేగెను. హరి యూరిలో లేనిసమయమున నక్రూరుడును, కృతవర్మయును శతధన్వుని సత్రాజిత్తుమీది కంపగా వాడు రాత్రిసమయమున వచ్చి అంతఃపురము ప్రవేశించి స్త్రీలెల్లరు హా యని మొరలిడుచున్నను కనికరములేక సత్రాజిత్తును జంపి శ్యమంతకమణి నెత్తుకొనిపోయెను. సత్యభామ తండ్రిమరణము నెఱింగి హస్తినాపురి కరిగి జరిగినసంగతి భర్తకు దెలుపగా హరి లీలార్థమై సత్రాజిన్మరణమునకు చింతించెను. సత్యభామయు, బలరాముడును ఏడ్చిరి. పిమ్మట వారు ద్వారక చేరిరి. బలరామకృష్ణులు వారణావతమున లాక్షాగృహాపదనుండి విముక్తులైన పాండవుల వివాహమునకు బోయియుండి మరల స్వస్థానము చేరిరి. సత్యభామచేత పురికొల్పబడిన కృష్ణమూర్తి శ్యమంతకమణిని గ్రహించుటకొరకు తనమీదికి వచ్చుచున్నాడని శతధన్వుడు తెలిసికొని అక్రూర కృతవర్మల కడకేగి తనకు సాయముగ రండని కోరగా వారు పరమాత్ముడగు కృష్ణమూర్తికి విరుద్ధముగ వర్తింపమనిరి. ఇంతలో కృష్ణమూర్తి తనపైకి వచ్చుటగని శతధన్వు డా మణిని అక్రూరుని కడ దాచి యుంచి నూరుయోజనము లొక్కదినమున పరువిడు గుఱ్ఱమునెక్కి పారిపోవ నారంభించెను. స్వామియు వానిని దఱుమగా అతని గుఱ్ఱము నడువలేక పడిపోయెను. అయినను వాడు నిలువక పరుగెత్తగా స్వామియు తరుముచుబోయి చక్రాయుధముతో నాతని తలను ఖండించి వానివస్త్రములను పరీక్షించి మణినిగానక బలరాముని కా సంగతి చెప్పెను. తన కా మణిని సంపాదించి యిమ్మని యడిగియుండిన బలరాముడు కృష్ణుడు తన్ను వంచించి ఆ మణిని తన భార్య కీయ దలంచెనని భావించి, వానికి భార్య పెద్దయయ్యె

నని తలంచి అతనితో పోవుట కిష్టములేక కృష్ణునెడ నపచారపడి- నేను మిథిలకు బోయెద నని చెప్పి వెళ్లెను. వీరివిరోధము నెఱింగి దుర్యోధను డచటికి వచ్చి బలరామునితో స్నేహముచేసి యాతని కడ గదాయుద్ధవిద్య సొంతము గ్రహించెను. మణి చిక్కలేదని సత్యభామ కెఱిగింపగా నామె యలిగిపోయెను. శతధన్వుడు శ్యమంతకమణి నపహరించుటకు తామే కారణభూతు లగుటచే నక్రూరుడును, కృతవర్మయు భీతులై ఊరు విడిచి వెళ్లగా వర్షమభావమై మారికాదులు సంభవించెను. అక్రూరుని రప్పించిన పక్షమున నీసర్వబాధలు నివర్తించునని పౌరులు శ్రీకృష్ణుని కెఱిగింపగా నత డట్లగుటకు కారణ మేమనెను? కాశీరాజు తనయూర వర్షమభావ మగుటచేత శ్వఫల్కుని రావించి కాందిని నొసంగి వివాహము సేయగా నాదేశమున వర్షము గురిసెను. అక్రూరుడు అట్టివాని పుత్రుడని వా రెరిగించిరి. స్వామి అక్రూరుని, బలరాముని బిలిపించి మంచిమాటలాడి 'నీవద్ద మణియున్నది. దానిం జూపు' మని యడుగ నక్రూరు డామణిని జూపెను. కృష్ణు డీ మాడ్కి తన యపవాదము బోగొట్టుకొనగా బలరాముని మోము చిన్నవోయెను. సాత్యకి బంధుమిత్రులతోడ కృష్ణదర్శనార్థము వచ్చెను. కృష్ణమూర్తి కుశలముగ నున్న పాండవుల జూడగోరి సాత్యకి ప్రముఖులతోడ నచటి కరిగి యొక్కనా డర్జునుని తోడ యమునాతీరమునకు బోగా నదీతరంగములు స్వామి పాదమును దట్టెను. ఇదేటులుండె ననగా "స్వామీ! గంగను నాకు సఖిగా చేసితివి. ఇంక నెవరి నైనను అట్లు చేసితివా యని యమున యడిగిన ట్లుండెను. అత డా ప్రదేశమున నొక్కయువతి తప మాచరించుచు వసించుట గని యామె యెవతెయో తెలిసికొని రమ్మని కృష్ణు డర్జునుని బంపగా నత డామెవద్దకరిగి యామెసంగతి విచారించెను. అపు డామె తాను సూర్యుని పుత్రిక కాళింది ననియు, భగవంతుని

వివాహమాడగోరి తపముసల్పుచున్నా ననియు, అతడు భర్త కాడేని యీ జన్మమున వివాహమే వలదనియు, అనాథబాంధవుడను పేరు గల్గియుండు వాడు రక్షింపకున్న నిక నాపేరాతని కనవసరమే యనియు చెప్పగా అర్జును డా మాటలెల్ల కృష్ణునికి చెప్పెను. (నీదశ యిట్లున్నది. నీ కనేకభార్యలు లభించుట కాశ్చర్యముగ నున్నదని పార్థు డనగా మీ రనేకు లొక్క తెను వివాహమాడుటయు నా కాశ్చర్యముగ నున్నదని వాసుదేవు డనెను). పిమ్మట కృష్ణు డా కాళిందిని రథమున నిడుకొని యింద్రప్రస్థమునకు వచ్చి చేరెను. పాండవులు కోరినందున హరి మయునిచేత నింద్రప్రస్థము నలంకరింపజేసెను. కృష్ణార్జును లొక్కనా డగ్నిదేవుడు కోరగా నాతని కోర్కెప్రకారము ఖాండవము నతని కాహారముగ నిచ్చి దహింపచేసిరి. కృష్ణు డట్లు మేలుచేయుచుండి వారియనుమతి వడసి కాళిందీసహితుడై సాత్యకి ప్రముఖులచేత ద్వారక కేతెంచి శుభనక్షత్రాదియోగయుక్తమైన దివ్యముహూర్తమున నెల్లవారి కానంద మగునట్లు కాళిందిని పరిణయ మాయెను. వసుదేవుని చెలియలగు రాజాధిదేవి కూతురు మిత్రవింద. ఆ మిత్రవింద తనస్వయంవరమునకు వచ్చియున్న కృష్ణునిజూచి మోహించి యతని కంఠమున పుష్పమాలను సమర్పింపబోవగా దుర్యోధనుని స్నేహితులు విందానువిందాదులు తమ చెలియలి నడ్డగించి భూమీశుడు గాని యీతని వరింప దగదనిరి. శ్రీకృష్ణు డపుడు రాజులందరు చూచుచుండగా మిత్రవిందను బలాత్కారముగ గొనిపోయి రథమున గూర్చుండబెట్టుకొని తన్నెదిరించిన శత్రువులను లక్ష్యము సేయక ద్వారకకు బోయి యామెను పెండ్లాడెను. కోసలదేశాధిపతియగు నగ్నజిత్తు కూతురు నాగ్నజితి లేక సత్య. వాడికొమ్ములు గలిగి వీరులు చెంత జేరిన కాలుద్రవ్వుచు అతిమదమత్తంబులై యుండు నేడు వృష

భంబులను పట్టినవానికి తనపుత్రిక నిచ్చునట్లు ఆరాజు ప్రతిన బట్టగా నెల్లరాజులును ప్రయత్నించి వానిచేత దెబ్బలుతిని పోయిరి. కృష్ణు డా సంగతి నెఱిగి ఆరాజు చెంతకేగి తన కా కన్య నిమ్మని యడుగగా నతడు నీయంతటివాడు నాయల్లుడగుట పరమసంతోషమే. అయినను నేను ప్రతినవట్టి యుండుటచేత నీసప్తవృషభముల జయించి యా కన్యను గైకొను మనెను. నీవు కోరున దింతేనా ? లేక యింకేమైన నడుగుదువా ? యని కృష్ణు డనగా నగ్నజిత్తు నీవా బలీవర్దంబులను జయించి కన్య నెత్తుకొని పోవచ్చునని దృఢముగ జెప్పెను. శ్రీకృష్ణు డపుడే దట్టికట్టి వానియం దొక్క దానిని పట్టబోగా మిగిలిన యాబోతులు తన్న వచ్చెను. స్వామి ఆయేడువృషభము ల కేడురూపములుగ గాన్పించి వాని నొక్కటిగ బట్టి యీడ్చి తన్నగా నా గోవృషభములు రాక్షసులుగ మాఱెను. నగ్నజిత్తు మిక్కిలి యాశ్చర్యమనస్కుడై "ఇతరు లొక్కవృషభమును పట్టి కట్టజాలకుండగా నీత డేడింటిని పట్టికట్టెను. ఏమిచిత్ర మేమిచిత్రము ? ఇట్టి పురుషు డెందు గలడు ? నాపట్టి భాగ్యమె గాని యన్యంబుగాదు'' అని తలచి శ్రీకృష్ణమూర్తి కా సత్య నిచ్చి వివాహము గావించెను. అటుపిమ్మట శ్రీకృష్ణుడు తన మేనత్త యగు శ్రుతకీర్తికూతురు భద్రను ఆమెయన్నలగు సుదర్శనాది కేకయేశ్వరు లొసంగగా గైకొని పరిణయ మాడెను. మద్రదేశ రాజపుత్రికయును, సర్వలక్షణలక్షితయు నగు లక్షణయను కన్యను కృష్ణుడు స్వయంవరమున నందరిని గెల్చి గైకొనెను. మద్రదేశపు రాజొక్క యంత్రము నాకాశమున గట్టి దానిని మరుగుపరచి దాని ఛాయనొక్కచోట పడునట్లు చేసి యుంచి ఆ ఛాయనుగూడ కన్నులారచూడక నీటియందుచూచి కొట్టునట్లును, అట్టివానికే తన కూతు నిచ్చునట్లును శపథము గావించెను. ఎవ్వరికి చేతగాని యాకార్యమును కృష్ణమూర్తి చేసి గరుడుడు అమృతమును గ్రహించునట్లు

ఆకన్యను గైకొనెను. భగవంతుని వాహనమునకే అంతటిశక్తి యుండగా భగవంతునికుండు టాశ్చర్యమా ? రుక్మిణీ మొదలగు కృష్ణునియొక్క భార్యలు అష్టపట్టమహిషులు అనబడుదురు అని శుకు డెఱిగింపగా నటుపిమ్మట సంగతేమని పరీక్షిత్తు అడిగెను. (పలుమారు మేళతాళముల తోడ పెండ్లియాడుట శ్రమముగ నున్నదని దలచి) కృష్ణమూర్తి నరకాసురునిజంపి యాతని యంతఃపురమున నుండిన పదియారువేలస్త్రీలను పెండ్లాడె నని శుకు డెఱిగించెను.

## నరకాసుర వధము

శ్రీకృష్ణమూర్తి నరకాసురునివధించి వానియంతఃపురమం దుండిన పదునాఱువేల నూర్గురుస్త్రీలను పరిణయ మాడెనని శుకు డెఱింగింపగా నరకాసురుడు బలశాలి, అట్టివాడు తెచ్చిన స్త్రీలను కృష్ణు డెట్లు పెండ్లాడెను ? ఆ సంగతి విశదముగ జెప్పుమని పరీక్షిత్తడిగెను. శుకు డందులకు "రాజా! వినుము. నరకాసురుడు కడు సమర్థుడు; బలపరాక్రమములు గలవాడు. బ్రహ్మదేవునొద్ద వరములు పడసినవాడు. ఇట్టివాడు తన పరాక్రమమున నెల్ల దేవతలను జయించి వారిస్థానము లాక్రమించుకొని యేలుచుండెను."

పూర్వము భగవంతుడు వరాహమూర్తియై నీట మునిగి యుండిన భూమిని పైకి తేగా నా భూదేవి భగవంతుడు తన భర్త యగుటచేత నాతనిని గలియుటకు కోరెను. ఇది ప్రదోషసమయ మగుటచేత వలదని భగవంతు డామెకు బోధించెనుగాని యా బోధ వ్యర్థ మాయెను. అపుడు భూదేవికి జన్మించినవాడే నరకాసురుడు. నిషిద్ధకాలమున జన్మించినవారు దుష్టు లగుదురని చూపుటకే భగవంతు డీకార్య మొనర్చెను. నరకాసురుడు లోకభయంకరుడై ప్రాగ్జ్యోతిష పట్టణ మేలుచు తన పరాక్రమమున నష్టదిక్పాలకుల జయించి వరుణుని గొడుగును, మహామేరు పర్వతములో మణిశైల

మందున్న దేవేంద్రుని స్వర్ణరత్నమయమైన భవనమును, అదితి యొక్క కర్ణకుండలములను అపహరించెను. భూమికొడుకగుటచేత నరకాసురునికి భౌము డనియు పేరుగలదు. ఈ యసురునిభీతిచేత నిందుడు మున్నగువారు పారిపోయి అడవులలోను, పర్వత గుహలలోను దాగియుండిరి. కొంతకాలమట్లు ఒకరినొకరు తెలిసి కొనజాలకుండి పిమ్మట వా రెల్లరును పరస్పరము వెదకికొని ఒక్క టిగ గుమిగూడి తమదుర్గతికై చింతించి—

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

అను భగ. 4అధ్యా. 8శ్లోకమట్లు

అవతరించిన శ్రీకృష్ణపరమాత్మ నాశ్రయించి తమకార్యము సాధించుకొనవలయునని నిశ్చయించుకొని అట్టిఘనుని సన్నిధికి పోవునపుడు పురుషకారిగ నుండుటకై నారదుని తమవెంట పిలుచు కొనిపోవ నెంచి స్మరించగా నాతడు వచ్చెను. ఇంద్రాదులు నారదునితో తమసంకటము నెఱింగించగా నతడు "దేవతలారా, అసురులకు సుఖము గలిగెనేని అది బహుకాల ముండదు. మీరు సత్పురుషు లగుటచేత మీకష్టము చాలకాలము నిలిచియుండదు. మీరు కోరినట్లు ద్వారకకు రండి" అనిచెప్పి వారిని పిలుచుకొని పోయి ద్వారకానాథు నింటివాకిట నిలువబెట్టి తాను ముందుగ స్వామిదర్శనార్థము లోని కరిగెను.

కృష్ణమూర్తి నారదుని గాంచి పరమానందభరితుడై 'రమ్ము రమ్మ'ని పిలిచెను. నన్నుజూచిన నీ కేల యింతసంతోషమని నారదు డడుగగా కృష్ణస్వామి ఆసంతోషము నాపుటకు తనగర్భము చాలలే దనెను. నీకడుపు చిన్నదిగాదే యని నారదు డడుగగా మహాప్రళయకాలమున చరాచర ప్రపంచమును కడుపున బెట్టు కొని శ్రీరంగమున నేకాదశికి వచ్చిన జనులు చోటులేక యల్లాడు

నట్లుగాక) ఆ ప్రాణులను విశాలమైన స్థలమున నుంచి సుఖముగ కాపాడునంతటి విశాలగర్భము గలవాడనైనను నిన్ను జూచుటచేత గలిగిన సంతోషము నాపుటకు నాగర్భమున స్థలముచాల లేదని శ్రీకృష్ణు డుత్తర మిచ్చెను. హీనస్థితియందుండు దేవేంద్రాదులు నిన్ను దర్శింపగోరి నాతోడవచ్చి తలవాకిట వేచియున్నారు. వారికి దర్శన మీయవలయునని నారదు డెఱిగించగా స్వామి దేవేంద్రాదులను బిలిచి మీ సంగతి యేమని యడిగెను. ఇంద్రుడు చెప్పలేక యేడ్వనారంభించగా స్వామివారు సంగతితెలుపు మని నారదునడిగి యతనివలన నరకాసురుని కథ యంతయు నాలకించి "కర్మానుసారముగ మీరు కష్టముల ననుభవింపవలసినదే" యని చెప్పెను. దేవేంద్రుదు లాపలుకు లాలించి "స్వామీ! నారదుని ముందుంచుకొనివచ్చి త్వమేవ శరణమ్మని విన్నవించితిమి. భయ పడకుడని యభయ మీయక నీవే యిట్లు పలుక నగునా? కఠినా త్ములుగదా అట్లు పలుకవలయును. నీవు కరుణాకరుడవుగదా! మేము, నారదుడు హాహా హూహూ గంధర్వులు మున్నగువారితో గూడి సదా నిన్ను పాడుచుండువారముగదా!" యని విన్నవించగా కృష్ణమూర్తి "దేవతలారా! అనన్యభావముతో నన్నాశ్రయించిన పిమ్మట మీకా చింత వలదు.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥

అను భగ. 9అధ్యా. 22శ్లోకమట్లు

ఆచింత నాదే. మీరు భయపడకు"డని చెప్పి నారదునితోడ వారికి విందొసగి రేపటిదినమే నరకాసురవధ మని చెప్పి వారిని బంపెను. దేవత లపుడు స్వామియింటినుండి బయలుదేరిరి. ఆకాశమున జేరి జరుగబోవు కార్యమును జూచుటకై వేచియుండిరి. కృష్ణమూర్తి తన అష్టభార్యలతో జెప్పి పోదలచెను. గాని ప్రొద్దులేమిచే సత్య

భామతో మాత్రము చెప్పి వెడలదలచి ఆమెగృహమున కేగి తన పయన మామె కెఱింగించెను. ఆమె తానుగూడ వచ్చెద నని కోరెను. యుద్ధమున వేడుక లేమియు నుండవని స్వామి పలికెను. "ఆ సంగతి తెలియును. నీ ప్రతాపము నెఱుగను. నన్ను బిలుచు కొనిపోయినయెడల మరలివచ్చిన తరువాత నా సవతులకు నీపరా క్రమమును దెలుపుదు" నని సత్యభామ పలికెను. "అటులేని మరొకభార్యను బిలుచుకొనిపోయెద" నని స్వామి పలుకగా ఆమె "స్వామీ! నాకు కొంచెము సామర్థ్య ముండుటచేత నేనాస్థలమునకు రాగల" నని విన్నవించెను. కృష్ణు డపుడు యుద్ధమన్న వేడుక గాదు, వనవిహారము గాదు, మదించిన తేనెటీగల ఝంకారము గాదు, మదపుటేనుగుల ఘీంకారమునుమా! మారుతముతోగూడి వచ్చు పద్మవనపరాగరేణువులు కావు. శూరులు వచ్చునపుడు వారి గుఱ్ఱముల కాలిక్రింది ధూళి రేగును. గాలిచేత కొట్టబడి వచ్చు నీటితుంపరలు గావు. బాణములు వచ్చి పడును. కలహంస సారస కాసారములుగావు. శత్రుసైన్యముల జూడవలసియుండును. సౌగంధికములు, తామరలు కానబడవు. ఖడ్గశూలాద్యాయుధములు కనబడును. అందువలన కన్యవు నీ వెక్కడ? యుద్ధ మెక్కడ? అని తెలుపగా సత్యభామ "స్వామీ! నినుబాసి యుండజాల" ననెను. "త్వరలో వచ్చెద" నని స్వామి చెప్పెను. కాని ఆమె "స్వామీ! నీ వెక్కడ? యుద్ధ మెక్కడ? అని చెప్పినమాటను జ్ఞాపకముంచుకొనుము. నేను నిత్యము పైదెలిపినవేడుకలు చూచు చుండుటచేత నెన్నడును జూడని ఆయుద్ధమునే చూడగోరు చున్నాను" అని చెప్పి నమస్కరించి యతనిని ప్రార్థించెను.

ఆశ్వయుజ కృష్ణపక్షత్రయోదశినాటి రాత్రి దేవాదులకు విందుపెట్టి చంద్రోదయము కాగా రాక్షసుని జంపుట కెన్ని దినము లగునో యని అభ్యంగనస్నాన మాచరించి శుచికై నూతనవస్త్రములు

ధరించి చతుర్దశినాడు శ్రీకృష్ణమూర్తి సత్యభామాసమేతముగ గరుడారూఢుడై ప్రాగ్జ్యోతిష పురమున కరిగెను. శత్రువుల కభేద్యమైన నరకాసురునియొక్క ఆరుకోటలను భార్యకు జూపి "యిట్టి స్థల మెఁగుటచేతనే నిన్ను రావలదంటి" ననెను. అందు కామె "నన్ను రావలదనినమాటజ్ఞాపకముంచుకొను డంటినిగదా" యనెను. భగవదభిప్రాయానుసారముగ గరుత్మంతుడు మొదటిదగు పర్వతపుకోటకు ప్రదక్షిణముగ రాగా స్వామియు ఆకొండను తన గదతో తాకుచు వెళ్లెను. ఆరాతికోట పొడిపొడి యాయెను. శ్రీకృష్ణు డీరీతిగనే ఆయుధములకోటను తన బాణప్రయోగముచేతను, వాయు జలాగ్ని దుర్గములను తన దివ్యచక్రము తోడను నాశనము గావించి నరకాసురునిమంత్రియగు మురాసురుని బుద్ధిచేత నిర్మింపబడిన దారములకోటను తన నందక మను ఖడ్గముతో కోసి లోపల ప్రవేశించి తనరాకను శాత్రవు లెఱిగి భీతిచెందునట్లు పాంచజన్యమును పూరించి అచ్చట నుండిన యొకప్రాకారము ను గదాస్పర్శచేత పాడుచేసెను. (నారదుడా! దేవతలారా! సత్యభామా! జరిగిన కార్యము గమనించితిరా యని స్వామి పలికెను.) నరకాసురునికి కావలికాడై అయిదుతలలు, పదిచేతులుగలిగి అర్ధరావణుడై యుండిన మురాసురు డీ సంగతి దెలిసి ఆరుకోటలను దాటివచ్చినవాడు సామాన్యుడు గాడని తలంచి శూలాయుధము నెత్తుకొని ప్రళయకాలసూర్యుడో, అగ్నియో యని తోచునట్లుండి మహావిషముగల పాము గరుడునొద్దకు వచ్చునట్లు కృష్ణమూర్తి యొద్దకు వచ్చెను. అట్లువచ్చి స్వామిని జూచి "ఈతడు రథములేక, సైన్యములు లేక, పక్షివాహనుడై భార్యతో సవిలాసముగ వచ్చినాడు. పిన్నవాడు, బుద్ధిలేనివాడు. వీని సనాయాసముగ జంపవచ్చు" నని తలంచి గరుడునిమీద శూలాయుధమును వేసెను. గరుడు డాశూలమును విధ్వంసము గావించుటకు శక్తుడై యుండియు తన రక్షణభారము

యజమానుని దగుటచేత నూరకుండెను. కృష్ణభగవాను డపుడొక బాణమును వేయగా మురాసురుని శూలము తునుక లాయెను. మురాసురునిచేత బాధపడుచుండు దేవతలయొక్క మనశ్శూల ములు సైతము వీడిపడెను. మురాసురుడపుడు గదను విసరగా స్వామి ఊరక చూచుచుండి తనసమీపమునకు రాగానే తన గదతో దానిని వేయి తునియలు గావించెను. ఆ యసురుడు నిరాయు ధుడై చేతు లెత్తికొనిరాగా స్వామి వానిపంచశిరములను చక్రముతో నవలీలగా ద్రుంచెను. (శ్రీకృష్ణుడపుడు ప్రక్కనున్న భార్యను పైనున్ననారదాదులను జూచెను.) పరమశివుని వరమువలన నైదుశిరస్సులు, పదిచేతులు వడసిన మురాసురుని జంపినందుకు కొందరు జ్ఞానులు స్వామిని స్తుతించిరి. పదితల లిరువదిచేతులను గలిగియుండిన రావణుని సంహరించిన స్వామికి వీనిని జంపుటొక మహాకార్యము గాదని మరికొందరు జ్ఞాను లనిరి.

నరకాసురు డీసంగతి విని మురాసురుని యేడ్వురు పుత్రు లను, పీఠుడను సేనాపతిని బంపగా తండ్రిని జంపినాడను క్రోధ ముతో సుద్రిక్తులైన మురసూనులు పీఠునితోడ వచ్చి యుద్ధ మొనర్చి శ్రీకృష్ణునిచేత నాశ మొందిరి. శ్రీకృష్ణభగవాను డపుడు రాహువువిడిచిన చంద్రునియట్లు ప్రకాశించెను. ఈ సంగతి దెలిసి నరకాసురుడు పెక్కువేల యేనుగులతో వచ్చి గరుడవాహనుడై దివ్య భూషణాలంకృతుడై భార్యాసమేతుడై పెండ్లికుమారునియట్లుండిన శ్రీకృష్ణమూర్తిని జూచి నాయూరుదుర్గములను, మురాసురుని,వాని పుత్రులను,పీఠుని నాశముగావించినవాడువీడుకాడనితలంచి(ఓయత్త గారింటియల్లుడా) యిన్నికార్యములు గావించిన శూరు డెవడో వానిం దెల్పుమని యడిగెను. స్వామి యందులకు నేనే ఆఘనుడ నని చెప్పగా "నూతనవస్త్రములు ధరించి చందనాదు లలదికొని అత్త గారింటికి వచ్చినట్లు వచ్చితివి. ఇచ్చట నరకాసురు డుండుసంగతి

నెఱుగవా'' యని యడిగెను. శ్రీకృష్ణు డపుడు సత్యభామం గాంచి "కాంతామణీ ! వీ డిదివరకు వచ్చినవారివంటివాడుకాడు. జగత్తును జయించిన శూరుడు. ఇట్టి వీనిని జూచితివిగదా ! రావల దనిన నామాటను బాటింపక వచ్చితివిగదా !" యనెను. సత్యభామ తన పతిని జూచి "నాథా ! అడుగడుగున కీరీతి సనవలదు. మీరు కొంచెము శ్రమదీర్చుకొను'' డని చెప్పెను. "నే నూరకుండిన నీవేమిచేసెద'' వని స్వామి యడుగగా నామె 'చూచుచుండు' డని చెప్పి యాశ్చర్యకరముగ ధనువు నందుకొని వంచి యల్లెత్రాటి నిడ్చి బాణములు వేయ దొడగెను. అపు డామెచేతిగాజులధ్వనియు, ఈధనుష్టంకారమును చేరి స్వామికి పాటగా తోచెను. సత్యభామ కపుడు భయము, శ్రమము, చెమ్మటలు గలిగెనో యని స్వామి చూడగా నతని కామెముఖము వజ్రాలకమ్మల కాంతులతో గూడి యుండి చంద్రబింబముగ గాన్పించెను. ప్రకాశించుచుండిన ఆమె కడగంటిచూపు బాణజ్వాలల నణచుచుండెను.

సత్యభామ మరిమరి బాణములను వేయుచుండినను ఆమె యెత్తునది వేయునది స్వామి కగోచరముగ నుండెను. ఆమెవేసిన బాణములధ్వని యెదిరిశబ్దముల నణచెను. వీరశృంగారభయరౌద్ర విస్మయములు గలసి భామిని యయ్యోనేగాని పంచభూతములచేరిక చేత కాదని స్వామికి తోచెను. శ్రీకృష్ణమూర్తి సత్యభామగావించిన యుద్ధమునకు మెచ్చుకొని ఆమె నుద్దేశించి "నీవే యీ యసురుని జంప శక్తిగలదానవైనను నేను దుష్టశిక్షణార్థమై యవతరించి యుండుటచేత నీ విక విశ్రాంతిగొనుమని చెప్పి తాను విల్లందు కొనియెను. పిమ్మట గరుడుడు నరకాసురుని యేనుగులను ముక్కుతో బొడిచి, రెక్కలతో గొట్టి, గోళ్లతోజీల్చి చంపివేయగా నా యసురుని గజ మొక్కటిమాత్రము నిల్చియుండెను. నరకాసురుడు ముందుగ గరుడుని నాశ మొనర్చుట కర్తవ్య మని తన శక్త్యాయుధమును ప్రయోగింపగా నా పక్షిరాజునుమంతైన క్షీతిలేక కదలకుండెను.

నరకాసురుడు తా నలక్ష్యముచేసిన పక్షియొక్క, పడతియొక్క సామర్థ్యములు దెలిసికొని అనేకులహృదయముల శూలము గుచ్చుకొనునట్లు స్వామిమీద శూలము ప్రయోగించెను. దానికి బదులుగా కృష్ణమూర్తి చక్రాయుధమును ప్రయోగించి నరకునిశూలమును, గజమును, కిరీటకుండలములతోగూడిన వానిశిరమును ఏకకాలమున క్రిందబడవేసెను. ఋషు లెల్ల రత్యాశ్చర్య మనిరి. హాహాకారములు చెలరేగెను. దేవతలెల్ల కృతార్థులమైతిమని పలికి స్వామిశిరమున పుష్పవృష్టి గురియించిరి. భూదేవి నరకు డపహరించియుండిన అదితియొక్క కుండలములను, వరుణునిఛత్రమును, ఇంద్రుని మణిపర్వతమందలి మందిరమును స్వామికి సమర్పించి అంతియగాక నరకాసురునియొద్దనుండిన వైజయంతిమాల నాతని కంఠమునవేసి సూర్యునివలె ప్రకాశించునట్టి మణి నిచ్చి నరకాసురుని పుత్రుడగు భగదత్తుడను వానిని స్వామిపాదములపై బడవేసి నా మనుమడగు వీనిని రక్షింపు మని ప్రార్థించెను. శ్రీకృష్ణమూర్తి నాకుగూడ వీడు మనుమడే యని చెప్పి భగదత్తునితో పట్టణమున ప్రవేశించి స్వహస్తముతో శుభముహూర్తమున వానికి పట్టము గట్టెను. మనుమని పట్టాభిషేకమును, పెద్దభార్యయగు భూదేవిని, సత్యభామసామర్థ్యమును జూచుటచేత కృష్ణమూర్తి సంతోషము గలవాడై యచ్చటచ్చట గల విశేషముల నెల్లను జూచుచు పోయి అంతఃపురమున నుండిన పదునారువేల నూర్గురు రాజకన్యలను గాంచి వారిభావ మెఱింగి వారినెల్ల పల్లకులందు గూర్చుండబెట్టి వారితోడ నచ్చటి ధనాగారములందుండిన రత్నములు మొదలగు నపరిమిత ధనమును బండ్లు బండ్లుగ గూర్చి ద్వారకకు బంపెను. ఎంతధనమునెత్తుకొని పోయినను అచ్చటి ధనాగారములలో ధనము తఱుగలేదు.

శ్రీకృష్ణు డపుడు మనుమని జూచుకొనుచుండు మని భూదేవి కాజ్ఞ నొసగి సత్యభామతో స్వర్గమున కేగి అదితినిజూచి "అమ్మా!

(వామనావతారమున నాకు తల్లివై యుండినదానా!) నేనా పాపిని జంపి నీకుండలముల దెచ్చితిని. వీనిని ధరింపుమా యని పలికి యామెకు నమస్కరించి అటనుండి నందనవనమున కరిగి యచటి వినోదములను సత్యభామకు జూపగా నామె పారిజాతవృక్షము కావలెనని కోరెను. ఈ వృక్ష మింద్రునకే యుండ నిమ్మని స్వామి చెప్పగా నామె చెట్టును గైకొనక తానాస్థలమును విడిచి రానని పట్టుపట్టెను. కృష్ణమూర్తి యా వృక్షమును భార్య కీయగా నింద్రుడు స్వామిమీదికి యుద్ధమునకు వచ్చెను. హరి యపుడు "ఇంద్రా! యింతలోనే నీస్థితిని మఱచితివా" యని హెచ్చరించి గరుడున కాజ్ఞ నొసంగగా వినతాసుతు డపుడు వారినెల్లర నోడించెను. శ్రీకృష్ణమూర్తి యింద్రునిభవనమును, వరుణునిఛత్రమును వారి కిచ్చి సత్యభామాసమేతుడై ద్వారకకు వచ్చి చేరి పదునారు వేలనూర్వురు రాజకాంతలకు వేర్వేరుగ నిండ్లు గట్టించి వారి నందునిచి గర్గాచార్యుని ఒకపెండ్లిముహూర్తము చూడు మని చెప్పెను. ఇందరు స్త్రీల నెన్ని దినములకు వివాహమాడబోయెద వని ఆచార్యు డడుగగా మీకా యోజనయేల? యని చెప్పి శ్రీకృష్ణమూర్తి పెక్కురూపములు ధరించి ఒక్కముహూర్తముననే పదునారువేల నూర్వురు వెలదులకు మాంగల్యధారణము గావించి నేను అందమైనదాన నగుటచేత స్వామి నాకే బొట్టుగట్టెనని ప్రతి వనితయు తలచునట్లు చేసెను.

ఇట్లు శ్రీకృష్ణమూర్తి రాచకన్నియ లందఱను పెండ్లాడెను. ఆశ్వయుజబహుళపక్షత్రయోదశీచతుర్దశీ దినములను కొనియాడు వారు దారిద్ర్యముచేత పట్టువడరు. చంద్రోదయము కాగా స్నానమాచరించి నూతనవస్త్రములను ధరించి బంధువర్గముతోడ విందారగించవలయును. భగవంతుడు స్నాన మాచరించి నూతనవస్త్రములను ధరించెను:గాన మనము నట్లే చేయవలయును. అతడు బాణములు వేసినట్లు మనమును రెండుటపాసులు కాల్చవలెను.

## ఉషాపరిణయము

కాశీదేశాధిపతియగు పౌండ్రకు డనువాడు లోకోద్ధరణార్థ మవతరించిన వాసుదేవుడు తానే యనియు, వాసుదేవుడని శ్రీకృష్ణు డుంచుకొనియుండు మిథ్యాభిధానమును తోడనే విడిచివేయవలె ననియు శ్రీకృష్ణభగవానునికి వర్తమాన మంపెను శ్రీకృష్ణుడా సంగతి నాలకించి కొందరు నన్ను భక్తి సేయుదురు. మఱికొందరు చేయరు. కొందరు నాకును, మఱికొందరు నాభక్తులకును అపరాధ ములను గావింతురు. కాని వీనియట్లెవరును నేనే వాసుదేవుడ నని పలుకలేదు. వీనిమద మణచవలెనని తలచి కాశికిపోగా నా పౌండ్రక వాసుదేవు డనేకభంగుల యుద్ధము గావించెను. కడపట శ్రీకృష్ణమూర్తి బాణప్రయోగముచే గాలిచేత నాళమునుండి తెగి దూరముగ కొట్టుకొని పోయి పడిన తామరపుష్పము వలె వానిశిర మును ఖండించి దూరముగ పడునట్లు చేసి ద్వారకకు వచ్చి చేరెను. గతించినవానిపుత్రుడు సుదక్షిణు డనువాడు భగవంతుని యందు క్రోధము వహించి అతడు స్వయముగ పోరుటకు శక్తి లేనందున ఆభిచారకహోమము గావించి యజ్ఞకుండమునుండి బయలుదేరిన భూతమును శ్రీకృష్ణమూర్తి మీదికి బంపెను. శూన్యము పెట్టుట మొదలగు నీచకార్యసాధకములగు అనేకమంత్రములు కడపటివేదమున చెప్పబడియున్నవి. వేదము తల్లివంటిది. కాన నెల్లవారికిని అనగా సాత్త్వికరాజస తామసులకును నుపయోగించు నట్లు చెప్పుచున్నది. అట్లుండిననే యెల్లవారికిని వేదమున నమ్మిక గల్గును. కాని వేదము ప్రవృత్తికర్మలకు కామ్యకర్మములు చెప్పి నట్లు కనబడుచున్నది. కాని నివృత్తికర్మలకు ఆ మంత్రములే మోక్షమార్గమైన అర్థమును దెలుపుచున్నవి. వేదమున జెప్పబడి యున్నవని కామ్యకర్మములను చేయరాదు. యోగ్యతకు దగినట్లు సాత్త్వికమునే గమనించవలయును. ఈసంగతి భగవద్గీత 2 అధ్యా

యములోని 42, 43, 44, శ్లోకములందు చెప్పబడియున్నది. వరుసగా ఆ శ్లోకము లివి—

యామిమాం పుష్పితాం వాచం ప్రవద న్త్యవిపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్య దస్తీతి వాదినః ॥

2అధ్యా. 42శ్లో

కామాత్మాన స్స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।
క్రియావిశేషబహుళాం భోగైశ్వర్య గతింప్రతి ॥

2అధ్యా. 43శ్లో

భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికాబుద్ధి స్సమాధౌ న విధీయతే ॥

2అధ్యా. 44శ్లో

అగ్నికుండమునుండి వెడలిన భూతము అగ్నిజ్వాలలతోడ ద్వారకయందు ప్రవేశించగా జనులెల్ల సొగటాలాడుచుండిన శ్రీకృష్ణమూర్తి కాసంగతి దెలిపిరి. కాని యతడు వారిమాటలను చెవి బెట్టలేదు. జూదము మున్నగు నాటలాడువారిగతి యిట్టిదని తెల్పుటకే స్వామి యట్లు తాత్సారముగ నుండెను. పిమ్మట నాభూతము కృష్ణమూర్తి యింటివాకిటికి వచ్చి నిలువగా నెల్లవారును "కృష్ణా ! లేవకున్నావే" యని యఱచి చెప్పిరి. హరి యపుడు చక్రమును స్మరించగా నదిభూతమును తఱుముకొనిపోయి దానింబంపినవాని యింటివాకిట నిలచెను. ఆ భూత మాసుదక్షిణుడనువానిని, యజ్ఞముచేయించిన ఋత్విజులతోడ మ్రింగివేసెను. (పుణ్యపాపములు కర్మచేసినవానికి గలుగును. కాని మనకేమని దుష్కర్మములు చేయించువారు తలపరాదు. ఆ పాపఫలము వారికిని కలుగక మానదు) పరీక్షిన్మహారాజా ! బలరామకృష్ణులు రాజ్యమేలుచుండినపుడు ప్రళయకాలమున కలుగునట్లు సూర్యదర్శనమే లేకుండ గ్రహణము పట్టెను. శ్రీకృష్ణమూర్తి సకలయాదవులతో

బయలుదేరి పరశురాముడు రాజులను జంపి రక్తప్రవాహముచేసి పితృతర్పణముగావించిన స్యమంతక పంచకమను కురుక్షేత్రసమీప ప్రాంతమునకు బోయెను. అపు డచ్చటికి బ్రహ్మర్షులు, దేవర్షులు, రాజులు, పాండవులు, యశోదానందులు, గోపికలు మున్నగువారు వచ్చిరి. శ్రీకృష్ణమూర్తి తలిదండ్రులకు నమస్కరించి మమ్మెడ బాసితివే యని చింతంచిన గోపికలకు సమాధానము చెప్పెను. గ్రహణస్నానము కంటెను శ్రీకృష్ణదర్శనము గొప్పదని యెంచి నారదాదులు వచ్చి దర్శనము చేసికొనిరి.

ఈ దశమస్కంధముయొక్క యుత్తరభాగమున మతభేదము చే కొంత ముందువెనుక లుండును. ఒకమార్గము ననుసరించి యీ గ్రహణకథ యిపుడు చెప్పబడెను. దేవకీదేవి యొకనాడు శ్రీకృష్ణమూర్తిని జూచి నీయట్టిపుత్రు లార్గురు మృతిజెందిరనియు, నిన్ను జూచుచుండగనే యింత సంతోషము గలుగుచుండ వారినెల్లర గలిగియుండి చూచుచున్న నెంతయానందముగ నుండునోయని దుఃఖించెను. శ్రీకృష్ణు డపు "డమ్మా! వారిని జూడగోరెదవా? యని యడుగగనే వా రెదుటవచ్చి నిలిచిరి. స్మరుడు, ఉద్గీథుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభువు, ఘృణియను నీయార్గురును బ్రహ్మపుత్రుడగు మరీచికి జనించిరి. సుందోపసుందులకై తిలోత్తమ యను నప్సరసను బ్రహ్మ సృజించి యిట్టిరూపవతిని తానే యుంచుకొనిన బాగుండు నని తలంచెను. మనసునబుట్టినట్టి మన్మథుడు నవ్వెను. మరీచి యార్గురుపుత్రులును అతనితోపాటు నవ్విరి. బ్రహ్మదేవుడు శపించగా వారు ప్రథమమున హిరణ్యకశిపునకు బుట్టి పిమ్మట దేవకిగర్భమున జనించి తోడనే శరీరత్యాగము చేసిరి. వారిని శ్రీకృష్ణుడు రప్పించగా దేవకి వారికి పాలుగుడిపెను. భగవంతుడు త్రాగినందున వారామెపాలు నమృతముకంటె నెక్కుడు రుచితో త్రాగిరి. ఇచటనే యుందురా యని

స్వామి వారి నడుగగా వారు నేనుండను, నే నుండ నని చెప్పి దేవకీవసుదేవులకు, బలరామకృష్ణులకు నమస్కరించి కార్యమాయె నిక పోయెద మని చెప్పి వెళ్లిరి.

కృష్ణమూర్తి రుక్మిణీదేవితో నొకనాడు సరసములాడుచుండి మనుష్యలీల నాశ్రయించి "రుక్మిణీ! నేను నిన్ను పెండ్లాడవలయు నని తీసికొనిరాలేదు. నాశాత్రవుల మదము నణచుటకై తెచ్చితిని. శత్రువులకు భయపడి సముద్ర నాశ్రయించి వసించువాడను. ఇపుడేమాయె ? నీకు తగినవానిని చేపట్టు" మని పలుకగా రుక్మిణీ దేవి విలపించెను. కృష్ణుడామె ననేకవిధముల నూరడించెను. కృష్ణ మూర్తియొక్క ఒక్కొక్కభార్యకును పదుగురేసిబిడ్డలు పుట్టిరి. అందు పెద్దభార్యయగు రుక్మిణీదేవియొక్క జ్యేష్ఠపుత్రుడు ప్రద్యు మ్నుడు. రుక్మిణీదేవి యన్నయగు రుక్మియనువాడు తన కూతు రగు రుక్మవతిని మేనల్లుడగు ప్రద్యుమ్నున కిచ్చి వివాహము చేసెను. వారికి అనిరుద్ధు డనువాడు జనించెను. రుక్మి కృష్ణుని యందు వైరము గలవాడైనను చెలియలియందలి ప్రేమచేత తన పౌత్రిని (కుమారుని పుత్రిక) రోచనను దౌహిత్రునకు (కొమార్తె కొడుకు) అనిరుద్ధున కిచ్చి వివాహము సల్పెను. (ఇతని కింక నెవరైన భార్యలు గలరా యని పరీక్షిత్తడుగగా రాజా! స్వయ ముగ స్వీకరించినది మఱియొకభార్య గలదు. పెద్ద లాలోచించి చేయువివాహములందే అనేకవిరోధములు తటస్థించును. ఇక స్వయముగ గావించుకొనిన విషయమున విరోధములు లేకుండునా యని శుకు డాసంగతి చెప్ప నారంభించెను.)

ప్రహ్లాదుని మనుమడును, విరోచనునిపుత్రుడును అగు బలి చక్రవర్తి నూర్గురు తనయులలో పెద్దవాడును, వేయిచేతులుగల్గి యుండిన బాణాసురుడు పరమశాంభవుడై పార్వతీపరమేశ్వరులను భక్తితో భజించుచు వారివలన మయూరధ్వజము, వాహనము పడసి

వారికి మూడవపుత్రుడై అనగా విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యుడు అనువారితో పాటు తానొక పుత్రుడై యుండెను. ఐ దగ్నికోటలు గలిగి శోణపురము నేలుచుండిన ఆ బాణాసురుడు ప్రతిదినము కైలాసమునకు బోయి గౌరీశంకరుల పూజించియే పిమ్మట భుజించు చుండెను.

ఇట్లుండి యొకనాడు తనసహస్రబాహువులకు పొగరుగలిగి యున్నది గాన యుద్ధమునకు రమ్మని పరమేశ్వరుని బిలిచెను. నే నారాధ్యుడ నగుటచేత నీకు నాతో పోరు తగదు. నీభుజబలము నణచగల నావంటివాని నితరు నొక్కని జూపెదను. వా డెవడన "ద్వారకానాథు" డని పరమేశ్వరుడు బాణున కెఱింగించగా వాడు తన బాహుకండూతిని తీర్చగల శాత్రవు డెప్పుడు వచ్చునో యని నిరీక్షించుచుండెను. బాణాసురుడు కైలాసమునకు బయలుదేరగా నాతనికూతురు ఉషయనునామె తానుగూడ వచ్చెద నని తండ్రితో కైలాసమునకు బోయెను. బాణుడు పుత్రికను కూర్చుండబెట్టి తాను ప్రదక్షిణాదులు సల్పబోయెను. పార్వతీపరమేశ్వరులు చదరంగ మాడుచు సరసములాడుచుండుటను ఉష చూచి తానును ఒక్క వరుని పరిణయమాడి యట్టి యానందము ననుభవింప వలయు నని తలంచెను. పార్వతి యోామెభావ మెఱిగి బిడ్డను బిలిచి "అమ్మా ! నీకోరిక ప్రకారము అచిరకాలమున నొక్కవరుని వివాహ మాడుదు" వని చెప్పెను. ఆత డెవ్వడని యుష యడుగగా హరివంశమున పుట్టినవాడు నీకు తగినవా డనియు, వైశాఖశుక్ల ద్వాదశిరాత్రి నీ స్వప్నమున వచ్చి ఆలింగనాదుల నిన్నలరించు ననియు, అతడే నీకు భర్త యగుననియు గౌరీదేవి చెప్పెను. ఉష ఈవిషయము సిగ్గుచేత తన తండ్రి కెఱిగించలేదు. ఇదొక గొప్ప సంగతి కాదని పార్వతియు బాణునకు తెలుపలేదు.

ఉష పార్వతిమాటలు వినినప్పటినుండియు నానాటికి శుష్కించిపోవుచుండెను. చెలులతో సైతము మాటలాడుట, ఆట

లాడుట మానివేసెను. ఈమెవాలకము కనుగొని సఖులు ఆమె తల్లి కా సంగతి దెలిపిరి. బాణాసురు డనేకమంత్ర వాదులను, వైద్యులను, పురోహితులను బిలిపించి ఆమెజాడ్యము మాన్పింప యత్నించెను గాని ఆయత్నము లన్నియు విఫల మాయెను. ఉషయొక్క తల్లి తనయను జూచి "అమ్మా! నీవ్యధకు కారణ మెఱిగింపుము. ప్రతీకార మాలోచించెద" మని పలుక నామె తనకు మన్మథజ్వరము తగిలియున్న దని యుత్తర మిచ్చెను. అందుల కామె తల్లి "బిడ్డా! త్వరలోనే నీకు పెండ్లి చేసెద" మని ధైర్యము చెప్పెను. ఉష పార్వతీదేవి చెప్పినదినమును నిరీక్షించుచుండి ఆమెచెప్పిన దివసమున నతిసుందరుడగు పురుషుడు తనతోడ ననేకసుఖము లనుభవించి తన్ను వదలించుకొనిపోయినట్లు స్వప్నము గని అట్లుపోవుట న్యాయముగాదని గట్టిగ నఱచెను. బాణాసురుని మంత్రి కుంభాండుడు. అతని కూతురును, ఉషయొక్క ప్రాణ సఖియు నగు రామ యనునది ప్రక్కనే పరుండియుండి తనచెలి పలవరించుచున్న దని యెంచి యామెను మేలుకొలిపి సంగతి నడిగెను. ఆకాశగంగాతీరమున నొక్కనాడు శివుడు పార్వతితో వేడుక లనుభవించుచుండగా నంది మొదలగువారు చేతులు జోడించుకొని నిల్చియుండిరి. చిత్రలేఖాదులు నాట్యమాడి వారిని సంతోషింప జేయుచుండిరి. చిత్రలేఖ యనునచ్చర పార్వతీరూపమును ధరించి నిజమైన పార్వతి యెవ్వతెయో యెఱుగక శివుడు మోసపోవలయు నని యెంచి యుండెను. పరమశివు డీ సంగతి దెలిసి సంకల్పించగా నచటనుండిన స్త్రీ లెల్లరు పార్వతు లైరి. నంది మున్నగువారల కెల్ల సైగచేయగా వారందరు శివరూపులై నిలిచిరి. పార్వతీరూపముతో నున్న చిత్రలేఖ ఒకమిథ్యాశివుని చేయిపట్టబోవగా వాడు నవ్వెను. ఆస్త్రీ యపుడు పరమశివుని ప్రార్థించగా నత డామె యసురస్వభావము జూపినదిగాన అసురునింట బుట్టు

గాక యని శపించెను. ఆ యచ్చరయే బాణునిమంత్రి కుంభాండుని కూతురై పుట్టి ఉషకు సఖియై యుండెను. ఈ కథ భాగవతమున సంగ్రహముగ దెలుపబడియున్నది. ఉష తనస్వప్నవృత్తాంతమును సఖియగు రామకు దెలుపగా నామె కలలోవచ్చినవానిని కోరుటకు నీవు పిచ్చిదానవుగా నున్నా వనెను. ఉష పార్వతిచెప్పిన విషయ మంతయు దెలిపెను. అటులైన నాకార్యము నెరవేర్చుభార మాపార్వతిదే. పార్వతిచెప్పిన సంగతి శివు డెఱుగునా యని సఖి యడిగెను. శివుడును నట్లే జరుగునని యాశీర్వదించె నని చెప్పి యుష సఖీప్రేరణచేత శివునిస్తుతించి వారినే నమ్మియుండిన నెట్లు? మనముకూడ ప్రయత్నించవలదా యని పలికెను.

చిత్రలేఖయొక్క అంశసంభూతయగు రామ తనకు శాప కారణమున శక్తియుడుగుట నెఱింగించి నిజమైన చిత్రలేఖవచ్చిన నీకార్యము ఫలించునని తెలిపెను. ఉష చిత్రలేఖను బిలిపించి తన వేదన నామెకు తెలిపి తనకోరిక నీడేర్చుమని వేడెను. స్వప్నమున ప్రాప్తించినవానిని గుర్తించి తెచ్చుట అసాధ్యము గనుక చిత్రలేఖ ఒకవారముదినములు అవకాశము కోరెను.

క. సరసిజనేత్ర! యేటికి విచారము నా కుశలత్వ మేర్పడన్
నరసురయక్ష కింపురుష నాగనభశ్చరసిద్ధసాధ్య కి
న్నర నరముఖ్యులం బటమునన్ లిఖియించినఁ జూచి నీమనో
హరుఁ గని పేర్కొమ్మనిన నప్పుడె వానిని నీకుఁ దెచ్చెదన్.

—పోతన భాగవతము

వారమునకైనను తెచ్చియిచ్చెదనని చిత్రలేక ధైర్యము చెప్పుటకు ఉష మిక్కిలి సంతోషించెను. నారదుని శిష్యురాలగుట చేత చిత్రలేఖ బ్రహ్మసృష్టిలోని సకల మెఱిగియుండెను గాన నామె రంగులుదెచ్చి పటములను వ్రాయ నారంభించి త్రిమూర్తు లను, అష్టదిక్పాలురను, గంధర్వ యక్షకిన్నరకింపురుషాదులను,

ఇంద్రాదిసకలదేవతలను, పాతాళములోని శేషుని, అవటిసకల రాజులను లిఖించి చూపెను. ఉష వీరుకారు; వీరుగా రనుచుండెను. చిత్రలేఖ భూమండలమందలి సకలదేశాధిపతులను వ్రాయుచు వచ్చి ద్వారకాపట్టణము నెత్తుకొని యాదవులను, శ్రీకృష్ణమూర్తిని వ్రాసి చూపి-

సీ. కమనీయశుభగాత్రుఁ గంజాతదళనేత్రు
వసుధాకళత్రుఁ బావనచరిత్రు
సత్యసంకల్పు నిశాచరోగ్రవికల్పు
నతపన్నగాకల్పు నాగతల్పుఁ
గౌస్తుభమణిభూషు గంభీరమృదుభాషు
శ్రితజనపోషు నంచితవిశేషు
నీలనీరదకాయు నిర్జితదైతేయు
ధృతపీతకౌశేయు నతవిధేయు

గీ. నఘమహాగదవైద్యు వేదాంతవేద్యు
దివ్యమునిసన్నుతామోదుఁ దీర్ఘపాదు
జిష్ణు వరసద్గుణాలంకరిష్ణుఁ గృష్ణుఁ
జూడు దైతేయకులబాల సుభగలీల.

—పోతన భాగవతము

అని యిట్లుపలికిన చెలికి తనస్వప్నమందు వచ్చినవా డింతటి రూపవంతుడుకా డని ఉష తెలిపెను.

అటుపిమ్మట నామె కృష్ణునికుమారుడు ప్రద్యుమ్నుని వ్రాసిచూపి యంతకంటెను తక్కువరూపవంతుడే యని యుష చెప్పగా ననిరుద్ధుని లిఖించెను. ఉష ఆయనిరుద్ధునిపటముజూచి ఇతడితడే. ఈక్షణముననే పోయి యతనిని తోడితెమ్మ. కల్పకోటి సహస్రములకైనను దొరకని యితనిని నీమంచియుక్తిచేత కను గొంటి వని చెప్పి చిత్రలేఖను గొనియాడెను. శ్రీకృష్ణమూర్తి

నారదుడు శ్రీకృష్ణు నుద్దేశించి "స్వామీ! ఇపుడు సైన్యముతో పని లేదు. నీ విపుడు శృంగారపురుషుడవై యున్నచో కార్యము కాజా లదు. నీవు సహస్రమూర్తివి కావలయు" నని చెప్పెను. తోడనే స్వామి సహస్రముఖములను, అష్టబాహువులను జూపెను. బల రామ ప్రద్యుమ్నులతోడ నా సహస్రమూర్తి గరుడారూఢుడై శోణపురము జేరెను. ఆకాశపర్యంతము వ్యాపించిన అగ్నిజ్వాల లతో గూడిన అయిదుకోటలుగల ఆ పురిలోపలికి పోవుటకు వైనతే యునకు వలనుపడలేదు. గరుడు డపుడు తనపై నారోహించి యుండినవారిని దించి సహస్రాననుడై గంగకు బోయి వేయి నోళ్లతో గంగాజలము నెత్తుకొని శోణపురము జేరి యుమియగా నా యగ్నిజ్వాలలు చల్లారిపోయెను. అయిదుగురు అగ్నిపుత్రులు యుద్ధమునకు రాగా వారిని జయించి లోపల బ్రవేశించిరి. బాణా సురుడు యుద్ధముచేసి చేతులు నొవ్వగా తన కిట్టిస్థితి కలిగెనే యని శివుని ప్రార్థించెను. భక్తవాత్సల్యమును జూపుటకై పరమశివుడు భూతప్రేతగణములతోడను, సుబ్రహ్మణ్యునితోడను స్వామిమీదికి వచ్చెను. బాణాసురుడు కొంచెము విశ్రాంతి తీసికొనెను. ప్రద్యు మ్నుడు ప్రస్వాపనాస్త్రమును ప్రయోగించగా పరమశివుడుదప్ప తక్కినవా రెల్లరు నిదురించిరి. శివుడు పైకిరాగా స్వామి జృంభ ణాస్త్రమును ప్రయోగించెను. శివుని కపుడు సోమరితనము కలు గగా స్వామి నోరు తెఱచెను. అందుండి యగ్ని బయలుదేరి యూరిని గాల్చుటకు యత్నించెను. ఇంతలో బ్రహ్మదేవుడు వచ్చి మనుష్యలీల ననుసరించు స్వామితో యుద్ధముచేయుట తగదని శంకరునికి జెప్పి మీలో మీరిట్లు పోరాడినయెడల త్రిలోకములకే హాని కల్గునని చెప్పగా కృష్ణమూర్తి జృంభణాస్త్రము నుపసంహ రించెను. ప్రద్యుమ్నుడు ప్రస్వాపనాస్త్రమును నిలుపగా నెల్లవా రును లేచి యుద్ధముసల్ప నారంభించిరి. బాణుడు స్వామితో

పోరుట బారంభించి పోరునపుడు శక్తిహీనుడు కాగా వానితల్లి పుత్రునిపై దయతో వస్త్రహీనయై సేనలనడుమవచ్చి నిలిచెను. స్వామి పరాఙ్ముఖుడు కాగా బాణుడు తప్పించుకొనిపోయి మరల శివునిరథమున గూర్చుండి యుద్ధముసల్ప నారంభించెను. బాణుని తల్లి మరల వివస్త్రయై యెదుటికివచ్చి నిలువగా స్వామి కనులు మూసికొనియే పోరి బాణుని చేతులను మార్గమున కడ్డుపడిన శాఖలను త్రోసికొనిపోవుసట్లుగ నఱికి వేసి శేషించిన నాల్గుచేతులను గూడ ఖండించుట కుద్యుక్తుడు కాగా శివుడు స్వామివద్దకు వచ్చి స్వామి చేతిని బట్టుకొని నీభక్తుని నేను, నాభక్తుని నీవు కావవలయును. వాని చేతులు వానికి భారమై తోచినవి. ఆభారము దీరుట ఆతనికి లాభమే అనగా స్వామి వానిని నాల్గుచేతులతో విడిచిపుచ్చి "ప్రహ్లాదునివంశజు డెట్టి యపరాధ మొనర్చినను చంపనని నాప్రతిజ్ఞ. కాన వీనిని సంతోషముతో మన్నించెద" నని చెప్పెను. నాకైనను నీకైనను వీడు మన్నించబడుటయే ముఖ్యమని శివు డనెను. బాణుడు వైరాగ్యయుక్తుడై శివునితో కైలాసమున కేగి నంది మొదలగు వారితో సుఖముగ నుండెను.

మంత్రియగు కుంభాండుడు స్వామిమొదలగువారిని నంతఃపురమునకు బిలుచుకొని పోగా గరుడునిప్రవేశము చేత ననిరుద్ధుని బట్టియున్న నాగాస్త్రము వీడిపోయెను. అనిరుద్ధుడు లేచెను. మంత్రి రాజ్య మీయ బోవగా స్వామి యతనినే రాజుగ జేసెను. ఉష కుంభాండునిచేత పెంచబడిన బిడ్డ గావున నతడే యనిరుద్ధున కిచ్చి యగ్నిసాక్షిగ వివాహము చేసెను. స్వామి కుంభాండుడు మున్నగువారితో ద్వారకకు బోయెను. కుంభాండుడు స్వామికి జాంబవతియందుబుట్టిన సాంబునకు తనకూతురు రామ నిచ్చి వివాహము సల్పెను. ఉషయును, రామయును ఒండొరులబాసియుండలేరనియే యత డిట్లు గావించెను. పదునారువేలనూటయెనిమిదిమంది

భార్యలతోడ వాసుదేవుడు లోకోద్ధారకుడై జగములను పరిపాలించు చుండెను.

శ్రీకృష్ణుడు తన భార్యలకు పరస్పరవిరోధము కలుగకుండు నట్లు వర్తించి వారితోడ కాపురము సల్పుచుండుటను జూడగోరి నారదుడు ద్వారకాపురి కేగెను. అపట్టణము వెలుపల,లోపలగృహము లందు తోట లుండెను. వృక్షములు పుష్పఫలభరితములై యుండి నవి. నవరత్నఖచితములైన గృహములే ఆ యూర నుండినవి. శ్రీకృష్ణస్వామియొక్క పదునారువేల నూటయెనమండుగురియిండ్లు వరుసగా నుండినవి. శ్రీకృష్ణుడు తనభార్యలకు దివ్యవస్త్రాభరణా దుల నిచ్చి సమత్వమున నేలుచుండెను. శ్రీకృష్ణు డేయింటిలో నుండునదియు తెలియక నారదు డా వరుసలో మొదటియింటికి బోయి శ్రీకృష్ణు డొక్కభార్యతో వేడుకగా నుండుటజూచి యీామెయే యితనిని వశపఱచుకొనె నని తలంచి రెండవయింటి కేగెను. ఆ యింట శ్రీకృష్ణమూర్తి వంటచేయుచుండెను. మూడవయింట నితడు తలంటుకొనుచుండెను. ఒకచోట నెత్తములాడుచుండెను. మఱియొకచోట తొట్లయం దుంచిన బిడ్డ నూచుచుండెను. ఇట్లనేక స్థలములం దనేకలీలలు సల్పుచుండిన స్వామిని కనుగొని యోగీ శ్వరు డగు పరమాత్మ—

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥

భగ. 9అధ్యా 29శ్లోకమట్లు సర్వసముడై వర్తించుచు నెల్లవారిని సంతోషింపజేయుచున్నాడు. ఇతనిని పరీ క్షింప వచ్చుట నాతప్పని నారదు డెంచెను. శ్రీకృష్ణు డొక్కయింట పూజసల్పుచున్నాడని విని బ్రహ్మాదులకు స్వామియగువాడే దైవ మును పూజించుచున్నా డని యోజించి యూహింపనేరక హరి వచ్చువరకు కాచియుండి యతడు రాగానే—

పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽప్యప్రతిమప్రభావ ॥

భగ. 11అధ్యా. 43శ్లోకమట్లు చరాచర ప్రపంచమునకు పూజ్యుడ వగు నీ వెవరిని పూజించుచుంటి వని యడిగెను. మిముబోటి భాగవతుల పాదధూళి నా కారాధ్య మగుటచే దానిం బూజించితి నని చెప్పి శ్రీకృష్ణమూర్తి భాగవతచరణ ధూళిని శ్లాఘ్యపఱచెను. (ఈ విషయము పురాణాంతరములో చెప్పబడియున్నది) నారదు డపుడు శ్రీకృష్ణు చర్యల కాశ్చర్య మొంది "స్వామీ! నీ సామర్థ్యమే సామర్థ్యము! ఎల్లపత్నులను సమభావముతో జూచుచు వారి కెల్లరకును సంతోషము గల్గించుచున్నాడ" వని కొనియాడి వెడలిపోయెను.

శ్రీకృష్ణుడు నిత్యోపభోగములతోడ భార్యల నందఱ నేలుచుండె నని శుకుడు చెప్పగా శ్రీకృష్ణు డేల అట్లు సల్పెనని పరీక్షిత్తు ప్రశ్నించెను. మనుష్యలీలార్థ మట్లు నటించెను. వారివారిమనస్సునకు చేష్టలకుతగినట్లు తానుసు నడచుకొనుచు ప్రాతఃకాలమున నిద్ర లేచిగజేంద్రమోక్షణము మొదలగు స్తోత్రములనుజేసి దంతధావనాది కృత్యములు గావించి నదియందు స్నాన మాచరించి మడివస్త్రములు ధరించి సంధ్యావందన, అగ్న్యుపాసన, మంత్రజపాది నిత్యనైమిత్తికములను.

యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥

అను భగ. 3అధ్యా 23శ్లోకమట్లు లోకోద్ధరణార్థము విధిప్రకారము తా ననుష్ఠించి చూపెనని శుకుడు తెలిపెను. ఇట్లుండ నొకనా డొకదూత శ్రీకృష్ణునొద్దకువచ్చి "స్వామీ! అనేక

రాజులను జరాసంధుడు పట్టి కారాగృహమున బంధించియున్నాడు. వారినెల్ల నరమేధము జేయదలంచియున్నాడు. ఈ సంగతి నా కారాగృహమునసున్న రాజు లందరు తమ కెఱింగించి ఆ జరాసంధుని వధించి తమ్ము కాపాడవలయు నని తమ మాటగ మీకు విన్నవింపు మనిరి. పదునెనిమిదిమారులు నీ వాతని నోడించినవాడ వగుటచేత నీ కీకార్య మొక ఘనమైనది కాదు. మేము నీ భక్తుల మగుటచేత మమ్ము రక్షించుభారము నీది. కనుక యోజింపు మని యును విన్నవించి'' రని తెలిపెను. ఆ సమయమున నారదుడును వచ్చి "కృష్ణా! ధర్మరాజు రాజసూయయాగము చేయబోవు చున్నా'' డని చెప్పగా "నాయాగము శ్రమసాధ్యమైనదిగ నున్నదే" యని కృష్ణు డనెను. నారదు డప్పుడు "స్వామీ! ధర్మ రాజున కా యిచ్ఛ గల్గుటకు నేనే కారణము. నీయానతి శిరసా వహించి మయుడు నిర్మించియిచ్చిన సభను జూచి మెచ్చుకొంటిని. ఇంద్రసభను వర్ణించుతఱి సభాసదుల పేరులను జెప్పుచు వచ్చి హరిశ్చంద్రుడును నచ్చటనున్నట్లు చెప్పి యముని సభయందు పాండురా జున్నాడని పల్కితిని. పాండురాజు యమసదనమున నుండుటకు కారణ మేమని ధర్మనందనుడు న న్నడిగెను. రాజ సూయయాగముచేయని కారణమున నా కీచోట వాసము గలిగెను. శ్రీకృష్ణసాహాయ్యమున నాపుత్రులగు మీ రేవురును రాజసూయ యాగ మాచరించి దానిఫలము నా కర్పింతురేని నేనును ఇంద్రసభను జేరుదు నని మీతండ్రి మి మ్మాజ్ఞాపించెనని నేను ధర్మరాజున కెఱింగించితిని. పితృభక్తిగల ధర్మరాజు నీ యాధ్యక్ష మున నా యాగ మాచరింపగోరి పలుమారు నిన్ను శ్రమపఱచుటకు నిష్టములేనివాడై నను నీవు లేనిదే యీ ఘనకార్యము జరుగనేరదు. కాన నిన్ను పిలుచుకొని రమ్మని నన్ను బంపెను. కావున "కృష్ణా! నీవు దయచేయవలయు" నని చెప్పెను. రాజసూయయాగ

మొనర్చుటలో శ్రమగలదని కృష్ణమూర్తి యోజించుచుండగా నారదు డతని నుద్దేశించి "స్వామీ! రాజసూయయాగమును గొప్పగ నిర్వహించి నిన్నారాధింప బోవుచున్నారు. దీని కింత బిగువుచేయుచున్నా వేల?" అని యడిగెను. ఇంతపరిహాసమేల యని కృష్ణమూర్తి పలుకగా-

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తి మృచ్ఛతి ॥
భగ. 5అధ్యా. 29శ్లో

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మా మభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే ॥
భగ. 9అధ్యా. 24శ్లో. పైశ్లోకముల ప్రకారము

"నీవు సర్వయజ్ఞభోక్త వగుటచేత నిన్నుగూర్చియే యజ్ఞమాచరింపబడును. సకలమంత్రములచేత హవిర్భాగములు నీ కొసగబడును. నీవి లోకమున నవతరించి గోవుల మేపుచున్నాడవు గాని పరబ్రహ్మవుగదా! సృష్టిస్థిత్యాదులను జేయువాడవు. త్రిలోకములందును గల మంగళకీర్తివి నీవు. ఇంతేగాక లోకమున పాదప్రక్షాళనజలము బహుహేయముగ నెంచబడుచున్నది. నీపాదజలమున్ననో స్వర్గమున మందాకిని యనియు, భూలోకమున గంగ యనియు, పాతాళమున భోగవతి యనియు పేరులు వహించి దర్శన స్పర్శన ఆచమనమాత్రమున త్రైలోక్యమును పావనము చేయుచున్నది. ఇక నీ కెంతటిప్రభావముండునో తెలుపవలయునా" అని స్తుతించి యజ్ఞమునకు రావలయు నని పిల్చెను. కృష్ణమూర్తి అట్లే వచ్చుటకు సమ్మతించి నారదునిబంపి తన యెదుట నిలువబడియుండిన దూతను గాంచి "ఓరీ! నీ విపుడు జరిగిన దంతయు చూచుచున్నావుగదా! కారాగృహబద్ధులగు రాజుల నెల్లను గాపాడదలచితిని. ఐనను ఘనకార్యమగు యజ్ఞము

నకు ముందు పోవలయును. శీఘ్రముగ వచ్చి కాపాడెదను; చింతింప వలదని వారికెల్ల నామాటగ జెప్పుము అని చెప్పి వానిని బంపివేసి సేనాపతిని బిలిచి రథగజతురగపదాతులను సిద్ధపఱచు మని యాజ్ఞాపించెను. కృష్ణమూర్తి తనపదునాఱువేలనూటయెన మండుగురుభార్యలతో బంధుమిత్రులతో బయలుదేరి పల్లకీల యందు పోవుచుండగా మార్గమున నాయాప్రదేశములం దుండు స్త్రీలు భగవంతునిస్త్రీలను దర్శించి మర్యాదలు సల్పిరి. పురుషులును శ్రీకృష్ణదర్శనము గావించి ఫలపుష్పాదులతో సత్కరించిరి. శ్రీకృష్ణపత్నులం గాంచి "ఆహా! స్త్రీజన్మ మనిన వీరిదే. పురుష మోహను డగు పరమాత్మ వీరిని పెండ్లాడెను. వీ రేస్వామిని పూజించిరో? ఎట్టి పూజలు గావించిరో? ఏ భాగవతు నర్చించిరో? వీరిపుణ్యఫల మెట్టిదోగాని యీతని పెండ్లాడిరి. స్త్రీలమైన మనము పురుషులను పెండ్లాడితిమి, వీరు పురుషోత్తముని పెండ్లాడిరి." అని స్త్రీ లెల్లరును ప్రశంసించిరి. శ్రీకృష్ణునిభార్య లతని ననుసరించి పోవుచు చంద్రునితోడ బోవు నక్షత్రముల ట్లుండిరి. నక్షత్రముల నడుమనుండిన చంద్రునియట్లు స్వామి భార్యలమధ్య ప్రకాశించెను. కృష్ణు డీరీతి సకలవైభవసమేతుడై యింద్రప్రస్థము చేరెను.

## శిశుపాల వధము

కృష్ణమూర్తి తనవారితోడ నింద్రప్రస్థముజేరి ధర్మజుచేత సత్కృతుడై యతనిప్రార్థనప్రకారము రాజసూయయాగము సల్పుటకు సమ్మతించి యాగాత్పూర్వము సమస్తరాజులను జయించవలసియుండుటచేత నెల్లభూపతులను పశువులగావింప నెంచి రాజులందు మేటియైన జరాసంధుని ప్రథమమున నోడించుట యుక్తమని యెంచి భీమార్జునులతోడ నతని యొద్దకు బోవ దలచెను.

కృష్ణు డట్లు తలంచి మగధదేశమున గిరివ్రజమును పట్టణము నేలుచుండిన జరాసంధునొద్దకు బావమఱదులతోడ బ్రాహ్మణ వేషమున బోయి జరాసంధునిచేత సత్కరింపబడి యుద్ధభిక్ష మడుగగా నత డా దాన మొసగి కృష్ణుడు తన్ను మోసపుచ్చె నని కనుగొనెను. శ్రీకృష్ణమూర్తి నీ వెవ్వరితో పోరనెంతు వని యడుగ జరాసంధుడు "కృష్ణా! నీవు రాజువుకావు. అదియునుంగాక పదునెనిమిదిమారులు నాతోబోరి పరాజితుడవై యున్నావు. కావున నేను నీతో యుద్ధముసల్ప వాంఛింపను. అర్జును డన్ననో నాకు సమవయస్కుడు కాడు. కనుక భీమునితోడ పోరాడ దలతు" నని చెప్పి గదనెత్తుకొని వచ్చెను. భీమజరాసంధు లిరువదియేడు దినములు పోరాడిరి. రణమునగల సకలరహస్యములను ప్రయోగించినను జరాసంధుని కొక గాయమైనను కలుగలేదు. జరాసంధుడు శూరు డగుటచే యుద్ధము చేసినపుడుచేసి తదితరసమయములందు కృష్ణభీమార్జునులను సకలవిధముల సత్కరించుచుండెను. ఇరువది యేడుదినములు పోరుసల్పియు జరాసంధుడు చావకుండగా శ్రీ కృష్ణమూర్తి ఒకతృణమునెత్తి దానిని నిడివికి రెండుగా జీల్చెను. ఇదిగని భీముడు జరాసంధుని నేలపైపడద్రోసి వాని యొకకాలి మీద తన కాలుంచి మరియొక్కకాలిని చేతబట్టుకొని యేనుగు తరుశాఖనువలె జీల్చెను.

బృహద్రథు డనురాజు చండకౌశికునాశ్రయించి యతని యనుగ్రహమున నొకఫలము వడసి దానిని తన యిరువురు భార్యల కిచ్చెను. ఆ ఫలము రెండుముక్కలుగ విభజింపబడి నందున శిశువుగూడ రెండుతునియలై రాజపత్నులకు బుట్టెను. ఇట్లు జనించినందున ఆశిశుఖండములు పారవేయబడెను. జర యను రాక్షసి వచ్చి యా రెండు ఖండముల నొక్కటిగ జేర్చి తోమగా నా ఖండము లొక్కశిశువై ప్రాణ మొదవి యేడ్వనారం

భించెను. అధికారు లాశిశువు నెత్తుకొనిపోయిరి. చండకౌశికుని ప్రభావమున జనించినందున జరాసంధునికి శరీరమున నేమాత్రము బాధ కలుగలేదు. జర సంధించినందున ఆ భాగము మాత్రము శక్తియుతమైనది గాదు. ఆతనిశరీర మెట్లతుకబడినదో అట్లే విడ దీయవలసినదై యుండెను. ఈ రహస్య మెఱింగిన శ్రీకృష్ణ మూర్తి సన్న చేయగా భీము డా మర్మము నెఱింగి జరాసంధుని నిలువున చీల్చివేసెను. కృష్ణుడీ కైవడి జరాసంధుని జంపించి యతనిపుత్రుడగు సహదేవునిపూజ లంగీకరించి "పరమభాగవతు లగు మీచేత నాతండ్రికి మరణము తటస్థించినది. ఇది పరమ భాగ్యము. మీకు వలసినద్రవ్యములను గైకొను" దని విన్న వించిన సహదేవుని గౌరవించి వలసినధనమును తీసికొనిపోయెను, ధర్మరాజు శ్రీకృష్ణునానతిచొప్పున సహదేవుని దక్షిణమునకును, నకులుని పశ్చిమమునకును, అర్జును నుత్తరమునకును, భీముని తూర్పునకును బంపగా వా రెల్లరను వశవర్తుల గావించుకొనిరి. లోబడిన సకలరాజులును కానుకలు దెచ్చిరి. బావమఱదులను నాల్గు దిక్కుల జయించుటకు బంపి శ్రీకృష్ణుడు తనస్త్రీల నెల్ల నచ్చటనే యుంచి తన యూరికి బోయి సమస్తరాజులు వచ్చిరని ధర్మరాజు సందేశము నంపగా తానును మరల వచ్చి చేరి ముఖ్యముగ రావల సిన దుర్యోధనుడు రాలేదని తలంచి వానినిగూడ పిలువగోరెను. ఒకనికి సంపద గల్గినపుడు ముఖ్యముగ శత్రులు, మిత్రులు చూడ వలయును. అసూయచే సంకటపడుటకు శత్రువులు, సంతోష పడుటకు మిత్రులు ఉండినపుడే ప్రయోజనము గాన దుర్యోధనుని పిలుచుటకు నకులుని బంపెను. అసూయాపూరితుడైన సుయోధ నుడు దిక్కులేని ధర్మజాదులు కృష్ణునిసాయమున నే రీతి యాగ మాచరింతురో యని యెంచి చూడగోరి సకలవిభవములతో వచ్చి చేరెను. శ్రీకృష్ణమూర్తి దుర్యోధనునిగాంచి తాను జరాసంధుని

చంపినసంగతి నతనికి దెలిపి యాతనిరాకకు సంతోషించి కూర్చుండుమని చెప్పెను. దుర్యోధనుడు తన్నుగూడ నేదైన యొకపనిలో నియోగింపు మని కోరగా శ్రీకృష్ణమూర్తి యందుల కంగీకరించి ఘనుడవగు నీకు ఘనకార్యము నే యొప్పగించవలెను. సకల రాజులు దెచ్చిన కానుకలను నీవు చేతితో తాకుచుండుము. నేను వానినెత్తుకొనిపోయి లోపల నుంచెదను. అదియుగాక శ్రీమంతుడవగు నీవు బాగుగ దాన మిత్తువు. ఆ కార్యము సైతము నీవే యొనర్పు మని వానితో జెప్పెను. నీవేమిచేయబోవుచున్నావని దుర్యోధను డడుగగా "నేను బ్రాహ్మణులురాగానే పాదప్రక్షాళనముచేసి పూజించి వారుభుజించిన తరువాత ఎంగిలాకు లెత్తి పారవేసెద" నని స్వామి చెప్పెను. దుర్యోధనునిచేతిని ప్రీతికై పట్టుకొనినట్లు పట్టుకొని యతని ధనరేఖను స్పృశించగా దుర్యోధనుడు తాకుచుండిన తబుకులలోని ధనరాసులు పెక్కురెట్లధిక మగుచుండెను. ఆయాగమును పరశురాముడు, వ్యాసుడు మొదలగువారును, బ్రహ్మరుద్రేంద్రాది సకలదేవతలును ప్రశంసించిరి. ఇందరుగూడినసభయందీ కృష్ణుడు ఎంగిలి విస్తళ్ళెత్తుచున్నాడు. మనయింట నెంతరాజసముగ నుండు నని దుర్యోధనుడు తిట్టుకొనుచుండెను. అంతియేగాక మహర్షులు పలుకుచుండిన మంత్రములను విని సంకటపడుచుండెను. అధ్వర్యుడు మంత్రపూర్వకముగ నిచ్చిన హవిర్భాగమును ఇంద్రుడు, వరుణుడు తుదకు బ్రహ్మదేవుడు స్వయముగవచ్చి యంగీకరించిరి. ఆ యాగమున నొక లక్షమందికి సంతర్పణ జరిగెనేని ఒకమారొకగంట మ్రోగును. మరియొక దినమున రెండుపంక్తులవారు భుజించిరి. అపుడా గంట మూడుముక్కాలుగడియలు కొట్టెను. యాగమును జూడవచ్చిన శుకులు అదృశ్యులై శుకరూపముతో భగవంతుని హస్తస్పర్శ పొందిన యుచ్ఛిష్టమున నోరుంచి యొక పర్యాయము కొంత

స్వీకరింపగా నందుచేత ననేకకోటిబ్రాహ్మణుల కన్నమిడిన ట్లాయెను. గంటనిలువక కొట్టినందుల కిదియే కారణము. ఆమహా ధ్వరము జరుగుచుండగా సోమాభిషవదినమున యాజకులకును, సదస్యులకును పూజగావింప తటస్థించెను. ప్రథమపూజ్యు డెవడని ధర్మజుం డడుగగా-

> పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
> ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

అను భగ. 4అధ్యా. 8శ్లోకమట్లు

దుష్టనిగ్రహము, శిష్టపరిపాలనము చేయునట్టివాడు, సకలాధికారము గలవాడు శ్రీకృష్ణమూర్తి యని సభాసదులు నిర్ధారించిరి. అందరు చేరి తాంబూలమిచ్చువా డెవడని యోజించి సహదేవు నొసగు మనిరి. 'కృష్ణా! తాంబూలము స్వీకరింపు' మని పిలువగా ఎంగిలాకు లెత్తు చుండిన స్వామిలోపలినుండి వచ్చి తాంబూలము గైకొనివెళ్ళెను. వసుదేవుని చెల్లెలి కొడుకు చేదిదేశాధిపతి శిశుపాలు డసూయా పరుడై "రాజులను బిలిచినది గౌరవించుటకా? లేకఅవమానించుటకా? ఈ కృష్ణుడు విద్య, తపస్సు, రాజ్యము, ఐశ్వర్యము మొదలగు వానియం దేవిషయమున హెచ్చైనవాడు? వీనికి పుంస్త్వమా? పరాక్రమమా? నేను పెండ్లాడదలచిన దానిని దొంగిలించెను. పాలువెన్నలను దొంగిలించు నితనికి కులశీలము లున్నవా? ఒక చోటబుట్టి మరియొకచోట బెరిగినవాడు. దేవర్షు లెల్లరు గూడి యుండునట్టి యీ చోట నెంగిలాకు లెత్తుచున్నాడు. ఇట్టివానికి మునుముందుగ మర్యాద సల్పి యెల్లవారి నవమానించదగునా? ఈ నాసందేహమునకు ముందు సమాధాన మొసగబడిన పిమ్మట నే తాంబూలము తీసికొనదగును" అని పలుకగా నెల్లవారును భీతులై యుండిరి. ధర్మరాజు కృష్ణుని ధ్యానించి "స్వామీ! ఈ శిశుపాలు డేమిచేయునో యని భీతి పొడముచున్నది. ఈయూర

నీవు, నీపాదము వినా మాకు వేఱుగతి లేదు. యజ్ఞమూర్తివగు నీవు కాపాడవలయును. యజ్ఞము ముగిసిన నీకు విందు జరుగును. లేకున్న సగము విందే యగును. నీవు దక్క నాకన్య రక్షకుడు లేడు. ఇది నామనఃపూర్వకమైన విన్నపము'' అని విన్నవించు చుండెను. శిశుపాలుడు స్వామిని దఱుముచుండగా వీరు ప్రార్థించు చుండిరి. స్వామి తిట్లు సైంచుకొనుచుండెను. నూరుతిట్లు ముగిసి నూటయొకటవది వానినోటినుండి వెలువడగనే స్వామి చక్రమును స్మరించి సభాస్థలికి వచ్చి ''సభ్యులారా! ఈతనిదూషణమును వినుచున్నారుగదా! నూరపరాధములను క్షమించునట్లు నాయత్త యగు వీనితల్లికి వాగ్దాన మొసంగి యుంటిని. వీడు పుట్టినపుడు వీనినెత్తియం దొకకన్ను మొలచియుండెను. రెండుచేతులధిక ముగ నుండెను. ఎవ్వనిస్పర్శచేత నీశిశువుయొక్క అధికనేత్రము, అధికకరము లడగునో వానిచేత వీనికి చావు కల్గునని అశరీరవాణి పల్కినందున మాయత్త వీని నెల్లవారిచేతుల కందిచ్చుచుండినది. నాచేతికి కూడ నీయగా ఆ మిక్కిలికన్ను, మిక్కిలిచేతు లణగి పోయెను. మాయత్త సాత్వతి నన్ను ప్రార్థింపగా శతాపరాధము లను మన్నించెద నని చెప్పితిని. కాన నిపుడు చక్రము రాబోవు చున్నదని పలుకుచుండగా శ్రీవిష్ణుచక్రము పళపళమెరయుచు వచ్చి శిశుపాలుని శిరశ్ఛేద మొనర్చెను. కవి యిట్లనెను. ఆ చక్రము ప్రళయకాల సూర్యోదయ మట్లున్నది. వజ్రాయుధము చేత ఛేదింపబడిన పర్వతము కూలునట్లు శిశుపాలునిశిరము క్రింద పడెను. పిమ్మట ప్రాయశ్చిత్త హోమము జరిగెను. ఎల్లవారికిని మర్యాదలు జరిగెను. వారువారు తమతమ నివాసముల కరిగిరి. అసూయాపరుడగు దుర్యోధనుడు జలముండు స్థలమును గుర్తించ లేక నీట మునుగగా నెల్లవారును నవ్విరి. స్త్రీలనడుమ నుండిన ద్రౌపది సహితము నవ్వెను. దుర్యోధనుని సమాధానపరచు విధ

[illegible]నాతని కరమును స్పృశించి నాతని ధనరేఖను తుడిచివేసెను. దుర్యోధనుడు స్వపురమున కరిగెను. రాజసూయయాగమును [illegible]ప్రకార్య మిట్లాచరింపబడెను. స్వామి భక్తుల విషయమున [illegible]డి అభక్తుల కవమానము గల్గించెను.

## కుచేలోపాఖ్యానము

శుకమహర్షి భగవత్కథలను పుంఖాను పుంఖముగ చెప్పు చుండినను పరీక్షిత్తు తృప్తిజెందక శుకు నుద్దేశించి నీ విదివరలో భగవంతుని యొక్క అనేకలీలావిశేషములను దుష్టనిగ్రహ శిష్టపరిపాలనాదికార్యములను వివరించితివి. తృప్తిమాత్రము కలుగ కున్నది. భగవంతుడిక నేయేకార్యములు చేసెను ? అని యడిగెను.

భగవచ్చరితమును విడువక చెప్పుచున్నాను. నీవును వినుచున్నావు. ఇట్లుండియు నీకు తృప్తి కలుగలేదా ? యని శుకు డడుగగా పరీక్షిత్తు ఈరీతి పలికెను. "శుకమహర్షీ ! వచించుటచేత నోటికి వాక్కు అని పేరు కలిగినది. దేనిని వచింపవలెను ? భగవంతుని కల్యాణగుణములనే చెప్పునది వాక్కుగాని, చెప్పనిది వాక్కు కానేరదు. చేయునదిగాన చేతికి కరమనిపేరు. చేయుటయన నెట్టి దానిని చేయవలెను ? పీట్లాడిన నది కార్యమగునా ? భగవత్కైంకర్యము చేయునదే కరము. తలచునది మనస్సనబడుచున్నది. స్థావరజంగమ రూపమగు ప్రపంచమున నంతర్యామియై వెలయు భగవంతుని దలచు మనస్సు మనస్సగును. లేకున్న దాని కాపేరెట్లు కలియుండును ? వినునది గాన కర్ణమనబడుచున్నది. వినరానట్టి కథలను వినుట యొక వినికి యగునా ? భగవత్కల్యాణ గుణములను వినునదే కర్ణమగును. వంగునది శిరమనబడును. భగవంతునికి నమస్కారము చేయకున్న నది శిరమగునా ? చూచుటచేత కన్ను చక్షువన బడును. చూడరాని దానిని జూచి

నరకమున బడునది కన్నెట్లగును ? భగవంతుని దర్శించునదే చక్షువగును. సంబంధపడునది గాన శరీరమునకు అంగమనిపేరు. సంబంధపడుటయన దేనితో సంబంధ మనుకొనవలెను; భగవత్పాద తీర్థముతో సంబంధము. భగవత్పాదజలమును పూసికొనునట్టిది శరీరమగును గాని చందనాదు లలదుకొని నంతనే యట్లనబడునా? (ఆత్మపోయిన పిమ్మట నీశరీర మమేధ్య మగునో, భస్మ మగునో లేక క్రిమికీటాదు లగునో యని నారదులుపల్కిరి). ఇత్యాది కారణ ములచేత మరియును భగవద్గుణానుభవమును కోరుచున్నాను. అని పలికిన పరీక్షిత్తు పలుకులు శుకు డాలకించి పరమానందభరితుడై శ్రోతయన నీయట్లేగదా యుండవలెను ? నాభాగ్యమే భాగ్యమని ప్రశంసించెను. కుచేలోపాఖ్యానమును భక్తిశ్రద్ధాపురస్సరముగ వినినటులైన మహాభాగ్యము గల్గును. భగవంతుడు భాగ్యము నిచ్చునా యనిన వేదాంతదేశికు లీరీతి దెలిపిరి. సాధారణముగ నొకయూరిలోనుండు విద్వాంసుడు దారిద్ర్య మనుభవించుచుండె నేని రాజా పండితునియెడ శ్రద్ధయుంచలేదని తాత్పర్యము. ఈ సంగతి నెఱింగియుండిన అకాలపురాజు మీకు కావలసిన సహాయము కోరుడని వేదాంతదేశికులకు వర్తమాన మంపెను. అందుల కాయన "స్వల్పవిషయమునకై యొకప్రభువును యాచింపవలెనా ? రాజనిన భూమికా ? స్వర్గమునకా ? ఏదో స్వల్పమును గోరి నీ వింద్రుడవు, చంద్రుడవు అని యొకమానవుని కొనియాడి వాక్కును చెఱచుకొనవచ్చునా ?" యని బదులు పంపెను. మీకు ద్రవ్యము కావలసిన పక్షమున నేమి చేతువని రాజడిగెను. అందుల కతడు "రాజా ! నాకా అక్కర గలుగదు. అట్లు కలిగినచో నాకోరికను కొనసాగించు ప్రభువొక డున్నాడు. సాధారణుడైనవాని ముఖో ల్లాసమునకుగా నెన్నియో యుపాయములను పన్నవలసియుం డును" అనెను. "నీవంటి దరిద్రునికి భగవంతుడు ప్రసన్న

డగునా" యని రా జడుగ నాకంటెను పరమదరిద్రుడు భగవంతు నాశ్రయించి కుబేరు డాయెను. అతడు కుచేలుడు. మే మిరువు రము ఉంఛవృత్తులము.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥

అను భగ. 9అధ్యా. 27వశ్లోకమున నీవు చేయునట్టి సకలకార్యములను నాకర్పణముచేయుమని భగవంతుని యాజ్ఞగాన నే నాభగవదాజ్ఞను శిరసా వహించి కాలము గడిపెదనని వేదాంతదేశికు లాయూరిజేనికి వర్తమాన మంపిరి.

కుచేలు డనునాతడు శ్రీగీతాచార్యునికి సఖుడు. అవంతీపుర వాసి; బ్రాహ్మణోత్తముడు; సార్థకనాముడై యుండెను. బ్రాహ్మణు డనగా పరబ్రహ్మమును తెలిసినవాడని యర్థము. కుచేలు డట్టి వారిలో నుత్తముడు.

శమోదమస్తప శ్శౌచం క్షాన్తిరార్జవమేవ చ ।
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మస్వభావజమ్ ॥

అను భగ 18అధ్యా. 42శ్లోకమట్లు జ్ఞానము గలవాడు జ్ఞానముండినను ఆశ యుండెనేని-

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః ।
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః ॥

భగ. 3అధ్యా. 31శ్లోకమట్లు యోగ్యతను తగ్గించును. కుచేలుడు కేవలము జ్ఞానిమాత్రమేగాడు. విరక్తు డునై యుండెను. విరక్తుడన పిచ్చివానియట్లు దేనియందునుఆశ లేకుండుట గాదు. వి=పరమాత్మయందు, రక్తుడు=ప్రేమగలవాడు అని యర్థము. విషయములందు మాత్రమే విరక్తుడు.

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥

భగ. 2 అధ్యా. 60 శ్లోకమువలె

మనసును బలాత్కారముగ నీడ్చునట్టి ప్రమాదము లైన యింద్రియములను జయించినవాఁడు, యదృచ్ఛాలాభసంతుష్టుఁడై భార్యతో గృహస్థాశ్రమధర్మము ననుష్ఠించుచుండెను. సకాలమున నిదుర లేచి సంధ్యావందన, ఔపాసన, అగ్నిహోత్ర వేదాంత ప్రవర్తనాది కార్యములను నెరవేర్చి తదనంతరము ఉంఛవృత్తివలన లభించిన దానితో భగవద్భాగవతారాధనము సల్పి భారతభాగవతాదిగ్రంథములను పారాయణము చేయుచు సదా భగవన్నామము నేమరకుండెను. ఆమహాత్ముని సద్గుణసంపత్తిని వినుటచే మహానందము కల్గుచుండినను ఆతనిదారిద్ర్యమును స్మరించునెడ కంటతడి యొదవును. గృహస్థాశ్రమధర్మములను నడపుటకు భార్యయొక్క అనుకూల్యముండవలయును. ధనికునికే యాభాగ్యము లభించును. దరిద్రుడగు కుచేలుని కీరీతి ధర్మానుష్ఠానము జరిగె ననగా ఆతని జన్మాంతరపుణ్యవిశేషముచేత నెట్లు భక్త్యాదులు లభించెనో అట్లే అనుకూలవతి యైన పత్ని లభించెను. అతనికిగల కల్యాణగుణము లన్నియు నామెకును ఉండెను. లేక యతనికన్న నెక్కుడుగుణశాలినియై యుండె ననియు చెప్పవచ్చును. ఆమెకు క్షుత్క్షామ అనగా ఆకలిగలది యని పేరు. ఆమె కాపురమునకు వచ్చినది మొదలు సదా ఆకలియే. ఉచితవిహిత సద్వృత్తిలో నుండు వీరిని పరీక్షింపగోరి భగవంతుడు వీరికొకపుత్రదాన మొసగెను. వీరు సన్మార్గముననే వర్తించగా భగవంతు డదిగని మరియును నిరువదియారుమంది బిడ్డలను ప్రసాదించెను. కుచేలుడా బిడ్డలకు నక్షత్రనామము లుంచెను.

కుచేలుడు తనయనుష్ఠానములు దీర్చుకొని ఉంఛవృత్తికి బయలుదేరు సమయమునకు ఊరివారు భోజనములు గావించి తాంబూలచర్వణము చేయుచుందురు. అట్లగుటచేత పోపొమ్మందురు. ఈ వైదికబ్రాహ్మణుడే వైదికమార్గము ననుసరించుచుండు

వారే యొసఁగిన ధాన్యము నింటికి గొనిపోయి మహాత్ముఁడగు కుచేలుని చేతిబియ్యము నైనను స్వీకరించి పరిశుద్ధు లగుటకు వచ్చి వాకిట నిలుచుండి యుండునట్టి శ్రోత్రియులను లోపలికి పిలుచుకొనిపోయి తెచ్చినదానిని గంజిగ కాచి వారిని సత్కరించి ఏమైనను మిగిలియున్న యెడల కుటుంబముతోడ ఆ యాహారమును స్వీకరించును. ఏమియు మిగులని పక్షమున ఇంటిల్లపాది సాలగ్రామ తీర్థమును పుచ్చుకొందురు. కౌపీనమునకును తగినంతగుడ్డ వారనాయాసముగ నిడికొనజాల కుండిరి. కుచేలు డీ విధమున నిత్యకర్మనుష్ఠానములను సల్పుచు భగవద్ధ్యానము చేయుచుండగా నతనిభార్య పతిపాదధ్యానముతో కాలము గడపుచుండెను. కుచేలుని బిడ్డలు క్షుద్బాధకు తాళజాలక అన్నమని తల్లిని మాటిమాటికి కడుగ నారంభించిరి. ఆ సాధ్వి తన బిడ్డలు పడుబాధ కన్నులార చూడజాలక భగవంతునిసన్నిధికిబోయి విన్నవించదలచెను. కాని పతికన్న దైవమును హెచ్చుగ భావించని యా పతివ్రతాతిలకము తా నట్లు కర్తృత్వము వహించరాదని యెంచి భర్తకే విన్నవించ దలచెను. అట్లు నిశ్చయించి ధ్యాన మొనర్చుచుండిన భర్తసమీపమునకు బోయి మహానందముతో గూడియుండు వీరినెట్లు మరలింతును ? అట్లు ధ్యానభంగము గావించిన యెడల నీ మహనీయునకు కోపము రాకమానదు. నాసతీత్వమునకే భంగము వాటిల్లు నని యెంచి తా నాచరింపబోవు కార్యమునకు విముఖురాలై మరలెను. మరియు తనబిడ్డల కష్టము నెట్లైనను మగనికి విన్నవింపవలసినదే యని నిర్ణయించుకొనెను. ఇట్లామె పతియొద్దకు, బిడ్డలయొద్దకు తిరిగి తిరిగి తుదకు పెనిమిటియొద్ద నిలిచియు పిలుపజాలకుండెను. అప్పు డా మహాత్ముని ధ్యానము చెదరగా నాతడు కన్నులు దెఱచి చూచి ధ్యానభంగమేల కావించితి వని కినుకతో బల్కెను. అపుడా సాధ్వి "నాథా! ఇంచుక శాంతముతో విందురేని విన్నవించెదను.

మీరు తక్క మాకు దిక్కెవరు ? సకల బంధువులు మీరై యున్నారు. మీతోతప్ప మరెవ్వరితో మొరపెట్టుకొందుము ?'' అని గద్గదస్వరముతో విన్నవించగా కుచేలుడు సంగతిదెలుపు మని యడిగెను. అందుల కామె "స్వామీ! ఆకటిబాధకు తాళ జాలని పిల్లలను జూడుడు. భగవంతు డీ బిడ్డలను నిర్భాగ్యురాల నగు నాగర్భమున బుట్టించె నని కన్నీరు నించెను. కుచేలు డా మాటలు విని యించుక యోజించి తనసతినిజూచి "నీవు వీరినిగూర్చి నాతో చెప్పవచ్చితివి. వారెవరు ? వారికిని, నీకును సంబంధ మేమి? పూర్వకర్మ ఫలము ననుభవించుటకే గదా వారిచ్చట జన్మించిరి ? ఇన్ని దినములుగ వేదాంతమును వినుచుండియును మూఢురాల పగిది పలికితివిగదా ! నన్ను పెండ్లాడినందున నీకు ఆత్మజ్ఞానము పూర్ణముగ గలిగియుండునని తలంచితి'' నని చెప్పి "ప్రభూ ! ఈమెకు ఆత్మజ్ఞానము ప్రసాదింపరాదా" యని దైవమును ప్రార్థించెను. అందుల కామె "నాథా ! నేను విన్నవించవచ్చిన విష యము వేఱు. మీరు దానిని సావధానముగా వినవలెను. తపము గావించినను రానట్టి మహానుభావులు తాముగ మనయింటికి వచ్చిన పుడు వారికి షడ్రసోపేతముగ నన్నముపెట్టవలసి యుండినను మన మా భాగ్యమునకు నోచుకొనక గంజిపోయుచున్నాము. ఇది నామొదటి దుఃఖము. భగవన్మహిమములను సదా మీనోట విను చున్నాను. మహాప్రభువగు భగవంతునికి మీరు జలముతోడనే షోడశోపచారములు సల్పుచున్నారు. భగవత్తత్త్వము తెలియనివా రెన్నివిధములనో ఆరాధించుచుండగా వానివిభవము తెలిసియున్న వారెంతగ పూజించవలసియుండును ? మన మిందుకు నోచుకొనక పోయితిమే యని నా రెండవ దుఃఖము అని యామె భగవద్భాగ వతారాధనము బాగుగ జరుపవలయు ననియు అందులకే సంపద కావలయు'' ననియు విన్నవించగా ఆ రెండు కార్యములు యథా

విధిగ జరుగనందున గలుగు దుష్కీర్తి నాకే కలుగును గాన నీకా విషయమై చింతకలుగ నవసరము లేదని కుచేలు డాతని ధర్మ పత్నికి దెలిపెను. అందుల కామె "నాథా! భర్త యెట్టివాడైనను భార్య యాతని ననేక విధముల బూజించుచుండును. వేదశాస్త్రము లతో నిండియుండు కుక్షిగల మీకు మంచిభోజనము పెట్టుటకు నోచనైతి గదా యని మహాదుఃఖముగ నున్న" దనెను.

భగవద్భాగవతారాధనము చక్కగ జరుగలేదనుచింత నీది కాదని కుచేలుడు తెలుపగా నామె భర్తయగుమిమ్ము తగువిధమున పూజింపగోరుచున్నా నని యామె పలికెను. అందుల కాతడు నన్నిపుడేమి చేయు మందువని యడుగగా "నాథా! సాక్షాల్లక్ష్మీ పతి మీ సఖుడై యున్నాడు. బ్రాహ్మణులయందు ప్రియముగల ప్రభువతడు. 'శరణన్నవారల సకల దుఃఖములను పోగొట్టుదు' నని దీక్షవహించిన యాతడు మాటలాడుచు ద్వారకయందు ప్రకాశించు చున్న పరబ్రహ్మస్వరూపుడు. అట్టివానిని దర్శించి రండని చెప్పెను.

కుచేలుడు తన భార్య మాటలు విని శ్రీకృష్ణాశ్రయముచేత మనకు సంపదగలుగునా యని యడుగగా "నాథా! మీరాతని సందర్శించి నిన్నుమించిన శ్రీమంతుడును, నన్ను మించిన దరిద్రుడును లేడని విన్నవించిన యెడల నతడు తప్పక సంపద లొసగును. నమ్మినవారికి సాయుజ్యము గూడ ననుగ్రహించు ప్రభువుగదా! నేనీసంగతి మీయనుగ్రహము చేతనే గదా తెలియ గల్గితిని. మనమాతనితో చేరినవారము. అతడు మనకు ప్రభువు. మనలను రక్షింప నితరులకు గాదు. ఆతడు మహాస్వామియు, దాత యునై యున్నాడు. అడుగనితప్పు మీదియగును గాని, ఆతనిది గాదు అని యా పతివ్రత బదులుచెప్పెను. శ్రీకృష్ణమూర్తి బాల్యస్నేహమును మరవకుండునా? అట్లు మరచి యుండిన

మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।
వివిక్తదేశసేవిత్వ మరతిర్జనసంసది ॥

భగ. 13అధ్యా. 10శ్లోకమునందు చెప్పబడిన భక్తి క్రమముగ గల్గును. క్రొత్తగ కాపురమునకు వచ్చిన కాంతకు పతియందు భక్తిలేకుండినను బాధకము గాదు. కాలక్రమమున నామెకు భక్తి కల్గును. అత్తగారింటికి వచ్చిరాక మునుపే పరపురుషునిమీద కన్నుపడినటులైన నాస్త్రీ కెన్ని జన్మములకైనను పతిభక్తి కలుగునా ? అట్లే భగవంతునియం దవ్యభిచారమైన భక్తి యుండవలయును. ఇట్టి దృఢభక్తిగల భాగవత శిఖామణియగు భార్య యుపదేశమును విని కుచేలుడు శ్రీకృష్ణ సందర్శనార్థము పోదలచెను. నృపదేవగురు దర్శనార్థము వెడలునపుడు వట్టిచేతితో పోరాదనియు శ్రీకృష్ణమూర్తి తన కన్నివిధముల సంబంధపడినవా డనియు తలంచి యిట్టివాని నుత్తచేతులతో పోయి దర్శించుట తగదని యెంచి భార్య నేదైన నిమ్మని యడిగి ఆమె లేదనిచెప్పునేమో యను శంక గలిగి, యేమియు లేదనకుము. స్వామి దర్శనమునకై వెడలుచున్నాను గనుక నేమియు లేకుండదు. చూచి తెమ్మని భార్య నాజ్ఞాపించెను. భర్తయాజ్ఞగొని యా క్షుత్క్షామి యాచనకై వెడలి యొకయింట నొకస్త్రీ పారవేయుచుండిన రాళ్లురప్పలతో గూడిన పిడికెడటుకులను తన కిమ్మని యడిగి పుచ్చుకొని మరియు నాల్గుచోట్ల దిరిగి నాల్గుపిడికెళ్లు సంపాదించి యిల్లుసేరి జీర్ణవస్త్రమున వానిని మూటగట్టి భర్తచేతి కిచ్చెను. కుచేలుడా మూట నెత్తుకొని ద్వారకానాథుని ధ్యానించుచు ప్రయాణమై పోవుచుండగా వామగరుడదర్శన మాయెను. తప్పక భగవద్దర్శన మగునని సంతోషముతో బోవుచుండగా నెదుట వేదపారంగతులైన బ్రాహ్మణుల దర్శన మాయెను. కుచేలుడు దృఢముగ భగవద్దర్శన మగునని తలంచుచు పోయెను. కుచేలుడట్లు పోవుచు

శ్రీకృష్ణదర్శన మగుట దుర్లభము, పదునారువేల నూట యెనమండుగురు భార్యలుగల యాత డేభార్యయింట నుండునో యని యెంచి "స్వామీ! నీవు శ్రీమంతుడవు, నేను పరమ దరిద్రుడను. అణువులో నణువై మహత్తునకు మహత్తై యుండు వాడవు. కాన నామొరాలకించి నీదర్శనము, ఆలింగనము నొసంగుము అని విన్నవించి స్వామియొక్క పాదాదికేశపర్యంతము సేవింపబోవు చున్నాను గదా! ఆ ప్రభునితోడ భుజింపబోవుచున్నాను గదా! ఆతని నాలింగనము చేసికొనబోవుచున్నాను గదా! యని పరమానందము నొంది యట్టిభాగ్యమునకు తన భార్యయొక్క ప్రేరణయే కారణ మగుటచేత నామెబుద్ధి యెంతటిదోగదా! యని మెచ్చి జన్మాంతరమున నేబ్రాహ్మణుని కొకపూట భోజనము పెట్టితినో లేక నేజేసిన అష్టాక్షరమంత్రప్రభావమో, లేక నేనొనర్చిన యే పుణ్యకార్యఫలమో భగవద్దర్శనాదులను గలిగించుటకు కారణ మని తలచుకొని దారిద్ర్యసముద్రమును నేటితో దాటబోవు చున్నాను గదా!" యని యనుకొనెను. ఇట్లు తలచి తలచి లేచి నిలిచి నడుమునకు వస్త్రము గట్టి "దారిద్ర్యాయ నమస్తుభ్యం" దారిద్ర్యమా! నీకు నమస్కారము. నీవు మాయింట వాసము చేయుచుండుటవలనగదా నాభార్య నన్ను కృష్ణదర్శనమునకు ప్రేరేపించెను. నీవు లేకున్న పక్షమున నాపతి వృద్ధులగు మీరేల పోవలయును. ఇష్టమున్నచో ఆ కృష్ణునే రానిండనునుగదా! యని యక్రూరుడు కంసునికి చేసినట్లు దారిద్ర్యమునకు నమస్కారము చేసెను. "బహుదినములుగ మాయింట తిష్ఠవేసిన ఓగొప్ప దారిద్ర్యమా! మమ్ము విడిచిపోయెదవా" యని కుచేలుడు దారిద్ర్యమునకు నమస్కరించె ననియు, భగవద్దర్శనము చేయించునది గాన దారిద్ర్యము గొప్పదనియు, వేడుకకొరకైన యొకయర్థము చెప్పబడెను. కుచేలు డీరీతి దలంచుచు ద్వారకసమీపమునకు

బోయి యెదురుపడిన జనులను జూచి "స్వామీ! నావంటివారి కేమైన నిచ్చునా" యని యడిగెను. అందుకు ఆటంకములేదని వారుత్తర మిచ్చి తమదారిని పోయిరి. కుచేలుడు ద్వారకకు ప్రయాణమై పోవుచుండిన యొకనావను జూచి నిలుపు డనగా నది కదలినందున నావికులు నిలుపలేదు. కుచేలు డొక్కగంతువేసి యా నావ నెక్కెను. అందున్నవా రాతని పిచ్చివానిగ భావించి పరిహాస మునకై కాసెక్కడ యని యడిగిరి.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥
భగ. 15అ. 12శ్లో

సూర్యచంద్రుల కంటెను ప్రకాశమానుడైన స్వామిని వారు ప్రకాశించుచున్నాడని చెప్పినారని యెంచి కుచేలు డానందముతో వారిని కౌగిలించుకొనెను. ధనమేమైననిచ్చునా యని యడుగుటకు మారుగ కుచేలుడు వారికి పిడికిలిని జూపెను. నావనెక్కినందులకు సెంతద్రవ్య మిమ్మందురని కుచేలు డడుగుచున్నాడని యెంచి నావికులు వీసెడు రూప్యము లనిరి. వి=అనగా గరుడుడని యర్థము. ఈశుడనగాస్వామి. వి + ఈశ= అనగా గరుడధ్వజుడగు స్వామి యనియు, ఆతని దర్శనమగునని వారని రనియు భావించి కుచేలుడు వారినాలింగనము చేసికొనెను. ఇట్లు నౌకాయాత్రచేసి కుచేలుడు ద్వారకాపురిచేరి నవరత్నఖచితమైన గృహములతో గూడిన వీథులు మొదలగు వానిని జూచెను. అందు శ్రీకృష్ణమూర్తి యొక్క దివ్యసౌధమును తిలకించి యందు ప్రవేశింప దలచెను. రాజసతామసులగు జనులవాసముచేత కొంత యపరిశుద్ధమై యుండు తనపట్టణమును పరిశుద్ధపఱచవలయునని హృషీకేశుడు సంకల్పించగా నతనిసంకల్పముచే కుచేలుని మనస్సునకుద్వారకా పట్టణమందలి వీథులను జుట్టిరావలెనని బుద్ధి పుట్టెను. శ్రీకృష్ణమూర్తి

కుచేలునికి ముందుగా తనదర్శన మిచ్చి పిదప నూరినిచుట్టి రమ్మనరాదా యన్నచో తనదర్శనమైన పిమ్మట నతడు గొప్పరథమున గూర్చుండవలసియుండు ననియు అపు డాతని పాదస్పర్శకు మార్గము లేదనియు భావించి స్వామి ముందుగనే యతని కట్లు తోపింపజేసెను. హృషీకేశునిసంకల్పముచేత కుచేలుడు ద్వారకాపురిని జుట్టివచ్చునట్లు నిశ్చయించుకొని పోవుచుండగా ఒకచోట యజ్ఞము జరుగుచుండెను. దానిని దర్శింపనెంచి యచటి కరుగగా-

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ॥
అని భగ. 5అధ్యా. 29శ్లోకమందును-

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మా మభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే ॥
అని భగ. 9అధ్యా. 24శ్లోకమందును

చెప్పబడిన సర్వయజ్ఞప్రవర్తకుడును, సర్వయజ్ఞస్వరూపుడును, సర్వయజ్ఞభోక్తయు, సర్వయజ్ఞఫలప్రదాతయు నగు భగవంతుడు నవరత్నఖచితమైన సింహాసనమున గూర్చుండి యుండుటను జూచెను. మరియొకచోట వివాహము జరుగుచుండగా నచ్చటగూడ స్వామివైభవముతో నొప్పుచుండెను. ఇంకొకచోట నాట్యము జరుగుచుండగా భగవంతుడు చూచుచుండెను. ఇది తగునా యని కుచేలుడు తొందరపడక యోజించగా నచట దాసీజనములు దేవదేవుని పాడుచుండిరి. కుచేలుడు స్వామికిని, వారికిని దండ మిడి తనదారి నరుగుచుండగా నొకచోట శాస్త్రవిచారము, వేఱొకచోట అధ్యయనము జరుగుచుండెను. ఇంకొకచోట సంగీతము ప్రవర్తిల్లుచుండెను. ఊరియందు జరుగు వైభవములను, అందందు వేంచేసియున్న భగవంతుని తిలకించుచు వెడలి కుచేలుడు శ్రీకృష్ణమూర్తి మందిరము వాకిటకువచ్చి నక్షత్రమండలములో చంద్రమండలము

మరి ప్రకాశించుచున్న మాధవుని సౌధమును గాంచెను. కుచేలుడు లోపలి కపుడు వలయు నని తలంచి నవరత్నఖచితమై యుండు ఆ యింటిలో వారికొరకు సంకోచించి కన్నుల కద్దుకొనెను. శ్రీకృష్ణ మూర్తి ద్వారపాలకులను జూచి వీరు నన్నెట్లు లోపలికి పోనిత్తు రని సందేహించెను. కుచేలుడు లజ్జాభయములతోడ మెల్లమెల్లగ లోపలికి ప్రవేశింప నారంభించి సప్తద్వారములను దాటుకొనుచు పోగా మేలిమి బంగారమైన నాల్గుగొలుసులు కట్టిన ఉయ్యాలయందు శ్రీకృష్ణ మూర్తి కూర్చుండగా శ్రీరుక్మిణీదేవి యూచుచుండెను. కుచేలుడు రుక్మిణీకృష్ణులను జూచి వారియొద్దకేగ సంకోచించి వెనుకకు తిరిగెను. శ్రీకృష్ణు డంతరాత్మ యగుటచేత కుచేలుడు వచ్చినసంగతి తెలిసియుండియు భార్య నెందుకు చెంత నుంచుకొని యుండెననగా ఐశ్వర్యము కలుగుటకు కారణము లక్ష్మీకటాక్ష మగుటచేత మహాలక్ష్మి యగు రుక్మిణీదేవి కటాక్ష మా కుచేలునిపై బడుటకు భార్యతోడ నుండెను.

కుచేలుడు వెనుకకు పోవుట గని భాగవతాపచారము గల్గునని ఉయ్యాలదిగి త్వరితముగ నరిగి యతనిని గాఢాలింగనము గావించుకొని యీ సుదినమున నెవ్వనిముఖము జూచితినో మహనీయుడగు విప్రోత్తముని దర్శన మాయె ననియు, అట్టి యనుభవము లభించి మహాదినము లాయె ననియు ఆతనితో జెప్పెను. రెండు కనులందు ఆనందబాష్పముల నింపి యతనిచేతిని బట్టుకొని పిలుచుకొనిపోయి కూర్చుండు మని చెప్పెను. తనకు తగినస్థలమెచ్చట నున్నదని యోజించుచు కుచేలుడు నిలబడియుండగా స్వామి మీకు తగినది లేదనుకొంటిరా ?

ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।
ఆస్థితస్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥

భగ. 7అధ్యా. 18శ్లో అనునట్లు నాకును,

మీకును భేద మేమున్నదని చెప్పి కూర్చుండు మనగా కుచేలు డా యుయ్యేలను కంటితో నద్దుకొనెను. శ్రీకృష్ణమూర్తి బలాత్కారముగ కుచేలుని తన యుయ్యేలలో గూర్చుండబెట్టి బంగరుపళ్లెరమును దెచ్చి రుక్మిణి జలమును పోయుచుండగా నతనిపాదములు మంత్రపూర్వకముగా గడిగి శిరమున ప్రోక్షించుకొనెను.

"పరీక్షిన్మహారాజా ! గమనింపుము. నామోచ్చారణ, స్మరణ, దర్శన, స్పర్శనములచేత దురితము లడచునట్టి గంగకు తనపాద స్పర్శచేత మహిమము గల్పించిన ప్రభుడు లోకక్షేమార్థము—

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥

అను భగ. 3అధ్యా. 21శ్లోకమట్లు అనుష్ఠించి చూపెను. స్వామి రుక్మిణిని స్వయముగ వంటచేయుమని ఆజ్ఞాపించి తాను కుచేలుని పాదములు నొత్తుచుండెను. రుక్మిణీదేవియు, అంతఃపురస్త్రీలును ఈ చర్యను జూచి యాశ్చర్యపడి యెట్టి బ్రాహ్మణదర్శన మాయెనని యనుకొనిరి. శ్రీకృష్ణమూర్తి కుచేలుని జూచి "అన్నా ! రుక్మిణి యెన్నడును పాకముచేసి యెఱుగదు. అందుచేత భోజనమునకు ఆలస్య మగును. నేనంతవరకు ఆకటికి తాళలేను. నీవు వట్టిచేతులతో వచ్చియుండవు. నీ విచ్చి నేను భుజించిన విశేషము, లేక మహాపతివ్రత యీయగా మీరు తెచ్చినదానిని భుజించుట విశేషము. తెచ్చినదాని నేరీతి నిత్తునని సంకోచించ వలదు.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః ॥

భగ. 9అధ్యా. 26శ్లోకమట్లు నేను పరమ సులభుడను అని యెన్నివిధముల జెప్పినను కుచేలు డటుకుల మాటను తియక తన్ను, స్వామిని, రుక్మిణీదేవిని, ఇతరస్త్రీలను

ఏనాటినా జూచుచుండెను. "ద్రవ్యాశయుండిన నిత డిదివరకే నాయొద్దకు వచ్చియుండును. భార్యను సంతోషపెట్టుటకై యీత డిప్పుడు వచ్చియున్నాడు. ఆ పతివ్రతను సంతోషింపజేయవలయును" అని యెంచి శ్రీకృష్ణమూర్తి కుచేలుడు మూసియుంచుకొనిన యటుకులమూటను బలాత్కారముగ గుంజుకొనగా జీర్ణవస్త్రమగుటచేత చినిగి అటుకులెల్ల క్రిందపడెను. ప్రసాదము క్రింద పడెనని చెప్పుచు స్వామి అటులనేరి బంగరుపళ్లెరములో పోసి యొకపిడికెడు నోటవేసికొని "సఖా! యింతరుచిగల పదార్థ మగుటచేతనే నీవింత బిగువుచేసితి" వని చెప్పి రెండవపర్యాయ మటుకులనెత్తి నోట వేసికొన బోగా వంటచేయుచుండిన రుక్మిణీదేవి పరుగెత్తుకొనివచ్చి శ్రీకృష్ణుని చేతిని పట్టుకొని వలదనెను. కారణమేమని స్వామి ప్రశ్నింపగా ఈతనికి వలసినదాని నిచ్చుటకు మీవద్దస్థితియున్నదా? యోజించుకొను డని రుక్మిణి పల్కెను. మోక్ష మిచ్చెద నని స్వామి తెలిపెను. ఆ పదవి యీ బ్రాహ్మణునికే యుండు. మీరొక్కసారి స్వీకరించుటతోడనే యీ బ్రాహ్మణునికి సకలము లభించెను. మరియొక పర్యాయ మీయటుకులను స్వీకరింతురేని నేను వారియింటనే వసింపవలసివచ్చును. ఆయటుకులను నాకిండని చెప్పి రుక్మిణి తానొక్క పిడికె డటుకులను భుజించెను. దీనిని గాంచుచుండిన సకలదేవతలును పుష్పవృష్టి గురియించిరి. శ్రీకృష్ణుడు కుచేలుని స్నానాహ్నికములు చేయించి నవరత్నఖచిత పీఠముపై అతనిని గూర్చుండబెట్టి అతనితో గలసి భుజించి, భోజనానంతర మతనిని తన పడకపై పరుండజేసి పాదసేవ జేయుచు సంభాషించెను.

"అన్నా! చిన్ననాడు మనము కాశీక్షేత్రమున సాందీపుని యొద్ద విద్యాభ్యాసము చేయుచుంటిమిగదా! ఒకనాడు సమిధలను తెచ్చుటకై పోయిన మనము వర్షము వచ్చినందున నా

వనప్రదేశములోనే పరుండితిమి. మన గురుపత్ని మనయిరువురికై యిచ్చియుండిన అటుకులను నీ వాకలి చేత నాకియక భుజించితివి గదా! నే నా రహస్యమెఱిగి నీవుతినిన నాపిడికెడటుకులు నాకు వచ్చువరకు నీ వల్లాడవలయు నని శపించితిని. ఇపుడు నాయప్పు తీరెను. నీ దారిద్ర్యము తొలగిపోయెను'' అని చెప్పి ఇకనీవు పోయి రావచ్చును అని పల్కెను. చంచలస్వభావముగల లక్ష్మి స్థిరముగ నుండుటకై కోరి స్వామి కుచేలుని వస్త్రమును తనపెట్టె యం దుంచియుండెను. కుచేలుడు కట్టుకొనియుండిన పీతాంబర మును తీసియుంచుమని చెప్పి యతనిజీర్ణవస్త్ర మాతని కిచ్చి వేసెను. కుచేలుడు తనవస్త్రమును గైకొని "వస్త్రమా! రమ్ము. ఈలోకమున నన్నువదలనివా రిరువురే. శ్రీకృష్ణుడును, అతని దర్శనమైన పిమ్మటగూడ వదలని నీవును. భగవంతునికి వేయి కన్నులు. నీకనులకు లెక్కయే లేదు. అతడు పురాతనుడు. నీవును పురాతనమైనదానవే. భగవంతు డాద్యంతరహితుడు. నీవును అటులే యున్నావు—'' అని చెప్పి వస్త్రమును గట్టుకొనెను.

[అనేకగుణసంయుక్తం సహస్రాక్షం పురాతనమ్ ।
అద్యంతరహితం వందే మద్వస్త్రసదృశం ప్రభుమ్ ॥

తనవస్త్రమునకు సాటియైన శ్రీకృష్ణపరమాత్మకు నమస్కరిస్తున్నాను అని కుచేలుడు పల్కినట్లు పండితవ్యవహారములో నున్న శ్లోకమిది.]

ఆహా! నేనెక్కడ?

మహాలక్ష్మికి నివాసస్థానమగు వక్షఃస్థల మెక్కడ? కృష్ణుడు నన్ను కౌగిలించుకొనెనుగదా! యని తలచుచు కుచేలుడు ప్రయాణ మాయెను. పరమదరిద్రుడ నగు నాకు ఐశ్వర్య మొసగిన యెడల నేను భగవంతుని మరచి భాగవతాపచార మొనరింతు నని యోజించియే స్వామి సంపద యీయలేదని యెంచుకొనెను. కుచేలు డిట్లు

స్వామిని ధ్యానించుచు పోయి అవంతిపురి చేరి ద్వారకాపురి యట్లు ప్రకాశించుచుండిన దానిని గాంచి, మరల పోయి ద్వారకను జూచి యిటు తిరిగి యటుతిరిగి కడపట తన యూరని జనులవలన దెలిసి పోవుచుండగా క్షుత్క్షామి భర్త రాకను దెలిసి సకలాభరణభూషితురాలై యిరుపార్శ్వములం దిరువురు సఖులు గొలువ భర్త కెదురేగెను. ఆమె భగవంతునిచేత బంపబడిన లక్ష్మి యతని కెదురేగునట్లుండెను. కుచేలు డామెను గుర్తించలేక దూరముగ తొలగెను. ఆమె భర్తను సమీపించి నమస్కరించగా నతడు "దీర్ఘసుమంగళీ భవ" యని యాశీర్వదించెను. అపు డామె నన్ను గుర్తించలేదా యని భర్త నడిగి అంతలోపల భగవంతుడు కుచేలుని తనయట్లు చేయగా మిమ్ముగూడ చూచుకొనుడని చెప్పెను. శ్రీకృష్ణునియట్లు కుచేలుడును, రుక్మిణియట్లు క్షుత్క్షామియు, ద్వారకయట్లవంతియు మార్పునొందెను. భగవంతు డీరీతి సారూప్య మొసగెను. అనేక వాద్యవిశేషములతో వారు ఊరేగింపు చేసిరి.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥
భగ. 9అ- 22శ్లోకము

తన్ను ధ్యానించుచుండిన కుచేలుని యోగక్షేమములను శ్రీకృష్ణమూర్తి వహించియుండెను.

## శ్రీకృష్ణ-బలరాముల మహిమము

శ్రీకృష్ణమూర్తి శిశుపాలవధ గావించిన పిమ్మట కొన్ని దినములు పాండవులతోడ నింద్రప్రస్థమున నుండగా-సాళ్వుడు మన పట్టణమును ముట్టడించియున్నాడు, అక్కడ కార్యము సమాప్తియై యుండెనేని వెంటనే రావలయు నని పుత్రుడగు ప్రద్యుమ్నుడు వర్తమానము బంపెను. అంత శ్రీకృష్ణుడు ద్వారకాపురి కేగెను. సాళ్వుడు శ్రీకృష్ణమూర్తి యూరిలోలేని సమయము జూచి ద్వారకా

పట్టణమును ముట్టడింపగా శ్రీకృష్ణుని కుమారు లందరు యాదవుల తోడ కలిసి యుద్ధ మొనర్చి మేటి రాక్షసు డగుటచేత వానిని జయింపలేక కృష్ణునకు తెలియపరచిరి. సాళ్వు డనువాడు పరమ శివునిగూర్చి తపము గావించి యతని యనుగ్రహమున నవరత్న ఖచితమైన సౌభకమను విమానమును బడసెను. ఆ విమాన మొక పట్టణము రీతిగా ప్రజల కెల్లను వాసయోగ్యముగా నుండి ఇతరుల కగోచరమై తలచినచోటి కెల్ల నెగిరిపోవునట్టిదిగా నుండెను. సాళ్వు డీ విమానము నెక్కి ఒక్కొక్కపట్టణముపై బడుచు జగత్తు నంత యును నాశము గావించుచుండెను. యాదవులకును, సాళ్వునికిని పరస్పరవిరోధ మగుటచేత వాడు నిర్భయముగ సంచరించుచు ద్వారకకు వచ్చెను. శ్రీకృష్ణుడు సారథియగు దారుకుడు నాల్గు గుఱ్ఱములపూన్చిన రథమున గూర్చుండి సాళ్వునితో పోరుట కారం భించెను. సాళ్వుడు విమానముతోడ పరుగు లిడుటను జూచి రథ మును వీడి తనభావము నెఱిగి వచ్చిన గరుడుని మీద శ్రీకృష్ణు డారోహించెను. సాళ్వుడు విమానముతోడ నొక్కొక్కసారి ఆకాశ మున, మఱొక్కసారి భూమియందు, వేరొకసారి పర్వతముమీద, ఇంకొకసారి సముద్రమధ్యప్రదేశమున తిరుగుచుండెను. ఇట్లు చేసి జగమంతయును చుట్టివచ్చెను. గరుడారూఢుడైన శ్రీకృష్ణమూర్తి యును వానివెంబడి తరుముచు బోయి యుద్ధము చేసి చూచెను. కృష్ణమూర్తి శస్త్రాస్త్రముల నెత్తులోపల వాడు నిలువక మరియొక చోటికి పోవుచుండుట గని, విమానముండునంతవఱకు పీనింబట్టుట అసాధ్యమని యెంచి కౌమోదకి యను తనగదతో వాని విమానమును గొట్టెను. అపు డావిమానము పొడిపొడి కాగా సాళ్వుడు స్వామి యెదుట నిలిచెను. నీ విమానము పొడిపొడి యాయెను, నీవును రమ్మని స్వామి పలుకగా విమానము పోయిన నేమి? నాగద యుండ లేదా? యని బింకములు పలుకుచు సాళ్వుడు గద

నెత్తెను. శ్రీకృష్ణమూర్తి యూరక చూచుచుండి వాడు సమీపమునకు రాగానే బాణము వేసెను. తోడనే పళపళమను గదతోడ వాని భుజము ఛేదింపబడెను. శ్రీకృష్ణ భగవానుడు చక్రము నెత్తుకొనెను. కోటిసూర్యప్రకాశమానమగు చక్రమును కృష్ణమూర్తి ధరించగా పర్వతసదృశుడై యుండిన యతని మీద ప్రళయకాల సూర్యోదయ మైనట్లుండెను. స్వామి క్రింద, చక్రముపైన నుండగా ఉదయ పర్వతము సూర్యులయట్లుండెను. శ్రీకృష్ణమూర్తి యిట్టిప్రకాశ మానమైన తనచక్రముచేత వానిశిరశ్ఛేదము గావింపగా దివ్యకిరీటముతో గూడి యది క్రిందపడెను. దుష్టశిక్షణమునకై యవతరించిన వాడు గాన స్వామి వానిని సంహరింప శక్తుడాయెను. ఇంద్రుడు వజ్రాయుధముచేత వృత్రాసురుని జంపినట్లు శ్రీకృష్ణమూర్తి సాళ్వుని జంపగా హాహాకారములు చెలరేగెను. సాళ్వుడను మహాసురుని శ్రీకృష్ణమూర్తి సంహరించగా దేవత లెల్లరును "వీనినెట్లు జంపనగును ? వీ డేరీతి చచ్చు నని యోజించుచుంటిమి. ఇంతలో వీనిని స్వామి సంహరించె"నని సంతోషించిరి. విశ్వావసు ప్రభృతులు గానము చేసిరి. పుష్పవృష్టి గురిసెను. అప్సరసలు నాట్యమాడిరి.

రాజసూయ యాగకాలమున దుర్యోధను డవమానము చెంది ఖిన్నుడై తన యూరుచేరి పాండవులను జూదమున నోడింప దలచి యొక మండపమును నిర్మించి తనకోరికను కొనసాగించుకొనెను. శ్రీకృష్ణమూర్తి సాళ్వయుద్ధానంతరము పాండవులక్షేమ సమాచారము తెలియలేదని యోజించుచుండగా నతనియొద్దకు ఒకయాచకుడు వచ్చి మహాపాపియగు దుర్యోధనుని వలన పాండవులు జూదమున నోటువడి భార్యాసహితముగ కాననముల కేగిరను సంగతి తెలిపెను. శ్రీకృష్ణుడు మనుష్యలీల ననుసరించి దుఃఖించి దారుకుని రథము దెమ్మని చెప్పి సమర్థులాలును, ప్రేమాస్పదు

రాలును అగు సత్యభామతోడ పయనమై వనమున కేగి యందు ద్రౌపదితోడ పరమదీనస్థితిలో నున్న పాండవులను జూచుటకు రథము దిగి, బావా యని యేడ్చెను. భగవత్సంకల్పమున కేమి చేయ నగునని వారే కృష్ణస్వామి నోదార్చిరి. కృష్ణుడు ధర్మరాజా దులను జూచి "మీ కీకష్టము తటస్థించుట నే నెఱుగను. అట్లెఱిగి యుండిన యెడల మిమ్మీరీతి విడిచియుందునా ?" యని పలుకగా వా రాతనితో "కృష్ణా ! నిన్ను జూడక పదుమూడు వత్సరము లెట్లు గడుపుదు మనియు, నీదర్శనము చేయలేకయే బయలువెడ లితి మనియు, చింతించుచుంటిమి. నీదర్శనమున మాకీచోటు స్వర్గ ముగ నున్నది గాని వనముగ లేదు. అపుడపుడు నీదర్శన మగు చుండెనేని మాకీ యిడుమలు తెలియవు. మేము వనములందు చరింపబోవుచోటులను నీకు తెలియపఱచజాలము. సర్వేశ్వరుడ వగు నీవే తెలిసికొని వచ్చుచుండవలయును. అపుడె మాదుఃఖము వీడి పోవు" ననిరి. సత్యభామయును ద్రౌపదిని గాంచి "అమ్మా ! ఎట్టి అవభృథస్నాన మాచరించితివి. ఇంతలో నెంతటి కష్టము సంభ వించెను ?" అని దుఃఖించి ఈపదుమూడువర్షములు గడచిన పిమ్మట పట్టపురాణి వగుదువు లెమ్మని ఆమె నోదార్చెను. ద్రౌపది సత్యభామను జూచి "అమ్మా ! వస్త్రాభరణములు మొదలగువాని చేత నాకు సుఖము గలుగదు. వనవాసమైన నేమి ? పట్టణవాసమైన నేమి ? సుఖదుఃఖములు పురుషులకే. నాయేవురు భర్తలును నాతోడ నుండ నాకేటి దుఃఖము ? మీరు మాత్ర మపుడపుడు వచ్చు చుండవలయు" నని చెప్పెను. స్వామి సత్యభామతోడ వారికి సమాధానము చెప్పి ద్వారకాపట్టణమునకు బోయి పదునాఱువేల నూటయెనమండుగురు భార్యలతో సుఖముగ నుండి దుష్టశిక్ష ణము, శిష్టపరిపాలనము చేయుచుండగా నొకనాడు యాదవబాలు రెల్లరును ఆడుకొనుచుండి యచటనొక పాడువడ్డ బావిలో నీరున్న

దేమో చూత మని తలంచి తొంగిచూచి యందు పర్వత సదృశమై యుండిన యొక ఊసరవెల్లిని గాంచి దానిని మరియొక మంచి స్థలమున విడువదలచి త్రాళ్ళుగట్టి లాగిరి. అది కదలలేదు. ఆ వనమం దుండిన తీగలనెల్ల త్రాడుగ పేని యీడ్చి చూచిరి. ప్రయోజనము లేకపోయెను. అపుడా బాలు రెల్లరును శ్రీకృష్ణ మూర్తి యొద్దకేగి ఆయూసరవెల్లి సంగతిని దెలిపి శూరులగు మావలన దానినెత్తుటకు కాలేదని విన్నవించిరి. శ్రీకృష్ణ డాబాలుర తోడ నా బావికడ కరిగి తనముం దొకసారి ప్రయత్నింపు డని బాలుర నాజ్ఞాపించి వారివలన శక్యము గాకుండుట గని తన వామ హస్తమున దానినెత్తి పాఱవేసెను. అందుచే నతనికి చెమ్మట గాని, శ్వాసము గాని కల్గెనా ? లేక దట్టికట్టి శ్రమపడి యెత్తెనా ? యనిన నెంతమాత్రము కాదు. అతడు దానినొక తృణముతో సమానముగ నెత్తి పాఱవేసెను. ఆ యూసరవెల్లినుండి ఒకతేజము పొడమి ఆకసమున కెగిరి పోయెను. అట్లు సూక్ష్మముగ పోయి ఘళఘళ మెరసి దివ్యకుండలాదులు ధరించిన యొకరాజు గగనమున గాని పించెను. శ్రీకృష్ణమూర్తి యతనిం జూచి "రాజా ! నీ వెవరవు ? నీ పేరేమి ? ఊ రెయ్యది ? తెలుపు" మని యడుగగా నతడు "నేను సూర్యపౌత్రుడను. వైవస్వత మనువు పుత్రుడను. నృగ మహారాజును. నాపేరు మీరు వినియుందు" రని పలికెను. అదెట్లని స్వామి యడిగెను. అత డందుకు "దాతలను చెప్పునపుడు నాపేరే గదా ముందుచెప్పుదు" రనెను. మహాదాతవగునీకేలయీజన్మము కలిగె నని శ్రీకృష్ణుడు ప్రశ్నించగా నతడు "స్వామీ ! నీయను గ్రహమున శాపవిముక్తుడనైతిని. నే నిచ్చిన గోవులకు లెక్కలేదు. భూమియందలి యణువులను, ఆకాశమందలి నక్షత్రములను, వర్ష ధారలను లెక్కించిన నెన్నియగునో అన్ని యగును. ఇట్లు గోదా నము జరుపుచుండగా నొకనా డొక బ్రాహ్మణుని కిచ్చిన గోవు

నామందలో చేరినందున గుర్తించలేక దానిని మఱియొక బ్రాహ్మ ణున కిచ్చితిని. మొదటివాడు గోవును గానక వెదకికొనుచు బోయి తన గోవు మరియొకనివద్ద నుండుట గని నాది నాకిమ్మని యతని నడిగెను. రెండవవాడు పశువు నాదేయని గట్టిగ పలికెను. వారిరు వురును నిట్లు వాదోపవాదములు జేసికొనుచు నా వద్దకు వచ్చి "రాజా! ఈ గోవు నిన్న నాకీయలేదా యనియు, నేడు నాకీయ లేదా యనియు" నడిగి యంతటితో నాగక నన్నుద్దేశించి "రాజా! నీవు మిక్కిలి అయోగ్యుడవు. దానమిచ్చిన దానినే మరల గ్రహించి మరియొకనికి పునఃపునః దానమొసగుచున్నావు. దాన మిచ్చు పుణ్యపురుషుడ వనుకొంటిమి గాని, యిచ్చిపుచ్చుకొను మహాపాపి వని యెఱుగనైతిమి. ఇచ్చియిచ్చి మరల మరల పుచ్చు కొనునట్టివాడ విట్టి వేషమేల వేసితివి? గోదానము చేయుట నిజమని నమ్మియుంటిమి. నేడే నీమోసమును దెలిసికొంటిమి. ధర్మశాస్త్రవేదాంతశాస్త్రముల నెఱిగియుండియు నిట్లు చేయుట దగునా?" యనిరి. వారిని సమాధానపఱచలేనైతిని. నేనపుడు తెలియక చేసితి నని వారితో విన్నవించితిని. అట్లు తెలియక యేల యీ కార్యము చేసితి వని ఒకడు గోవుతల నీడ్వగా మరియొకడు తోకనీడ్వ నారంభించెను. వీరిట్లు జగడములాడుచుండగా నేను చచ్చి యమలోకమున కేగితిని. యమధర్మరాజు నన్ను జూచి "అబ్బా! నీవు పుణ్యాత్ముడవు. దానమిచ్చి పుచ్చుకొనినందున కొంత పాపము గలిగెను. ఆపాపము గూడ నీవనుభవింపవలసియున్నది. ఏఫలమును ముందనుభవింపగోరెద" వని నన్నడిగెను. పాపమునే ముందనుభవించెద నని నేనాతని కెరిగించితిని. దానిఫలమునే అనుభవించుమనట్లాజ్ఞాపించితి నని యముడు పలుకగా నే నీపాడు నూతిలో పడితిని. నీదివ్యమంగళహస్తస్పర్శచేత నాకు శాపవిమో చన మాయెను" అని నృగమహారాజు ఎఱింగించెను. శ్రీకృష్ణమూర్తి

సంతోషించి ఉత్తమలోకమునకు బొమ్మని యాజ్ఞాపించెను. ఆ రాజపుడు "స్వామీ! నీకరస్పర్శచేత నాకు దివ్యదేహము లభించెను. లక్ష్మీపతి వగు నీకేమి సమర్పింప" నగు నని ప్రదక్షిణ మొనర్చి దివ్యకిరీటము ధరించిన శిరముతో నమస్కరించెను.

శ్రీకృష్ణమూర్తి "రాజా! భగవదపచారము కంటెను భాగవతాపచారము గొప్పది. అందువలన నిట్టికష్టము వాటిల్లెను. ఇక ముందు జాగరూకుడ వయి యుండుము- ఇక పొ"మ్మని యాజ్ఞాపించగా నవరత్న విమానము వచ్చెను. నృగుడు దానిలోనెక్కి మోక్షమున కేగెను.

ఇంతకుమున్ను శ్రీకృష్ణమూర్తియొక్క కొన్ని మహిమలు తెలుపబడెను. ఇపుడు శ్రీబలరాముని మహిమ తెలుపబడుచున్నది. శ్రీకృష్ణమూర్తి ఒక్కొక్కకార్యములో ప్రవేశించి జరుపుచు బ్రహ్మాదులచేత కొనియాడబడుచుండి అన్నయగు బలరాముడు బలరాముడే యని లోకమునకు తోపింపజేసి యతనికి యశస్సు కలిగింపవలయు నని వాంఛించెను. ధర్మరాజాదులు పదుమూడువర్షములను ముగించిన పిమ్మట భారతయుద్ధ మొక దినమని నిశ్చయింపబడెను. బలరాముడు కురుపాండవయుద్ధము జరుగనుండుట దెలిసి "యీ కృష్ణుడు పాండవపక్షపాతి. కృష్ణు డుండుచోటనే జయము గలుగును. నాకడ గదాయుద్ధవిద్య నభ్యసించినవాడగు దుర్యోధనుని విషయమున నాకును విశ్వాసము గలదు. నాపుత్రిక వత్సలను దుర్యోధనుని పుత్రున కిచ్చుటకు యత్నింపగా నీశ్రీకృష్ణు డామెను అర్జునున కిప్పించెను. కృష్ణుడు పాండవపక్షపాతియై యుండగా జరుగబోవు సమరమును జూచి దుఃఖమును సవింప జాలను" అనితలంచి తనమనోభావమును కృష్ణమూర్తి కెఱిగించి తీర్థయాత్రకు వెడలెను. బలరాము డరిగి తీర్థయాత్రయను నెపమున బయలుదేరిపోయి బ్రహ్మసృష్టియం దుండునట్టి

యొకస్థలము నైనను విడువక చూచివచ్చెను. అత డనేకస్థలము లను జూచుకొనుచు వచ్చునపుడు నైమిశారణ్యమునకు పోగా నచట సత్రయాగము సల్పుచుండిన శౌనకాదులు సూతుని నధిముఖునిగ జేసికొని యతనివలన పురాణములను వినుచుండిరి. బలరాము డచటికి రాగానే మహర్షు లెల్లరును లేచి మర్యాద లొనర్చిరి. ఉన్న తాసనమున గూర్చుండి పురాణము జెప్పుచుండిన సూతుడు విధి ననుసరించి లేవక కూర్చుండియుండెను. పురాణము చెప్పుచుండు వారు కూర్చుండియుండు నాసనమునకు వ్యాసాసన మనిపేరు. ఆయాసనము నధిష్ఠించి పురాణము చెప్పుచుండువారు పురాణమును ముగించుటకు మునుపు ఎట్టి మహాత్ముడు వచ్చినను మధ్యలేచి మర్యాదచేయ బనిలేదను న్యాయముండుటచేత సూతుడు బల రామునిజూచి లేవకుండెను. బలరాముడు తాను ఆదిశేషాంశజు డగుటను సైతము గమనింపక కూర్చుండియుండు సూతునిపై కినిసి తనచేతిపవిత్రము (శుచికై దర్భచేత చేయబడి వ్రేలియందు వేసికొనియుండు దానిని) కొనతో సూతుని శిరమును స్పృశింపగా నది వీడి క్రిందపడెను. మునీశ్వరు లెల్లరును హాహాకారము లొన ర్చిరి. సూతపౌరాణికుని జంపిన పాపపరిహారార్థము ప్రాయశ్చిత్త మును గావించుకొను మనియును జెప్పిరి. సకలక్షేత్రములను జుట్టివచ్చిన నేను ఏ ప్రాయశ్చిత్తము చేసుకొనవలయు నని బల రాము డడిగెను. వా రందులకు "బలరామా! మేము చెప్పు కార్యమును చేయుదు వేని పాపపరిహార" మగును.

ఇల్వలుని పుత్రుడు పల్వలు డనువాడు కలడు. వాడు పర్వదినములగు అమావాస్య, పౌర్ణమాసు లందు, యాగకాలమున నీ చోటికి వచ్చి రాళ్ళు, మన్ను మొదలగువానిని విసరివేయును. వానిని సంహరించుటే నీపాపమునకు ప్రాయశ్చిత్త మగునని పలి కిరి. బలరాము డందులకు సమ్మతించి యాగమును పాడుచేయు

టకు వచ్చిన పల్వలుని నాగటితో నీడ్చి రోకటితో కొట్టి సంహరిం చెను. పల్వలుడు ఘనుడైనను బ్రాహ్మణద్రోహి గాన బలరాముని చే జిక్కి చచ్చెను. బలరాముడు గోకుల బృందావనమునందుండిన తన బాల్యస్నేహితులను జూడగోరి వారియొద్ద కేగి వారల చేత నుపచరింపబడెను. బలరామునికి రహస్యముగ కొందరుస్త్రీలు ప్రీతిపాత్రులై యుండిరి. బలరాము డాస్త్రీలతోడ జలక్రీడలాడ గోరి యమునయొడ్డున కేగి స్త్రీ యగుటచేత యముననుగూడ తమతోడ నాడరమ్మని పిలిచెను. అందుకు యమున సముద్రుని భార్య నగు నేను వత్తునా యని యుత్తర మీయగా బలరాము డాగ్రహమున నామెతో నే బిలుచుటే భాగ్యమని తలపక రానంటివి గదా యని నాగలితో నీడ్వగా యమున ఉండుచోటు తెలియక పోయి తన నిజరూపముతో వచ్చి సముద్రునిభార్య నగు నన్ను మన్నింపుము. అదియును గాక నేను శ్రీకృష్ణమూర్తికి కావలసిన దాన నని వేడుకొని బలరాముని మన్నన వడసి వెళ్ళెను.

మైందుడను వానరునియొక్క తమ్ముడును, నరకాసురుని స్నేహితుడు నగు ద్వివిదు డనువాడు ద్వారకాపట్టణమున కేతెంచి నోముచేయు నారంభించగా బలరాము డచటికి పోయి వానిని చెట్టు కాండముతో కొట్టెను. వాడు కొమ్మతో కొట్టెను. ఇట్లే విరోధము పెరిగి వారు వృక్షములను పెరికి యొండొరులను గొట్టుకొని ఆప్రదేశమున నొక చెట్టైనను లేకుండునట్లు చేసిరి. బలరాముడు తన ముసలలాంగలములను దిగువబెట్టి ముష్టియుద్ధమున కారంభించి ద్వివిదుని రెండుచేతులను బట్టుకొని కుడిభుజమున గొట్టగా వాడు నోట రక్తముగ్రక్కి చచ్చెను.

దుర్యోధనుని కూతురు లక్షణయనునామె తన స్వయంవరమునకు జాంబవతికుమారుడు సాంబుడు వచ్చుట గని యతనిని వరించెను. అందుకు దుర్యోధనాదులు సమ్మతింప నందున జాంబ

ఁతనయుడు శత్రువులనెల్ల జయించి ఆమెనెత్తుకొనిపోయెను. కృష్ణుని కుమారుడగుటచేత దుర్యోధనుడు సాంబుని మీదికి యుద్ధమునకు వచ్చి రథము విరుగగొట్టి కన్యతో పట్టుకొనిపోయి ంధమునం దుంచెను. సాంబుడచట సుఖముగ భుజించుచు కాలము తపుచుండెను. ఇట్లుండగా ద్వారకయం దెల్లవారును సాంబుడు నికారణము నూహింపజాలక దుఃఖింప దొడగిరి. శ్రీకృష్ణమూర్తి ందరికంటె ఎక్కువగ దుఃఖింపసాగెను. స్వామియును దుఃఖింప రంభించగా నెల్లవారి దుఃఖమునకు మేరలేక పోయెను. ముందు ంబునిగతి తెలియనట్లు నటించి అందరు అధికముగ దుఃఖించుట ు సాంబుడు సుఖముగ నున్నాడు, అధైర్యపడకుడని మరల ప్పుట తనకు తగదని యెంచి స్వామి నారదుని స్మరించెను. రదుడు తక్షణమే ప్రత్యక్షము కాగా నెల్లవా రాతని గని మా డు క్షేమముగ నున్నాడాయని యడిగిరి. భగవంతునితో జేరిన కు చింత యెక్కడిదని నారదు డుత్తర మిచ్చెను. శ్రీకృష్ణు ను విలపించుచున్నాడని వారతనికి విన్నవించిరి. మీబిడ్డ దుర్యో ుని యంతఃపురమునందు సుఖముగనున్నాడని నారదు డెరి పగా యుద్ధప్రయత్నములు గావింపబడెను. కృష్ణమూర్తి బల ము నుద్దేశించి "అన్నా ! మీ రొక్కరు పోయిన చాలదా ? ఇన్ని యత్నము లేల అని చెప్పగా బలరాముడు సూర్యోదయ ంతితో సమానమైన కాంతిగల రథమున గూర్చుండి పయనమై ెను. శత్రులైనను దుర్యోధనాదులు సంబంధు లగుటచేత బల ముని సత్కరించిరి. బలరాముడు వారిచేత నుపచరింపబడి మా ంబుని మాకొప్పజెప్పుడని యడిగెను. అతడు మాయొద్ద లేడని రనిరి. మీ రాతని జూపరేని నేను బలాత్కారముగ మీ యం పురమున బ్రవేశించి శోధింపవలసివచ్చునని బలరాముడు రితో గట్టిగ జెప్పెను. దుర్యోధనాదులు బలరాముని మాటలకు

కోపము గలవారై యెట్లు శోధింతురో చూత మనిరి. బలరాము డాగ్రహము చెంది నాగలితో భూమిని గ్రుచ్చి యెత్తగా భూమి అంతఃపురముతోడ పెల్లగిల్లెను. బలరాముడు భూమిని క్రింద గొట్టు నని భయపడి వా రతనికి శరణాగతిచేసిరి. అపుడు బలరాము డున్నరీతి చూడగా నతడు త్రైలోక్యమును నాశముచేయున ట్లుండెను. భీష్మద్రోణు లాతని గాంచి "రామరామ! అఖిలాధారా! నీవుగదా భూమిని భరించుచున్నావు. ఆమెను నీవే నాశ మొనరింప నగునా? నీ కెంతటి పరాక్రమ మున్న దని మేము తెలియమైతి" మని శరణాగతిచేసి అనేకరత్నాభరణము లు మున్నగు బహుమాన ములతోడ లక్ష్మణను, సాంబుని అతనికి సమర్పించిరి. బలరాముడు కుమారుని, కోడలిని బిలుచుకొని తనయూరి కేగెను. కృష్ణమూర్తి బలరాముని పరాక్రమము లోకమున కిట్లు వెల్లడియగునట్లు గావించెను.

శ్రీకృష్ణభగవానుడు ద్వారకయందు వాసముచేయుచుండిన కాలమున నతనికి మిథిలయందు బహుళాశ్వుడను రాజును, శ్రుతదేవుడను బ్రాహ్మణుడును మిత్రులై యుండిరి. వారు పిలువ నంపగా స్వామి దారుకుని రథము దెమ్మని యందు గూర్చుండి మిథిలకేగి స్నేహితులతో సంభాషించి వారికి సంతోషము గలిగించి మరల ద్వారకకు పోయెను. "పరీక్షిన్మహారాజా! ఇంత సులభుడై వర్తించు స్వామి యెవరని తలచితివి? సాక్షాత్ వైకుంఠనాథుడే సుమా!" అని శుకు డెరిగింపగా రాజు "ఆహా!" యని ఆశ్చర్య మందెను. ముందు జరుగబోవు వేడుక చూడుమని శుకు డిట్లు చెప్ప నారంభించెను. దుర్యోధనునిమామ శకుని. అతని కొడుకు వృకుడు. వాడు పోవునపుడు మార్గమున నారదుని సందర్శించి యేదేవతను గూర్చి తపమాచరించిన శీఘ్రముగ అధికబలము లభించు నని యడిగెను. వృకుడు సిద్ధిపొంది దేశమును నాశము చేయగోరుట

దెలిసి నారదు డతనిని చెఱుపదలచి "ఓయీ! బ్రహ్మవిష్ణులు బిగువుగలవారు. పరమశివుడు సులభుడు, అతనిని గూర్చి తప మాచరింపు" మని యుపదేశించెను.

శకుని పుత్రు డపుడు విభూతిరుద్రాక్షలను ధరించి ప్రణవముతో గూడిన పంచాక్షరీమంత్రమును కోటిసారులు జపించెను. శివుడు ప్రత్యక్షమై యేమివరము కావలెనో కోరుకొను మనెను. వా డందులకు "శంభూ! నీకును, నాకును శ్రమ కలుగకూడదు. ఆ రీతిగ వర మడిగెదను. నే నెవ్వని శిరమున చేయినుంచిన వాడు తక్షణమే మరణింపవలె" నని కోరెను. తపమాచరించినవానికోర్కె దీర్చుట తన విధి యగుటచే పరమశివు డందుల కంగీకరించెను. వృకుడు పార్వతీశునిగాంచి "స్వామీ! యీ వరము ఫలించునా?" యని ప్రశ్నచేయగా నతడు ఫలించు నని యుత్తర మిచ్చెను. వాడపు డటులైన నా సమీపమునకు రమ్ము. నీతలయందు నాచేతి నిడి చూచెద నని పలుకగా శివుడు పరుగెత్తి పదునాల్గులోకములు చుట్టి వైకుంఠమున కేగి శ్రీమన్నారాయణునితో జరిగిన సంగతి విశదపఱచెను. వైకుంఠుడు వెలుపలికి వేంచేసి "మీరు శకునిపుత్రులుగదా! సంగతి యేమి? అని ప్రశ్న సేయగా వృకుడు జరిగిన సంగతి దెలుపగా నారాయణుడు ఈ శివుడు దక్షుని శాపమున శక్తిహీనుడై యున్నాడు. ఇట్టివానింగూర్చి తపము సేయు మని నీకెవ రుపదేశించి" రనగా వృకుడు "స్వామీ! నారదు డట్లుచెప్పెను. నాకోరిక ఫలించునో ఫలించదో" యనెను. హరి వానిం జూచి "ఓరీ! ఈ శివునింత వేడుకొనుచు, అతనిం దఱుముచు చుట్టనేల? వారి వారికి హస్తము, శిరము స్వాధీనము లుగ నున్నవి. శివునివరము ఫలించునో లేదో నీవు స్వయముగ పరీక్షించుకొని చూడవచ్చునే యని హితోపదేశము చేయగా.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥
భగ. 7అధ్యా. 14శ్లోకము:రీతి

భగవన్మాయామోహితుడై వృకుడు తనశిరమున తన చేతి నుంచుకొని వజ్రాయుధము చేత ఛేదింపబడిన పర్వతశిఖర మట్లు నేల గూలెను. అపుడు సాధుసాధు, నమో నమ యని దేవాదు లెల్లరు పల్కిరి. ఈ కథ భవిష్యోత్తరపురాణమున తెలుపబడియున్నది. ఇట్లు దుష్టనిగ్రహముచేసి లోకోద్ధరణము గావించిన ప్రభు వాతడు.

సరస్వతీనదీతీరమున మహర్షులు సత్రయాగ మాచరించుచుండగా కడపట ఫలమెవరికి సమర్పించెద రని నారదు డడిగెను. వారు వీరని వితర్కము జరిగి స్వల్పదేవతలను విడిచి ప్రసిద్ధులగు త్రిమూర్తులలో నెవ్వరి కీయవలయునో యెఱుగజాల కుండిరి. ఎవ్వ రైనను స్వయముగ వారిగుణములను పరీక్షించిన బాగుగ నుండు నని నిర్ధారించుకొనిరి. భృగుమహర్షి పరీక్షార్థమై బయలు దేరి కైలాసమునకుబోయి యందు శివుడు విషయవాంఛ కూడదని ఉపదేశించుచు పార్వతిని ప్రక్క గూర్చుండబెట్టుకొని తన్ను గమనించకుండుట గని బ్రహ్మకడ కేగి యాతడు భార్యను నాలుక యందే యుంచుకొని యుండగా, వైకుంఠమున కేగి యచట స్వామి లక్ష్మితోడ శేషశయ్యపై శయనించియుండుటను గాంచి యాతడు పైవారికంటెను దుష్టు డని యెంచి తనకాలితో నతని వక్షఃస్థలమును తన్నెను. లక్ష్మీశు డతివేగముగ లేచి తైలము దెమ్మని లక్ష్మి కాజ్ఞాపించి భృగుమహర్షి నెదుర్కొని "మహర్షీ! మీమృదువైనపాదము అసురులతో పోరి వారి బాణములు తగిలి వజ్రమువలె కర్కశమై యుండు నాయురము సోకి యెంత నొచ్చెనో గదా!" యని యతని పాదములకు రాచి కడిగెను.

శ్రీమహాలక్ష్మితో శృంగారముగ నుండునట్టి సమయమున తన్నిట్లు మర్యాదసేయుట గని యితడె యోగ్యుడని యెంచి భృగు

సంగతి మహర్షుల కెఱింగించెను. ఓర్పుచేత గౌరవము గల్గును. మాతృభక్తి, ఆచార్యభక్తి, భగవద్భక్తి కలుగుటకేగదా విద్య నేర్పుటకు ? అట్లుగాక వ్యతిరేక మయ్యెనేని ఆ విద్యవలన నేమి ప్రయోజనము ? అన్నము పెట్టి కాపాడుటకు మారుగ తల్లి విషముపెట్టిన నేమి గతి ? సాధారణముగ విద్య యధికమగు కొలది అహంకారము గలుగును. దానిని విడిచినవాడు భగవంతుడు.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥

భగ. 9 అధ్యా. 27శ్లో అనునట్లు

మహర్షులు యజ్ఞముచేసి భగవదర్పణము గావించిరి. భగవంతుడు చరాచరప్రపంచమును రక్షించుచున్నాడు. భవిష్యత్కాలమున సంహారముచేసి తన గర్భమున నుంచుకొని యోగనిద్ర జెందును. మరల నెవ్వరిప్రేరణచేత సృష్టించును ? బ్రహ్మయొక్క నూరు వర్షములు భగవంతుని కొక్కపగలు.

ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।
మాముపేత్య తు కౌంతేయ ! పునర్జన్మ న విద్యతే ॥

భగ. 8అధ్యా. 16వశ్లో

మహాప్రళయమునకు కడపటిభాగమున వేదపురుషులు పోయి స్తోత్రముచేసి లేపుదురు. రాజునొద్ద జీతము పుచ్చుకొని తగిన భాగమున తాళశుద్ధము [illegible]
దుర లేపవలయును.
దములు భగవంతుని
రువదియేడు శ్లోకములు గలది. వేదములు
డిన స్వామి లేచి సృష్టించును. క్రొత్త బ్రహ్మను
ట్టి స్వామి సారథియై యుండి యుద్ధము చేయించి జయము
లిగించి పట్టాభిషేకము గావించెను.

శ్రీకృష్ణమూర్తి లోకరక్షణార్థము అశ్వమేథయాగము చేయుచు యజ్ఞదీక్షయం దుండెను. అపుడా చోటి కొకయువతి వచ్చి తన పదుగురుబిడ్డలు పుట్టినతోడనే అదృశ్యమైపోవుచుండుటకు దుఃఖించి యీ యన్యాయ మేమని మొరపెట్టెను. శ్రీకృష్ణమూర్తి ఊరక చూచుచుండగా అర్జును డామెనుగాంచి యిన్నిదినములు మా కెందుల కెఱిగింప కుంటి వని యడిగెను. పోయినవారు పోయినను ముందు పుట్టబోవు శిశువును గాపాడకున్న నగ్నిప్రవేశము గావించెద నని అర్జునుడు ప్రతిన పూనెను. బ్రాహ్మణుడు ప్రసవకాలమును దెలుపగా నర్జునుడు శస్త్రములతోడ కోటగట్టి యెవ్వ డెత్తుకొనిపోవునో చూచెద గాక యని జాగరూకుడై శిశువు జనించినతోడనే మాయమై పోగా అర్జును డగ్నిప్రవేశము సల్పుటకు సంసిద్ధు డాయెను. ఇంతలో కృష్ణమూర్తి రాగా బ్రాహ్మణుడా సంగతి దెలిపెను. శిశువు లభించినయెడల అర్జును డగ్నిప్రవేశము సల్ప బనిలేదుకదా యని చెప్పి స్వామి బహుదూరమున గాఢాంధకారమయమైన చోటికి నర్జునుని పిలుచుకొనిపోయెను. ఆ కారుచీకటికి భీతిల్లి అర్జును డచ్చోటికి వచ్చుట కిచ్చగించ లేదు. భయపడుచున్నదా యని పలికి స్వామి చక్రమును స్మరింపగా తళతళ మెఱయుచు సుదర్శనము వచ్చెను. అర్జును డూరడిల్లెను. ఇకముందు "అహం", "మమ" అనకు మని స్వామి చెప్పెను. వారట్లు పోయి పోయి యొకచోట ముక్తులుగొలువ నాదిశేషునిపై శయనించియున్న భగవంతుని గాంచిరి. శ్రీకృష్ణమూర్తి అతనిని సేవించెను. అర్జునుడు చెంపలు వేసికొనెను. బ్రాహ్మణునిబిడ్డలు తాతా యని పిలుచుచు స్వామి మీద నెక్కి పారాడుచుండిరి. అర్జును డిదేమని యోజించుచుండగ స్వామి నవ్వి నేనే యీ బిడ్డలను రప్పించితిని. నీవు శరపంజరము నిర్మించియు లాభము లేక పోయెనుగదా ! ఇక ముందు "అహం", "మమ" అనకుము.

ు యిరువురను జూడగోరి యిట్లు చేసితిని. మీరు నరనారాయ
ులు. మీ యధికారమునకు లోబడినవారి నిట్లు గావించిన మీరు
ర్త రని "ఇట్లు చేసితిని." మీరీ శిశువులను బిలుచుకొని పొండు
అని చెప్పగా కృష్ణమూర్తి శేషశాయికి మ్రొక్కి ముందువచ్చినట్లే
అర్జునుని హస్తము పట్టుకొనిపోయి ఊరుచేరెను. శ్రీకృష్ణమూర్తి
యిట్లు పరిపాలించుచుండగా కరూశదేశాధిపతియు, సాళ్వుని స్నేహి
తుడు నగు దంతవక్త్రుడు యుద్ధమునకు వచ్చెను. వైకుంఠుని
ద్వారపాలకులు శాపముచే మొదటిజన్మమున హిరణ్యకశిప హిర
ణ్యాక్షులై జన్మించిరి. రెండవజన్మమున రావణకుంభకర్ణులై పుట్టిరి.
మూడవజన్మములో శిశుపాల దంతవక్త్రులై ప్రభవించిరి. శ్రుత
శ్రవస్సు కొడుకు శిశుపాలుడు. ఆమె చెల్లెలు శ్రుతదేవకుమారుడు
దంతవక్త్రుడు. వాడు యుద్ధముచేసి కృష్ణుని గదాఘాతముచే
రక్తము క్రక్కుచు క్రింద పడి మరణించెను. వానితమ్ముడు
విదూరథుడు. వానిని కూడ కిరీటకుండలములతో శిరము క్రింద
పడునట్లు వధించెను. స్వామి యిట్లు దంతవక్త్ర విదూరథులను
దుష్టులను సంహరించెను. ఎన్ని బ్రహ్మకల్పముల కైనను భగ
వంతుని క్రీడలను సంపూర్ణముగ జెప్పుటకు వలనుపడదు. మనకు
అట్టి అవకాశము లేదు. "ఈ దశమస్కంధము ను భక్తిశ్రద్ధాపుర
స్సరముగ వినిన వారికి భగవంతుడు ధర్మార్థ కామ మోక్షము
లనెడు చతుర్విధ పురుషార్థముల నిచ్చును" అని శుకుడు పరీక్షి
త్తున కెఱిగించెను.

శ్రీకృష్ణమూర్తి బ్రహ్మాదులచేత ప్రార్థింపబడి నిత్యవిభూతిని
వీడి లీలావిభూతికి వేంచేసిన భగవంతుడే యగుటచేత లోకక్షేమా
ర్థమై యనేకకార్యము లాచరించి యటుపిమ్మట వైకుంఠమునకు
బోవ దలచెను. అట్లు తలచి తాను సంకల్పించిన కార్యము లెల్లను
చేయబడినవా యని యోజించి దేవకీవసుదేవులకు తనయు డగుట,

యశోదానందుల యింట పెరుగుట, ననేక బాలక్రీడలు సలుపుట, దుష్టనిగ్రహము, శిష్టపరిపాలనము సేయుట యిత్యాది కార్యములు జరిగినవి గాని తన యవతారమునకు ముఖ్యోద్దేశమైన భూభారహరణము కాలేదని గ్రహించెను. దుష్టులను మోయలేక బ్రహ్మాదుల తోడ గోరూపధారిణియై యేడ్చుచు క్షీరసాగరము కడకు వచ్చి శరణువేడిన భూదేవియొక్క సంకటమును బాపదలచెను. శ్రీకృష్ణమూర్తి కంస కాలయవనాదులను సంహరించెను. దుర్యోధనాదులను హతుల గావించెను. భూభారము తొలగిపోయెను గదా! ఇక వైకుంఠమునకు బోవుటకు ఆటంక మేమి యనిన తాను వైకుంఠమునకు బోవుటచేత ప్రభువులేనివారై యాదవులు అమార్గమున ప్రవర్తింతు రనియు, అందుచేత వారి నీలోకమున నుంచరా దనియు, తనవారిని తానే సంహరింప దగదనియు ధనజనశరీర బలములతో తులదూగుచుండు తనవారిజోలికి శత్రు లెవ్వరును పోరనియు, యదుకుల నాశనమునకు మార్గమెద్ది యనియు యోచించుటయే వైకుంఠమునకు పోని కారణము. శ్రీకృష్ణమూర్తి కొంత యోజించి యాదవులు సుందోప సుందులట్లు పరస్పరవిరోధమున పొలియుట మేలని తలంచి యేదియో యొక జగడమును గల్పించ సంకల్పించెను. ఏ వృక్షము లైనను అగ్ని తాకుటచేత మండవలయును. వెదుళ్లు ఒండొంటి రాపిడిచేత మండును. యాదవులును అన్యోన్య కలహమున చావవలయు నని స్వామి తలంచెను. అట్లు తలచి యేమిచేసె నని పరీక్షిత్తడుగగా శుకు డిట్లు చెప్పెను. శ్రీకృష్ణమూర్తి యీ విషయమున తాను నిందాపాత్రుడు కాకూడదని భావించి ఆత్మగుణసంపన్నులును, బ్రహ్మజ్ఞానులు నగు బ్రాహ్మణులకు అపచార మొనర్చి వారిశాపమున యాదవులు సమూలముగ నాశము కావలయు నని సంకల్పించెను. పైని తెలుపబడినట్లు బ్రాహ్మణాపచారమున నాశము గల్గునని సకలవేదశాస్త్రముల యభి

ప్రాయము. ఇతరులు తిరస్కరింపరాని యదుకులమున కెవ్వరు
ాపము పెట్టి రని పరీక్షిత్తు ఆశ్చర్యపడెను. భగవత్సంకల్పమున
ిగ్రహానుగ్రహశక్తి యుక్తులును, అణిమాద్యష్టసిద్ధులు గలవారును
ిగు మహర్షు లెల్లరును పిండారకక్షేత్రమున నొక పుణ్యకాలమున
ొక్కటిగ గూడిరి. అపు డాస్థలమునకు యాదవులు సైతము పోయి
యుండిరి. యాదవబాలురు పదుగు రొక్కటిగగూడి జాంబవతీ
ుమారుడును, సౌందర్యవంతుడు నగు సాంబునికి గర్భిణీస్త్రీవేషము
ేసి మహర్షులదర్శనమునకు వెళ్ళి యీామె గర్భమునందుండునది
్త్రీశిశువా ? పురుషశిశువా ? సెలవిండని యడిగిరి. మహర్షు లందు
ిదో యొకటి పుట్టులే యనిరి. వారంతటితో పోక యామెకు పురుష
ిశువు జన్మించవలయు నని కోరుచున్నాము. ముందుగా తెలిసిన
ంతోషముతో నుండ వచ్చునని అడుగుచున్నా మనిరి. భగ
త్సంకల్పమున నొకమహర్షి "ముసలము (రోకలి) పుట్టు" ననెను.
ోకలియా పుట్టు నని వా రడుగగా నామహర్షి "అవును. ఇనుప
ోకలి పుట్టు" ననెను. పుట్టిన నేమి ? దానితో బియ్యము మొదలగు
వి దంచుకొనవచ్చు ననుకొనిరి. ఆ మహర్షు లపుడు "ఆ రోకలి
ియ్యము దంచునది గాదు, మీకులమును సమూలముగ నాశ
మొనర్చునట్టిదిసుమా'' అనిరి. పెద్దలయెడ నపచారము చేయ
ాదు. వారు శమప్రధానులు, శాంతరసప్రధానులై యుందురు.
తమ్ము తిట్టినను, కొట్టినను వారు కోపగించుకొనరు. అచ్చటచ్చట
గవంతు డుండి యట్లుచేయుచున్నాడని తలంపుదురు. వారి
ోపల నొకశక్తి యున్నది. వారు దానిని చూపుదురేని తోడనే
భస్మమైపోవలసినదే. వారిశక్తి వెలుపలికి వచ్చినయెడల కష్టము
సంభవించును. సూర్యకాంతపు రాతిని స్పృశించునెడ చల్లగ
నుండును. దానిశక్తిని పరీక్షించుటకై సూర్యునియెదుటికి గొని
పోతిమేని వస్త్రమునం దుంచుకొని యుండినను ఆ వస్త్రమును

గాల్చివేయును. సత్యసంకల్పుడగు స్వామి ప్రేరణచేత మహా శాంతమూర్తులైన మహర్షులు యాదవులకు శాప మొసగగా నా బాలురు రాజగు నుగ్రసేనుడు ఈ సంగతినెఱింగిన కోపించు నని భీతిజెందినవారై మహర్షులను మన్నింపు డని వేడిరి. వారు మానోట వచ్చినది తప్ప దనిరి. సాంబునిస్త్రీవేషము మార్చునప్పటికి ముస లము జనించెను. బాలు రెల్లరును రోకలిని ఉగ్రసేనునికి జూపి జరి గినసంగతి వివరింపగా నతడు భయపడి శ్రీకృష్ణమూర్తిని బిలువ నంపి సంగతి దెలిపెను. మహర్షులవిషయ మగుటచేత నాకు దానిని చక్కబెట్టుటకు శక్తి లే దనియు, భగవత్సంకల్ప మట్లున్న దనియు కృష్ణు డుత్తర మిచ్చెను. వారు ప్రార్థింపగా దానిని బాగుగరాచి ఆపొడిని సముద్రమున గలుపు డని స్వామి యుక్తిచెప్పెను. వారట్లె ముసలము నరుగదీసి యా పొడిని నీటగలిపి భయవిము క్తులై యుండిరి. మహర్షులశాపజన్యమైన ఆ యినుపరజమును ధరింపలేక సముద్రుడు దానిని గట్టునకు దెచ్చెను. ఆ యణువులు సాగరతీరమున తుంగలై మొలచెను. రోకటిని రాచి, రాచి కడపట మిగిలిన చిన్నయినుపముక్కను వారట్లే సాగరమున బారవైచిరి. ఆ ములికి నొకచేప మ్రింగగా జాలరి యొకడు దానిని దరిగి గర్భమున గోచరించిన ఆ యినుపముక్కను తీసికొని తన బాణము కొన నుంచి యుండెను.

యాదవులు తమ శాపవృత్తాంతము మరచు పరకును కృష్ణ మూర్తి కొన్ని దినము లూరకుండెను. వాసుదేవుడు శ్రీవైకుంఠము నకు బోవుటకుముం దాతని నొక్క పర్యాయ మీవిభూతియందే దర్శింపనెంచి నారదు డేతెంచెను. స్వామి యా సమయమున నింటలేకుండగా నారదమహర్షి ఆత డెచ్చట అని వసుదేవు నడి గెను. అధిక ప్రసంగి యగు వా డింటనుండ నేర డని వసుదేవ మహారాజు నారదుని కెఱిగించెను. నారదు డా మాటలను విని

“రాజా! నీ తప్పేమున్నది? సంబంధ మధికమాయె నేని మర్యాద యెక్కడ జరుగును? పరబ్రహ్మమని యుండిన బిగువుచేయును” అని పల్కుచుండగా కృష్ణమూర్తియును వచ్చి చేరెను. నారదముని శ్రీకృష్ణమూర్తిని, అతనిబంధువర్గమును జూచి యానందించి వారికడ సెలవు గైకొని వసుదేవు నొద్దకు వచ్చి పోయివచ్చెద ననగా నా రాజు తన కేదైన తత్త్వోపదేశము సేయుమని కోరెను. సకలతత్త్వోపదేష్టలకును ఆరాధ్యమూర్తియగువాడు నీ పుత్రుడుగ నుండుటచేత అతనివద్ద నుపదేశము పడయరాదా యని నారదు డడిగెను. పుత్రవాత్సల్యముండుటంబట్టియే నే నతనియొద్ద బాగుగ నుపదేశము బడయజాలనని వసుదేవు డనెను. నారదు డందులకు “వసుదేవా! నేను స్వయముగ చెప్పనేల? పూర్వము మహాత్ములు చెప్పినదానిని చెప్పెదను. వినుమని” యిట్లు చెప్ప నారంభించెను. “ధ్రువుని తండ్రి ఉత్తానపాదుడు. అతనియన్న ప్రియవ్రతుడు, అతనికొడుకు అగ్నీధ్రుడు. అతనికి నాభి, అతనికి ఋషభుడు, ఆ ఋషభునకు నూర్గురుపుత్రులు. వారిలో పెద్దవాడు జడభరతుడు. ఋషభుని తొమ్మండుగురు పుత్రులు నవఖండాధిపతులైరి. వారలలో యెనుబదియొక్కరు విశ్వామిత్రునియట్లు యోగులగు బ్రాహ్మణులైరి. కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు పిప్పలాయనుడు, హవిర్హోత్రుడు, ద్రమీళుడు, చమసుడు, కరభాజనుడు అను మఱితొమ్మండుగురు మహానుభావులు విరక్తులై సకలలోకంబులందును సంచరించుచు విదేహదేశమునకు వచ్చిరి. అపరసూర్యులై భూసంచారముసేయుచు వచ్చినవారిని విదేహరాజగు నిమి పూజించి ఉపదేశము సేయుడని వేడగా వారొక్కొక్కరుగ నుపదేశించిరి. ఆ సంగతి చెప్పెదను వినుము_ మనుష్యజన్మము దుర్లభమైనది. ఎనుబదినాల్గులక్షలజీవరాసులలో క్రిమి కీటాది యోనులలో జన్మించియుండిన నేమిచేయవచ్చును? ఈ జన్మమును

సార్థకము చేసికొనువారు పరమభాగవతులు. శరీరముచేత నైహికా ముష్మికసుఖము లనుభవించవచ్చును. దీనిచేత శ్రవణమననాదులు చేసికొనవచ్చును. ఇట్టి శరీరము లభించియే యున్నది. ఇక తక్కు వేమి అనుకొనరాదు. పైక్షణమునకు ఉండునో ? పోవునో ?

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే ।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ॥

భగ. 7అధ్యా. 17 శ్లోకము

వైకుంఠునికి ప్రీతియైనవారి దర్శనము పరమదుర్లభము. వారి వలన లభింపవలసిన విషయము లభింపకపోవుటయే పాపము. కలియుగము మంచియుగము. దానియందు గొప్ప అనుకూల మున్నది. అట్టి అనుకూల్యము పైయుగములందు లేదు. తెలి యనివారు కలిని దిట్టుదురు. అశుద్ధమనస్కులకు తప్పులే తోచును. పంది సువాసనగల పూలతోటలలోనికి పోదు. అమేధ్యముండు తావునకే అరుగును. సారాంశము గ్రహించువారు కలిని స్తోత్రము చేయుదురు. పైయుగములందు కష్టముచేత లభించుఫలము కలి యుగమున భగవన్నామసంకీర్తనము వలననే కల్గును. నూరుదోష ములుండినను ఒక్కగుణముండెనేని దానినే గ్రహించవలయును. భగవన్నామము జపింపుడు. మీవద్దకు రానని కలి యనుచున్నాడు_ అని తొమ్మండుగురు చెప్పి" రని నారదుడు తెల్పగా వసుదేవుడు మనుష్యులుసేయు పాపము వారిని బాధించునే యని ప్రశ్నించెను. భగవదనుగ్రహముచేత సదాచార్యోపదేశము పొంది భగవంతుని ధ్యానించునెడ దయాళువగు స్వామి ఆచార్యానుగ్రహమున పిలు చుచున్నాడని తలచి మనసున ప్రవేశించి కూర్చుండి అందుగల అశుద్ధమును తొలగించును. వసుదేవా! భయపడకుము అని నారదుడనెను. అనేకుల మనసుల నెట్లు శుద్ధపఱుపనగునని వసుదే వుడు యోచించగా నతనింజూచి వసుదేవా! స్వామి నీకొడుకని తలంపకుము.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తస్స్మృతిర్జ్ఞానమపోహనం చ ।
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో
వేదాంతకృ ద్వేదవిదేవ చాహమ్ ॥

భగ. 15అధ్యా. 15శ్లో.

పిపీలికాదిబ్రహ్మపర్యంతము అతడు నిండియున్నాడు. అందుచేత నత డాకార్యమును సల్ప సమర్థుడు అని పల్కి నారదుడు వీణా గానము చేయుచు వెడలిపోయెను.

# ఏకాదశస్కంధము

## ఉద్ధవోపదేశము

శ్రీకృష్ణమూర్తి నిత్యవిభూతికి వేంచేయుటకు ముందొకపర్యాయము నారదుడు ద్వారకకువెళ్లి స్వామిని సందర్శించెను. పిమ్మట బ్రహ్మాదులును అట్లే ద్వారకకువచ్చి శ్రీకృష్ణభగవానుని సేవించి "స్వామీ! అద్భుతమైన నీశక్తి నేమని మెచ్చగలము? యజ్ఞము, దానము, సత్కర్మము మొదలగువానిచే మనశ్శుద్ధి గలుగదు. ఎట్టిదురాచారుడైనను—

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥

భగ. 9అధ్యా. 34 శ్లో

అని నీ వన్నట్లు వేదాధ్యయనాదులచేత కానికార్యము నీయందలి భక్తిచే గలుగును. నీ వైభవ మేమనవచ్చును? జగదీశ్వరా! యీ విద్యలచేత మనస్సు శుద్ధిగాదు. అది యట్లుండగా తపస్సు చేసి పెద్దలవద్ద భగవత్కథాశ్రవణ మొనర్చి భక్తిశ్రద్ధలు, నమ్మిక గలిగి, మననాదులుగలిగి యీడుపడువారియట్లు నీయందు భక్తితో మెలగువారు నగుదు రని తలంపవచ్చును. వాడు ఎట్టిదుష్కర్ముడైనను, పతితుడైనను—

అపిచేత్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥

భగ. 9అధ్యా. 30 శ్లోకమట్లు సాధువని చెప్పబడును.

అపి చేదసి పాపేభ్య స్సర్వేభ్యః పాపకృత్తమః ।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥

భగ. 4అధ్యా. 36 శ్లోకమువలె మహా దురాచారుడైనను, పాపియైనను స్వామికథలు విని యీడుపడినట్లైన తరించు" నని స్తుతించి బయలుదేరిరి. వచ్చినకార్యమేమో చెప్పుడని స్వామి యడిగెను. "స్వామీ ! శ్రమపడి మిమ్ము విభూతికి రప్పించితిమి. నీ విచ్చటనే యుండ నెంచుచున్నావు. ఈ లోకమునం దుండువారు పైలోకములకు రావలయు నని కోరుటమాని యా లోకులు ఇచ్చటికి వచ్చుటకు కోరవలసియుండును. ఈ భూమి కింత గొప్పతనము కలిగించరాదు. దీనిని మా లోకముల కంటె హెచ్చైనదిగ జేయరాదు. ఎచ్చటనుండినను మీ కేమియు కొఱత లేదు. కాని మాకును, మాలోకములకును మహిమ తగ్గిపోవును. మీ రీలోకమునం దుండి సంసారియట్లు వర్తించుచుండిన మాగతి యేమగును ?" అని బ్రహ్మదులు విన్నవించిరి. ఈ మాటలు విని శ్రీకృష్ణమూర్తి నవ్వి "పరమేష్ఠీ ! అవతారకార్య మైనది. ఐనను మఱికొంతపని యున్నది. అపని పూర్తిచేసి వచ్చెద" నని చెప్పి వారిని బంపి వేసెను.

ఈ సంగతి ఉద్ధవునికి తెలిసెను. కుబ్జయింటికి తన్ను సైతము పిలుచుకొనిపోయినట్టి స్నేహితుడు తరలిపోనున్నాడని తలంచి యాతనిదర్శనమునకు వెళ్లి ఉద్ధవు డిట్లడిగెను.

ఉద్ధ : కృష్ణా ! రహస్యము వెలిపుచ్చనా ?
కృష్ణ : ఏ రహస్యమును ?
ఉద్ధ : స్వామీ ! నీవు యాదవకులమును సంహరించిపోవున

ట్లున్నావు. అట్లుగాకున్న బ్రాహ్మణు లెల్లరు నేకముగ గూడనేల ? యాదవు లేల వారిని దుష్టప్రశ్న చేయవలెను ? వార ట్లడిగినను నీపుత్రుడనియైన నెంచక వారట్లేల శపించవలయును ? వారట్లు శపించినను నీవైనను దానికి ప్రతిక్రియ సేయక భగవత్సంకల్ప మంటివి. గాయత్రీమంత్రజపసిద్ధులైనవారి మాటను త్రిప్పుటకు నావల్లగా దంటివి. ఈ కారణముచేత నీవు పోవుటకు ఒకవ్యాజ మేర్పఱచుకొంటి వని తలంచుచున్నాను.

కృష్ణ : నిజమే. నీ మనసులో నుండనిమ్ము.

ఉద్ధ : స్వామీ ! నేనును యాదవకులమునకు చెందిన వాడను. నన్నును సంహరించి పోయెదవా ? (అని యేడ్చెను).

కృష్ణ : ఏల యేడ్చెదవు ?

ఉద్ధ : నీ యంఘ్రికమలములను విడిచి యరక్షణమైనను సహించజాలను.

కృష్ణ : అట్లేర్పాటు చేసితిని. ఏమిచేయనగును ?

ఉద్ధ : నీ యిష్టానుసారము చేయుము. నన్నుమాత్రము నీతో పిలుచుకొని పొమ్ము.

కృష్ణ : ఉద్ధవా ! అట్లు కోరకుము ఈ లోకమున నీవు నాకు మిగుల ప్రియుడవేకాని, యిట్లని నిన్నావిభూతి కిపుడు పిలుచుకొని పోదగునా ? (ఇట్లనగా ఉద్ధవు డేడ్చె)

ఉద్ధ : స్వామీ ! నీవెంట బిలుచుకొని వెళ్లుటకు నేను తగి యుండను. నేజేసిన యనేకపాపముల క్షమింపవలెను. దండించిన దండింపుము. క్షమించిన క్షమింపుము. నీ విరహము అరక్షణ మైన నోర్చుకొన లేను.

కృష్ణ : ఉద్ధవా ! మన యాదవకులమును నిర్మూలించిపోదలం చితిని. నీ వట్టి దుర్మరణము చెందవలదు. అయినను నిన్ను నాతోడ పిలుచుకొనిపోవుటకు వీలుపడదు. నీవు బంధువులు, స్నేహితులు

మున్నగువారియందలి స్నేహపాశమును తెగించివైచి వారియందలి మనసును దిగిప్పి నాయం దుంచుము. నీవీ భూమియం దుండ వలదు. నీవు బయలుదేరి అనేకదివ్యక్షేత్రములు సందర్శించుచు పెద్దలవలన శ్రవణము చేసి మననాదులొనర్చి యింకను మనశ్శుద్ధి బడసినవాడవై తదనంతరము నాకడకు రావచ్చును.

ఉద్ధ : స్వామీ ! నీవు నీ శాసనము నతిక్రమించి నడువవు. నాయందు మిత్రభావము గల్గియుండుటచేత సదుపదేశము గావించితివి. నాకు నీవంటివా డెవడు లభించును ? నా కేదైనతత్త్వ ముపదేశింపుము.

కృష్ణ : ఉద్ధవా ! నిన్ను అందందు తిరుగుచు కాలము గడపుమను టెందుకో తెలియునా ? అట్లు సంచారము సల్పుటచేత ఆయాతావులఁగల విశేషములు తెలియఁగలవు.

ఉద్ధ : అట్లు తెలియవలయునా ?

కృష్ణ : అవును. అవధూతగీతను జెప్పెద నాలకింపుము. యాదవా ! పూర్వ మొకయవధూత (వివస్త్రుడైన సన్యాసి) మంచి తారుణ్యములో నుండువాడు అందందు సంచరించుచు రాగా యదు వాతనింజూచి తత్త్వోపదేశము గావింపుమని వేడెను. అత డందులకు "రాజా ! నా కిరువది నలుగురు గురువులు గలరు. నేను వారి యొద్ద విషయములను దెలిసికొని అభ్యాసముచేయుచున్నాను. ఆ గురువు లెవ రనగా పృథివి, వాయువు ఆకాశము, జలము, అగ్ని, చంద్రుడు, సూర్యుడు, కపోతము , అజగరము , సముద్రము , పతంగము, మధుకరము, గజము , మధుహారి, హరిణము, మీనము, పింగళ, కురరము , అర్భకుడు, కుమారి, శరకారుడు, సర్పము, ఊర్ణనాభము, పేశకారికీటము అను నిరువది నలుగురు గురువులు. వారి నాశ్రయించి సంగతిదెలిసికొంటిని. ఏయే గురువు వలన నేయేగుణము గ్రహించితి ననగా పృథివి తనయందు

మలమూత్రములు విసర్జించినను, తన్ను గుంట గావించినను చలింప కుండును. జడమైన భూమి యిట్లు సహించుచున్నది. ఆమెవలన క్షమాగుణము నేర్చితిని. వాయువు సర్వదా సంచరించుచుండును. దేనితోను సంబంధపడకుండును. సుగంధము, దుర్గంధము నడుమ వచ్చిననే. ఎట్టి హీనజన్మ మైనను మధ్యవచ్చిన దని యెంచి హర్ష శోకములు పొందరాదని గ్రహించితిని. ఆకాశము అంతటను నిండి యున్నది. స్వచ్ఛమైనది గాన ప్రతిబంధకము గల్గించదు. అనగా మనకును, ఇంకొకరికిని నడుమ ఆకాశ ముండినను వారిని మనలను మరుగుపఱచదు. దీనిచేత మిత్రభేదము చేయరా దనియు, సంచ రించునపుడు సంబంధపడియు, పడకయు నుండవలయు నని గ్రహించితిని. జలమునకు స్వభావతః రుచి గలదు. తేలిక మాధు ర్యము గలదు. మన్ను చేరిన దీనిరుచి, రూపు మారును. ఆత్మ సహజముగ మధురమైనది. ప్రకృతిచేరికచేత చెడును. దీనివలన నిది గ్రహించితిని. అగ్ని తేజస్సుచేత దీపమునకును, పచనము గావించుకొనుటకును, శ్రాద్ధక్రియలకును, శవమును గాల్చుటకును ఉపయోగపడినను అశుద్ధము గాదు. అట్లే జ్ఞానము సంపాదించిన యెడల నెట్లుండినను నెవ్వరితో జేరినను దోషము లేదని గ్రహించి తిని. చంద్రుడు తనకళలు శుక్లపక్షమున వృద్ధియగుచు కృష్ణపక్ష మున క్షీణించుచున్నను దుఃఖపడడు. అట్లే మనము మన స్థితి గతులు తగ్గినను, హెచ్చినను దుఃఖింపరాదని చంద్రునివలన గ్రహించితిని. సూర్యు డెనిమిదిమాసములు జలమును గ్రహించి వర్షాకాలమున వర్షించును. ఈతని యట్లు సంపాదించునపుడు సంపా దించి, యిచ్చునపు డీయవలె ననియు, సంపాదించిన దంతయు తానే యుంచుకొన రాదనియు గ్రహించితిని. కపోతమువలన గతించినవారికై దుఃఖించి మనము జీవింపరాదని తలంచుట తగదని గ్రహించితిని. స్త్రీపురుష కపోతములు రెండు ఆహారసంగ్రహార్థము

వెలుపలికి వెళ్లియుండినసమయమున వేటకాఁడొక్కఁడు ఆ పక్షుల పిల్లలను వలపన్ని అందు తవిలించెను. ఆడుపక్షి యీ సంగతి దెలిసి సంకటపడి తానును ఆవలలో ప్రవేశించెను. పురుషపక్షియు సతీసుత వియోగము సహింపలేక తానును వలలోపడెను. పోయిన వానికై దుఃఖించుటచేత పక్షులు సమూలముగ నశించెను. అజగరము అనగా కొండచిలువ. అది నోరు తెఱచుకొని కదలక, మెదలక ఉన్నచోటనే యుండును. భగవత్సంకల్పమున తననోట బడు దానిసే అది ఆహారముగ గ్రహించును. ఇట్టిదాని నొక్కటిని మార్గమున జూచి దీనికెట్లు ఆహారము లభించునో యని గమనించుచుంటిని.

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

భగ. 9అధ్యా. 22 శ్లోకమునందువలె అన్యచింతలేనివారి యోగక్షేమములు వహించెదనని చెప్పిన స్వామి ప్రతిదినమును దాని కాహార మొసగుచుండెను. అందువలన ఆహారార్థ మూరూరు తిరుగనేల ? ఉన్నచోటనే భగవంతు డనుగ్రహించు నని గ్రహించితిని.

ఆపూర్యమాణమచలప్రతిష్ఠం
సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే
స శాన్తి మాప్నోతి న కామకామీ ॥

భగ. 2అధ్యా. 70 శ్లోకమట్లు సముద్రుడు జలమువచ్చినను, పోయినను భేదము లేకుండును. నీరువచ్చి చేరవలయు నని యత్నింపడు. రాకున్నను దుఃఖింపడు. అట్లే విషయ సుఖములు లభించినను, లభించకున్నను సమత్వమున నుండవలయునని సాగరమువలన గ్రహించితిని. పతంగము (మిడుత) నిప్పును జూచి పండను భ్రాంతిచేత దానియందు పడి చచ్చును.

అట్లే మనకు తగని పదా
తను తెలిసికొని ప్రవర్తి
వించును అని శలభవ
పుష్పములపై వ్రాలి
దించుటకు యత్నిం
కొంచెము కొంచెముగ
టీగవలన గ్రహించితిని
చుచు పెంటియేనుగువ
జిక్కిన నిదేగతి యని
కూడబెట్టిన తేనెను తీసి
యొరులకు బెట్టక సమా
నని గ్రహించితిని. హ
వానిని సమీపించి మ
గానమునం దాశ యుం
బెత్తగ తగదు. వా
భార్యాపుత్రాదులను గూడ పరిత్యజింపు మనును. హరిణదృష్టాంతమున నీ విషయము గ్రహించితిని. మీనమును బట్టుటకై బెస్తవాడు ఏదో ఆహారమును గాలమునం దమర్చును. మీనము ఆ యాహారమున కాశపడి చెంబడివానికి చిక్కును. ఇందుచే అధికముగ నుపచరించువారిని నమ్మరాదు. అట్టివా రేదో మనసున నుంచుకొని యున్నారనుకొనవలె నని గ్రహించితిని. పింగళ : విదేహరాజ్యమందలి యొకదాసి. అది యలంకారము చేసికొని యెవ్వడైనను తనయింటికి వచ్చునా యను తలంపుతో తలవాకిట నిలబడి చూచుచుండెను. ఎవ్వరును రాకుండుట గని యింటిలోని కేగెను. ఇంతలోపల వచ్చునేమో యని భావించి మరల వీథి వాకిటికి వచ్చి నిలబడెను. ఎంత తడవునకు రానందున లోనికేగెను. మరల వెలుప

లికి వచ్చెను. ఇట్లు అర్ధరాత్రివరకు లోపలికి, వెలుపలికి తిరిగి తిరిగి తుద కెవ్వడును రానందున విసుగుచెంది పడకపై మేనువ్రాల్చి తుదకు ఒడలుమఱచి నిదురించెను. పురుషునియొక్క ఆశ తన కున్నంతవరకు దానికి నిదురపట్టలేదు. ఆశ తీరగనే సుఖనిద్ర వచ్చెను. ఇందువలన ఆశయే పరమదుఃఖ మనియు, నిరాశ పరము సుఖ మనియు గ్రహించితిని. కురర మను పక్షి కీచుకీచుమని కూయు చుండును. వాయువశమున వచ్చు పదార్థములను తినును. ఇది తన ఆహారమును తన్ను బాధించు పక్షుల కిచ్చి సుఖముగ నుం డును. మన మేవస్తువునుగూడ మనతో తీసికొని పోరాదు. అట్లు తీసికొనిపోయినను ఎదుట వచ్చువాని కీయవలయునని గ్రహించి తిని. అర్భకుడు: వీనికి దేహాభిమానము లేనందున వస్త్రము కావలె నని కోరడు. మానావమానములు కల్గియున్నప్పుడే వస్త్రము కావలె నని తోచును. ఆ బిడ్డవలె నభిమానము లేకుండ నుండుపక్షమునన సుఖ మని గ్రహించితిని. అపుడే నావస్త్రములు త్యజించితిని. కుమారి: ఈమె రహస్యముగ వడ్లుదంచగోరి యారంభించెను. ఆమెచేతిగాజులు గలగల మని శబ్దించుచుండినందున ఆమె తన గాజులను పగులగొట్టి ఒక్కొక్కచేతికి రెండేసి గాజులు మాత్రమే యుంచుకొనెను. ఇంకను నవి శబ్దించుటచేత ఒకచేతి కొక్క గాజును మాత్రమే యుంచుకొని సద్దులేక తనపని తాను ముగించు కొనెను. ఇందువల్ల నేకార్యమున కైనను పదుగురుచేరిన వట్టి కోలాహలమేగాని కార్యము కాదనియు, ఇద్దరుచేరిన ప్రసంగములు చేయుటచేత అపుడును పని జరుగ దనియు, ఒక్క డేకాంతముగ నుండినపుడే కార్య మగు ననియు గ్రహించితిని. శరకారుడు: వీడు బాణము సానపట్టుచుండెను. తన ప్రక్క నరుగుచున్న రాజును గూడ గమనింపక ఏకాగ్రచిత్తుడై పనిచేయుచుండెను. శరకారుని రీతిగనే మనదృష్టి భగవంతునియం దుంచినయెడల ప్రపంచము

కన్నులకు కనబడ కుండునని గ్రహించితిని. ఊర్ణనాభ మనగా సాలెపురుగు. ఇది తన నోటినుండి తంతువులను కల్పించితనయిచ్ఛ వచ్చినపుడు లోనికి గొనును.

క. ఒకపరి జగముల వెలినిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ దానై
సకలార్థసాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్.

అని గజేంద్రుడు స్తుతించినట్లుగా భగవంతుడు జగత్తులను సృష్టించి మరల తనగర్భమున నుంచుకొనుననుట యెట్లు సంభవమని తలచియుంటిని. ఈ చిన్నప్రాణియే ఈ కార్యము సల్పునపుడు భగవంతుడు సల్పడా యని గ్రహించితిని. భ్రమరము కీటకమును దెచ్చి తినునపుడు ఆ కీటకము శరీరముచేత నిజముగ మారకున్నను భ్రమరమునే తలంచుచుండుటచేత దానివలెనే యగును. అట్లే జగత్సృష్ట్యాదికార్యములను చేయుచుండు స్వామిని తలంచి ఆయనవలెనో లేక ఆయనగనో కావచ్చునని గ్రహించితిని" అని యిట్లు అవధూత యదుసంవాదమును శ్రీకృష్ణమూర్తి ఉద్ధవున కుపదేశించి "నీ వందందు సంచారము సేయుచు బోయిపోయి బదరికాశ్రమము చేరి యందు నా పాదతీర్థమును (అలకనంద యనుపేర బరగునది) దర్శించి యందు స్నానమాచరించి, పాపపరిహారము గావించుకొని మనసును, వాక్కును నాయందుజేర్చి కందమూలాదుల దినుచు నింద్రియములను జయించి, తపము గావించి, పరిశుద్ధాంతరంగుడవై అటుపిమ్మట త్రిగుణములను వదలి నాయొద్దకు వచ్చి చేరనగు" నని తెలిపి, "కాలమైనది గావున నిక పొ''మ్మని యాజ్ఞాపించెను. జగదీశ్వరుడును, ఆపద్బాంధవుడును, దీనరక్షకుడును అగు స్వామి యా రీతి నాజ్ఞాపించగా ఉద్ధవుడు బయలుదేరి వెడలి బదరికాశ్రమముచేరి

భగవదాజ్ఞానుసారముగా వర్తించి మోక్షము వడసెను.

శ్రీకృష్ణమూర్తి ప్రభాసతీర్థమునకు పోదము రండని యాదవులను ప్రేరేపించి వారితోడ నచ్చటికి వెళ్లెను. ఎల్లవారును ద్వారకాపట్టణమున నోడల నెక్కి పశ్చిమసముద్రమును దాటి అటనుండి రథము లెక్కి పయనమై వెళ్లి ప్రభాసతీర్థము చేరిరి. అచటికి వెళ్లినవా రెల్లరును తీర్థోపవాసము చేయవలసియుండగా భగవన్మాయామోహితులై వవారు గనుక అట్లు సేయక సురద్రావిమత్తులై జగడములాడి యొండొరులను గొట్టుకొని యా ప్రదేశమున మొలచియుండిన తుంగను బెఱికి దానితో తాడించుకొని వెదురునందు నిప్పుపుట్టి కాలిపోవునట్లు హతులైరి. ఈ జరిగినదానినంతయును గనుచుండిన బలరాముడు యోగనిష్ఠలో గూర్చుండి అగ్నిని కల్పించి మండిపోయెను. యదుకులము వా రెల్లరును శాపమున చావవలసిన విధి యుండుటచే శ్రీకృష్ణమూర్తియును శరీరము విడువదలచి యొకయశ్వత్థవృక్షముక్రింద నాసీనుడయ్యెను. స్వామిపాదమును జూచి పక్షియని భ్రమించిన వేటకాడొకడు బాణమువేయగా నది స్వామికి తగిలెను. వాడా సంగతి తెలిసికొని స్వామిసమీపమునకు వచ్చి తెలియక తప్పుచేసితి ననియేడ్చెను. "ఓరీ! ఇది నీతప్పుకాదు. నేనే నీకట్లు తోపింపజేసితిని. నీవు నాయభిప్రాయము ననుసరించియే బాణము విడిచితివి. భయపడకుము. నాయిష్టము నెరవేర్చితివి. ఇది నాకు తులసీదళార్చనమే. నీకు మోక్ష మిచ్చుచుంటినని స్వామి వాని కభయప్రదానము సేయగనే వాడు సాక్షాత్పరబ్రహ్మమగు స్వామికి ముమ్మారు ప్రదక్షిణము గావించి ముక్తిని పొందెను.

సారథియగు దారుకుడు స్వామిని వెదకికొనుచు నచ్చటికి వచ్చెను. శ్రీకృష్ణమూర్తి శరాఘాతముతో కొంచెము శ్రమపడుచున్నట్లు నటించెను. రథము తనంతటనే మింటి కెగసిపోయెను.

చక్రాద్యాయుధము లెల్లను దానివెంట జనెను. సారథి యీ చిత్ర మును జూచి ఆశ్చర్యపడుచుండగా కృష్ణస్వామి యిట్లనెను. "దారుకా! నీవు పోయి జరిగినవృత్తాంతమును విదురాక్రూరులకు, సవ్యసాచికిం దెలిపి ద్వారకాపురియం దుండువారిని ఏడుదినములకు మీద నొక్కక్షణముగూడ నక్కడ నుండవలదని చెప్పుము. నేను పోయిన పిమ్మట సముద్రము ద్వారకాపురిని ముంచివేయును అని పల్కి యతనిని బంపివేసెను. బ్రహ్మాదు లెల్లరును పుష్పవృష్టి గురియించుచు ఆకాశమున నిల్చి "దేవదేవా! మా లోకము లెల్లను శూన్యములుగ నున్నవి. నీవు వేంచేయవలె" నని పిలిచిరి. దేవ దుందుభులు మ్రోగెను. స్వామి బ్రహ్మాదులచేత పిలువబడి, నుతింపబడి, నిత్యవిభూతికి తరలివెళ్లెను. అర్జును డీ సంగతి నెఱింగి ద్వారకలో శేషించియున్న స్త్రీబాలవృద్ధులతోడ నింద్రప్రస్థపుర మును జేరెను. మధురాపట్టణమునకు అనిరుద్ధునికుమారుడైన వజ్ర డనువానిని పట్టాభిషిక్తుని చేసెను. శ్రీకృష్ణనిర్యాణ మాదిగాగల సంగతులనుఅర్జునుడెఱిగింపగా ధర్మరాజాదులు "పరీక్షిన్మహారాజా! నిన్ను పట్టాభిషిక్తుని గావించి మహాప్రస్థాన మొనర్చిరి. స్వామి ప్రభువు. వారైదుగురు దేవతలు. వారును మూలస్థానము చేరిరి. ఈ కథ పరమమంగళ మైనది" అని శుకుడు పరీక్షిత్తున కెఱింగించెను.

# ద్వాదశస్కంధము

## కలివైభవము : కల్క్యవతారము

శ్రీకృష్ణనిర్యాణమువరకు జరిగిన సంగతు లన్నింటిని శుకు డెఱింగింపగా భావికాలమున జరుగగలదానిని చెప్పుమని పరీక్షిత్తు కోరెను. పరీక్షిత్తునకు శుకయోగీంద్రుడు పిమ్మటి రాజుల విస్తా రము నెఱింగించెను. శ్రీకృష్ణమూర్తి నిత్యవిభూతికి వేంచేయగనే కలి ప్రవేశించెను. పాండవులును రాజ్యము వదలిపోయిరి. కలి ప్రారంభమున పరీక్షిత్తు రాజ్యమేలుచుండినందున నతనిశక్తి చూప జాలక పోయెను.

పరీక్షిన్మహారాజా! కలి ప్రవేశముచేత ధర్మ మిపుడే చెడి యున్నది. కాలక్రమమున నింకను చెడును. ఏ రీతి చెడునని యడిగెదవా? రాజా! కలి మిగులదుష్టుడు. వానివలన సత్యము యొక్క మహిమ తొలగును. సూర్యోదయాది పునస్సూర్యోదయ పర్యంతము అసత్యమే. భార్యాభర్తలయెడను అసత్యమే అమరి యుండును. భర్త భార్యకు నిజముగ మనసునీయడు. లేనిపోని యాశలు గల్పించి నెరవేర్చక కాలము గడపును. భార్య తనపనికై భర్తయెడ మిక్కిలి భక్తిగలదానివలె నటించును. తండ్రిని తనయుడు, గురుని శిష్యుడు, మోసపుచ్చజూతురు. శౌచము (దేహశుద్ధి) లేదు; క్షమ మొదలే లేదు. గురుశిష్యులకు, పితాపుత్రులకు, భార్యాభర్తలకు కోపగుణ ముండును. క్రిందివారిపై దయాగుణము లేదు. సద్గుణములు తగ్గుటతోడనే ఆయువు క్షీణించును. వేదమున నూరుసంవత్సరము లాయుః ప్రమాణ మని యున్నను అట్లు జరుగదు. (మూలమూలల ముక్కద్దపుటంగళ్లుండుటయు, కంటిజోళ్లను మంచి యౌవనవంతులు ధరించుటయును చూచుచునే యున్నాము) జ్ఞాపకశక్తి తగ్గును. (ఆకులో తామప్పుడు భుజించిన పదార్థము లేమియని యితరు లడిగినప్పుడు మఱపుచేత చెప్పుటకు వీలులేని కాలము సంప్రాప్తించినది. మఱి శాస్త్రార్థము లెట్లు జ్ఞప్తిలో నుండగలవు?) రాజా! యిట్లు సత్యశౌచ శమాదిగుణములు తగ్గగనే భూసారము తగ్గును. అంతియేగాక పదార్థములకు రుచియును లేదు. దానిరసము తగ్గిపోవును. జ్ఞానభక్త్యాదులు గలవాడు క్షీణించుట, పరమపతితులు వృద్ధికి వచ్చుట తటస్థించును. రాజులు ప్రజలను సన్మార్గమున ప్రవర్తించునట్లు చేయరాదా యనిన వా రర్థపరాయణులై యుందురు. బ్రాహ్మణులు చేయరాదా యనిన వారే ప్రథమమున కర్మమును విడుతురు. స్త్రీలు మిక్కిలి యాచారవంతురాండ్రై వ్రతములు సల్పుచు భక్తిగల

వారై యున్నను వారికి స్వధర్మమగు పతిభక్తి సున్న. ఒకడు తాను సుఖించునపుడు "ఆహా ! నాయీశరీరము నాతండ్రివలన గల్గినది. దీనిచే నే నిన్నిసుఖము లనుభవించుచున్నానని తలంచునా ? తలంచడు. తండ్రి యేదైనమాట చెప్పగా నీకావిషయము తెలియదు. ఊరకుండుము" అనును. రాజా ! పాండవులు కలికాల ప్రవాహ మిట్లుండుట జూచి మనమింక నిచ్చట నుండుట మర్యాద గాదని వెడలిపోయిరి. కాలము చెడినది. ఇంకను చెడును. కలి ప్రాజాపత్యము జూపగా దుష్టులు చేరి చెఱుచుదురు. అధర్మము మిగుల వృద్ధిపొందెనేని భగవంతుడు కల్కిరూపమున అవతరించును. కలిచే నాక్రమించబడిన మనుష్యులు మనుష్యులా ? ఖలులే. స్వామి గంగా-యమునలమధ్యప్రదేశమున శంబళమను గ్రామములో విష్ణుయశుడు అను బ్రాహ్మణునకు తనయుడై కల్కియను నామముతో నవతరించును. అట్లవతరించినస్వామి యేమిచేయు ననగా ఉత్తమాశ్వము నారోహించి భూమండల మంతయు ప్రదక్షిణము గావించును. అపుడు ధర్మద్రోహులను జంపుచు వచ్చును. దుష్టులను, ధర్మద్రోహులను జంపగా కలిమహిమము కృష్ణపక్ష చంద్రునియట్లు క్షీణించును.

శుకు డిట్లు చెప్పగా రాజు భయపడి అసాధులగతి తెలిసెను. యోగ్యులుగూడ చెడుదురుగదా ! సాధుసహవాసులును, సత్కులజులును చెడుదురే యని యడిగెను. కలిచే నాక్రమించబడినవారు వాని త్రోసికొనుటకును మార్గ మున్నది. కలియందు ముఖ్యముగ జనులు పరమాత్మను మఱతురు.

అంతకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥

భగ. 8అధ్యా. 5శ్లోక మట్లు స్వామి అంత్యకాలమందైనను తలంపు మనియెను. సుఖముగ నుండు

నపుడు నీస్నేహితులు, బంధువులు, బిడ్డలు మొదలగువారితో కాలము గడపుము. నీకు మరణకాలము ప్రాప్తించి (నడువలో వేసి) యుండగా నీవు సంపాదించిన ధనముతో నూర్గురుభుజించుచుండగా నీ కొక్క గరిటెడు పాలుకూడ నోటియందు దిగక అల్లాడు స్థితి యందయినను నన్ను తలంపు మనెను. నడచునపుడు ఎదురు దెబ్బతగిలి గోరు వీడి రక్తమువచ్చునపుడు రామా యనరాదా? పడినపుడు కృష్ణాయని భగవన్నామము నుచ్చరించరాదా? అట్లు చేసినను భగవంతు డుత్తమగతిని గల్గించును. కలిలో అట్లుకూడ చేయడు. కలిలో కడతేఱుటకు భగవన్నామస్మరణతప్ప అన్యోపాయము లేదు. కలియందు దేహము చెడును. అందుచే ధర్మములు జరుగవు. ద్రవ్యము అన్యాయముగ సంపాదించబడును. దానిచే ధర్మము చెడును. స్వామిని హృదయమం దుంచుకొన్నయెడల నతడు దోషములను హరించును. భగవత్కల్యాణగుణములను వినవలయును; ధ్యానము చేయవలయును; చెప్పవలయును; అతనిని పూజించవలయును. భగవంతుడు గొప్పవాడని చెప్పువారిని పూజించువారు పెద్దలని సత్కరించవలెను. మనమును ఆస్థితి నందుకొనుటకు కోరవలయును. ఇట్లుచేయుయెడ భగవంతు డనేకజన్మములం దార్జించిన పాపమును పరిహరించును. కలియందు భగవదాశ్రయము వినా కడతేఱు నుపాయము లేదు. తీర్థయాత్ర, దానము, జపము చేసినయెడల పుణ్యము గలుగదా యనిన నీ యుగమున ఆ కార్యములశక్తి ఉపయోగపడదు. భక్తియుండదు కాశియం దుండువరకు అసత్యము పలుకకుండవలయు ననిన సరిపోదు. (సంకల్పముచెప్పునపుడు ప్రక్కనున్నవారిపై కన్నుపోకుండునా?) అట్లుచేసిన సంకల్పముచేత ప్రయోజన మేమి? కాన భగవద్ధ్యానము, భగవత్కథాశ్రవణము, భగవత్కథలను జెప్పుట వలన మనశ్శుద్ధి కల్గును. పైదానిచే కాదు.

దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥

అని భగ. 17అధ్యా. 20 శ్లోకములో చెప్ప బడిన సాత్త్వికదాన మొనర్చుటకే వలనుగాదు. మనసు సరిగా నుండదు. వేఱుపాయములేదు. కావున "రాజా! ఒక్కపనిచేయుము. నేజెప్పినట్లు సకలకలిదోషములను పరిహారము గావించుకొనుము. భగవంతుని ధ్యానింపుము. నీ కాయుస్సుతీఱను. నీ కనేకవిషయ ములను తెల్పియుంటిని. వానినెల్ల జ్ఞాపక ముంచుకొని జాగ రూకుడవై ధ్యానింపుము. అట్లు జ్ఞాపకముంచుకొని ధ్యానించితివేని ఉత్తమగతిని పొందెదవు" అని శుకు డెఱింగింపగా నట్టి దుష్టుడైన కలి భగవంతుని ధ్యానించినటులైన వీడునా యని పరీక్షిత్తు ప్రశ్నిం చెను. శుకు డందులకు "రాజా! కలియెడల ననేకదోషము లుండును. భగవంతుని ధ్యానించినను, ఆతని నామోచ్చారణ మొనర్చినను వారియొద్దకు రానని చెప్పునట్టి గుణ మున్నది. కృతయుగమున ధ్యానముచేత, త్రేతాయుగమున యాగముచేత, ద్వాపరయుగ మున పూజచేత, కలిలో నామసంకీర్తనముచేత ఫలము గలదు. చూచుటకు కలి దుష్టుడని తోచుచుండును. కాని విచారించి చూచి నటులైన వానియందు గొప్పగుణ మున్నది. అందుచే వానిచేత నాక్రమించబడినవాడు భగవత్కథ విని స్మరించి, ధ్యానించుచుండిన యెడల కలి దూరమై పోవును. మఱియు నిట్టి కలియుగముపోయి త్రేతాయుగము సంప్రాప్తించును. మరల అనుక్రమమున కలి యుగము వచ్చును. ఇట్లే యుగములు మారుచుండును.

సహస్రయుగపర్యంత మహర్య ద్బ్రహ్మణో విదుః ।
రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః ॥

భగ. 8అధ్యా. 17 శ్లోకమట్లు చతుర్యుగసహస్రములైన బ్రహ్మ కొక్కపగలు, అంత రాత్రి.

ఇట్టి దినములుగల బ్రహ్మయొక్క నూరుసంవత్సరములు భగవంతుని కొక్కపగలు; అంతమాత్రము రాత్రి. అది మహాప్రళయకాలము. రాజా! నీకు ఏడుదినములు గడచెను. చెప్పవలసిన విషయములు చెప్పితిని. నేను వెళ్లెదను. సకలచరాచరప్రపంచమును సృష్టిస్థితిలయములుచేయు నారాయణుడు ఆధారభూతుడై ధరించును. ఆతనియవతారములను, లీలలను దెలిపితిని అని శుకుడనగా సమస్తవిషయములు తెల్పబడినవా యని రాజడిగెను. సంగ్రహముగ జెప్పితిని. బ్రహ్మదేవునికిని భగవంతునికథలు పరిపూర్ణముగ జెప్పుటకు శక్యముగాదని శుకు డనెను. మీరు చెప్పిన భగవత్కథలను భక్తితో నాకర్ణించునెడల కలిదోషహర మగునా? యని రాజడిగెను. "రాజా! సంసారమను సాగరమున మునిగి వివేకములేక అల్లాడుచున్నారము. దీనిని దాటుటకు ఓడయొకటి కావలెను. సాక్షాద్భగవంతుని యవతారగాథలను వినుటే యోడయగును. అవివేకముచేత మనము ప్రాకృతవస్తువులను జూచి సంతోషించుచున్నారము. అట్లానందించుచుండినను, పోవునపుడొక్కదానినైనను వెంట గొనిపోవజాలము. ఇట్లని తోచదు. సంసారమను నడవియందు దుఃఖమను నగ్నిచేత కాల్పబడుచున్నాము. దీనియందు సుఖములేదు. యోజించునెడల సంసారమం దీడుపడుటకు మార్గముండదు. ఒక్కొక్కడు అట్లుతలంచుట కారంభించిన ప్రపంచమెట్లు జరుగును? అందుచేత భగవంతుడు మాయనుంచుకొనియున్నాడు. అందుచేత స్వామీ! సుఖములేనిచోట సుఖముండునట్లు తోపించుచున్నావని యతనిని ప్రార్థింపవలయు"నని శుకు డెఱిగించెను. "శుకమహర్షీ! మీరు అనేకానేకవిషయములను జెప్పుచు వచ్చితిరి. భగవంతునిదెలిసికొని యతనిని ధ్యానింపవలసి యుండుటచేత మీరుచెప్పిన విషయముయొక్క సారమును మఱియును జెప్పవలెనని కోరుచున్నాను" అని రాజడుగగా

శుకుడువేదాంతతత్త్వమును, పరబ్రహ్మతత్త్వమును జెప్పి "రాజా! కాల మాయెను. నేను పోయెదను. మృత్యువు వచ్చును. జాగరూకుడవై యుండుము. ఆ కాలమున భగవంతుని మఱవకుము" అని చెప్పెను. పరీక్షిన్మహారా జపుడు శుకమహర్షియొక్క పాదములు పట్టుకొని నమస్కరించి లేచి నిలిచి యంజలిబద్ధుడై ఆనంద బాష్పములతో నిట్లనెను. "ధన్యుడ నైతిని. మీచే ననుగ్రహింపబడితిని. ఇంతకంటెను నాకు గావలసిన దేమున్నది ? నేను మిమ్ముల స్తోత్రము చేయుచున్నా ననుకొనవలదు. మీరు జ్ఞాతలు, స్వామిని తెలిసినవారు. ప్రపంచము, విషయసుఖములు అసారమని గ్రహించినవారు. సకలము తుచ్ఛమని భావించువారు. మీ కిప్పటి కేల రావలయును ? నే నడిగిన విషయముల నేల చెప్పవలయును ? తమబోటివారు మమ్ము బోటివారితోడ కలసియుండుట మేము కడతేరుటకేగదా ! ఇదియే అనుగ్రహము" అని యిట్లు భాగవతమును వినిన రాజుచేత నుపచరించబడి శుకుడు లేవగా ఋషు లందఱును లేచిరి. జనసంఘమున భగవద్ధ్యానముచేయుట కష్టముగాన నేకాంతమున భగవద్ధ్యానము సేయుమని శుకు డెజిగింపగా రాజు ప్రదక్షిణము గావించెను. అందఱును అచటినుండి వెడలిపోయిరి. అందరు గురునియొద్ద సమయము నెఱిగి ప్రశ్న చేసి సంశయపరిహార మొనర్చుకొనవలయును. వినవలసిన శాస్త్రార్థములను విని జ్ఞాపక ముంచుకొని ఆచార్యుని యుపకారమును మఱపరాదు. స్వామీ ! మీచే ననుగ్రహింప బడితిని. జ్ఞానము లభించినది, మనుష్యుడ నైతిని. ఈ యుపకారమునకు ప్రత్యుపకార మేమి చేయగల నని ఆచార్యునికి తమయొక్క ఉపకారస్మృతిని పరీక్షిత్తు రీతిగా దెలుపవలయును.

శుకమహర్షి భాగవతము నుపదేశించి జాగరూకుడవై భగవద్ధ్యానము చేయుమని చెప్పి వచ్చియుండిన మహర్షులతోడ వెడలి

పోగా పరీక్షిన్మహారాజు భాగవత తత్త్వవిచారార్థము కట్టియుండిన మేడయందు ధ్యానము సల్పుచు కూర్చుండి యుండెను. శమీక మహర్షి పుత్రుడు శృంగియను నతడు పరీక్షిత్తు తక్షకుడను మహా సర్పముచేత నేడవదినమున మరణింపవలయు నని శపించి యుండినందున నా మహాసర్పము బయలుదేరి పోవుచుండెను. అట్లు పోవునపుడు మార్గమున కశ్యపప్రజేశ్వరుని సంధించి "అయ్యా! మీ రెచటికి బోవుచున్నా" రని యడిగెను. పరీక్షిత్తును కాపాడబోవుచున్నా నని యాత డనెను. "నావంటివాడు కఱచినను కాపాడగలవా? నీశక్తి యెట్టిదో చూపు" మని తక్షకు డొకవృక్షమును డాసి కఱచెను. అతనిదారుణమగు విషమున కావృక్షము భస్మము కాగా కశ్యపప్రజేశ్వరుడు మంత్రోచ్చారణము చేసి యా తరువు నెప్పటియట్లు గావించెను. తక్షకు డాశ్చర్యకలితమానసుడై "అయ్యా! మీకారాజు చుట్టమా? మిత్రుడా? అతనినేల రక్షించుటకు పోవుచున్నా" వని యడుగ నా ప్రజేశ్వరుడు కొంత ద్రవ్యాశ చేత నతనిని గావబోవుచున్నా నని తెలిపెను. అటులైన నేనే మీకు వలయుధనము నిప్పించెదను. నా కార్యమునకు భంగము గావింప వల దని తక్షకుడు పలుకగా భగవత్ప్రేరణచేత కశ్యపుడు సమ్మతించెను.

అర్జునుని మనుమ డగు పరీక్షిత్తు ఈ కలికాలమున నుండరా దనియే భగవత్సంకల్పము. (ఆ ప్రజాపతికే ద్రవ్యాశ యుండగా మనుష్యమాత్రులసంగతి చెప్పనేల?) తక్షకుడు బ్రాహ్మణరూపముతో పోయి "పరీక్షిద్దర్శనార్థము వచ్చితి" నని ద్వారపాలకునితో జెప్పి లోనికి బోయెను. బ్రాహ్మణసన్నిధానమున తన ప్రాణము పోవుట శ్రేయమని యెంచి పరీక్షిత్తు ఆ బ్రాహ్మణుడు తన కడకు వచ్చుట కంగీకరించెను. కపటభూసురుడు పండు నీయగా రాజు దానిని వాసనచూచెను. వెంటనే ఆ ఫలమును

భేదించుకొని యందుండి యొక చిన్న క్రిమి వెలుపలికి వచ్చెను. రాజు దానిని త్రోయబోగా నది పెద్దసర్పమై యతనిని గఱచి చుట్టు కొనెను. తక్షకుని విషాగ్ని చేత పరీక్షిత్తు దేహము భస్మమై పోయెను. అపుడు పుష్పవృష్టి గురిసెను. దేవదుందుభులు మొరసినవి. అప్సరస లాడిరి. విద్యాధరులు పాడిరి. బ్రహ్మయును, దేవతలును, మహర్షులును ఆశీర్వాదములు చేసిరి. శౌనకాదిమహర్షులారా! శుకుడు పరీక్షిత్తునకు జెప్పిన భాగవతమును మీకు జెప్పితిని. వ్యాసు డిట్టి యనేకపురాణములను రచించి భగవత్కల్యాణగుణములను చాటెను.

## మార్కండేయ చరిత్రము

శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు దెలిపిన భాగవతమును సూతపౌరాణికుడు శౌనకాదిమహర్షులకు జెప్పగా వారిట్లనిరి. "సూత పౌరాణికా! భృగువంశమున బుట్టినట్టి అనగా మావంశమున బుట్టిన మార్కండేయుడు ప్రళయకాలమున సముద్రమున నల్లాడి వటపత్రశాయియైన స్వామిని జూచెనని వినియుంటిమి. ప్రళయకాలములో నత డెట్లుండెను? అతడు ప్రళయము నెట్లు చూడగలిగెను?" అని యడుగగా సూతు డిట్లనెను. శౌనకాదులారా! మార్కండేయుడు తపము గావించగా నరనారాయణులు ప్రత్యక్షమై నీకు గావలసిన దేమని యడిగిరి? అందు కతడు "నాకు దీర్ఘాయువు గలదు. భక్తి యున్నది. నీవు ప్రళయకాలమున వటపత్రశాయివై యుందు వని విందును. ఆవైభవమును చూడ గోరెదను" అనగా స్వామి నీవు చూడజాలవు, భయపడుదు వని చెప్పి అయినను మిగుల కోరుచుండు మార్కండేయుని కోర్కె దీర్చునట్లు పలికి అంతర్ధాన మాయెను. మార్కండేయుడు తపముగావించుచుండగా సముద్రము పొంగి వచ్చెను. అతడు లేచి మఱియొకప్రక్కకు బోవగా నాప్రక్కకును సాగరము వచ్చెను. ఇట్లే నలుప్రక్కలను సముద్రములు కూడి పొంగి మార్కండేయుని తలమీదుగా

పోయెను. అతడు సముద్రమునందలి సుడులందు పడుచు మత్స్య తిమింగిలముల నోటబడి వెలుపలికి వచ్చుచు అల్లాడుచుండగా వట వృక్షముయొక్క కొమ్మ యొకటి కనుపించెను. క్రిందవృక్షముండు ననియు దానిని పట్టుకొనవచ్చు ననియు తలచి మార్కండేయుడు క్రిందికి దిగెను. వటవృక్షముయొక్క చిగురునందు స్వామి పరుండి యుండెను. సూర్యమండలము, చంద్రమండలము, స్వర్గలోకము, బ్రహ్మలోకము మునిగిపోయి యుండినందున అంతట నొకే యంధకారముగ నుండెను. అట్టి యంధకారమున వటపత్రశాయి యే రీతి గనుపించె ననగా స్వామియొక్క మేనికాంతి పదివేల మత్తా బులు వెలిగించినట్లు ప్రకాశించుచుండెను. ఆ ప్రకాశముచేత మార్కం డేయుడు భగవద్దర్శనము చేసికొనగలిగెను. వటపత్రశాయి తన రెండుచేతులతో కాలుపట్టుకొని కాలిబొటనవ్రేలిని నోటనుంచుకొని చీకుచుండెను. స్వామి నఖములు పద్మరాగమణులట్లు ప్రకాశించు చుండెను. అతడు దివ్యహస్తములతో పాదమును నోటనుంచుకొని యుండెను. మార్కండేయు డా బిడ్డను జూచి పెద్దవాడగు తానే అట్లల్లాడుచుండ మఱి శిశువుయొక్క అపదను యోజింపవలయునా అని యెంచి సమీపమునకు బోయి శిశువును జూచెను. ఆ చిన్నబిడ్డ శ్వాసపీల్చగా మార్కండేయుడు చిన్నదోమవలె లోపలికి పోయెను. చిన్న నాసికారంధ్రమునుండి లోపలికి నెట్లు రాగల్గితి నని భార్గవుడు యోజించుచుండగా నతనికి స్వామి గర్భమున అనేక సముద్ర ములు, పర్వతములు, సకలచరాచరప్రపంచము కనబడెను. అట్లు సకలలోకములను, తన్ను చూచుకొనెను. వెలుపల నొక్కటియు లేకుండెను. అనగా స్వామి ప్రళయమున నన్నింటిని తన గర్భ మం దుంచుకొని కాపాడును. ఆ విధమును జూపిరి. పిమ్మట మార్కండేయుడు మరియొక నాసికారంధ్రమునుండి వెలుపలికి వచ్చి అల్లాడుచుండెను. తన ప్రభావమును మరియును చూపు చుండినయెడల నెంతదీర్ఘాయుష్మైనను అతడు మనజాలడని యెంచి

స్వామి అంతర్ధానమాయెను. మాయికులు ఇంద్రజాలము చేయగా పిమ్మట నేమియు నుండనిరీతి వృక్షము, సముద్రము, ప్రళయము మొదలగునవి యేమియు కనబడలేదు. స్వామియు లేడు. అతడు మునుపటివలెనే బదరికాశ్రమమున తప మాచరించుచుండెను. స్వామి యిట్లు మార్కండేయున కొక్కక్షణము ప్రళయము జూపెను. మార్కండేయుడు పరమశివుని చేత ననేకవరములను బడసి యతనిబిడ్డవలె నుండుటచేత పార్వతీపరమేశ్వరులవద్ద కేగి సంగతి దెల్పి "దీర్ఘాయువు గలవాడనుగాన నేను బ్రదుకగల్గి మిమ్ము జూడగంటి" నని చెప్పెను అని సూతుడు శౌనకాదుల కెఱిగించెను. మరియు నతడు సూర్యుడు ద్వాదశమాసములు సంచరించుట, అతనితోడ నొక్కొక్కనెలయందును బోవు దేవతలు, ఋషులు, అప్సరసలు మొదలగువారి సంగతిని వర్ణించి సూర్యుడు లోకరక్షణార్థము సంచారము సేయుటను జెప్పెను. అట్లు చెప్పి శౌనకాదుల నుద్దేశించి "శౌనకాదులారా ! నేను తీర్థయాత్రార్థము వచ్చితిని. మీరీ నైమిశారణ్యమున యాగ మాచరించుచుంటిరి. భాగవతము నన్నడిగితిరి. చెప్పితిని. శుకమహర్షి దీనిని చెప్పినపుడు నే నొక మూల గూర్చుండి వినుచుంటిని. ఆ సంగతులనే చెప్పితిని. మీ రడుగగా మార్కండేయుని చరిత్రమును జెప్పితిని. ప్రతిదినమును ఉపాసించవలసిన సూర్యునిసంగతి దెల్పితిని. ఇక తీర్థయాత్రకు బోవలయును" అనగా "మీరు వేదవ్యాసశిష్యులు; మహానుభావులు. మా కుపదేశించితి" రని స్తుతించిరి. వా రట్లనగా సూతుడు "మీరు నన్ను స్తుతింప బనిలేదు. నేనే మిమ్ము స్తోత్రము చేయవలెను. పరీక్షిత్తు ప్రార్థింపగా భాగ్యవశమున శుకు డెఱిగించెను. నే నొక్క మూలనుండి వినుచుంటిని. అపుడు మననమెట్లు చేయనగును ? వ్యవధి లేకుండెను. మీ రడిగినందువలనగదా నాకావిషయము లెల్లను మననమునకు వచ్చెను. మీపుణ్యమున నేనా సంగతిని సాకల్యముగ చెప్పగల్గితి" నని శౌనకాదులను ప్రస్తుతించెను. ఈ

భాగవతమును ఆద్యంతము వినినవారు సంసారసాగరముయొక్క గట్టెక్కినవారని సూతుడు వచించెను. కొన్ని దినములు వినుచుండి నడుమ వదలివేసిన ప్రయోజన మేమి? నీటమునిగినవాడు ఒక్క జానెడు మునిగిన నేమి? మూరెడుమునిగిన నేమి? ఇట్లు మునుగని వాడే గట్టెక్కినవాడు. ఈ భాగవతము యొక్క అర, పాతిక, పరక శ్లోకమును విన్నను ఎట్టిపాపియు పుణ్యాత్ము డగును. శౌనకాదులారా! ఎక్కడి పరీక్షిత్తు? ఎక్కడి శుకుడు? ఆ యడిగిన, చెప్పిన స్వారస్యమేమి? శుకపరీక్షిత్తులసంవాదమైన భాగవతము నేమని వివరింపగలను? తత్త్వదీపము వెలిగించిరి. మనము వారి కేమి యుపకృతి గావింపగలము? "కేవలబ్రహ్మానందము న మునిగి ఆశ విడిచి భగవద్విషయమున ఈడుపడి యెల్లవారికిని దీపమట్లుండుభాగవతము ను దయచేసిన శుకునకు మన మందర మును గలసి భక్తిశ్రద్ధాపురస్సరముగ నమస్కరింతము" అని సూతుడు పలుకగా అందఱును "వ్యాసపుత్రుని స్మరించి, పరమాత్మను ధ్యానించి నమస్కరింత" మనిరి. భాగవతప్రతిపాద్యుడైన "ఏ స్వామిని వేదములు, బ్రహ్మాదులు స్తోత్రముచేయుదురో, సామవేదులు గాన మొనర్తురో, యోగులు హృదయాకాశమున ధ్యానింతురో, ఇంకను ఏ పురుషునకు మునిపు తెలిసికొనలేరో అట్టి వానికి అందరము నమస్కరింతము" అని పలికి వారు అట్లే నమస్కరించిరి. సూతుడు వారితో గలసి నమస్కరించెను. శౌనకాదులు సూతు నుపచరించగా నతడు శ్రీమద్భాగవతముయొక్కమహిమ చెప్పెను. ఓపాఠకులారా! భాగవతముతో సమానమైన పురాణముండదు. దీనిలో సకలతత్త్వార్థము లుండును. కేవలభగవత్తత్త్వము లుండును. వీనిని మఱవకుడు. భాగవతప్రతిపాద్యమూర్తియే మనకు గతి.

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్ ।
తత్సర్వం క్షమ్యతాం దేవ నారాయణ నమోఽస్తుతే ॥

---